రాధాకృష్ణ

[పది యంకముల నాటకము]

ఇది

పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారిచే

రచియింపఁబడినది.

మూడవ కూర్పు 500

ప్రకాశకులు :

కురుకూరి సుబ్బారావు అండ్ సన్

ప్రొప్రయిటర్సు : సరస్వతీ బుక్కు డిపో, బెజవాడ (కృష్ణాజిల్లా)

తెనాలి లక్ష్మీ పవర్ ప్రెస్ నందు ముద్రింపఁబడియె.

1943

[వెల రు 1-4-0

ఇందలి పాత్రములు

సరస్వతి—కథానాయిక--గోవర్ధనుని సోదరి.

మధురిక—సరస్వతికి దాసి.

జయరామసింగు—రాగవర్ధనుని భార్యకుఁ దమ్ముఁడు.

భ్రమరుఁడు—మధురికకు మగఁడు.

గోవర్ధనుఁడు—రాగవర్ధనుని కొడుకు.

కళాలలితుఁడు—సరస్వతికి భర్త

కళాలలిత—గోవర్ధనుని భార్య-కళాలలితుని చెల్లెలు

కురంగి—కళాలలిత దాసి-జయరామసింగు భార్య.

రాగవర్ధనుఁడు—రామపుర రాష్ట్రమునకు రాజు. ఇతనికి మందపాలుఁ డని కూడఁ బేరు.

మాధవవర్మ—రాగవర్ధనుని పినతండ్రికొడుకు-కాళీపుర నాథుఁడు.

కమల—గోవర్ధనునకు సరస్వతికిఁ దల్లి.

ఇద్దఱు పల్లెవాండ్రు, ఇద్దఱుభటులు, మఱియొకసారి యిద్దఱుభటులు.

హెచ్చరిక

శ్రీరామ

పీఠిక

ఈ సరస్వతి నా పదునాఱవ నాటకము. నన్నుఁ బోషించు మ॥ రా॥ రా॥ శ్రీ శ్రీరాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దరు సీ. బీ. యి. గారికిఁ బ్రథమ పుత్త్రుఁడు చిరంజీవులగు శ్రీరాజా గంగాధర రామరావు బహద్దరుగారు సోదర సోదరీ సమేతులై గురుబంధుభృత్యపరివృతులై మదీయ కథాలహరి లోని కథలను జదివించి యానందముతో వినుచు నన్నుఁ బేరొక్కని యేదైన నొక్క విచిత్ర కథను గల్పించి నాటకమొనర్పుమని నాతో సెలవిచ్చిరి. పరమేశ్వర కటాక్షమునను మాతాపితల పుణ్యమునను వారికిఁ బదేండ్ల పసితనముననే గలిగిన గ్రహణశక్తికిఁ గవితాభిమానమునకు మహానంద మొంది చిత్తమని మనవిచేసితిని. కొన్ని మాసములయినపిమ్మట భర్తృదారకుని యాజ్ఞ ప్రభువుగారితో విన్నవించి యీ నాటకమును రచియించితిని. శ్రీ శ్రీ శ్రీ మా సూర్యరాయ ప్రభువువారే దీని నచ్చు వేయించిరి. వారికి వారి కుటుంబమునకుఁ బరమేశ్వరుఁడు పరిపూర్ణ సుఖాయుస్సంపత్సమృద్ధుల నిచ్చి రక్షించుఁ గాక !

నాకుఁ బరమ మిత్త్రులును రామకృష్ణపరమహంస గౌరాంగ చరిత్ర రూపలతావనవాసి ప్రముఖ శ్రవ్యదృశ్య ప్రబంధసంధానధౌరేయులును సద్గుణ గణనీయులును నగు బ్రహ్మశ్రీ కూచి నరసింహము గారు దీనికి నాంది ప్రస్తావనలను వ్రాసి యిచ్చుటచే వారి కనేక నమస్కారము లర్పింతును.

శ్రీ శ్రీ శ్రీ

పా॥ లక్ష్మీనరసింహారావు.

శ్రీ రామ.

సరస్వతి

నాంది.

ఉ. వ్యాహృతిరూపమై కవుల ♦ వాక్కుల కించుకయేని లొంగక క
త్యూహమనీష, నైహిక మ ♦ హోత్కటనాటకమందు కర్వ ని
ర్మోహమనస్కుఁ జిత్రముగ ♦ మోహితుఁ జేసినవ్యక్తి యాజగ
న్మోహిని మీకు సంతత వి ♦ నోదములన్సమకూర్చుఁ గావుతన్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును.)

సూ—నటీ! (నటి ప్రవేశించును.)

నటి—బావగారూ! నమస్కారము.

సూ—నమస్కారముల కేమిగాని, నటీ! యిటొకసారి చూడుము.

గీ. సత్కళాపుంజమండల ♦ శతసమేతుఁ
డౌచు జైవాతృకుఁడు నభం ♦ బందు వెలుఁగు
పగిది, సూర్యరాణ్ణామజై ♦ వాతృకుండు
సత్కళాభిజ్ఞవితతి నీ ♦ సభ వెలుంగు!

నటి—ఔను. ఆహా!

గీ. శుభ్రదివ్యవిద్యుద్దీప ♦ శోభితంబు
భూమిభృత్కల్పతరుసుమ ♦ నోమనోజ్ఞ
మమృతమంజుద్విజాలాప ♦ సముదయంబు
బావ! యీసభ నందన ♦ వనము గాదె?

కాని మన నాటకమును చూచుటకై నేఁడు దర్శకసంఘ మింత క్రిక్కిఱిసియుండుటకుఁ గారణమేమో?

సూ—కారణములేని కార్యముండునా!

సీ. దాతృత్వధీరతో ♦ దారగంగాధర
రామరాయాగ్రహా ♦ త్రకుఁడు మఱియు
భూతదయాశాంతి ♦ పుష్కలవితరణ
ప్రముఖసద్గుణసూర్య ♦ రాణ్మణికిని

బహాదరప్పారాయ ♦ వంశదీపిక చిన్న
యాంబాసతీమణి ♦ కగ్రసుతుఁడు
తల్లివంశమువారి ♦ తండ్రివంశమువారి
యమలయశోలక్ష్మి ♦ కాటపట్టు

గీ. తాతనామంబు ధరియించు ♦ ధన్యుఁ డాయు
రున్నతుఁడు, మన యువరాజు ♦ చిన్నవాఁడు
భవ్యపీఠికాపుర భావి ♦ పాలకుండు
కలికి! యీ వేడ్క కంతకుఁ ♦ గారణంబు.

నటి—ఎట్లెట్లు? నేఁ డాయుష్మంతులగు మన యువరాజుగారి జన్మదివస వార్షికోత్సవమనియా? అది ప్రతిసంవత్సరము జరుగుచునే యున్నదికదా! ఇప్పటి విశేష మేమి?

సూ—నేఁ జెప్పఁదలఁచిన శేషభాగము వినినచో నా విశేషమేమో తెలియును. మన యాస్థాన కవీశ్వరులగు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి నొక విచిత్ర నాటకము వ్రాయుఁడని వారొకసారి యడిగినారఁట. వారి కోరిక దీర్చుటకై కవీశ్వరు లట్టి నాటకము వ్రాసినారు. అదియే, మన మిపుడాడఁబోవు నాటకము. తన్నాటకావలోకనకౌతూహలమే సదస్సు నిట్లు చతుష్పూర్వముగఁ జేయుచున్నది.

నటి—అలాగునవా? సరసవిద్యావయఃపరిపాకమున రావలసిన యుదారాభిలాష లేఁత వయసుననే యెట్లు పుట్టెనో!

సూ—(నవ్వుచు) వరవంశప్రసూన లక్షణములకు వయోవిద్యాపరిణతి యంత యావశ్యకము గాదు.

గీ. నేర్చి నేర్పించి విద్యల ♦ నియతిఁ బెంచి
ప్రాకటంబైన శ్రీరావు ♦ వంశమందు
వేఱుకోరిక లెట్లుద్భ ♦ వింపఁగలవు?
మల్లెచెట్టునఁ బుట్టునే ♦ యుల్లిపూలు?

నటి—సరే! యీ నాటకము చేసినవారెవరు?

సూ—ఇంత వరాకేమి నటీ! ఆ మాట యిప్పుడేకదా చెప్పితిని?

నటి—ఓహో! మేధావియగు నృసింహారావుగారి పదునాలవ నాటకమా మనము ప్రదర్శింపఁబోవు "సరస్వతి"?

సూ—ఔను.

గీ. క్రమభావంబులను గథా ♦ కల్పనమున
సరసశృంగారహాస్యప్ర ♦ సంగములను
గ్రాలుచున్నది యీనాట ♦ కంబు షోడ
శకళలను నిండుపూర్ణిమా ♦ చంద్రుఁ బోలి !

నటి—పదునాఱు కళల పార్వణచంద్రుఁడో, పదాఱువన్నె బంగారమో, సరే-కాని, అయన వయసెంత ?

సూ—ఏఁబదియైదు దాఁటినవి కాఁబోలు.

నటి—బావా ! షష్టిపూర్తి కైదు సంవత్సరములు తక్కువగా నున్నప్పుడుకూడ నీ నవనవ శ్యామాశృంగారములు; నర్మప్రసంగములేనా ?

సూ—బాగుగానున్నవి నీ మాటలు ! బాలుఁడైన భర్తృదారకుని యభిరుచి దీర్చుటకై పాతంజలయోగశాస్త్రము పాఠము చెప్పమందువా ? పారాశరి వేదాంత సూత్రములు పారాయణ చేయు మందువా ? అదిగాక, శృంగారము కావ్య రసరాజము కాదా ?

ఆ. చెట్టు పెరుఁగుకొలఁదిఁ ♦ జేవయుఁ బెరుఁగును
దోఁచుకొలఁది నూతఁ ♦ దోయ మూరు
మెఱుఁగు దేఱి యల్లె ♦ మించుఁ గవిత్వంబు
వయసు ముదురుకొలఁది ♦ ప్రాయుకొలఁది.

మఱియు,

ఆ. హాస్యరసము జీవ ♦ మతని గ్రంథములకు
వచనరచనలందుఁ ♦ బద్యరచన
సశ్రమంబుతోడ ♦ హాస్యరసం బొలుకఁ
బలుకునుండి చేతి ♦ కలమునుండి.

శృంగార హాస్యములు ప్రధానములంటిని గాని యితరరసము లున్నవినుమా ! చూడుః ఇందలి యష్టమాంక మెంత కరుణరసభరితమో ! కనులు చెమ్మగిల్లకుండ నది చదువుటగాని వినుటగాని కడుఁగష్టముగదా !

గీ. ఆపగలు, పుట్టుచోట్ల మి ♦ తాంబువులయి
బహుళజలపూరితంబులౌఁ ♦ బాఱుకొలఁది,
నట్టి యీనాటకము మొద ♦ లెట్టి వెళ్లు
కొలఁది రసవంతమై హాయిఁ ♦ గూర్చు మదికి.

నటి—ఏమిటో! మన "మనము"గారి మదనశాస్త్రమర్యాదలు, ప్రద్యుమ్న ప్రకరణములు, మదనతాడనములు—నాకంతగా నచ్చలేదు బావా!

సూ—పోనీ, గర్దభ శృంగారమని కవియే పేరుపెట్టినాఁడుగదా దానికి. సృష్టిలో నట్టి కొత్తి సాఱబుఱ్ఱవా రుండఁగూడదా! అట్టివారున్నఁ గాని పరమపురుషుల ప్రతిష్ఠ యెట్లు బయలుపడును?

సీ. జయరామసింగు వా ♦ చాటత్వమున కేమి?
ప్రహసనపోషణ ♦ పాత్రమద్ది
కాయికభోగకాం ♦ క్షాతీవ్రమధురిగా
కామానలస్ఫులిం ♦ గముల కేమి?
యైహికసంప్రదా ♦ యానుగ గోవర్ధ
న పరిష్కృతి మోహ ♦ నటన కేమి?
లలితాంగి! యలకళా ♦ లలితాకళాలలి
తామలదివ్యస ♦ త్ప్రేమ చూడు!
గీ. చుంబనాశ్లేషముల దాఁటి ♦ సుప్రణయను
స్త్రీపురుషభేదచింతనా ♦ తీత మవిష
యకము స్వార్పణపూర్వక ♦ మదియె రాధ
బాలకృష్ణునిపై నిడ్డ ♦ వలపుసుమ్మి!

ఏఁబదియేండ్ల శృంగారమునకును, మీ యిరువదియైదేండ్ల శృంగారమునకును దారతమ్యమును గనిపట్టినావా యిప్పుడు?

నటి—అంత యుదారప్రేమ ప్రతిపాదకమా యీ నాటకము?

సూ—అంతమాత్రమే కాదు. పతితల ప్రకృతియునుబట్టియుఁ, బాలవయసుబట్టియు నీ గ్రంథమునుండి యనేక నీతులు గ్రహింపవచ్చును.

నటి—అవి యేవి?

సూ—గీ. జగతియంతయు దుర్భ్రమ ♦ సంకులంబు
పురుషు లస్వతంత్రులె యెట్టి ♦ ప్రౌఢలైన
నంచు నాటకమంత బో ♦ ధించు, రాగ
వర్ధనుఁడు ద్వితీయకళత్ర ♦ బాధఁ దెల్పు.

నటి—ఇట్టి నాటక రచనకుఁ గారణభూతులైన యువరాజాగారి కెట్లభినందింపఁగలమో తెలియదు.

సూ—ఇట్లాశీర్వదింపవచ్చును.

ఉ. వాణియనుగ్రహంబునను ♦ వాక్చతురత్వము ధీబలంబు, శ
ర్వాణిదయన్ శుభోత్కరము, ♦ పద్మకృప న్సిరులు, న్త్రిమూర్తిసం
త్రాణమున న్జిరాయువు, ని ♦ రామయతాపటిమంబు, నిత్యక
ల్యాణముఁ బచ్చతోరణము ♦ నయ్యెడు మాయువరాజుగారికిన్.

(తెరలోనుండి మంగళ మద్దళ ధ్వనులు వినఁబడును.)

నటి—అదేమి!

సూ—మరేమియు లేదు. మృదంగమునుండి శబ్దబ్రహ్మము, మన దీవనలు విని "తథాస్తు తథాస్తు తథాస్తు" అనుచున్నది. ఇంకను నాటకప్రదర్శనమునకుఁ గాలయాపనమేల?

నటి—ఇదిగో! పోయి సరస్వతీ పాత్రధారణము చేసికొనెదను.

సూ—నీవనినది సరిగాలేదు. గోవర్ధనుఁడవు కావలెను.

నటి—ఎట్లైననుసరే పోనిండు! లోపల సరస్వతిని, పైకి గోవర్ధనుఁడను.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

శ్రీ శ్రీ శ్రీ



శ్రీరామ

సరస్వతి

ప్రథమాంకము

ప్రదేశము—అడవి—రామపుర సంబంధమైనది.

ప్రవేశము—సరస్వతి, మధురిక, పురుషవేషములతో.

సర—నీవనినది సరిగాలేదు. మధురికా! ఏది? అప్పుడే యేమైనది! వెనుకటి కష్టమేదో యంతరించినది కాని యింక రాఁదగిన వెన్ని చిక్కులున్నవో! పడవలసినపాటు లెన్ని యున్నవో! అవి యన్నియు నైనతరువాతఁగదా సుఖము చేకుఱుట.

మధు—దేవీ - సరస్వతీ! పామున్న పుట్టలోఁ జేయిపెట్టవచ్చును. పులియున్న గుహలో నివసింపవచ్చును. పిశాచమున్న చెట్టుక్రింద నిదురింపవచ్చును గాని సవతితల్లి చేరినయింటిలో నుండరాదు. అహో యిప్పటికి మీకు వదలినది కావున బ్రతికితిమంటిని. ఇఁకముందుఁ జిక్కులువచ్చుననియా మీసందేహము? రానీ- అది దేహధర్మము. కడుపున్నంతకాల మాఁకటిశ్రమ తప్పదు; కాని అత్త రోఁకటిపోటు లోకసవతితల్లి ప్రాపుక్రింద దిగఁదుడుపు.

సర—మాతండ్రిగా రామెకు వశుఁడు కాకుండినయెడలఁ గేవలము సవతితల్లి నన్నేమి చేయఁగలదుకే!

మధు—కన్నబిడ్డలుండఁగా గంకణాల సంబరమునకు రెండవసారి సిద్ధపడిన కక్కుర్తి పెండ్లికొడుకునకు దేహశక్తి తక్కువ కావున విధేయత యెక్కువ. బింకమైన ముద్దుపెట్టుకొనుటకు దంతముల పటుత్వము చాలనప్పుడే క్రొత్తపెండ్లికూఁతు ముక్కునకుఁ బచ్చలముంగర. బిగికాఁగిటిలోఁ బడుచుబొమ్మను నిలుపుకొనుటకు సమర్థతలేనప్పుడే సవతిబిడ్డలను శంకరగిరి మన్నెములకు సాగనంపుట. ఇది యీనాఁడే పుట్టెనా? ప్రపంచచరిత్రమునకు మొదటిపత్రమున నేమి యున్నదో కడపటి పత్రమునఁగూడ నదియే యుండును. ఎప్పటికప్పుడే క్రొత్తయని కవులేమో తలతిక్క గాన మొనర్చెదరు. కాని యది పట్టి కల్లఁ. ఎవని యనుభవమున వానికిఁ గ్రొత్తకాని వస్తుతత్త్వమునఁ గ్రొత్తకాదు. దానిలో నొకపత్రమును జూచినవాఁడు మిగులు పత్రములను జూడనక్కఱ లేదు. అది పట్టిరామకోటి—ఏదో చెప్పవచ్చి మఱచితినమ్మా!

సర—ఏమున్నది? ద్వితీయభార్యలు తరుణులైనఁ గనఁబఱచు వాల్లభ్యమునుగూర్చి.

మధు—అందులో మీతండ్రి పట్టి మైనపుదిమ్మ—మట్టిబొమ్మ—తన తమ్మునిఁ జేసి కొనవలసినదని నిన్ను మీసవతితల్లి బతిమాలుకొనినది—బెదరించినది—లంఘనము లుంచినది బంధించినది. తుదకుఁ జంపుదునని శపథముచేసినదికాదా. దాని కిష్టము కానప్పు డీబలాత్కార మేలయని మీతండ్రి రవంత పెదవి కదలిచి నాఁడా? ఆయన రవంత కఱకున్నవాఁడైనయెడల మన కీగతియేమి! ఇల్లు వదలి యడవులపాలై పోవుటేల!

సర—నీవు మాతండ్రిగారి నేమియు ననవలదు. ఆయన మహానుభావులు తపశ్శాలులు—అంతర్ముఖులు—వైరాగ్యసంపన్నులు. ఆయన మాహాత్మ్యము నీ కేమి తెలియును?

మధు—అట్లైన గంగాతీరమందుఁ బద్మాసనమున ముక్కుమూసికొని కూరుచుండి ముక్తికాంత నపేక్షింపక, మదనవిలాసములో మంచముమీఁద జంచేసి నోరు తెఱచుకొని మూఁడవ పెండ్లాము నపేక్షింపనేల?

సర—మధురికా! వెనుకటిసంగతు లేమియు నెత్తకు. ఇఁక ముందుమాట యేమిటో యదిచెప్పు.

మధు—ముందుమాట కేమున్నది? నీవు పొమ్మనువఱకు నీసేవచేయుచు నీయొద్ద నుందును.

సర—అది సరేలే. ఎవరినైన మనవెనుకఁబంపి మాతండ్రిగారు తిరుగ మనలఁ బిలిపించు కొందురేమో?

మధు—అయ్యో, అసందేహము, ఆభయము నీకక్కఱలేదు. పీడవదలినదని యిద్దఱు సంతసింతురు. తనయనంతరము తనతమ్మునిపేర రామపురరాజ్యము వ్రాయించి-

సర—పోనిమ్ము. రాజ్యమున కెవరు దేవులాడుచున్నారు! కాని నాసవతి మేనమామ మాత్రము వెఱ్ఱియాసచే నన్ను వెంబడించు నేమోయని యనుకొనుచున్నాను.

మధు—అతఁడు వేటకై పోయినాఁడు. తిరుగ నెప్పుడు గ్రామములోనికి వచ్చునో!

సర—అతఁ డీయడవికే వేఁటకు వచ్చినయెడల, మనలఁ గలసికొనవచ్చునేమో!

మధు—కానీ - పురుషవేషముల నున్న మనల నాతఁ డెట్లానవాలు పట్టును! నిన్నాతఁ డెప్పుడు చూచియే యుండఁడుకద! ఇఁకనన్నా! తెల్లమొగము ముండకొడుకు! ఆతఁడేమి! నన్నానవాలు పట్టునేమి! కన్ను లున్నవారందఱు కనుచున్నారా! చెవులున్నవారందఱు వినుచున్నారా! నోరున్నవారందఱు తినుచున్నారా! మంచమునకుఁ గన్నులు లేవా! గంగాలమునకుఁ జెవులు లేవా! అక్షయపాత్రకు నోరులేదా! ఇవియన్నియు నుండవలసినది లోనఁగాని పైనఁగాదు. ఆ 'లోన' మనపెద్దమ్మ కయ్యవారినట్టిల్లు.

సర—పోనిమ్ము. ఆతనిమాత్ర మధిక్షేపించుట యెందులకు!

గీ. మనకు నచ్చకపోయిన ♦ మనుజుఁడైనఁ
బరుని కుపయోగకారి కా ♦ వచ్చుఁ జుమ్ము

రాజహంసము కనని ధా ♦ రాధరంబు,
శిఖిని నెయిలెక్కలాడఁగఁ జేయుఁగాదె!

ఇంతకు జాలిని విడనాడి పోవుచునే యుంటిమిగాదా.

(నేపథ్యమున) విడిచిపెట్టుఁడు భటులారా—విడిచిపెట్టుఁడు—రండు.

మధు—(అటునిటు చూచి) అదిగో నీసవతిమేనమామ! ముందు పరుగెత్తుచున్న రెండు లేఁడిపిల్లలను బట్టుకొనలేక, విడిచిపెట్టి యిటకే వచ్చుచున్నాఁడు. అతనిఁ జూచి సిగ్గుపడి చప్పునఁ జెట్టుచాటునకుఁ బాఱిపోకుము.

సర—నూతన పురుషత్వముగావున, భద్రముగనే యుందును. (తనలో): అహా! స్త్రీ పురుషుల కెంత భేదమున్నది!

గీ. ఎంత గడిఁ దేలె మిలమిలాలు ♦ నింతియైన
నన్యుఁ గన్నెత్తి చూడఁ గా ♦ నంత కొంకు,
నెట్టి యాడంగి పావడ ♦ గట్టునైనఁ,
దెఱవపైఁ గోరచూపులఁ ♦ ద్రిమ్మరించు.

గీ. పొలఁతులకు సిగ్గు సహజమగా ♦ భూషణంబు;
పురుషులకుఁ జాకచక్యమే ♦ పుట్టుతోడవు;
కవచమున సాధుహృదయంబు ♦ గట్టిపడునె?
పట్టుఅవికను మృదువౌనె ♦ గట్టిమనసు?

గీ. కాని, దేశకాల విభేద ♦ గతులఁ బట్టి
కోరమీసాలు గాగరాల్ ♦ కుండమార్పుఁ,
జెందుచున్నవి సందర్భ ♦ సిద్ధిఁ గనక
కల్లనటకుల వేసాల ♦ గతుల యట్లు.

(జయరామసింగు ప్రవేశించును.)

జయ—ఓహో! మీరు మాదర్శనమునకే వచ్చిన పురుషులని మే మెఱుఁగకపోలేదు. మీమనవియేదో విన్నవించుకొనుఁడు.

మధు—(తనలో) మీదర్శనము—అసత్యమే; పురుషులు—అసత్యమే; (ప్రకాశముగా) అయ్యా! చేతఁజిక్కిన లేఁడిపిల్లలను వదలివైచితి రెందులకు?

జయ—ఆలేళ్లతోఁకఁ జూడఁగానే మాగ్రొత్త పెండ్లికూఁతురుగారి తలకట్టు మనమునఁ దటుక్కుమనుసరికి, వాని నేమియుఁ జేయవలదని శాసించినాము. ఇది దయాహేతుకారణము.

మధు—ఆహాహా! మీసౌందర్యరసగ్రహణము! లేఁడితోఁకవంటి కేశభారముని లోకమున కొక క్రొత్త కవిసమయమును గల్పించిన మహావిద్యాంసుఁడవు! విహిత

కారణ మంటివి! అముష్మికకారణ మింకొకటి యున్నదా!

జయ—లేదామరి? భవిష్యభగవానుని జటాజూటమందున్న జంతువును జంపఁగూడదని—

మధు—అది శంకరుని చేతిలో నున్నదని కాదా - పురాణములందున్నది!

జయ—ఉత్తరదేశపు బ్రతులలో నట్లున్నదనుట వాస్తవమే కాని యది ప్రక్షిప్తమని శంకరాచార్యులవారు కృతయుగమందే పరిష్కరించినారు.

మధు—అబ్బో! విమర్శనముతోఁగూడిన మీపాండిత్యము సర్వతోముఖముగఁ బ్రకాశించుచున్నదే.

జయ—పెద్దలేర్పరచిన యఱువదినాల్గు విద్యలలోను 'దస్తావీజు' వంటి సాహిత్యము సంపాదించినాము. పరీక్ష చేయువాఁడున్నప్పుడు బయలుపడును. పూర్వప్రభువులు గలించిపోవుటచేఁ గాబోలు నిప్పు డెక్కడను గనఁబడకుండ నున్నారు. కోడిపందెము ప్రత్యేక మొక సముద్రమంత విద్య; ఆవిద్యరానిరాజు రాష్ట్రపాలన కర్హుఁడు కాఁడు. దొంగతన మొక విద్య; అర్థశాస్త్రసంప్రదాయము రాజనీతియు నందు నిరివిగ నున్నవి. ఆవిద్య రానివాఁడు మంత్రిపదవి కర్హుఁడు కాఁడు. కుట్టకుదరు ముష్టియెత్తుకొనుట యొకవిద్య. అది రానివాఁడు బ్రాహ్మణవృత్తికిఁ బనికిరాఁడు.

మధు—(అప) అమ్మ—ఈముండకొడుకుతోఁ బెండ్లి మాన్పి భగవంతుఁడు నీకెంత యాపదఁ దప్పించినాఁడమ్మ!

సర—(అప) నాకు మిగుల కోఁతగ నున్నది. నీకాతనితో సంభాషణ మెందులకు?

మధు—(అప) నే నాతని నిటకు రమ్మనలేదు. నేను ముందుగా నాతనితో మాటలాడలేదు. అయినను వదలించుకొనుటకుఁ బ్రయత్నించినకొలఁది పెంపుటికంపవలెఁ గాళ్లకుఁ దగులుకొనుచున్నాఁడు.

సర—(తనలో)

గీ. ఆఁడుదానిపుట్టు ♦ వధికప్రమాదంబు,
వదలరాని పెండ్లి ♦ బాధవలన,
మగలకున్న స్వేచ్ఛ ♦ మాకుఁగూడఁగనున్న
లగ్గులేక యున్న ♦ నగ్గులేదు.

మధు—మీ జ్ఞానసముద్రమంతయు మీతో నింకిపోకుండ లోకోద్ధరణార్థ మేమిచేయఁదలఁచితిరి?

జయ—సర్వప్రపంచసారమను గ్రంథమును వ్రాసి పెండ్లికూఁతురుగారికిఁ గృతినిచ్చెదము.

మధు—పెండ్లికూఁతురుగారని యిదివఱకొకసారి యంటిరి. మీకు వివాహము నూతనముగా నైనది కాఁబోలు నేఁడు!

జయ—(కట్టిగ నవ్వుచున్నాఁడు.)

మధు—అట్లు నవ్వెదవేల?

జయ—దానికి సపాదలక్షగ్రంథమున్నదిలే—నీవక్కనున్న యీయన యిదివఱకు మాటలాడలేదేమి?

మధు—ఆయన బహుమితభాషి.

జయ—ఆయనయెదుట మనము స్వేచ్ఛగా మాటలాడుకోవచ్చునా?

మధు—అభ్యంతర మేమి?

జయ—పెండ్లికూఁతురుగా రెవరనఁగా—ఈదేశపు రాజన్నాఁడే, మందపాలుఁడు—ఆతనికూఁతురు—పిల్లను పెండ్లిచేసికొమ్మని మన యక్కయు బావయుఁ బెద్ద పట్టుపట్టుచున్నారు. మనమే యింకను దలఁ గదల్పలేదు. ఆలాగున వ్యవహారము రొంపిలో స్తంభమలాగున నున్నది.

మధు—అక్కగారి బావగారి పట్టునకేమి? ఆపిల్లకు మీయం దనురాగమున్నదా?

జయ—మనమనఁగా నామెకుఁ బంచప్రాణాలు—వింటివా—పంచప్రాణాలు! ఆమె కెంతసేపు మనగోడవరయే—మనయొబునే—ఇంకొకనిమీఁది కామె మనస్సు పోవుటకు మఱి యే ముందకొదుకున కిన్ని సౌభాగ్యములున్నవి? మనము శాశ్వతముగా నామె హృదయములోఁ దిష్ఠవేసినాము. అది శిలాక్షరమైనమాట.

సర—(తనలో) అంతవఱకు నిజమే.

గీ. చెవిని దుద్దుకాంతి ♦ చిత్త మంటునో లేదో?
చెవిని గలుగుపోటు ♦ చిత్తమేర్చుఁ?
గాలియందె హృదిని గల్లనునో లేదో?
కాలిముల్లు మదిని ♦ గలుకుమనును.

గీ. జననమిడిన తల్లి ♦ స్మరియింతు నెప్పుడో
సవతితల్లి పేరు ♦ జప మొనర్తు;
జనునియావి హృదిని ♦ జారిపోవఁగవచ్చుఁ
దిట్టు చిలుకకొయ్యఁ ♦ బట్టు మదిని.

గీ. మిత్రవరునికంటె ♦ శత్రువే యెల్లప్పు
డుల్లమందు విడువ ♦ కుండువాఁడు
ప్రేమకున్న జిగురు ♦ పెళుసేమొ కాసంత
యప్రియతకుఁ గలుగు ♦ నతుకు మెండు.

మధు—మీయం దామె కంతప్రేమమున్నదిగదా—మీ కామెయం దెట్లున్నది?

జయ—సాధారణముగా మనవంటివారిలోఁ బ్రేమయను తత్త్వముండదు; ఏదో కారణమును బట్టి యది యప్పుడప్పుడు బయలుపడును. ప్రేమయున్నప్పుడు మగతనమునకుఁగూడఁ గొంత లోపమని మంత్రశాస్త్రజ్ఞులందఱు నొప్పుకొనిన యంశమే; అయినను సంక్రాంతిపండుగలకు డింకిలోడిమీఁదనున్నంత ప్రేమము నాకు పెండ్లికూఁతురిగారిమీఁద నున్నదని చెప్పఁజాలను. ఆప్రేమ తత్త్వము విచిత్రత యేదో అనుభవించినవానికిఁ గాని తెలియదు. ఒక్కొక్కప్పుడు పిల్లికూన పదునాల్గు పెండ్లికూఁతులపెట్టు; మొత్తముమీఁద ప్రేమ యున్నదికాని లేకపోలేదు. లేనియెడల నామెను సప్తవింశతిభుజంగప్రయాతములతో నేల వర్ణించియుందును?

మధు—మీ రామెను జూచుటకు వీలులేదుగదా—ఎట్లు వర్ణింపఁగలిగితిరి?

జయ—ఆమెయొద్ద మధురికయను దాసియున్నది; అది పట్టి తలబిఱుసుముండలే—దానిని నెత్తి వాయఁగొట్టి నిమ్మళముగాఁ గేలోపు చేసికొన్నాము.

మధు—(తనలో) ఓరి దొంగముండకొడుక (ప్రకాశముగా) చేలోపవఁగా?

జయ—ఆయువశిష్టము దీర్చినామన్నమాట.

మధు—(తనలో) ఓరి నీగొంతుకఁ గోయ్య.

జయ—దానిమూలమునఁ బెండ్లికూఁతురుగారి యవయవసౌభాగ్యమంతయు విని కవిత్వము చెప్పినాము.

మధు—సరే, మీ కింకను వివాహ మెందులకుఁగాలేదు?

జయ—ఇచ్చటనే యున్నది కీలకము—లౌకికపుమాట.

మధు—నా కేదియో బోధపడలేదు.

జయ—మనము రహస్యములు వెల్లడించుకొను బుద్ధిహీనస్వభావము కలవారము కాము; కాని మిమ్ముఁ జూడఁగానే మనకు విశ్వాసము కలిగినది కావునఁ జెప్పుచున్నాము. ఈరాజ్యమంతయు ముందుగా మనపేర వ్రాసి యిచ్చినఁగాని మీకూఁతును మనము పెండ్లాడమని మాయక్కగారిచే కావకుఁ జెప్పించినాము,

మధు—అందు కాతఁ డంగీకరించినాఁడా?

జయ—ఆత్మస్తుతి పనికిరాదు—కాని చక్రవర్తివంటి పెండ్లికొడుకు లభించినప్పుడు చచ్చురాజ్య మిచ్చుట విశేషమేమి?

మధు—(తనలో) నాకడుపులో మండుచున్నది. నిన్నేమనుటకు వీలులేకున్నదిరా. ఇక్కడినుండి పోవులోపల నిన్ను దొడమీఁదఁ గొట్టకుండునెడల నేను రాజగురువుగారి కూఁతురనుగాను.

జయ—మాయక్కకు సంతానపుసంగతి నిరాశమైనది. మనలో మనమాట. ఇఁక నే నీరాజ్యమునకు రాజను. ఇప్పటి రాజుగారు నాకుఁ బగలుకావ రాత్రిమామ; ఆయనకున్న యధికారమంతే.

సర—సేవకా! లేనిపోనిమాటలాడుచు నాదొరగారికి నీవు నికోపము త్రమమీయనేల! వారి యొద్ద సెలవుతీసికొనుము. పోవుదము. మనకున్న యవశ్యమగు పనియేమి! ఈవ్యర్థకాలహరణమేమి!

మధు—అయ్యా క్షమింపుఁడు. ఇదిగో పోవుదము (అపవారించి) అమ్మా! ఈతనిచే నీకాళ్లు పట్టించెదను. ఒక్కనిముసము శాంతింపుము!

సర—(అపవారించి) నాకక్కఱలేదు.

జయ—అయ్యా! ఆయన యట్లు కోపపడెదరేల!

మధు—కోపపడెదరేలయని సామాన్యముగా ననుచున్నారా! మీరు చెప్పినమాటలను బట్టి యాయన యీవఱకు మీజుట్టుపట్టుకొని జాడించి నేలఁ గొట్టియుండవలసినది. నన్నుఁజూచి యూరకుండినట్టున్నది.

జయ—ఎందుచేత! మనమేమైనను దప్పాడితిమా యేమి! మనమెప్పుడు తగవులో దిగువారము కామసుమీ! పౌరుషము లేకకాదు. దినమున కొక్క మేఁకను దిను మనకుఁ బౌరుషముండకేమి? పౌరుషమనునది పంటికి క్రిందనున్నది. పంది వాళ్ళమీఁది క్రొవ్వును బంటివరుసలో గట్టిగాఁ గోరముతో గోఁకినట్లు లాగి తీని వానికిఁ బౌరుషము వచ్చినదన్నమాటయే. ఎవ్వనికైనప్పటికిఁ బన్నుకొండలు కొని కొండనాలుకవఱకే పౌరుషతత్త్వము. దానిక్రిందినుండి శుద్ధమాత్సర్యమే; కాని యిప్పుడు మీహితునకు మనయందుఁ గోపమేల కలిగినదో చెప్పుము. అంతకంటె ముఖ్యమైనది—అది శాంతించుటెట్లు! దురదగలిగినప్పుడు వెంటనే గోఁకికోవలసినదేగాని కారణపరీక్ష చేయుచు నాలసింపఁగూడదు.

మధు—మీ రాతనికిఁ బ్రబలశత్రువగుటచే మిమ్ము శిక్షించినఁగాని యాతనికోపము శాంతింపదు.

జయ—అంతదూరమెందులకు! పాఱిపోవుటగూడఁ బౌరుషచిహ్నముగానే వేదాంతు లంగీకరించినారు. కావున మర్యాదగా వెనుకాడెదమా!

మధు—కదలినయెడల నిన్నాతఁడు ముక్కలక్రింద ఖండింపఁడా!

జయ—అంతవఱకు వచ్చునెడల మన మాతని కాళులపైఁ బడెదము. మనమా యుచ్చరనీవతపట్టుదల పెట్టుకొనలేదు. కులగోత్ర విచారణము మనకు నెందలే యక్కఱలేదు. తగవులాటలు తక్కువజంతువులకుగాని మనకుఁదగవు.

మధు—(తనలో) ఎంత నిర్భాగ్యుఁడవురా. నీ వెంగమిద్య (ప్రకాశముగా) ఆతఁడు నీకేల శత్రువయ్యెనో నీవడుగవేమి!

జయ—కారణచింతతో మనకుఁ బనిలేదని యిదివఱకే చెప్పితిని. ఆ కారణమేదో తెలిసినయెడల, దానికిఁ బైకారణముఁ దెలియవలసివచ్చును. ఇట్లు పైపైఁ బోయినకొలఁది మనుజుఁడట్టెయట్టె దిగిపోవును గాని పైకి వచ్చుఁడు. ఇప్పుడు మనకు దిగవలసిన దినములుకావు. ఇప్పుడు మన కుచ్చస్థితినొందిన కుజుని మహాదశ; రాజ్యలాభము దీనిలోనే కలుగవలసియున్నది.

మధు—అబ్బా! నేను చెప్పఁదలఁచినదేదో చెప్పనీకుండ నొకటేసోద చెప్పకు. ఈతఁ డొక మహారాజపుత్త్రుఁడు. వివాహప్రాయము ప్రాపించినవాఁడు. కన్యాన్వేషణకై తిరుగుచున్నాఁడు. ఈదేశపు రాజునొద్ద సుందర స్వరూపిణియైన కన్యయున్నదని తెలిసి యిటకు వచ్చినాఁడు. ఆమెను పరతితల్లి ప్రోత్సాహమునఁ దండ్రి బలాత్కారముగ నొక నిర్భాగ్యున కిచ్చి—

జయ—మనమే యానిర్భాగ్యులము కాని కుజనిలో ముక్రాంతరము వచ్చునరికిఁ గిరీటధారణయోగము కలుగనియెడల నీగ మొదలంటఁ దఱిగింతు.

మధు—ఊస్స! చెప్పఁదలచినదేదో చెప్పనీయవు. చెప్పినంతవట్టునకైన నభిప్రాయమేదో కనిపట్టవు. ఆపిల్ల కిష్టము కాకుండ నీవివాహము జరుగనై యున్నది. కావున నిన్ను రాజును దండించి యామె నితఁడు తీసికొనిపోవలయునని వచ్చినాఁడు.

జయ—అచ్చే! అమ్మతోడు; కన్యకకు నాయందు గాఢమైన వలపు.

మధు—(తనలో) చీ. చీ.

సర—(తనలో) వదినిమాసము లీతనిమాటలు వినుటచేతనే యొడలు జలదరించి బాధపడుచుంటినిగదా. ఈతనిని భర్తగా బడయనున్న యిల్లాలిగతి—ఆహా—యేమి కావలయునో! భగవంతుఁడా! అంతియేకాక ఈరాజ్యమున కితఁడే ప్రభుఁడైనచోఁ బ్రజ లెంత భాగ్యహీనులగుదురో!

గీ. ప్రజను సమదృష్టిఁగాంచెడు ♦ ప్రభువరుండు
వధువును సుఖోదధిని దేల్చు ♦ వల్లభుండు
కృతికి శోభను సమకూర్చు ♦ కృతిపతియును,
ఛాత్రునకుఁ గన్నులిచ్చు నా ♦ చార్యవరుఁడు.

గీ. దానమున కిన్నివిధముల ♦ దగినపాత్ర
వంశవిఖ్యాతి నిలిపెడు ♦ బాలకుండు
పూర్వజన్మాఘురచితసం ♦ పూర్ణపుణ్య
భారపరిపాకమునఁగాని ♦ పడయుటెట్లు?

(ప్రకాశ) నీవింక వానితో మాటలాడక ముందునడువుము.

మధు—మహాప్రభూ! చిత్తము.

జయ—అయ్యా—మీకాళ్ళపైఁబడుదును—మనకు జుట్టుపట్టుకొనుట యొక్కటియుఁ గాళ్ళుపట్టుకొనుట యొక్కటియుఁ గాదు. పౌరుషమున్నవానికి నఖశిఖ లొక్కటే; మహారాజా! మీకుఁ గన్యలకేమికొదవ. మనమైనను రాష్ట్రము కొఱకే యీబొజ్జమున్కు ముచ్చిలొమ్ము నపేక్షించితిమిగాని మఱియొకటి

కాదు. మనలో మనమాట. అంతఃపురకాంతల లోపముల నెల్లడింపఁగూడదు అన్నియు నామె కవగుణములే.

మధు—ఛీ. ఛీ. ఇరువదేడు భుజంగప్రయాతములలో నామెస్వరూప స్వభావముల వర్ణించితినని చెప్పితివే.

జయ—ఆమాటమాత్రము మనమనలేదు. జిహ్వఁగోసిననైన మనకసత్యమనుమాట లేదు.

మధు—పెండ్లికూఁతు పేరేది!

జయ—ఏదో కాని మఱచిపోయితిని. మంచిపేరే.

మధు—అయ్యో — పెండ్లాముపేరు మఱచినవాఁడవు నీ వెక్కడి మనుజుఁడవు!

సర—నేవకా! ఇఁకఁ బోవుదము రమ్ము.

జయ—రక్షించు — రక్షించు. (సరస్వతి కాళులపైఁ బడును.)

సర—లెమ్మని చెప్పుము.

మధు—(అప) నీకు సప్తపదోత్సవము చేయవలసిన పెండ్లికుమారుని యవస్థ చూచితివా! (ప్రకా) లే.

జయ—మీరు మనకూటిలో మట్టిఁగొట్టకుండ మీయూరు పోవలయును. మనకట్టి బాస యిచ్చినఁగాని లేవను. మహాభటులు దూరమున నుండుటచేత గౌరవము నకు లోపములేదని కాళులు పట్టుకొంటిమి.

సర—మాదారిని మేము పోవుదుముకాని నీప్రయత్నమున కేమియు నడ్డురామని చెప్పు.

మధు—వింటివా!

జయ—(లేచుచు) ఇంతకంటె మనకేమియు నక్కఱలేదు.

మధు—అక్కఱలేకేమి! రెండు లెంపకాయలు మాప్రభువుగారి పక్షమున నే నిచ్చెదను తీసికొనుము. (చేయి యెత్తును.)

జయ—రెండు కాదు. పండ్రెండు లెంపకాయలు తీసికొందును. లాభించునప్పుడు తీసికొనుటలో వెనుకయడుగులేదు. ఇందులో నొక ధర్మసూత్ర మున్నది. నే నిప్పుడు రాజప్రతినిధినగుటచేత నన్నుఁ గొట్టినదెబ్బలు రాజు దౌడపైఁ గొట్టినట్లని మాత్రము మనుస్మృతి చెప్పుచున్నది.

మధు—నీవంటి యవకతవక తెలివితక్కువ నిర్భాగ్యశిరోమణినిఁ జేర్చినందుల కూరక పోవుదా! (రెండుసారులు దౌడపైఁ గొట్టును.)

సర—నేవకా! నడు. (పరిక్రమించుచున్నది.)

జయ—నేనుగూడ లేవువఱకు వచ్చి యోడ నెక్కించి మఱలిపోవుదును.

మధు—(అప) అమ్మా! మనకు రేవువఱకు దారి తెలియదు. అక్కడ నోడ నెక్కుటకుఁ బడవలసినపాటు లనేకము లుండును. ఇతఁడు కూడ మనతో వచ్చును.

సర— గీ. గరళసంపర్కముస్న యో ♦ గిరమువలెను
మొండిచేయిపుట్టినయింటి ♦ పోల్కి నకట !
మాడుసాపత్న్యమాతచే ♦ మనసు చెడిన
కన్నతండ్రిని విడిచి యోఁ ♦ గంగవలసె.

గీ. చల్లనిదయాసుధల బావి ♦ తల్లి పోవఁ
దండ్రి పినతండ్రికంటె ను ♦ త్తరుఁడుకాడు
భవ్యగాయత్రిహృదయంబుఁ ♦ బాసిపోవ
యజ్ఞసూత్రంబు మొలత్రాటి ♦ కధికమగునె ?

గీ. కన్నతండ్రిఁ బాసినదని ♦ నన్ను నింద
సలుపకుఁడు రామనగరవా ♦ స్తవ్యులార !
పెండ్లికొమరునిసౌశీల్య ♦ విధము నంత
కాంచితిరికాదె ? నాయందుఁ ♦ గలదె తప్పు ?

గీ. విషధిమధ్యంబునఁ దుపాను ♦ విసరునపుడు
చాపకొయ్యలు విఱుగఁ బుం ♦ జాలు దెగఁగ
మోర్జ పగులఁగ జుక్కాను ♦ ముక్కగాఁగ
నడలునావికగతి నుంటి ♦ నడవినడుమ.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది ప్రథమాంకము.

శ్రీరామ

సరస్వతి

ద్వితీయాంకము

ప్రదేశము—భీమపురము-సముద్రతీరము.

ప్రవేశము—ఇద్దఱు పల్లెవాండ్రు.

మొదటివాఁడు—అన్నా! తుక్కు రేఁగఁగొట్టినదిరా తుపాను- దీని సిగ దఱుఁగ.

రెండ—వల బుజాన వేసి ఎన్నియేండ్లయినదో! కుంటిబావనయ్య అయిదు పదులమీఁద రెండన్నాఁడు. కంతిసాతానమ్మ పదైదులమీఁద రెండన్నది. ఎవరిమాట నిజమో తెలియదు కాని, యింతగాలివిసరుమాత్రము తోఁకచుట్టలో బొమ్మ డాయి బోణి అయినది మొదలు నే నెఱుఁగను బాబూ! నెత్తిమీఁద నెంద్రుక లుండునో యెగురునో యనిపించినది.

మొద—మన లెక్కయేమి? రావణాసురుని మీసాలే రూపుమాసిపోయినవి. ఆయమ్మ మనపాలఁబడి మనచేతిలోఁ బెట్టిన మెడలోని తీగచేతఁ గడుపులో పెచ్చఁబడి యీమునురుదినములలో బ్రదికినాము గాని—

రెండ—పోలేరమ్మగండిలోఁ జిక్కుకొన్న అమ్మవారిని లాగినందుకు మెడతమీఁద లాడితెదు గలదో లేదో అవస్థ విచ్చినందుకే సంబరపడుచున్నావా? నేనే ఆఁడుదానవైన పక్షానికి - నీవే నన్ను లాగినపక్షానికి - బంగారపు రింగునున్న వల నీబుజాన వేయనా? ఆయమ్మ యిప్పుడేమైనది?

మొదటి—అయిదాఱురోజులు మాగుడిసెలోఁ బ్రాణాలు గూటఁబడువరకుంచినాము- తరువాత- ఈభీమపురము సివారునుండి రొయ్యమీసాలయ్య యెవఁడో యయ్య వచ్చినాఁడు. అటు చూచినాఁడు. ఇటుచూచినాఁడు. ఈయమ్మ యట్లె కన్ను తెరచినది. ఇట్లె తలవంచినది. అయయ్య యిగిలించినాఁడు. ఈయమ్మ సగిలించినది. ఆ! నీవు నేను మాటలాడుకొనునంతలోఁ బెద్దచేఁప చిన్నచేఁపను బట్టుకొన్నట్లు- ఆయయ్య యీయమ్మని వడిసెపట్టినాఁడు.

రెండవ—అటుపైన,

మొదటి—అటుపైన లేదు. ఇటుక్రింద లేదు. వల దులుపులోఁ దప్పించుకొని నీటిలోఁ బడిన చేఁపలాగున మళ్లీ చూపులేదు.

రెండ—అదిరా తమాషా! ప్రుట్టగోఁచి పెట్టినది మొదలు చూడఁగాఁ జూడఁగా నా కేమితోఁచిన దనఁగా— మగవాఁడున్నాఁడే— నేయి అన్నము తినువాఁడు

మొదలుకొని అంబలిత్రాగువాని కంటను బట్టి దద్దమ్మ. ఇల్లు దాఁటినయెడల నువ్వుగల్లునకు మారఁడు. అమ్మ! దీనిమాయ కాల—అఁడు దున్నదే! అడవిలోఁ బెట్టు— నడికంద్రానఁ బెట్టు— దానిబ్రదు కది సులువుగాఁ జూచు కొఁగలదురా. దీపానికివచ్చిన యినుళ్ళ తెరలాగున దానిఁ జూచి అందఱు మూఁగుదు రేమిరా! మనకొంగ కొంకఁడును జూడఁ డేమిరా! ఛీ! ఎన్నాళ్ళు గోఁచిపెట్టి సిగవేసికొని బ్రదికిన నేమి లాభము? పైఁట వేసుకోవలెను. కొప్పు పెట్టుకోవలెను. అప్పుడు దాని తమాషా! మిసాలపోతులుగా మనలఁజేసి ఆ బమ్మగాఁడు మన గొంతుక గోసినాఁడురా. కొన్నాళ్ళాఁడుది, కొన్నాళ్ళు మగవాఁడుగా నుండునట్లు చేసినను కుసందుగా నుండును. ఇన్నిమాట లెందుకురా! నీపిట్టకంత అఁడుది కావందను. మగవాఁడు కానిపీఁడను. తమ్ముఁడా! అట్లు చూపు పాతిన దేమిరా!

మొదటి—అదిగో! ఆకొబ్బరితోఁపు ప్రక్కను- అమగవాఁడు నాఁడుదికూడ నిలఁబడి నారురా!

రెండవ—ఏది! (చూచి) ఆదిరా తమాసా! అక్కఅచేఁపలాగున మంచిసొగసుగా నున్నదిరా! ఎన్ని రంగులైన నెన్ని సొగసులైన కొంతతమాసయైన సముద్రపుఁ జేఁపలలోను— అఁడుపాపలలోను నున్నదిరా. అదిగో! వారిక్కడికే వత్తురు కాఁబోలు. ఆమగముండకొడుకు పీఁతలాగున నడ్డముగా నడచుచున్నాఁడేమి! మన మిద్దఱము పోవుదమురా. (నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

ప్రదేశము—భీమపురపు సివారు.

ప్రవేశము—మధురిక, భ్రమరకుఁడు.

భ్రమ—అది నీకు బాగుగా నున్నదా?

మధు—నీకు బాగుగా లేకపోవచ్చును గాని, నాకు బాగుగా లేనియెడల నే నట్లేల యనియుందును? నాజాతివాఁడవు కదా - దూరబంధువు ననికూడఁ జెప్పితివి కదా—మాయింటికి రమ్మని యాదరణపూర్వకముగాఁ బిలిచితివికదా అని వచ్చితిని. మూఁడు దినములకంటె నీవలన నాతిథ్య మొందుట యెందులకు? నీ యింటిలోనున్న ముసలియామె నాకు మిగుల మేలైన యాఁడుతోడుగా నుండుటచేత నీదినములైన నుంటిని గాని నే నిట్లుండుట తగునా? నీవా—వడుచు వాఁడవు నేనింక నగరు పెండ్లియైనదానను గాను. అందుచేత నేను బోవుదును. నాకు సెలవిమ్మంటిని. నేను దగనిమాట యేదియు నవలే దనుకొందును. అంటి నని నీకుఁ దోఁచినయెడల క్షమింపవలయును.

భ్రమ—నీయభిప్రాయ మేదో నాకు బాగుగాఁ దెలియలేదు. నేను వడుచువాఁడ నైన యెడల నీకుఁ గలిగిన చిక్కేమి? నీకుఁ గన్నెతనము గానందువలన నీ

యూరికిఁ గలుగు నష్టమేమి? నీకేల పోకలయును? సరే—పోయెద ననియే యనుకొనుము. నీవు వెళ్ళినందు వలన నా వదినకు భంగము కలుగు నని నీ యభిప్రాయమా? నీనగరు పెండ్లి కీయూరికంటెఁ బైయూ రెక్కువ తృణకాష్ఠజలసమృద్ధి గందని నీయభిప్రాయమా? నీశుభకార్యము శ్రీజగన్నాథాలయములోఁ జేయఁదగినది కాదుగదా! ఏదోయొకయూర జరుగఁదగినదే కదా! ఈయూరి మనదానులంద ఱీమాత్రపు కృతాకృత్యమునకుఁ బైయూరు పోవుచున్నారా! ముసలిదానియింట మన మిద్దఱ మింక ముందుఁగూడ నున్న యెడల నితరు లేమని యనుకొందురని నీయభిప్రాయమో రవంత చెప్పు!

మధు—ఆఁ! ఏమైన ననుకొందురు—మానుదురా యేమి? నరములేని నాలుకకు న్యాయ మేమి యన్యాయ మేమి?

భ్రమ—ఏమైన ననుకొందురని యంటివిగదా—ఏమని యనుకొందురో చెవులార వినవలయునని యున్నది. ఏదీ! ఏదీ! (నవ్వును.)

మధు—(సిగ్గుతోఁ గూడిన వగతో) ఆఁ!

భ్రమ—ఆహాహా! ఎంతసొగసుగా 'ఆఁ' కొట్టినావు! ఏలాగున? ఆఁ ఆఁ. (తానను కరించును.) ఏమధురగానముకూడ నీ 'ఆఁ' కు సరిపోదుగదా. సప్తస్వరసారస్య సార మొక్క దెబ్బతో విసరివైచితివే! సరే. మన మిద్దఱము భార్యాభర్తల మని పై వారనుకొందురు. మన మట్లింకను గాకపోవుట వారితప్పా మన తప్పా? ఇంకను గాకపోవుటచేత నేగదా వారట్లనుకొనుటకుఁ గారణమగును. వినయెడల నోరెత్తుదురా? సతీపతుల నందర నూరివారు తారకమంత్రమువలె జపించుచున్నారా? తప్పు మనలో నున్నప్పుడూరివారికిఁ జీవాటులేల? మూఁడు దినములు వృథయైనందులకే మనము భగవంతునికిఁ బ్రజలకుఁ గూడ నుత్తర వాదులమై యుంటిమిగదా. ఇంక నాలస్య మేల?

మధు—ఇందులో భగవంతునికిఁ గూడ నేమిసంబంధము?

భ్రమ—సంబంధ ముండితీఱినది.

మధు—ఎట్లు?

భ్రమ—నీవు చక్కని చుక్కవు. దోరజామిపండువంటి ప్రాయము వచ్చినదానవు. స్వదేశమునకు మిగుల దూరమున నున్నావు. అసహాయురాలవై యున్నావు. పోల్గుపిట్ట మఱ్ఱిపండునువలె నిన్ను గుటుక్కున మ్రింగుట కీవాడనే యెందఱో జాలుకచ్చలవారు—కోరమీసాలవారు—వడివేసియున్నారు. నన్నుఁజూచి సంశయించుచున్నారు. మొదట నేను శుద్ధజాఱుఁడువలె నిన్నాకర్షించితిని. నాస్వభావ మది కాదు. నీవు నా కొఱఁబడుట నాయదృష్టమే కాక నీయదృష్టము కూడను. ఇట్టి నీవు దుష్టసంపర్కముచేఁ జెడిపోకుండఁ గాపాడుట నావిధి యనుకొనుచున్నాను. నీవు భగవతిచ్ఛచేఁ బల్లెవాని కొంపలో నాకుఁ జిక్కితివి. నిన్ను వదలివైచినయెడల నేను భగవంతుని కుత్తరవాదిని గాకలని తప్పు

వని భయపడుచున్నాను. నిన్ను నేను బెండ్లాడెదను. నీవు సుఖముగా సంసారమును సవరించుకొనుచు నన్నుఁ బుత్త్రవంతునిగాఁ జేయవలయును.

మధు—ఈయంశమందే నీకు నాకును భేదాభిప్రాయము లున్నవి. నేను బెండ్లిసొల్లను. అందువలననే మఱియెక్కడికైనఁ బోవుదు ననుచున్నాను.

భ్రమ—పోకుండ నిన్ను నిరోధించుట కవని కధికారమున్నది! నీవు వయసువచ్చిన దానవు, దానితో బుద్ధికూడ రావలసినదే. కావునఁ బెండ్లిచేసికొనుము.

మధు—పెండ్లిప్రస్తావన నీవు పదేపదే చేయకుము. నాకది యపశకునముగా నున్నది. పెండ్లిచేసికొనుటకు నేనంత దిక్కులేనిదానను గాను. అంత కన్ను ముక్కు తీరు లేనిదానను గాను. అంత నాగరాగుడ్డకైన గతిలేనిదానను గాను.

భ్రమ—కావుననే పెండ్లిచేసికొనుమని ప్రతిమాలుకొనుచున్నాను. చేసికొని టంకసాల లోని కాసులవంటి పిల్లలఁ గనినయెడల నీ సౌందర్యము లక్షగుణములై శాశ్వతముగాఁ బ్రకాశించును. నీజాతిని నీవు లావణ్యమయమును జేయుదువు. కవి యగువాఁడు గ్రంథముల వ్రాయవలయును. సౌందర్యవతి సంతానమును గనవలయును.

మధు—సంతానము కొఱకేనా యీజంజాటమంతయు? సరిసరి మంచి బుద్ధిమంతుఁడవు! పిల్లలవలన సౌందర్య మెంత ధ్వస్తమగునో మగవాఁడవైన నీ కెట్లుతెలియును? తలవరనినప్పుడు సంతానమే కావలసియుండిన యెడల దేనినైనఁ దెచ్చికొనఁ గూడదా? సంతానమునది వృత్తివిచ్ఛేదము గాకుండఁ గొనసాగుటకే కదా. అదిగాక కులవృత్తిలో నున్నప్పుడు మాత్ర మంత కనవలసిన దౌర్భాగ్యము భగవంతుఁడు నుదుట వ్రాసినప్పుడు తప్పునా యేమి? కావున వృత్తి మానుకొని పెండ్లి చేసికొనుమని నీవు చెప్పిన మాట నాకు నచ్చలేదు.

భ్రమ—మధురికా! వృత్తి వృత్తి యని పెద్దమాటలు చెప్పుచున్నావు. రాజ్యాధిపతి వృత్తియా? మంత్రాధిపతివృత్తియా? సేనాధిపతి వృత్తియా?

మధు—ఆవృత్తులు మావృత్తికంటె ఘనమా! కత్తి చేతధరించి యుద్ధభూమి కటికి వీరావేశమును దెచ్చుకొని యొక్క శత్రువును స్వాధీనునిగాఁ జేసికొనుసరి కొక సేనాధిపతికిఁ జావు తెంపులయి పోవును. అట్టి విలాసముగాఁ దలుపు చాటున నిలిచి హృదయముమీఁది హారమైనఁ గంపింపకుండ నొక్క క్రీఁగంటి చూపుతో వీరాగ్రేసరునినైన గడగడలాడించి నాగరాకొనను గన్నుల కద్దుకొనునట్లు చేయఁగల వృత్తి నాది—సేనాధిపతియే నాయొద్ద మారనప్పుడు ప్రధానుని లెక్కయేమి? ఆస్థానగజాశ్వాదిజంతు పరిపోషణాధికారమున్న మంత్రిచే నాయింటి కోళ్ళకుఁ దవిటియాండలు చేయింతును. తప్పులెక్కలు వ్రాయించి ధనము గడించిన సచివశిరోమణిచే మాయింటిలోని చాకలిపద్దులు వ్రాయింతును. ఇఁక రాజ్యాధిపతివృత్తి మావృత్తికంటెఁ దక్కువయని మా యమ్మమ్మ పవిత్రమైన తన జీవచరిత్రముచే లోకమునకు వెల్లడిచేసినది.

భ్రమ—అదియేమి ! అదియేమి !

మధు— మాయమ్మమ్మ— శ్రీమతులలోనిది— నీవు వినలేదుకాఁబోలు— చరచర కవిత్వము చెప్పఁగలదగుటచేఁ బరపరఁ దన జీవచరిత్రమును దానే వ్రాసికొనెను. ఇప్పటి మందపాలరాజున్నాఁడే. ఈయనతాతయే కాఁబోలు, మాయమ్మమ్మను జేరఁదీసెను. ప్రభువులనఁగా నాకాలపుఁ బ్రభువులు. దాసు లనఁగా నాకాలపు దాసులు— ప్రభుఁడు మొదలుకొని కానిసవర కందఱు దాసినుంచుకొని తీరవలసినదేకద! ఆమర్యాద యాసాగను నానియమము చూచితీరవలసినదే. కాని చెప్పు నలవికాదఁట. మాయమ్మమ్మ పల్లకిలోఁ బగటికాగడాలతోఁ జోడుదాలు కట్టలతో డప్పులతో నాస్థానమునకువచ్చి విజయదశమినాఁ డర్ధసింహాసనమునఁ గూరుచుండి నజరులను దీసికొనుచుండెడి దఁట. ఆమె యట్లతద్దెనోము చేసికొనునప్పుడు రాజుగా రామెయింటివీథి యరఁగుమీఁదఁ గూరుచుండి యక్కడికివచ్చిన పిన్నపెద్దల కత్తరుతాంబూలము లిచ్చి యామెతో వీథివెంటఁ బాదచారియై బయలుదేఱి పదిమందిదాసు లింటికిఁ బోయి యట్లు పంచిపెట్టించెడివాఁడఁట. అప్పటి కట్టుపాటు లెంతముద్దుగా నుండెడివో చూడు! బంగారుయుగము. ధర్మము నాలుగుపాదములతో సమముగా నడచినది. ఇప్పటి ప్రభువులు—పై చక్కఁబోటులకుఁ బటుత్వములు లేక, మడికట్టుకొంటిమని, మతమని, మనస్సాక్షియని దాని మొగము చూడక తాము పాడై యాస్థానముల కప్రతిష్ఠ తెచ్చుచున్నారు. ఇఁకనిప్పటి రాజకీయోద్యోగులు— పట్టెదిద్దమ్ములు— ఆపంగిరీకముల అబ్బన్నలు— నడుమీఁదుప్పువారు— అజీర్తికడుపులవారు— మొగము వెలవెలలవారు— బిట్టలబండారములవారే కాని గాగరాగాలికాఁగిన ముండకొడుకొక్కఁడును లేఁడు. అందుచేతనే వర్షములు వెనుకఁబట్టుచున్నవి. పంటలు భగ్నము లగుచున్నవి. కరవు లధికమగుచున్నవి. ఒక్కటే మాట— ఏయాస్థానమున దాసి ప్రభుని కంటె నెక్కువగా గౌరవింపఁబడునో, యెచ్చట దాని కడుపు తరవాణికుండ కంటె నెక్కువ చల్లగానుండునో, అచ్చట సుభిక్షము— అచట సుభోజ్యము— అచ్చట సుమాంగల్యము.

భ్రమ—ప్రపంచవృత్తు లన్నిటిలో వ్యభిచారవృత్తి వరమోత్కృష్టమని యిప్పుడు బోధపడినది. కాని నీవుచెప్పినమాటలు నీకే బాధకములుగా నున్నవేల! పెండ్లి చేసికొనననిి నిశ్చయపరచుకొంటివి. గాగరాగాలికాఁగిన ముండకొడుకిప్పుడొక్కఁడైన లేఁడంటివి. నాలుకమీఁది తేనెచుక్క పైయంగిటి కంటినఁగాని రుచి యెట్లుపుట్టును ! వీణను మీఁటువాఁడున్నఁగాని నాద మెట్లుద్భవించును! సరసుఁడు లేకుండ వృత్తి యెట్లుచేసెదవు! న్యాయవాదియింట నెన్ని శాస్త్ర గ్రంథము లున్న నేమి! తలలో నెంతజ్ఞానమున్న నేమి! మనోవృత్తి శాసించిన పూర్వమువాసిని యైన లభింపనిచో నతఁడు పుస్తకములనడుమఁ బస్తుండఁదగిన దేకద! వట్టిగదిలో నీకనుగీఁటులు వల్లెవాటులు గోటిపోటులు పూలవ్రేటు

తెలిసికొనుము! ఇప్పు డుత్తమజాముఁడు లేఁడు. కావునఁ దగినవానిని నిన్నుఁ గోరినవానిని బెండ్లి చేసికొని—

మధు—జగత్తంతయు గొడ్డుపోయినదని నాయభిప్రాయము కాదు. బట్టతలపై వెండ్రుకలవలె నక్కడక్కడ నొక్కొక్కఁడుండవచ్చును. అట్టివారుండఁ బట్టియే కలియుగ మిప్పటికైన నీవిధముగా నైన నిలిచియున్నది.

భ్రమ—అట్టి ధర్మదేవత లుండుటవలన లోకోపకారమే జరుగుచున్నది. కాని యట్టి మహాపురుషు లెచ్చట నున్నారో నీవు వారి నెట్లు కనిపట్టఁగలవు! ఏ వేషము పెట్టుకొని వారివెంటఁ దిరుగుదువు!

మధు—నేనంత వెనుకదిక్కు లేనిదానను గాను. మాతండ్రి రాజగురువు - అళహసింగరాచార్యులు గారు. ఆయన శిష్యసంచారము వంకఁబెట్టుకొని నాకన్నెచెఱఁ బాపుటకై తగిన రాజపుత్త్రుని కొఱకు వెదకుచున్నాఁడు.

భ్రమ—అద్దీ! ఆచార్యాభిమానము శిష్యులపై నట్లుండవలయును. పంచబాణవిద్యోపదేశమునకై షట్ఛాస్త్రపండితుఁడు బయలుదేరినప్పు డింకఁ గొదువయేమి? ఏమీ! భుజాగ్రములందు శంఖచక్రధారణము చేయించుటకంటెఁ గూఁతురుకంతమున శిష్యులచే మంగళసూత్రధారణ చేయించుట ఘనతకాదా. శిష్యులు మతమర్యాదను బుత్త్రులు బంధుమర్యాద నల్లురునా? శిష్యవిత్తాపహారణమునకై తన సాలగ్రామతీర్థపాన మొక సాధనము-ముద్దులబిడ్డ యధరతీర్థపాన మొక సాధనమునా!

మధు—నీవధిక్షేపించుచుంటి వేమోకాని కన్నకడుపుకొఱ కెన్ని పాటులు పడవలయునో కన్నవానికిఁ దెలియును గాని నీ కెట్లు దెలియును!

భ్రమ—తెలియవలసినప్పుడు తెలియనే తెలియును గాని రాజగురువా? అళహసింగరాచార్యులు గారా? రాజగురువని యీదిక్కుమాలిన బిరుదముకూడ నెందులకు? అది యాచార్యులవారి ప్రతిష్ఠకొఱకా? రాజుగారి ప్రతిష్ఠకొఱకా? అళహసింగరాచార్యులన్న సరిపోవునే. ఏ మూఁడు నామాల దాసరయ్యయో యని యెవ్వఁడును గణింపకుండునే! రాజు ప్రతిష్ఠకూడఁ బాడుచేయుట యెందులకు? రాజుగా రట్లని నట్లు చేయుమనినారా? రాజుగారి గురువు కాదుకదా—రాజుగారి చాకలియైన నట్లు చేసినయెడల సాఁగదీసి—

మధు—నీవధిక్షేపించుచుంటివమ్మ నేనిఁకఁ బోవుదును. నీ మోమేమోకాని నాకు విశేష విశ్వాసభాజనమగుటచే నా కష్టసుఖములు నీతో వెడలఁ బోసికొనుచుంటిని. మనఃకాపట్యములేకుండ వటవట వాగుదాననేకాని యెదుటివాని యుత్తిపోడుపులను గ్రహింపలేనిదానను. అట్టి నాకే నీ వధిక్షేపించుచుంటివని తోఁచినప్పుడు—

భ్రమ—నన్ను క్షమింపుము. ఇఁక నిన్నుఁ బరిహసింపనులే. కాని మీయమ్మయే వరాన్వేషణకై బయలుదేఱినయెడల నాచార్యులుగారు బయలుదేఱుటకంటె బాగుగా నుండునేమో?

మధు—మాయమ్మ చనిపోయి మూఁడు సంవత్సరము లైనది. ఆమె సరిగా నీవంటి హృదయవైఖరికలది. మధురికమ్మకుఁ బెండ్లిచేయవలయును గాని కులవృత్తిలో దింపవలదుసుమా యని మాతండ్రితో నవసానసమయమునఁ జెప్పి పోయెను.

భ్రమ—వృత్తి కష్టములస్థితినిఁ బట్టుటచే నామె యట్లు చెప్పినది. కాని మీతండ్రి యేమనినాఁడు?

మధు—నాఘటములోఁ బ్రాణములుండఁగా మధురికమ్మచేత నాగరాకూనిపించి చీర కట్టింతునా? మధురికమ్మకు మగలే లేకపోవుదురా? మూఁడు జిల్లాలలో శిష్య సంచారమున్న యాచార్యపురుషుఁడను ముద్దునుకుమ్మాళువారిని బూట కొక్క మగనిఁ గన్నబిడ్డకుఁ దేలేకపోవుదునా? యని కన్నీరు గ్రుక్కుకొనెను.

భ్రమ—మీయమ్మకంటె మీతండ్రియే ముందుగాఁ బోయినయెడల నీ క్రుమ్ములాట లేకుండి యుండును. కాని మీయమ్మమాట పథ్యమా మీనాయనమాటపథ్యమా?

మధు—అమ్మమాట పథ్యమే కాని యపథ్యము పైకి నాలుక పంచెపు గుఱ్ఱమువలెఁ బరుగెత్తుచున్నది.

భ్రమ—అందుచే జిహ్వయందు రోగదోషమున్నట్లు స్థిరపడవలయును. నీవు నోటికి వచ్చినకల్ల వదరుటయే కాని యెదుటివాని యొత్తిపొడుపులను గ్రహింపలేనని యిప్పుడేకదా పలికితివి? ఇట్టి నీవు కులవృత్తికిఁ బొత్తిగాఁ బనికిరావు.

మధు—పనికిరాకేమి? నేనే పనికిరానియెడలఁ బనికివచ్చినది మఱియొకతె? నాది ధారాళమైన స్వభావమే కాని కుత్సితమైన స్వభావము కాదంటిని.

భ్రమ—అందుకుఁ గావలసినదే కుత్సితత్వము కృత్రిమత్వము క్రూరత్వము. నీతెలివి రాణింపదు. నీవాణీవిశారదతవలన ఫలములేదు. నీకన్ను ముక్కు రెండుల నుపయోగింపదు. దీనికిఁ గావలసినది హస్తలాఘవము కనుకట్టు, మహేంద్రజాలము. చెవితోఁ జూడవలయును—కంటితో వినవలయును. నాలుకతోడ మూరుకొనవలయును. తెరలేకుండ నంతరిక్షమునఁ దోలుబొమ్మ లాడింపవలయును. మూఁకుడుతీయకుండఁ దొలిపొడుపకుండఁ గుండలోని లేపెను నాలుక తగులకుండ నాకింపవలయును. మబ్బులేని మింటినుండి రసములేని వర్షము కురిపింపవలెను. అంచేతఁ ద్రిమూర్తుల నగపఱుపవలెను. ఇవియన్నియు నీవు చేయఁగలవా? సహస్రమాయావిశేషమునఁ గోటీశ్వరుఁడైన న్యాయవాది యెవ్వఁడైనఁ జచ్చి యుత్తరజన్మమున దాసియై పుట్టి చాపాటముగా వర్తక మారంభించిన నైన నాతని కీర్తి నాగరాకట్టుమాత్రము పూర్వపుగాను కట్టంత జయప్రదముగా మాత్ర ముండదు.

మధు—ఎవని కుండకపోయిన నాకేమి? నా చాకచక్యమును నా చమత్కారమును లోకమునకుఁ గనఁబఱచుటకైన నేను కులవృత్తిలోఁ బ్రవేశింతును. జీవయాత్రా నిర్వాహమునకుఁ గొంతమాయ యావశ్యకమని నేను నెఱుఁగుదును. రవంత బియ్యపుఁబిండి కూడికయున్న సెనగపిండిలోఁ గలిసినపకోడి కాని పంటిక్రిందఁ

గుణకము లాడదు. రుచిమంతమై రెండుదినములవఱకు నిలువయుండదు. ఉద్ధ పాత్యకమైన బుద్ధికంటె రవంత వెంకితనపు మేళవింపుగల బుద్ధి యొక్కువ శోభించును. వంకవంకలుగల తలకట్టునకున్న శోభ తీఁగ సాఁగుడు తలకట్టునకు లేదు. ఆమాత్రపు గడుసుఁదనము మాయయు నాకున్నవి. అధికమాయయున్నటి కపటము పొందును. అది నాకు లేనులేదు. అక్కఱయులేదు. చెట్టుసంపంగి పూలనుండి వచ్చిన గాటుపరిమళమువలె నొక్కసారి విటహృదయములను గ్రమ్మి యుక్కిరిబిక్కిరి లాడింతును. కాని నాదొక్కప్రార్థనమున్నది. నాకు మనసులో నొక్కటియుఁ జైని నొక్కటియు లేదు. నిన్నుఁ జూడఁగనే నీపై నాకు వాంఛకలిగినది. నాకీకన్నెచెఱఁ బాపి నన్నూరిపై విడువుము. పెండ్లియని పట్టుపట్టకుము. ఇంత సందేహింపకుండఁ దనయంత తానడిగినదాని యెవతయైన మండునాయని యనుకొనకుము. ఒక్కొక్కయాస్థానమున నావంటి తెల్లిపొంగ పొంకతె యుండును.

భ్రమ—పెండ్లికొలకే కానియెడల నీవు నాకేల ?

మధు—(దీనముగా) ఇంతియేనా !

భ్రమ—ఇంతకాక నీకు వేంతయనుకొనుచున్నావు !

మధు—(ఊరకుండును.)

భ్రమ—మాటలాడవేల ? పడమటి వడగాలి విసరే విసరుదువో ! తూర్పు తుపానుగాలి విసరే విసరుదువో ? ఉత్తరపుఁ గొండగాలి విసరే విసరుదువో ? దక్షిణపుఁ బయ్యెర విసరే విసరుదువో కానీ.

మధు—నామనస్సు స్పష్టముగా నీకు విప్పి చెప్పినను నీకు దయరాకపోయినది. నిన్ను వదలిపోవుటకు నాకు మాత్రమిష్టమా ? ఎటువచ్చినను పెండ్లిమూడి దగులుచు కొనిన పిమ్మట మనస్సులోనైన వ్యభిచరించుట మహాదోషము కావున నే నింత సందేహించుచున్నాను. కాని పడుచుఁదనపుటుత్సాహము ప్రబలముగానుండుట చేతఁ గడద్రొక్కపోవుట కుబలాటపడుచున్నాను.

భ్రమ—నీపడుచుఁదనపు విసరులు—ఊపులు — ఆగాగులు — దండయాత్రలేవో యన్నియుఁ గానిచ్చుకొని శాంతిపడినపిమ్మటనే నాయొద్దకు రమ్ము.

మధు—(తెల్లఁబోయి) అప్పుడు నీవు నన్నెట్లు పరిగ్రహింతువు ?

భ్రమ—నాయిల్లూడ్చుటకైన నక్కఱకు రాకపోవుదువా !

మధు—నాబ్రదుకు దుర్భరంతే.

భ్రమ—ఇంకనుసందేహమా ! ఇట్టి యవస్థ నీకొక్కతెకేనా ! పిల్లలు మాకక్కఱయే లేదని యాఁచిన మిండకత్తెలలో నిప్పుడు మంతురసానితన మొందలు చేయు చుండుటలేదు ! విటులచేఁ దలలకు సంపంగినూనె యంటించుకొనిన విటకత్తె లెందఱిప్పుడు సాంతతిరుహస్తములతో నంట్లు తోముచుండుటలేదు ! పడుచుఁ దన మేమి పాషాణమనుకొంటివా ! బ్రహ్మత త్త్వమనుకొంటివా ! నీవొక్కతెకే

పడుచుదానవా! నీవంటి పడుచువాండ్రెందఱో దండయాత్రలు సలిపినారు!
ఏదేశములఁ గొల్లఁబెట్టినారు. ఏయుద్ధములు పోడిచి గెలిచినారు! నీజవ్వనపు
విసరులు పిల్లపింగుటలు విఱుచుకొని యూరిపైఁబడుటలు వీరావేశములు విజయ
ధ్వజములు సింతకాల ముందునడుపొంటివి! పక్షిణివలె యాఁడువాళ్లు.
తుపానుగాలియైన వాల్గువిసరులతోఁ జప్పఁబడును. గంగవెల్లియైనను రెండు
పొంగులతో నడఁగును. నీపడుచుఁదనపుఁబోటు సముద్రపుఁబోటుకంటె పెక్కు
వదా! పాటు అప్పపాటులో వచ్చునుగాదా! ఈదినమున వన్నెలవిసనకఱ్ఱ
రేపు చీఁపురుకట్ట—ఈపూట గజగామిని రేపు గంజికావడి—ఈపక్షమునఁ
జక్కవపిట్ట వైపక్షమునఁ దలక్రిందుపక్షి. ఈవారమునఁ గమలనేత్రదానివై పై
వారమునఁ గాగితాల రాసి—(ఒడలునిండిన పలాస్త్రీపట్లచేత) ఇంతేకాదా!
దాసీదాని పడుచుఁదనపు సౌభాగ్యము! యీమాత్రమునకే యీయాకాశగమన
మెందులకు? పేకజువ్వవలెఁ గాలి చప్పబడి గుల్లయై వెంటనే యధఃపతన
మొందు టెందులకు?

మధు—దేహారోగ్యము చెడుననియా! చెడనీ! దేహత్యాగమైనఁగానీ! ఊరుపేరులేక
కదలికలేక లొడితెడు సంసారములో గుడుగుడుగుంచము లాడుటకు నాకు
మనస్కరింపకున్నది. అదికాక నీతో నిదివఱకుఁ జెప్పలేదు. నాకొక్కరాణి
యున్నది. ఆమె కొలువులో నే నుందును. అంతకంటె నామెనుగూర్చి
యిప్పుడు నన్నడుగకు. తరువాత నీకుఁ జెప్పనే చెప్పుదును. అంతఃపుర రాజ్ఞీపరి
చర్యకంటె మాకు సంసార మెక్కువదికాదు. రాణివాసపుజీతము తక్కువయే
కాని రాఁబడి దానికంటె నిరువదిరెట్లుహెచ్చు. రాఁబడికేమికాని యందులో
నున్న సొగసంతకంటె హెచ్చు. గ్రుడ్లుమిడుకరించుకొని చూచువారు, గ్రుక్కిళ్లు
మ్రింగువారునునగు రాజోద్యోగులనడుమఁ బడుగు పేకగా మేము దిరుగుచున్న
ప్పుడు మాకెంతో యుత్సాహముగా నుండును. ప్రధానుఁడు మొదలు బంటు
వఱకు దేశపాగలదద్దయ్య లందఱు మమ్ముఁజూచి గడగడలాడుదురు. మాదయ
కొఱకుఁ బ్రాకులాడుదురు. స్థానబలముచేత మాకట్టి యధికారమున్నది. రాజా
గారు మాత్రము? అతఁడుగూడ మమ్ముఁగని ప్రక్కబెదరుతో నుండకతప్పదు.
క్రిందిది మీఁదఁబెట్టినను మీఁదిది క్రిందఁబెట్టినను గవ్వను గాసుచేసినను గాసును
గవ్వచేసినను ముడిబెట్టినను ద్రెంపినను నన్నిటికి మేము చాలియుందుము. మా
కిష్టముకానిదని యేదియుఁ గోటలో జరుగుటకు వీలులేదు. మునుపు మంథర
యేమిచేసినది? కట్టుకొన్నతోరణాలు ద్రెంపించి రాము నడవికిఁ బంపలేదా?

భ్రమ—మంథర సంసారిణికాక దాసియేయని నీ వెఱుఁగుదువు? దానిపేరు మీ
వంశవృక్షములో నున్నదాయేమి? నాయభిప్రాయ మేమనఁగ వ్యభిచారిణులు
రాజాంతఃపురములఁ బూర్వమున నుండియుండరు. వారు కులకాంతలనియే
నానమ్మకము. అలాగున నీవుకూడ సంసారిణివై లేనిపోని పోకడలుఁబోక
మహారాణిని గొల్చుట నాకు సమ్మతమే. మగవారు సంసారులు రాజాగారి కొల్వు

కొలువులో నీడువారు మగవాండ్రు రాణిగారి నట్లు కొలువుండఁదగినదే. లేనప్పుడు భటత్వము మనుష్యున కేర్పడిన వృత్తి. అంతేకాని కులవృత్తియని చెప్పి కోళ్ళకంటెఁ గొండ్రముచ్చులకంటె గాడిదలకంటె సహస్రగుణము అధమమైన బ్రదుకు బ్రదుకుట యెందులకు?

మధు—నేను మా బ్రదుకే యధిక గౌరవయుక్తమైన దనుకొనుచున్నాను.

భ్రమ—గౌరవమా? మహారాజభార్యయైనసరే వ్యభిచారిణియైనచో మాదిగవాఁడైన వాఁడామెను గాంచి నిర్భయముగాఁ గన్నుగీటఁగలఁడు. మాదిగవానిభార్య సంసారిణియైనచో మహారాజైన దానిని గన్నెత్తిచూచుటకు గడగడలాడును. అట్టిచోఁ బడుచు కొనుటయే వృత్తిగాఁగలదాని బ్రదుకెంత తుచ్ఛమో చెప్పఁ దరమా? వెలకు సంతలోఁ బెట్టిన యానపశువుమీఁదఁ గుష్ఠరోగియైన రవంత మిగిలియున్న గోటితో నొక్కుటకు యత్నించును. అట్టిబ్రదుకు బ్రదుకుకాదు. ధనము వచ్చునుగదా దానివలన గౌరవము రాఁగూడదా యని నీ వనుకొను చున్నావేమో? ధనపురాఁబడి కల్ల. వచ్చినదేదో వైద్యులకు వైశ్యులకు బ్రాంది బుడ్లకు, ఎదురీవి నపేక్షించు ముద్దులమగలకుఁ జాలదు. అందులో నీకాలపు దాసులకు విటులనుండి రాఁబడికంటె విటులకుఁ బెట్టుబడి యెక్కువ. కుల వృత్తివలనఁ గొంప గుల్లయగుటకాని మఱియొకటికాదు. అక్క సంపాదింతు వనియే యనుకొనుము. నీ మంచిముత్యాలహారము అన్నియు నొక త్రాసు చిప్పలో వైచి కులకాంతమెడలోని పసుపుకొమ్ము కట్టిన బొందొక చిప్పలో వైచినయెడల బొందు బరువుగానుండును. నీవృత్తినిబట్టి నీకేకాదు నీ సంబంధ మున్న ప్రతివస్తువునకు గౌరవమను మాటయైనలేదు.

మధు—అటులైన నన్నేమి చేయుమంటివి?

భ్రమ—మాదిగవాని నొకని బిలిపింపుము.

మధు—ఎందులకు?

భ్రమ—వానికి నాలుగణాలిచ్చి మధురిక కులవృత్తిలో దిగినది; కావున నీయవకాశము వృథపోనీయక వచ్చువారందఱు రావచ్చు నోహో యని చాటుమని చెప్పుము. న్యాయవాదులు కట్టునట్లు లింటికి బిల్లకట్టిన వినియోగము లేదు.

మధు—నేను కులకాంతనై యుండెదను. చూడు! నేను నిన్ను మనస్ఫూర్తిగా నమ్మినదానను. నీవు నాభర్తవు. చిన్నతనమునుండి యీశరీరము పుష్పశయ్య మీఁదఁ బెరిగినది. ఇప్పుడు కఠినశయ్యపైఁ బండుకొనలేను. చల్లనిపన్నీటిబుడ్డి నొడలిపైఁ జిమ్మరించుకొనిన నేను వేడికుండను వంచి గంజివార్పలేను. పువ్వులు గ్రుచ్చిన యీచేతులతో పిడకలను జేయఁజాలను. చేతితో మాదు వత్తిని విలాసముగాఁ బట్టి యిప్పుడు చీపురుకట్టను బట్టుట నాకు మిగుల దురవస్థగా నుండును. ఇదికాక మఱియొకమాట— నీవెఱుఁగనిదికాదు. మనలో సంసారిణులే యింటిపనియంతయుఁ జేయుదురు. గిలుకు గిలుకుమనుచు

హంసహంస యనుచు గమగమలాడుచు నీరాసిముండలు (పెంటికలు విడుచును) పాలపిట్టరంగులతో పెమిలిపిట్ట కుచ్చులతో మస్నైపు గోరపులకులతో వచ్చునరికి వారికిఁ గాళులుగడుగుకొనుటకు సంసారిణులే నీరిచ్చెదరు. కంచాలమందుఁ గూరుచుండునప్పు డాయమ్మవారలకు నైవేద్యము పెట్టుదురు. ఇట్లు చేయకుండ మాత్రము నామర్యాద కాపాడుము.

భ్రమ—నాకట్టివా రెవ్వరులేరు. నేనొక్కఁడను. నిన్ను సుఖపెట్టెదను. నేను గొంత ధనము సంపాదించినాను. దానివలన వచ్చువృద్ధితో మనము సుఖముగా జీవింపఁగలము. నీరాణియొద్దకు నన్ను రమ్మన్నయెడల వచ్చెదను. కానియెడల మన మిద్దఱమీయూరనే యుందము.

మధు—మారాణి యిప్పు డూరలేదు. ఇప్పుడామెయొద్దకు వలదు. నీయొద్దనే నేనుందును. ఈయూరు నీదికాదా?

భ్రమ—ఔను. ఈరాత్రి చెన్నకేశ్వరాలయములోఁ బెండ్లాడుదమా!

మధు—నీయిష్టము. నాకొక్కయాలోచన తోఁచుచున్నది. మనజాతివారందఱు సాధ్యమైనంతత్వరలో నొకచో సభగాఁ గూడి యింతటినుండి మనలోని కన్యలకు వివాహములే చేయవలయును గాని వారిని గుణవృత్తిలో దింపఁగూడదనియు, నట్లు చేసినవారిని సంఘమునుండి బహిష్కరింతుమనియు నొకశాసనము చేసికొనవలయును. ఇఁకనాకు దానిదాని పొంగముచూచిన నసహ్యమగును.

భ్రమ—ఆసభలో నీవుపన్యసింతువా?

మధు—అభ్యంతరమేమి? గంగాప్రవాహమువలె మాటాడుదును. వాగ్ఝరి యనునది యాఁడుదానికే చెల్లును. మొద్దువాలుగఁగల మగవాఁడు మెమ్మె పెప్పె యనువాఁడేకాని వచోధారాళతcc గలవాఁడు కాఁడు. ఆఁడుదానినోరు విడఁబడినతరువాత బ్రహ్మరాక్షసుకే యచ్చట నిలువలేనప్పుడు దురాచారముల లెక్కయేమి? కాని నావైపునఁ జూడక యట్లు చూచుచున్నావేమి?

భ్రమ—అదిగో! మాప్రభుఁడు సాయంకాలమగుటచే సముద్రతీరమునఁ జల్లగాలిని దిరుగుటకై పోవుచున్నాఁడుకాఁబోలు.

మధు—నీకొక్క ప్రభుఁడున్నాఁడా? అతనికిఁ బెండ్లి యైనదా?

భ్రమ—కాలేదు.

(గోవర్ధనుఁడు ప్రవేశించును.)

భ్రమ—అయ్యా! క్షమింపవలయును. ఈమెను బెండ్లిచేసికొనఁదలఁచుకొని యింతసేపటినుండియు మీకొలువులోనికి రాకుండ నీమెతో మాటలాడుచుంటిని. ఈరాత్రి స్వామిసన్నిధిని వివాహము స్థిరపఱచుకొంటిమి. మీరు మమ్మాశీర్వదింపవలయును. నమస్కారము. ఊరకుందువేల? బాబుగారికి నీవుకూడ నమస్కరింపుము. (మధురిక నమస్కరించును.)

గోవ—భ్రమరా! సంతోషమే; నేను జిన్నవాఁడనుగదా! నాయాశీర్వాదమేల!

మధు—(కావ్యమునఁబోయి యడఁచుకొని తనలో) అమ్మా! సరస్వతీ! నీవు మృతి నొందితివని యేడ్చితిని. నీవుగూడ దైవకటాక్షమున నీకేవునకే చేరితివా? హా! భగవంతుఁడా! ఎంతదయాళుఁడవయ్యా! నడిసంద్రమున మునిఁగిన రాణిని దాపిని దిరుగ నిట్లు సంధానపఱిచితివా! అహా! ఎంతయాకస్మికముగా వేఱు చేసితివి! తిరుగ నెంత యాకస్మికముగాఁ గలిపితివి! సముద్రమధ్యమున నెంత యిక్కట్టుఁ బెట్టితివి! ఇక్కడ నిప్పు డెంతయానంద మొసఁగితివి! ఈశ్వరా! నీవెంతటి సమర్థుఁడవయ్యా! (ప్రకా) బాబూ! ఆశీర్వదింపలేదా? మఱి యొక్కసారి నమస్కరించుచున్నాను.

గోవ—వివాహ మీరాత్రియే యగునని నీభర్త భ్రమరుఁడు చెప్పినాఁడుకదా. ఇఁక శీఘ్రవివాహసిద్ధిరస్తని యాశీర్వదింప నక్కఱలేదుగదా! శీఘ్రముగఁ బుత్త్రవతివగుమని యాశీర్వదింతును. నీవు కొంచెము నాకంటెఁ జిన్నదానవువలెఁ గానఁబడుచుంటివి. కావున నిన్నాశీర్వదించితిని. నీపేరు?

మధు—(తనలో) సముద్రమున నానుటచేత నీగొంతు కొంచెము బొంగుగా నున్నదా! ఇది నీపురుషవేషమునకు మఱింత తగియున్నది. అమ్మా! ఎంతగడుసుదానవు. నీదాసినైన నన్ను - నీతో నడచి వచ్చిననన్ను—అబ్ధిమధ్యమున నీతోడ మునిఁగిన నన్ను—బ్రతికియుండి మొద్దువలె నీయెదుటఁ బడిననన్ను—రవంత యాలుకైన లేకుండ—ఆనవాలు పట్టినట్లు మోమున రవంత సంజ్ఞయైన లేకుండ—గొంతుకను గాసంత గద్గదికయైన లేకుండ—యేవిదేశమునుండియో దిగి వచ్చి యెన్నడును నా మొగము చూడనిదానివలె నింతకొంకు లేకుండ నీపేరేది యని యడిగితివా! ఆహా! పనికిమాలిన యొడలెంతయున్న ప్రయోజన మేమి! పటుత్వముగల హృదయము లేనప్పుడు? అమ్ (అర్థోక్తిలో) బాబూ! నాపేరు నేనట్లు చెప్పవచ్చునా?

గోవ—నీవు చెప్పఁగూడదు. నీభర్త యంతకంటెఁ జెప్పఁగూడదు. ఇఁక నాకుఁ దెలియుటెట్లు?

మధు—ఇంకను బెండ్లి కాలేదు. కావున నాతఁడు చెప్పవచ్చును.

భ్రమ—అయినను నాకాసందేహము లేదు. బాబూ! దీనిపేరు మధురిక!

గోవ—అలాగా! పేరు బాగుగా నున్నది. ఇది సాధారణముగా నవలలో నాటకములలోఁ గృత్రిమకాంతలకుఁ బెట్టు సొగసైన పేరువలె నున్నది. నేనిట్టిపేరు సాధారణముగా దాసికుటుంబములలో వినియుండలేదు.

భ్రమ—చిత్తము.

మధు—(తనలో)ఇది మఱింత దొంగమాట! నేను గృత్రిమస్త్రీనఁట! అమ్మా! సరస్వతీ! నీకొఱకే పురుషవేషము వైచికృత్రిమస్త్రీనో కృత్రిమపురుషుఁడనో కొంతకాల మయితిని. "భార్యాభర్తలవలె నుందము. పురుషవేషమును దీసివేయు" మని కూడ యొక్కనప్పుడు నీవు నాతోఁ జెప్పుటచేతఁ దీసివైచి యథార్థస్త్రీ

నైతిని. నీవు లోపల వాఁడుదానవు, పైకి మగవాఁడవు. అదిగాక నీదానిని నీ వెఱుఁగనట్లు నటించుచున్నావు. కావునఁ గృత్రిమకాంతవు నీకె యేల కాఁగూడదు?

గోవ—భ్రమరా! రేపుదయముననే యిటనుండి నేను గాళీపురమునకుఁ బోఁదలఁచితిని. నీ వివాహమైనపిమ్మట మూఁడు దినములు నిచ్చటనే యుండి నీవు నన్నటఁ గలసికొనుము.

భ్రమ—మీరొక్కరు పోయెదరా?

గోవ—భయమేమి? నేను బోయెదను.

భ్రమ—శీఘ్రముగనే బసకు వచ్చి మీ సామగ్రి నంతయు సర్ది సిద్ధపఱచి యుంతును.

గోవ—నేనే సిద్ధపఱచితిని. కాని మూటలసంచి నీయొద్దనే యున్నది కాదా?

భ్రమ—ఉన్నది. వచ్చియిచ్చెదను.

గోవ—అక్కఱలేదు—నీవు తీసికొనిరమ్ము—నాయొద్ద నింకను సొమ్మున్నది.

(గోవర్ధనుఁడు నిష్క్రమించును.)

మధు—(తనలో) పోవునప్పుడైన నావంక రవంత చూడకుండఁబోయినదే. అహా! ఎంతగుట్టుగాఁ బ్రవర్తించుచున్నదో! ఈమె రహస్యమును నేను నా భర్తకైన వెల్లడిచేయుట తగదని తోఁచుచున్నది. వెల్లడిచేయకుండ నుండలేను. తన నేస్తకుఁడైన యీ భ్రమరుని నేను గట్టుకొనఁదలఁచుటచేతఁ దన రహస్యము నాలో నింక దాఁగియుండదని యెంచి మమ్ముఁ ద్యజించి పాఱిపోవుచున్నదేమో! ఇఁక నాకు నా రాణి కనఁబడదుకాఁబోలు? అయ్యయ్యో! నేనేమిచేయుదును!

భ్రమ—మధురికా! ఏమి! యట్లు యోచించుచున్నావు?

మధు—మనస్సున కేమో దిగులుగా నున్నమాట సత్యము. నాథా! అతనిపేరేది.

భ్రమ—గోవర్ధనుఁడు.

మధు—(తనలో) అమ్మయ్యో! మాఅమ్మ పురుషవేషమునఁ బెట్టుకొన్న పేరునుగూడ నిదియే. రామపురరాజులకుఁ దఱచుగా నదియేపేరు. (ప్రకా) ఈతఁ డెప్పుడీయూరు వచ్చినాఁడు?

భ్రమ—అయిదారు దినములకంటె నెక్కువయై యుండదు. వచ్చిన దినముననే భృత్యుఁ డాకస్మికముగా మరణించుటచేత నా మరునాఁడే నే నీతని కొలువులోఁ జేరితిని.

మధు—అటులైన నీ వీతనికి నాలుగైదు దినముల నుండియేనా సేవకుఁడవు? ఏయూర నుండి వచ్చినాఁడో నీకుఁ దెలియునా?

భ్రమ—ఇచ్చటికి దాదాపుగా నాలుగామడల దూరములోనున్న కల్యాణపుర మను నూరినుండి వచ్చినాఁడట.

మధు—ఇక్కడి కేల రావలయునో!

భీమ—విద్యాపరీక్షార్థి కొంతకు దేశయాత్రఁ జేయుచున్నాఁడఁట.

మధు—(తనలో) అది మాయమాట. (ప్రకా) కల్యాణపురముగూడ సముద్రతీర గ్రామమేనా?

భీమ—అఁ.

మధు—(తనలో) ఈమె యూరేవున జేరి యిక్కడకు వచ్చియుండును. ఇచ్చటకు వచ్చుటతోడనే భృత్యుఁడు చచ్చుటయేమో బోధపడకున్నది. (ప్రకా) మనము కాశీపురము వెళ్ళుటకు నీతఁడు మన కొంత కక్కడ నుండునా?

భ్రమ—ఉండలేమి?

మధు—ఈతని కెవ్వడైన నీనాల్గుదినములలో నీవు స్నానముచేయించితివా?

భ్రమ—ఈతఁడు పరాపేక్ష నేమాత్రమును గోరువాఁడు కాఁడు. ఆతనిగూర్చి నీవంత గ్రుచ్చి యడుగుచుంటివేమి?

మధు—ఈతనినిగూర్చి యొక రహస్యమున్నది. నీభార్యనగుటచే నీకుఁ జెప్పవలసినదే కాని కొన్ని కారణములచే జెప్పఁదగినది కాదు. అయినను నోటిచివర నాడు చున్నది. దాని నాపలేనప్పుడు నేనే చెప్పెదను. అది చెప్పమని నీవుమాత్రము నన్నెన్నఁడు నడుగ వలదు.

భ్రమ—అట్లు నే నడుగువాఁడను గాను. మన కిచ్చట నింక నాలస్యమేల? త్వరగఁ బురోహితునిఁ జూచుకొని కళ్యాణప్రయత్నములఁ జేసికొందము రమ్ము.

మధు—(తనలో) సరస్వతీ! చేయి దాటిపోయితివికదా! మేము వచ్చువఱకు నీవు కాశికాపురమున నుండుట నిజమేకదా! హా! సరస్వతీ! అనుకూలుఁడగు భర్తను నేను సంపాదించుకొనినట్లే నీవుకూడ సద్భర్తను బడసి సుఖ మెప్పుడు పొందుదువో!

ఇది ద్వితీయాంకము.

శ్రీరామ

సరస్వతి

తృతీయాంకము

ప్రదేశము — జగన్నాథపురము

ప్రవేశము — ఒకభవనమున సరస్వతి

సర — నే నాతని గాఢముగా వలచితిని. పురుషరూపమున నున్నను నే నాఁడుదానను గదా! నాకాతఁడు నచ్చినాఁడు. కావున నేనాతని వలచితిని. ఇంతవఱకు సహజమే. అతఁడు నన్ను వలచుట — మగరూపమున నున్న నన్ను వలచుట — యాశ్చర్యముగా నున్నది. అతనివలపు నావలపుకంటె గాఢతరమైయుండుట మఱియింత యాశ్చర్యముగా నున్నది. ఈవిచిత్రశృంగార నాటక మిట్లుండగా నిందులో నవాంతరనాటక మొకటి జరుగుచున్నది. అతని సవతిచెల్లెలు నన్ను బురుషుఁడనుకొని హద్దులేకుండ వరించి యనుదినము రాయబారములచేఁ జంపుచున్నది. సవతితల్లిబాధకంటె, నదవిబాధకంటె, సముద్రబాధకంటెను నీబాధ యెక్కువగాఁ గానిపించుచున్నది.

గీ. జగతి యానందమయమను ♦ జనులమాట
సత్యమో కాదో చెప్పంగఁ ♦ జాలఁగాని
యెప్పు డేబాధకలుగునో ♦ యప్పుడదియె
యోర్చుకొనుటకుఁ దగనిదై ♦ యుంట నిజము.
బాధలన్నియు సమమని ♦ పలుకఁ దగదు
మనసునకుఁగల్గు సాఁగుడు ♦ మహిమ యదియె
ఒకఁడు కూర్చున్న లక్షకూ ♦ ర్చున్ననైన
పరిగ నిండు కుబేర పు ♦ ష్పకము వోలె.
బళిర! మగవాఁడు మగవాని ♦ వలచుటయును
భామ వేఱొకభామను ♦ వలచుటయును
సృష్టిలో వింతలగుచుండు ♦ నివ్విరెండు
నాతలనె పుట్టఁగావలె ♦ నా రమేశ.

అదిగో మగవాఁ డిచ్చటికిఁ వచ్చుచున్నాఁడు. ఈమేడ ప్రత్యేకముగా నా

యుపరోగమునకై నితనియొద్దఁ దీసికొంటిని గాన గుట్టు నిలువఁబడియున్నది. కాని లేనియెడల నీసరికి బట్టబయలై యుండును.

గీ. మోటమగవాని దుస్తుల ♦ ముదుతలందు
నడఁచి బిగియించి కట్టిన ♦ నాఁడుఁదనము
చటుకుమని యెట్లొ తలచూపి ♦ పొటకరించు
నుదకమున నొక్కియున్న వా ♦ యువును బోలె.
వెలఁదుకతనంబు నడివీథిఁ ♦ బెట్టుపనికి
నింతగాలి చాలు రవంత ♦ యెండచాలు
నొడలిపొంగు చాలును గుండె ♦ దుదుకు చాలు
సిగ్గుతొగరు చాలును గంటి ♦ చెదరు చాలు.

(కళాలలితుఁడు ప్రవేశించును.)

ఓహో ! వచ్చితివా రాజపుత్రా ! (నమస్కారము.)

కళా—గోవర్ధనా !

గీ. మంజుమకరందమహితమౌ ♦ మల్లెపువ్వు
పిలిచి పేరంట మిడినదే ♦ భృంగమునకు ?
సరససురభిళరుచిమద్ర ♦ సాలఫలము
కీరమున కొరగను గన్ను ♦ గీఁటినదియె ?

వచ్చితివా యని నన్ను బహుమానింపనక్కఱలేదు. ఇక్కడకు వచ్చుటలో నా ప్రయత్న మెంతమాత్రమును లేదు. ఇచ్చటి నుండి కోటకుఁ బోవుటయందు నెంత ప్రయత్నమైన నున్నది. ఆకష్టముఁ జూచి ఓహో యనఁదగినది. నీవెచట నుంటివో నేనట నుండవలసినవాఁడను. నీవందుల కంగీకరింపకపోవుటచేత గోటకు నీయింటికి నడుమ నిట్టల్లలాడుచున్నాను. నాకు నీయందున్న ప్రేమలో సగమైన నీకు లేదేమో !

సర—(తనలో) కళాలలితా ! ప్రాణకాంతా ! నీదేహము కోటకు నాయింటికి నడుమనే యల్లలాడుచున్నది కాని !

గీ. ఇంతినాట గట్టిగఁ గౌఁగి ♦ లింతు ననుచుఁ
బైమగతనాన మానంగ ♦ వలయు ననుచు
నాక నరక మధ్యమున మ ♦ హార్తి నాదు
హృదయ మలలాడు నీబాధ ♦ యెంతయయ్య ?

(ప్రకా) కళాలలితా ! ఏమంటివి ! నీకున్న ప్రేమలో నాకు సగఁబాలైన లేదనియా ! తండ్రిని బాసి, ఉన్నయూరిఁ బాసి, మహారణ్యమధ్యమునఁ బడి

సముద్రమునఁ బమ్పుటకు సిద్ధమై, దైవేచ్ఛచే నౌకనిర్జనమగు ద్వీపమును జేరి యుండఁగాఁ దుష్టులవలనఁ బ్రాణాపాయదశ నొందినవారి నెవ్వరినైన రక్షించు సదుద్దేశముతో నీవు మఱునాఁడు నావనెక్కి వచ్చి నన్నుఁ గాపాడి యిటకుఁ దెచ్చి యిచ్చట నన్నుఁ బోషించుచుంటివిగదా! ఇంత మహాంధకార మున గింజుకొనినఁ గాని నీ ముఖచంద్ర దర్శనము గాలేదే! అన్నియాపదలు నీవలన నంతమొందినవిగదా! నీయెడల నాకెంత యనురాగముండునో నేను చెప్పఁగలనా! చెప్పిన నీవు తెలిసికొనఁగలవా!

కళా—నేఁ జేసిన మేలునకు నీవు ప్రత్యుపకృతిగా నన్నిప్పుడు ప్రేమించుచుంటివో యప్పుడు నీప్రేమ స్వచ్ఛమగునది కాదు.

గీ. పూతమగురాగ మది స్వయం ♦ జాతమగును
నీకు రొండిని భైకము ♦ నాదు భుక్తి
నీకు నరిక్రొత్తగాగరా ♦ నాకు ముద్దు
నయివెలయు కుండమార్పు లిం ♦ తైనఁ గాదు.
బంగరును జిమ్ము సూర్యుఁడే ♦ బదులు దీర్ప
గాలి పన్నీరు జిలుకునే ♦ కాంత్యువలన
వెండితొడుగిచ్చుఁ జంద్రుఁడే ♦ బేరమునకుఁ
బూలు మణిరాసు లిచ్చునే ♦ మేలు దీర్పఁ
బైనినేకాదు సుమరాశి ♦ లోన నుండు
రాగతత్త్వము దాని సౌ ♦ రభమె సుమ్ము
గొంతుకను కాదు మది నుతి ♦ తంతులుండు
వానిరాగమె నిజరాగ ♦ వైభవంబు.

సర—కళాలలితా! అటులైనఁ బంచభూతములవలెఁ బరమాత్మవలె నకారణజాయమాన దయానూనుఁడవగు నీకు నాప్రేమ నీప్రేమలో సగఁబాలైన నున్నదో లేదో యని సంకోచమేల!

కళా—గోవర్ధనా! నా దట్టి శుద్ధరాగమని చెప్పలేదే. మాటవరుసకుఁ గృతజ్ఞత రాగమునకుఁ గారణము కాదంటిని.

గీ. వార్ధితటకూపమున బహు ♦ స్వాదుజలము
గంగయొడ్డున బావిలో ♦ క్షారజలము
గలుగుఁ దఱచుగ నట్లురా ♦ గంబునకును
గారణంబు కృతజ్ఞత ♦ కాకయుండు.

అదిగాక రాగమనునది హృదయప్రవృత్తులఁబట్టి యుండునంటిని గాని యది నీకుఁ దక్కువయని విచారించువాఁడను గాను. చిన్నఁగి కొబ్బరికాయలోఁ గడుఁబ్రిగిల్లున నిండఁదగిన మధుర జలముండును. సామాన్యజాతికాయలోఁ దక్కువ యుండును. దర్శిళ్లఁ గొబ్బరికాయలో నిండకే యుండదు.

సర—ఉండఁదగిన దెంతయో యున్నది. అది నీయధీనమే యయినది. కాని యాఁడు దానిని తలఁచినట్లుగా నీవలె మగవానిని తలఁచునంతటి రాగరసము నాకు లేక పోయినఁ బోనిమ్ము.

కళా—నీవు సంపూర్తిగా మగవాఁడనని చెప్పఁగలవా!

సర—(తనలో) సంపూర్తిగాఁ గాదుకదా! రవంతయైన మగవాఁడనని చెప్పఁగలనా!

కళా— గీ. కూండబంతిలాగు ఫిరంగి ♦ గుండు నోడియ
వేగ యెదురేగు వీరాధివీరునకును
గాతరత యింతో యంతయో ♦ కలదు; పిఱికి
పందయును ధైర్యలేశంబు ♦ చెందియుండు,
నింటదాతకుఁ గృపణత ♦ యీవిసైని,
నెంతపిసిఁడియుఁ బిడికిలి ♦ విడుచుఁ గొంత,
ప్రబలబుద్ధికిఁ గొసవెఱ్ఱి ♦ బాంధవంబు,
పిచ్చికేకలందును జ్ఞాన ♦ విధము కలదు;
అట్లె మగవానిలో నైన ♦ నాఁడుఁదనము
కొలఁదిగనొ గొప్పగనొ లోనఁ ♦ గలదుసుమ్ము.
మానవతిలోన నైనను ♦ మగతనంబు
తులమొ యరతులమొ పలమొ ♦ గలదుసుమ్ము.
పూర్ణపురుషపురంధ్రులీ ♦ భువిని లేరు;
సృష్టిజీవాళి యర్థనా ♦ రీశ్వరంబు;
అడుసు గలిపెడువేళ నే ♦ యంశ మధిక
మగునొ దానిచే భేదమా ♦ వ్యక్తులయ్యె;
అస్మదీయతత్త్వస్థమా ♦ నాఁడుఁదనము
నన్ను నీవైపునకుఁ ద్రోచు ♦ చున్నదేమొ?
యుష్మదీయతత్త్వస్థమా ♦ సువిదతనము
నన్ను నీకన్నిధికి లాగు ♦ చున్నదేమొ?

సర—కళాలలితా! సృష్టివిషయకమైన నీవిచిత్రాభిప్రాయము ననుసరించి నేను నీభార్య

నగుదునుగాఁబోలునేమి?

కళా—అంతమాట యేల యనుము. నీవు నాకు భర్తవు. నాకంతయుఁ దెలియును. గోవర్ధనా! వివాహము చేసికొనఁగాని రాజ్యమును స్వీకరింపక ప్రతినిధిచే దాని నేలించుచుఁ గన్యాన్వేషణప్రయత్నమున నెంతయో విసుగుఁ జెందియుంటిని. నేను జూచిన వధువు లెవ్వరును నాకు నచ్చియుండలేదు. తుట్టతుదకు నా యనురాగమున కంతకు నెలవైన నీవు నాకు లభించితివి. ఘటన యెట్లున్నదో చూడు.

సర—కళాలలితా! నే వాఁడుదానను గాకపోయితి ననికదా నీకింత విచారము?

కళా—విచార మెంతమాత్రమును లేదుసుమా. నేనే పూర్ణముగా వాఁడుదాన నైన యెడల నింతకంటె నెంత సొగసుగ నుందునోయని యనుకొనుచున్నాను.

సర—(తనలో) హా! నీ వాఁడుదాన వగుటెడల నాప్రియు డింకేమైన నున్నదా! అసొగ సేదో యెఱుఁగనక్కఱలేదు.

గీ. బోసిదగునోటిలో గారె ♦ ముక్క యేల
తీఁగె యూఁతకు వేఱొక్క ♦ తీఁగ యేల
లొట్టకంటికిఁ జూపుడు ♦ గొట్ట మేల
రమణి రమణితోఁ దార్చు దౌ ♦ ర్భాగ్యమేల?

(ప్రకా) కళాలలితా! నీ వాఁడుదానవగుటెడల నెంత సొగసుగ నుందునో యని యంటివి. అసొగసేదో నాకు బోధపడలేదు. నీవు నాకంటె గాఁగిన మగవాఁడవు కావున నేను నిన్నింతగాఁ బ్రేమించితిని గాని నీవాఁడుదాన వగుటెడల నీవెంగము వైపు చూతునో లేదో! నీవు నా కక్కఱలేరావేమో! అసంగతి నీ కెట్లు తెలియును?

కళా—అయ్యో! అట్లైన వలదుసుమా! అది మహాకష్టము కాదా. పోనీ నీవే స్త్రీవి కమ్ము. ఊఁ.

సర—ఒకవేళ మాటవరుసకు నేను స్త్రీ నయ్యెద ననుకొనుము. నీవు నన్నింతగాఢముగా వలతువా?

కళా—నిజముగా నా కట్లైనను సరియేసుమా. మాటవరుసకే యక్కఱలేదు. మగవాఁడు ప్రయత్నించిన యెడల నిజముగా మగువ కాఁగలఁడు. మహామహిమసంపన్నమైన మనస్సున కసాధ్యమైనది లేదు. పురుషుఁడు ప్రయత్నమున స్త్రీ కావచ్చును. పొలఁతియుఁ బురుషుఁ డట్లే కావచ్చును.

గీ. కత్తి విడిచిపెట్టి ♦ గరిటను జేపట్టి
గోనెసంచి వెనుకఁ ♦ గూరుచుండి
చేతఁ గలము మాని ♦ చెవికి దుద్దులు పూని

కోరచూపు లొలుక ♦ యొదిఁగి కులుక
కనుల సన్నసైన ♦ కాటుకఁ దీరిచి
దంతములను గప్పు ♦ సంతరించి
బుగ్గలందుఁ బచ్చ ♦ బొట్టును బొడిపించి
కుత్తికంటు నాను ♦ క్రోవిఁ గూర్చి
అవికఁ దొడిగి గాగ ♦ రాను సింగారించి
సరిగయంచు పైటఁ ♦ జాఱనిచ్చి
కిన్కకు కినుకు మనుచు ♦ గిలుకు గిలుక్కంచును
నట్టి యిట్టి త్రిప్పు ♦ లాడుకొనుచు
పురుషుమొగముఁ గనక ♦ పొలఁతులతోడనే
గవ్వలనుచు గ్రచ్చ ♦ కాయ లనుచు
నాటలాడుకొనుచు ♦ నాడంగిమాటలఁ
జీర అవిక సొగసు ♦ చెప్పుకొనుచు
నాఁడుదాననంచు ♦ మూఁడేండ్లు గడపినఁ
దొలుత నున్న వ్యక్తి ♦ తుడిచిపెట్టి
నలువతలలు వంగ ♦ నరుఁడు సమర్థాడు
జనుల మానసములు ♦ సంచలింప.

సర.— నే నాఁడుదాన నగుటకొఱకు ప్రపంచమున నున్న లింగభేదమేల వ్యత్యస్తము కావలయును? సృష్టి యేల తలక్రిందైనట్లుండవలెను? మొగము మాడ్చుకొని బ్రహ్మ యేల పరితపింపవలయును? నాకు జ్ఞానము వచ్చినదిమొదలు నన్ను నే నెఱిఁగి నట్లెఱిఁగియున్న నావంటి దొకతె యున్నది. దానిని నీకర్పింతును. మాటలాడక స్వీకరింపుము.

కళా.— నీవంటి దనగా నాకు బోధపడలేదు. వంటి యనునది పనికిరాదు.

ఆ. వె. ముద్దుటుంగరాల ♦ మురిపంపుమొకమాలు
సల్లకుచ్చు లివియె ♦ నాకు వలయు,
నెంతొ యెత్తుగాని ♦ యెత్తు తక్కువకాని
నడిమిఫలక మిదియె ♦ నాకు వలయు,
సగము విడుచు చెట్టు ♦ సంపంగి యిదె ముక్కు
రంపుఁగొనలఁ బ్రతిఫ ♦ లింపవలయుఁ,

కాలముండె దొండ ♦ పండు మధ్యమున నీ
నోరుక్కలోన మనసు ♦ చిక్కవలయు,
కళల దిశలఁ జిమ్మ ♦ కాటుకపిట్టల
మూకభాష యిదియె ♦ నాకు వలయుఁ,
గువలయేశుచుట్టు ♦ గుడికట్టు కార నా
నందబంధనంబు ♦ నాకు వలయు,
నేది నీయందు నీవని ♦ యెన్నఁబడునో
యదియె నాకుఁ గావలసిన ♦ యది సతంబు
దానివంటిది యదికాదు ♦ గాన వలదు
నీవె మఱి నీవె మఱి మఱి ♦ నీవె వలయు.

సర—హా! అటులైన నావంటిదే నీవైనప్పుడు చూచుకొనవచ్చుఁ గాని అంతరంగము నన్నే సంపూర్ణకాంతిగా భావించి—

కళా—ఇది నీవు మనస్ఫూర్తిగా ననినమాటయేనా!

సర—సర్వవిధముల నామనస్సు నీయధీనమై యున్నది. కావున నాసంగతి నన్నడుగ నేల?

కళా—అటులైన నిన్నుఁ బ్రేయసీ! ప్రాణప్రియా! యనిపిలువవచ్చునా!

సర—(మందహాసముఁ జేయును.)

కళా—అదిగో నవ్వుచున్నావు. సాధారణముగా నాటకములలో నాయకుఁడు నాయికా పాత్రమైన మగవానిని ప్రేయసీ యని పిలుచుటకు వెగటుపడును. వానివంటి వాఁడేయైన తన్నుఁ బ్రేయసీ యని పిల్చుచున్నాఁడని స్త్రీపాత్రము సిగ్గుపడి కొంచెముగా నవ్వుకొనును. నీవుకూడ నట్లే నవ్వుచున్నావు. నామాటలట్టి మాయమాటలా! నాబ్రదుకంత యనుకరణపు బ్రదుకనుకొంటివా! కోఁతి కృష్ణవేష మభినయించినట్లే యనుకొంటివా!

ఆ. వె. నాటకంపుఁదెరలఁ ♦ దాఁటి మందాక్షంపుఁ
దేర చాటుమాటు ♦ తెరల దాఁటి
నీరు బుగ్గయైన ♦ నీలంపుఁదెర దాఁటి
తెరలు లేనిచోటఁ దెఱపిచోట
నాకసమున కెల్ల ♦ నాకాశ మగుచును
దివ్యదీప్తితోడఁ ♦ దేజరిల్లి

పైని లోన నేమి ♦ వ్యత్యాసమొందక
రాగమొప్పు సత్య ♦ రాశియగుచు.

కాదట్టి పరిశుద్ధరాగ మని నే ననువాఁడను గాను జుమీ ! గాని,

ఆ. వె. తనువు కాంతి కాగి ♦ తంపుఁ బొట్లములోది
డాలుకత్తి నూనె ♦ డబ్బుతునుక
కోఁతిమైల గొఱ్ఱె ♦ గోడు మీసపుఁబస
కాకిరేకు తళుకు ♦ గద్దెడాబు
నొసట వెక్కిరింపు ♦ నోటిపై నిగిలింపు
మనసునందు డొలక ♦ కనుల సలక
ఒడల మాయవేఁడి ♦ దుఃఖుఁ జెందనినాడి
లోన బాపనయ్య ♦ పైనఁ బ్రభుఁడు
నగు పాళెక్కిరాజ ♦ నని నవ్వినా వేమొ
అట్టటోపి పూస ♦ కుట్టుబొంతఁ
బూని ప్రాఁతపాత ♦ ముల వెనక నందీయ
నప్పు జెప్పు దాస ♦ రయ్యగాను.

సర—(తనలో) ప్రాణనాథా! నీవెంత సుకుమారహృదయుఁడవు. రవంత నవ్వితివని యెంత నొచ్చుకున్నావు. నీప్రేమరసము సముద్రమువలె లోఁతు దెలియనిదై యున్నది. ఎక్కడను మిథ్యాలేశమైనఁ బనికిరాని నీకు, లోన వెనుక దోఁపుడు లంగా కట్టుపైన బట్టులాగుగల వ్యక్తి సిద్ధించినది. నాథా! నీవు నటకుఁడవని నే నంటినని నీవిబ్బంది పడుచున్నావా! ఆమాత్రపు ఔచిత్యమున్నదాన నైన యెడల నాకీదురవస్థ యేల! నేను నటకాధమను; స్త్రీ అనురాయి యుండవలసిన తలపై నీదిక్కుమాలినపాగఁ బూని యెండకన్నెఱుఁగి యుండఁదగని నేను పర పురుషుని యెదుటఁబడి శృంగారకథాకలాపమును వినిపించుచున్నాను. మగ పోఁడుములు తెచ్చుకొని సిగ్గు మన్నుజేసి పురుషపాత్రాభినయ మొనర్చు చున్నాను. పోనీ! యింతటితో దీతినయెడలఁ బాడులోకములోడిదే యను కొందును. ఈతెయితక్కులలో నన్నుఁ "గాంతగానే భావింపవలసినది. పురుషవ్యాపారము మిథ్య" యని స్పష్టముగా నేను వినిపింపవలసివచ్చినది. ఉత్తమస్థితి పోయినది. నటకాధమస్థితిని బడితిని. అంతులోనైన ఘనతలేకుండ నటులు అందరచేఁ జీ యనిపించుకొనఁదగిన యీపనిఁ జేసితిని. ఎందుకొరకు? ప్రాణనాథా! నీకొఱకు; నీకొఱకు; మెడలో గన్నెఁ గట్టించుకొని వీథినిబడిన కాకిని గాకున్నయెఁడ జేరి పాడుచును. రామరామ యని యనసేర్చె యెద

విని బడిన చిలుకపిల్లను పావురపిల్లకంటె వేగముగాఁ జిలుకలే గొంతి చేయును. పడుచుపెండ్లామును దనవెంటఁ ద్రిప్పుకొనుచున్న మూఁడుకాళ్ల భర్త కూరివారిలో వరకు గూడవం తన్నలు మిగిలినవం తల్లురు. పిల్లలు కోఁతికొరకు ముష్టివానిని వెంబడించిన ట్లాతని వెంటఁ బడుచు వారు తిరుగుదురు. లోకమున సామాన్యముగా నిట్లు జరుగుచుండగా వాఁడుది పురుషవేషమున దేశమునఁ బడినసంగతి లోకమునకుఁ దెలిసినయెడల నింకేమైన నున్నదా? కావునఁ బురుషవేషమును దీసినఁగాని నాకు సౌఖ్యము లభించునట్లు తోఁచదు. కాని యొకపెద్దచిక్కు. ఈతని హృదయ మాత్మతత్త్వమువలె నగాధమై యజ్ఞాతమై యున్నది. ఇతని కెక్కడను మాయమర్మము పనికిరానట్లు కనఁబడుచున్నది. రవంత నవ్వితినని యెంతో యిబ్బందిపడినాఁడు. రాగతత్త్వమును నిర్ణయించునప్పు డేదో బట్టబయలని యాకాశమని ఏవో యర్థము స్పష్టము కాని మాటల నాడినాఁడు. నేను స్త్రీనని స్పష్టముగాఁ జెప్పి స్త్రీరూపమున నీతని యెదుటఁ బడినయెడల "నీవెంతదూరమునుండి యిక్కడికి వచ్చితివో నాకు నీ వక్కఱలేద"ని నిరాకరించునెడలఁ బ్రాణములు నిలువున విడువవలసివచ్చును. మగవానివల పుదయపుమంచువలె నెంతదట్టమైనను రవంత ప్రొద్దెక్కినయెడల నంతయు నెప్పపాటులో మాయమగును. ఆతని ప్రేమ కొంతపొడుగుగ సాఁగినను రవంత వేఁడి యున్నంతసేపే యాసాఁగుడుగాని యది కొంత తగ్గిన వెంటనే లక్కతీఁగవలె నెక్కడి కక్కడే ముక్కలగును. అశ్వలోగపు రాకయుఁ బురుషరాగపుఁ బోకయు నెఱిగినవాఁ డెవ్వఁడు? అందులో నీతని దొక వింతతత్త్వమువలెఁ గానఁబడుచున్నది.

కళా—ఏమో యాలోచించుచున్నావు?

సర—ఔను. ఆలోచించుచునే యున్నాను. నీకుఁ బ్రేయసినగు నేనాఁడుదానిచర్య కనుగుణముగ రవంత నవ్వినందులకు నీవింత నొచ్చుకొనుట కేమికారణమో యని యోజించుచున్నాను. నాకు నవ్వువచ్చుటకుఁ గారణమున్నది కాని లేక పోలేదు. నేను నాయీడువ్యక్తితో నొకప్పుడు బొమ్మరింటను గూరుచుండి మిగుల బాల్యమున మగఁడుపెండ్లమాట లాడుచుండగా నీవిప్పుడు నన్నుఁ బ్రేయసీ యని పిలిచినట్లే నామిత్రము నన్నుఁ బ్రేయసీ యని పిలిచెను. నీపిలుపు వలన నీపూర్వవృత్తాంతము జ్ఞప్తికి వచ్చినది. నాబ్రదుకున కెల్లప్పుడు బ్రేయసీతనమే కాబోలు నని భగవంతుఁడు నన్నిందులకే పుట్టించినాఁడు కాఁబోలునని నాకు నవ్వువచ్చినది.

కళా—అంతేకద! ప్రియురాలా! నీరూపమును జూచి యజ్ఞబాలుకే గాంధర్వరాగమునఁ బ్రేయసీ యని పిలిచినప్పుడు నే నూరకుండఁగలనా? రూపమున కనుగుణముగు నీకంఠరవమో! అహా! నీమాటలే మధురమైన గానమువలె నున్నవి గదా! ఇఁక నీగాన మెట్లులుండునో! నేను నీగానమును విని పరవశుఁడనగు మహాభాగ్యము నెన్నఁడైనఁ గలుగఁ జేసెదవా!

సర — కానిమ్ము. ఇప్పుడు గానప్రశంస యేల?

కళా — ఇప్పుడే కావలసినది.

గీ. భోగయుతులకు ద్రవిణమే ♦ పూజ్యతమము
యోగయుతులకు సాధన ♦ ముత్తమంబు
రోగయుతులకు నాశయే ♦ రోగహరము
రాగయుతులకు గానమే ♦ రంజకంబు.

కావున గోవర్ధనా! ఒక్కపద మైనఁ బాడి ప్రేమలత కసాధారణమోదముఁ జేసి పుణ్యముఁ గట్టుకొందువా?

సర — నామాటలను బట్టియే నేను బాడఁగలనని మీరు గ్రహించుట తగునా?

కళా — నీకంఠరవము మహామధురముగా నున్నది. నాణెమును జూచుటకై తర్జనిపైఁ బెట్టి బొట్టనవ్రేలితోఁ బైకి మీఁటిన బంగారు నాణె మెట్టి నాద మిచ్చునో యంతకంటెఁ గంగున రంగునగలదై యున్నది. నీవు పాడలేకపోవుట యేమి? సామాన్యముగా —

గీ. భుక్తిదములైన పనులందె ♦ పురుషమహిమ
రక్తిదములైన కళలందె ♦ రమణీఘనత
భోజనాది సంపూర్తియే ♦ పురుషుసొమ్ము
పానకమువంటి పాటయే ♦ భామసొమ్ము.

సర — అది స్త్రీజనసామాన్యమునకు వర్తింపవలసిన మాటకాని నాకెట్లు వర్తించును?

కళా — ఓహో! అదియా? ఇదిగో చెప్పుచున్నాను.

ఆ. వె. వ్రేలుచెవులవాఁడు ♦ విపులాయు వగువాఁడు
తెల్లనోటివాఁడు ♦ తిండిపోతు
స్ఫుటతరంపుగొంతు ♦ ముడివాఁడు గాయకుం
డెత్తుముక్కువాఁడ ♦ హీనబుద్ధి.

సర — (గొంతుక తడుముకొని) సాముద్రికసత్య మడుగనక్కఱలేదు. వినను నాగొంతు ముడిమాత్ర మేమంతయెత్తుగా నున్నది?

కళా — అంతకన్న నెత్తైనవి యుండవచ్చునులే. దయయుంచి ఏదీ! మామిడిచిగురు వగరున జీరవదలిన కంఠముతోఁ గోకిలమువలె నేదీ! ఒక్కపదమునకు రెండు పదములఁ బట్టుకొందును. (కాళ్ళు అంటఁబోవును.)

సర — వలదు వలదు. చేతనైనట్లు పాడెదను.

బేహాగ్—ఆది.

నాలో నేదియు లేదు, నీలోన నున్నది
లాలింపవేల? దయాలవాల॥ నాలో॥
నాలోపములన్ని చాలఁగ మన్నించి
నీలోకిఁ దీసికొమ్మా, జాలమేల॥ నాలో॥
వేణునఁగలదేది, వేణువు నూఁదెడు
జాణతనము నీదిరా ప్రాణనాథ॥ నాలో॥
కలువనుగలదేది, కలువ నవ్వించెడు
గిలిగింతయది, నీదిరా ప్రాణకాంత॥ నాలో॥

కళా— గీ. జాజిపూవుల వాసనల్ ♦ సంతరించి
పండువెన్నెల శైత్య సం ♦ పద హరించి
చిన్ని పూఁదేనె రేణువుల్ ♦ స్వీకరించి
మదిని గదలించె నేమంద ♦ మారుతంబొ?

గోవర్ధనా! అమృతప్రవాహమట్లు పాడుచుంటివి!

సర—పాడుచుండుటలేదు - మానివైచితిని.

కళా—నిజముగా మానివైచితివా? అదిగో! ఇంక వినఁబడుచున్నదే.

గీ. బట్టకొంగున నత్తరు ♦ వలపువలెను
గాలి యడఁగిన నీటిలోఁ ♦ గరదువట్లు
సవిత గ్రుంకిన సంజ కెం ♦ జాయలీల
నీదుగీతము గాలిలో ♦ నిల్చి మొఱసె.

అహా! గోవర్ధనా! జగతి గానమయ మని తోఁచుచున్నది సుమా!

గీ. భావనాదూర మగు పర ♦ బ్రహ్మమందు
బహువిచిత్రంపుఁ బ్రణవ రా ♦ వము జనించెఁ
బ్రణవమున లక్ష స్వరము లు ♦ ద్భవములయ్యె
స్వరమునకుఁ గోటి శ్రుతులైన ♦ సంభవించెఁ
గైశికీకాకలీముఖ ♦ గతివిభేద
కోటులంతటఁ బ్రస్తార ♦ పాటవమునఁ

బంచభూతమనోముఖ ♦ స్వరవిభేద
భాగసంగతి రాగముల్ ♦ ప్రభవమందె.
రాగములె సుమ్ము సృష్టిలోఁ ♦ బ్రాణులన్ని;
షాడవపుటౌడవపుషాడ ♦ వౌడవంపు
భేదములకంటె శతకోటి ♦ భేదగతు ల
కారణమున నెన్నియొ మేళ ♦ కర్తలయ్యె
మారరంజని కనకాంగి ♦ కీరవాణి
వంటి డెబ్బదిరెండు రూ ♦ పముల దాఁటి
కమత సింహాది జనకరా ♦ గంబు లయ్యె
నెన్నియో! జన్యముల లెక్క ♦ యెన్నఁదరమె?
భైరవికి మేఘరంజి దే ♦ వక్రియ యగు
రంజియును భార్యలయి కాఁపు ♦ రంబు గూర్చు
పోల్క స్త్రీరాగకోటికిఁ ♦ బురుషరాగ
వితతి భర్తృత్వమును గాంచి ♦ వృద్ధిఁ జెందు;
గానమున కెల్లఁదాళము ♦ ప్రాణమగును
దాళగతి స్వభావము ప్రాణి ♦ తతికి నెల్ల
నడచుటందును నూఁపిరి ♦ విడుచుటందు
నాడియందున లయగతి ♦ కూడియుండు,
నుసియు దెబ్బనుబట్టి యీ ♦ యుర్వి తిరుగు
గ్రహగతులు తాళగతి పరి ♦ భ్రాజితములు
కాలచక్రంబు తధిగిణో ♦ చ్చాలితంబు
గాన నీసృష్టి పరమాత్ము ♦ గానఫణితి.

గోవర్ధనా! నేను జెప్పినది నీమనస్సున కేమైన నెక్కినదా?

సర—ఎక్కకేమి? నీవు కళాలలితరాగమవు. నేను గోవర్ధనరాగమను. నాది యేక తాళము. నీది త్రిపుటతాళము.

కళా—నామాటలు నీకు నచ్చలేదు కాఁబోలు!

సర—తెలియఁదగనివానిని గూర్చి చెప్పినమాటలు నచ్చకపోవుటలో వింతయేమి? దారితెన్ను తెలిసంగతి కావున చెవిటివానికిఁ దోఁచినట్లు వాఁడు చెప్పును. నీవు గానప్రియుఁడవై యుండుటచేతఁ గాఁబోలు నీవు సృష్టి గానమంటివి. కవి యగువాఁడు జగతియంతయుఁ గవితామయమని చెప్పును. మాదిగవాఁడు

ప్రపంచమంతయుఁ బరమాత్మ చేసిన పాదరక్షయని చెప్పుదు. ప్రేళ్ళ యుంగరములే సూర్యచంద్రులు. పై తగరపుపిసరులే నక్షత్రములు. నడిమియంతరమే లోదనీకుహరము. ఎక్కడికక్కడికే సరిపోవును.

కళా—నీవు చెప్పినదికూడఁ గొంత నిజమే కాని నీయభిప్రాయమేమో చెప్పెదవా?

సర—సృష్టియంతయు స్త్రీమయము. పురుషుఁడొక్కఁడును లేఁడు. ఇది నాయభిప్రాయము.

కళా—పరాత్పరుఁడైనఁ బురుషుఁడు గాఁడా?

సర—కాఁడు. అందఱును స్త్రీలే.

కళా—ఏలాగున?

సర—స్త్రీలపై వలపుగలవారు స్త్రీలకు వశులగుటచే స్త్రీలు; స్త్రీల వలపెఱుఁగనివారు స్త్రీల కక్కరకు రాకపోవుటచేత స్త్రీలు.

కళా—ప్రపంచమంతయు స్త్రీమయమైన మన కేమిలాభము? నేను స్త్రీనైన మనకు లాభము. నీవు స్త్రీవైన మనకు లాభము. గోవర్ధనా! నిజముగా నీమో మింత లావణ్యవంతమై యుండుట కేమికారణము?

సర—సముద్రసంబంధముచేత.

కళా—కప్పుదాఁటులు వై చెదవేల?

సర—అదియు నందుచేతనే.

కళా—ఇంతసేపటినుండియు నీమోమువంకఁ దేఱిపాఱఁ జూచుటకుఁ బ్రయత్నించుచున్నాను. చూపు నిలువఁబడదే. అడఁచిన కొలఁదిఁ జూపు చెల్లచెదరై పోవుచున్నది. ఎందువలన?

సర—అది నీచూపు లావణ్యమహిమ గాని నామోము లావణ్యమహిమ కాదు.

కళా—ఓస్! గడుసుదానవు. ఆమాత్ర మెఱుఁగకపోలేదు.

క్రొవ్వరాటకు నెగఁబ్రాకు ♦ క్రోఁతివలెను
గాజుతలుపునఁబడు మంచు ♦ కణికవలెను
వడఁకుతలను బెట్టిన నిమ్మ ♦ పండువోలె
నీదుమోమున నాదృష్టి ♦ నిలువదేల?
సూర్యునైన నిట్టె ♦ చూడంగవచ్చును
జుక్కకోడి నైనఁ ♦ జూడవచ్చు
గాంతి ప్రతిఫలించు ♦ కలఁగునీటిని జూడ
నౌను నీదుమోము ♦ గానరాదు.

సర—కానరానప్పుడు కష్టపడి కాంచుటయేల?

కళా—దర్శనీయమైన వస్తువును జూడనివాఁడు ధన్యుఁ డెట్లగును ! కన్నులుండిన వాఁడెట్లు కాఁగలఁడు !

ఆ. వె. నుదురు చూడఁబోయి ♦ నుదిటికంటెను ముక్కు-
సొగసటంచు దానిఁ జూడఁ దిప్పర
సొగసనులు నాదు ♦ చూపుఁ గట్టిగ నీడ్చి
విఱిచి చెక్కులందు ♦ విసరివైచె.
ఎన్నొ పూలనడుమ ♦ నేదియుఁ గ్రోలఁగ
స్థిరత లేక మొఱయు ♦ తేటిపోలె
నిన్ని సొగసులున్న ♦ నెదియును గనలేక
విలవిలంచుఁ జూపు ♦ నిలిచిపోయె.

ఇంతకష్టపడి యేల చూడవలయునంటివే !

ఆ. వె. చూడఁదగనిదాని ♦ జూచుమోదముకంటెఁ
జూడఁదగినదాని ♦ జూడలేని
జాలి మేలుగద! ము ♦ సలిదాని 'ఊఁ'కంటె
చిన్నికులుకులాఁడి ♦ 'చీ' పసందు.

పర—(తనలో) ఆద్ది ! నానాథుఁ డక్కరకువచ్చు శృంగారత్వదారిలోఁ బడుచున్న ట్లున్నది. నేను గాంతనని కొంత స్పష్టపడుచున్నట్లున్నది. ఇదివరకున్న యాకాశపురాణపు మాటలకు నిప్పటి యబలానురాగపు మాటలకుఁ గొంత భేదమున్న ట్లగపడుచున్నది. నాకు మగవాఁడైన సరే యాఁడుదియైనసరే యనెడివాని కిప్పుడు చిన్నికులుకులాఁడి చీకొట్టుటలు కావలసివచ్చినట్లు కనఁబడుచున్నది. ఇతఁడు తెలివిగలవాఁడు. యోగ్యుఁడు. గంభీరానురాగము గలవాఁడనుట స్పష్టము. కేవల ధారాళాంతఃకరణము గలవాఁ డగుటచే మాయామర్మగ్రహణమునఁ గొంత యసమర్థుఁడు. ఎన్ని మడతలలోఁ బెట్టి దాఁచి పెట్టెలలోఁ బెట్టినను మొగలిపూవు పరిమళము పైకి రాకుండ నడఁగునగునా ! ముద్దుబొంతచే వాఁడుదాని యొుపలి యిటు మాటుసేయ వచ్చునుగాని కంటిపోటెట్లు గ్రమ్మవచ్చును. అట్టి నాయాఁడుఁదనము నానాథు నావరించి నీరు కచ్చికలోని కెక్కిన ట్లెక్కుచున్నది. ఇది మంచికే వచ్చినదో చెట్టకే వచ్చినదో యెట్లు తెలియవచ్చును ? (ప్రకా) కళాలలితా ! ఈగొడవయేల మఱియేమైనఁ జెప్పరాదా ?

కళా—నీకంఠరవము నీవదనకాంతియు నన్ను మిగులఁ దహదహలాడించుచున్నవి. అవి మగవాని కున్నట్లులేవు.

సర—అవి యీ వేళనే లేవా నీవు నన్ను జూచునప్పటికి లేవా

కళా—మొదటినుండియు నాకుఁ దెలియలేదు. మందబుద్ధినైన నాకిప్పటికిఁ దెలిసిన దనుకొనుచున్నాను.

ఆ. వె. వింటియల్లెత్రాడు ♦ వంటిది మగకొంతు
వీణతీఁగ సుమ్ము ♦ వెలఁదికొంతు
వనజనేత్రకొంతు ♦ బంగారు గంటయా
బాగులు మనెడిలోడుగు ♦ పురుషుకొంతు,
బ్రహ్మహీరకాంతి ♦ రమణీముఖచ్ఛవి
స్ఫటికకాంతి పురుష ♦ వదనశోభ
యెఱ్ఱ పురుషవక్త్ర ♦ మెట్టగన్నెరుపువ్వు
లలన మొగపుజిగి గు ♦ లాబిపువ్వు;
తులము మల్లెలోనఁ ♦ గలిగిన మృదులత
నందివర్ధనంబు ♦ నందుగలదె?
కడిమిపువ్వులోనఁ ♦ గల విచిత్రద్యుతి
కదళి పుష్పమందుఁ ♦ గనఁగఁదగునె?
సొగసులన్ని మించి ♦ సొగసుల కోటీర
మైనతళుకు తళుకు ♦ లోని తళుకు
మొలకకులుకులొలుకు ♦ కలకల కలదందు
నాఁడుదాని మొగమె ♦ యాఁడుమొగము.

సర—కళాకలితా! ఒకరొకటి యొకటి యను నట్లు లెక్క మప్పఁజెప్పితివేమి?

కళా—అంతకంటెఁ జెప్పుటకు నావలనఁ గానప్పు డేమి చేయవలసినది?

సర—చెప్పుమని యెవరు నిన్నుఁ దొందరచేసినారు?

కళా—ఇదివఱకే చెప్పవలసియుండఁగ నిప్పుడు చెప్పుటకూడఁ దొందరయగునా? చీఁకటిలోనైన వృషభము గోవు నిట్టె గ్రహింపఁగలదుగదా! పద్మముకుళ ములోఁ బడియున్నను భృంగిని దెలిసికొని యాపుష్పముచుట్టు భృంగము దిరు గుచు మొఱబెట్టునే. అమాత్రమైన నేను జేయలేకపోయితినే! పసికున్న పస వానకన్నను లేకపోయెనే! ఈకన్నులతో నాకేమిప్రయోజనము? మన్మథుఁడు గ్రుడ్డివాఁడని యందురు. అది యసత్యము. అతఁడు సహస్రాక్షుఁడు. పాప మాపుణ్యాత్ముఁడు నన్నుఁ దగినచోటనే చేర్చినాఁడు. నేనే యింతవఱకు గ్రుడ్డివాఁడనైతినికాఁబోలు అదిగో చెవులకుఁ గుట్టు! అద్దశాసరంధ్ర మదిగో!

గోపరజా! నిజముగా నీవు నావంటి మగవాఁడవు గావుగద! అదిగో చెక్కు-లెఱ్ఱపెక్కుచున్నవి. కావు. మగవాఁడవుకావు. మగవాఁడవు కానప్పు డింక వాఁడుదానవు కాక యేమగుదువు?

సర—(తనలో) ఆఁడుదాన నగుదునుగదా యని తాత్కాలికముగా సంబలాటపడు చున్నాఁడు. కాని యాఁడుదాననే యని స్పష్టముగాఁ దెలిసికొని శాంతిపడిన పిమ్మట మాత్రము నన్నుఁ జూచి వెగటుపడునని నాకు భయముగానున్నది. రామపురరాజా కూఁతురేమి! మగవేసమేమి! దేశాటనమేమి! సముద్రయాన మేమి! ఈచర్య మగవాఁడు మెచ్చఁదగినదేనా? కావున స్త్రీ నని యొప్పు కొనను. ఎప్పుడైన నెక్కడనైన స్త్రీరూపమున నీతనిఁ జూచి వరింపఁబడు దును. ఇప్పుడుమాత్ర మట్టి తొందర పనికిరాదు.

కళా—ఆఁడుదానవేకద! ఆఁడుదానవేకద! మొగమెత్తి నావంక నొక్కసారి చూడుము.

సర—ఏల చూడవలయును?

కళా—ఆఁడుదానవేకద! ఒక్కసారి గట్టిగఁ గౌఁగిలించుకొననిచ్చెదవా? ఏదీ? (మీఁదికి రాఁబోవును.)

సర—ఆఁగు. స్నేహధర్మము ననుసరించి పరిహాసార్థముగాఁ బ్రేయసీ యని పిలువ నిచ్చితిని. నవ్వులాటగా నారంభమైన దింతవఱకు ముదిరినదా! కళాలలితా! యిఁకఁజాలు; నాకుఁ దల నొచ్చుచున్నది. నేనుబోయి పండుకొనెదను. (లోనికిఁబోవును.)

కళా—అయ్యయ్యో! ఇదియేమికర్మము! మగవాఁడేకాఁబోలు. నేను దీసికొనిన చనువు నకై కోపముగలిగి లేచిపోయినాఁడు. మగవానిని బట్టుకొని యాఁడుదని యాతనిని ముద్దిమ్మనఁగ నెట్టి పురుషునకైన నెట్టిమిత్రునకైనఁ గోపమురాదా? అయ్యయ్యో! ఎంతబుద్ధిలేమి సిద్ధించెను! మగవాఁడే కాఁబోలు. ఆఁడుదని యింత భ్రమసితినేల? అయ్యయ్యో! చెవికుట్లుచూచి యడ్డబాసరంధ్రముఁ జూచి యాఁడుదని నిశ్చయింపవచ్చునా? ఆఁడు పిల్లలులేని దంపతులు తమ మగపిల్లలకు ముద్దుకొఱ కట్లు సేయింపవచ్చును. పాటఁజూచి యాఁడుదని గ్రహించునెడల నిప్పటి మగవారిలో నూటికిఁ దొంబదిమంది అవిశకట్టుసరకు క్రిందికి రావలసినవారేకదా! అయ్యయ్యో! మొగపుఁ జేడితన మాఁడుతన మగునా? కంటి లేడితన మాఁడుతనమగునా? ఎటువచ్చినను గంఠరవము వదన లావణ్యము సన్నిడ్డి నేలఁ గొట్టినవి. ఆఁడుదానికిఁ దప్ప నట్టి సౌభాగ్యము లుండవు. అందుచే నాతఁ డాఁడుదియే కాఁగూడదా? స్త్రీని గానని యాతఁ డనునప్పు డంతకంటె నా కెక్కువదెలియునా? స్త్రీయైయుండినయెడలఁ గోపించి లేచిపోవు టెందులకో? హా! మగవానికేమి? సుధామధురమైన యాకంఠమేమి!—సుప్రసన్నమైన యాసోయగమేమి?—ఏమో—సత్యకాలపు టూహము!

గీ. ఖరనినాదారావులైన యం ♦ గనలు లేరొ
కోకిలారవ పురుషులు ♦ గూడ లేరొ?
పురుషులందున శీతాంశు ♦ ముఖులు లేరొ
ముదితలందు మృణ్మయపాత్ర ♦ ముఖులు లేరొ?

స్త్రీత్వ పురుషత్వ నిశ్చయమున కివి చాలవు. ఇచ్చట నెవ్వరులేరుగద! (అటునిటుఁ జూచి) ఎందుచేతనోకాని వక్షము నితంబముగూడ కొంత పెద్దగానే కనఁబడినవి. ఆమాటలు గూడ నోరు జారినవిగావు. అదృష్టవంతుఁడను. ఇంతకంటె నప్రతిష్ఠ యున్నదా! ఈమాట గోడదాఁటినయెడల నంతకంటె నగుఁబాటున్నదా! అయ్యో! ఎదుటఁబడిన వ్యక్తి యాఁడుదో మగదో తెలిసికొనలేని నేను ప్రపంచ తత్త్వమునుగూర్చి ముచ్చటించి యుంటిని గాఁబోలు. యథార్థముగా నాఁడుది కనఁబడినను మగవాఁడనియే యెంచి తలవంచుకొని దాఁటిపోవువాఁడే యీ దుష్టదినములలో నదృష్టవంతుఁ డను కొందును. ఈకాలమునఁ బైవేషములఁబట్టి యాఁడుదానిని నిర్ణయించుట మాత్రము బహుకష్టము. కొందఱకుఁ గంటికజోళ్లు—కాలికజోళ్లు—నెత్తికి టోపి—చేతిలోఁ గఱ్ఱ—మెడలో శ్రీరామరక్ష—మొలలోఁ బొడుముడబ్బి—నేను పొరపాటుపడుచున్నాను. గోవర్ధనుఁడు నిజముగా మగువకాని మగవాఁడు కాఁడు. అతఁడు మగవాఁడే యైనయెడల వానియందు నాకీ వలపేల కలిగి యుండును! నామనస్సే నాకు సాక్షి. అతఁ డాఁడుది కావుననే నామనస్సింత కరఁగి పోయినది. నాప్రేమము బీదలపై ననురాగమువలె నున్నదా! జన సామాన్యముపై నున్న సోదరానురాగమువలె నున్నదా! ఇట్టి మనోవికారము నే నెన్నఁడెఱుఁగను. ప్రేమించుట కాఁడుదని యెఱిఁగియుండవలయునన్న మాట యక్కఱలేదు. జ్ఞానమునకు సహజవైఖరికి సంబంధములేదు. సూదంటు రాతికి సూది నాకర్షించుటలోఁ దెలివితోఁ బనియేమున్నది? పైమట్టమునుండి నీరు క్రిందికిఁ దెలివియే దిగుచున్నదా? ఈమె యాఁడుదికాని మగవాఁడు కాఁడు. తగిన యవకాశమును జూచి మరల వచ్చి యీమె ననునయించి దయాపాత్రమనగుదును. ఇప్పుడేమియు మాటలాడక కోటకుఁ బోవుటకంటెఁ దగిన పనిలేదు. హా! గోవర్ధనీ! ప్రాణకాంతా! (నిష్క్రమించును.)

ఇది తృతీయాంకము.

శ్రీరామ

సరస్వతి

చతుర్థాంకము

సరస్వతి గదిలోఁ గూరుచుండును.

గదిప్రక్కను గళాలలితయు దాసి కురంగియుఁ బ్రవేశింతురు.

సర—ప్రాణకాంతా! కళాలలితా!

కురం—అమ్మా! కళాలలితా! ఇప్పుడాగదిలోనుండి వచ్చినమాటలు వింటివి కాదా!

కళా—'ప్రాణకాంతా! కళాలలితా!' యను నమృతమధురాక్షరములు వినఁబడినవి కాదా! అతఁ డన్నమాటలేనా యివి!

కురం—సందేహమేమి? చూచితివా! పైకి బిఱ్ఱబిగియుచున్నాఁడు లోన మొత్తుకొనుచున్నాఁడు. ఒక్కొక్క తుగముండకొడుకున కిదే తెగులమ్మా. ప్రాణములు కటకటలాడించుచున్నాఁడు. మాయమ్మ నంచుకొనిన దేవాంగి సరిగ నిదే మాదిరి. వీథియరుఁగుమీఁద గూరుచుండి లోపలి కెన్నిసారులు బతిమాలుకొనినను రాఁడు. ప్రాణములు విసిగి తుదకు లోనఁ దలుపు వైచుకొనిన తరువాత విరహబాధచేత వీథియంతయుఁ బరవళ్లు త్రొక్కుచుఁ దెల్లవాఱువరకు నొక్కటే యేడుపు. ఇదివరకు నాలు పర్యాయములయినను నీయాజ్ఞచే నతని యొద్దకుఁ బోయి నీ మనస్సు నాతనికి బట్టబయలు చేసితి. ఎంతసేపటికి "నుహుఁ హుఁకే కాని ఊఁ" లేదే. ఇప్పు డొకఁడు గదిలోఁ గూరుచుండి 'ప్రాణకాంతా! కళాలలితా!' యని యఱచుచున్నాఁడు. రమ్మన్నప్పుడు రాక తివరించేల! మంచముమీఁదఁ గూరుచుండి మదనతాపమేల?

సర—(తనలో) కళాలలితా! ప్రాణకాంతా! ప్రపంచమున నాకు నీవంటి యిష్ట వస్తువు లేదు. నీకు నాపైనున్న యనురాగ మసాధారణమని యెఱుఁగుదును కాని—

కురం—వింటివా? నీకొఱ కేడ్చుచున్నట్లు స్పష్టమేనా?

కళా—కాని యనుచున్నాఁడు. కురంగీ! తరువాత నేమిచెప్పునో యని భయముగా నున్నది.

కురం—'కాని' యేమిరా నీ మొగమని సాఁగదీసి దౌడమీఁదఁ గొట్టినయెడల చేకోప కారమగును. దేవతలు మెత్తురు. నా నెత్తురు నావారపోసినాఁడు. ఇంకను— కానియఁట- చేఁదు మేయనుగాఁబోలు. గరికేరుకేరా? నేలకేమా! ని

కములాగున నోటికివచ్చిన తెన్నముద్దను గుటుక్కున మ్రింగక కానియుఁట! బంగారుబొమ్మ ప్రక్కలోనికి సిద్ధమైనప్పుడు- నిర్భాగ్యత కాకపోయినయెడల- కాని కాని యని యేడ్చునేమి?

కళా—కురంగీ! నీ వాతని నేమియు ననకుము. అతని కేమి యభ్యంతరమున్నదో!

కురం—ఆఁ! ఆఁ! బాగుగాఁ జెప్పితిరి! నాకు స్ఫురించినది కాదుసుమా! పట్టిదట్టయ్య గారేమో! ముందుగా నది తెలిసికోవలయును. పట్టి బట్టలగుమ్మట మేమో! ఈవైపులనే మనము పుట్టకముందొక పంగనామాలయ్య యుండువాఁడట. అతఁడు పెండ్లి యనఁగా విషూచిరోగముకంటె నెక్కువగా జడియువాఁడఁట. ఏదో కొంత చదువుకొని యేకాకిగాఁ గాలక్షేపము చేయఁగా నితఁడు సిసిందిరీ నిగ్రహము గలవాఁడని—

కళా—సిసిందిరీ నిగ్రహము కాదు. ఇంద్రియ నిగ్రహము.

కురం—అదే కాఁబోలు. ఊరివారంద ఱతని కొక చిన్న చావడి కట్టించి పెళ్లికొక జాతరచేసి నైవేద్యాలు పెట్టించి చుట్టు రామభజనచేయుచుఁ ద్రిప్పెడువారఁట. ఇంత మహాపురుషుఁడు లేఁడని దేశమంతయు మాఱుమ్రోఁగినది. తుద కతఁడు వట్టి అద్దిద్ది ముండకొడుకని నూయిక్కమ్మ కనిపట్టినది.

కళా—అబ్బా! పోనిమ్ము. ఈదిక్కుమాలినకథ లెందులకు!

కురం—కథ కాదమ్మా! నిజముగా జరిగినదే. జన్మ బ్రహ్మచారులలో నేమి, పడుచుఁదనమున రెండవపెండ్లి వలదనువారిలో నేమి పెద్దమనుష్యులు లేరని నేను జెప్పను. కాని పెద్దమ్మ లెక్కువ. ఈమాపుడుగుత్తాలు గుగ్గిళ్ళు తినుటకుఁ దప్ప వినియోగింపవు. ఈతఁ డాజాతిలోనివాఁడేమో కనిపట్టవలసియున్నది.

కళా—పెత్తెచదువులు చదువకు. సమయాసమయము లెఱుఁగకుండ నెందులకావదరుట? ఊరకుండుము.

కురం—అమ్మా! మీరు చెప్పినతరువాతమాత్ర మాతని స్వరూపమును గూర్చి నాకు భయముపట్టుకొన్నది. అతని మొగములోఁ బొంకమేకాని బింకముగపడదు. ఆరంగున్నదే అదేమో జాలుగానున్నది కాని ఎదురెక్కుగా లేదు. నిజమైన మగవానిరంగు నలుపులో మసరైన నల్లుందుబలె నుండవలెను. ఈచిలుక రెక్కల గంధకపురంగువారు— కోతిపిల్ల మామిడిపండు రంగులవారున్నారే- వీరు తలుచుగా గోడలమీఁద పటములలాగున నింటి సింగారమునకు మాత్రమే యని మా పిన్నమ్మ చెప్పినది.

కళా—ఛీ! ఛీ! ఒక్కటేమతిలేని ధోరణి! మన మిప్పు డెవరియింటనుంటిమో? ఎందులకు వచ్చితిమో? ఏలాగునఁ గార్యమును సఫలముఁ జేసికోవలయునో? యీ సంబంధమైన చింతయు బెంగయు నేమియులేకుండ నూరక వాగెదవేల!

కురం—అన్నిచింతలు నన్నిబెంగలు నాకు వదలిపోయినవి. ఈతనిని నీకు స్వాధీనపఱచుట కాతరము గాలేదు. అందుకొఱకేగాదా నిపుడిని నీకే చూచుకొయని

నిన్నిక్కడకుఁ దెచ్చితిని? నీ చిత్రఫలకమును జూచుటకంటె నిన్నుఁ జూచినయెడలను. నాసంధానసంభాషణ వినుటకంటె నీమాటకే యానందిం వినినయెడలను నీకు మనోరథసాఫల్యము గలుగునేమోయని యెంచి నీచే నింతపని చేయింపవలసివచ్చినది. కొందఱు వస్తువుల చూడవలయును గాని దానిప్రతిమను జూచినయెడల వస్తువును గ్రహింపలేరు. మాపెద్దమ్మ రాజుగారి పురోహితుని బొమ్మనుజూచి గొఱ్ఱెపొట్టేలనుకొనినది. మాయక్క కొండముచ్చుబొమ్మను జూచి యీయూరి పెద్దకోమటి యనుకొనినది. ఈమాటలు నీవు నమ్మక వెఱ్ఱిధోరణి యందువు. అమనుష్యుల స్వభావమది. పటము చేతికిచ్చినయెడలను తెరమేదో, తూరుపేదో, గ్రహింపలేరు. కడుపుముందఱ యేదో రొండిమీఁదేదుకాయయేదో గ్రహింపలేరు. ఈతఁ డట్టి నిర్భాగ్యులలో నొకఁడని నానమ్మకము. చతురక్షర సంయోగమైనఁ గాని యొకఁడు చదివినయెడల నొకనికిఁ దెలియదు. కంఠముతోఁ బాడినప్పుడే గాయకుని గాన మొక్కఁడనుభవింపఁగలఁడు. కన్నులున్న గ్రుడ్డిప్రకృతులకుఁ జెవులున్న చెవిటిప్రకృతులకుఁ బ్రపంచమున వాద్దేమి? వద్దేమి!

కళా—నీ వాచాటతకువలె—ఇఁక నోరుమూసికొనుము. కాని యిప్పుడు మనము చేయఁదగినదేమి?

కురం—ఏమియులేదు. ఆ చింతచెట్టుబరికె యొక్కటిలాగి యెడఁబడి మదనపిశాచము వదలునట్టుత్తరదక్షిణా అక్రింద కొడవలయును. నేను పెండ్లిచేసికొనునప్పుడు నవ్వులతోను, బువ్వులతోను, మాటలతోను, పాటలతోను పెండ్లికొడుకును స్వాధీనపఱచుకొనను. జుట్టు పాయఁదీసి చావఁగొట్టి మఱి సప్తపాదాలు ద్రొక్కింతును. మగజాతి వట్టి మొండిజాతి. అందులోఁ బెండ్లికొడుకుజాతి యున్నదే దాని కెప్పుడు మింటిమాపే కాని మంటిమాపులేదు. పెండ్లికూఁతురు రీచ్చి చెంపకాయ కొట్టినప్పుడే కాదా నా మేనమామకుఁ దల కుడిభుజము మీఁదికిఁ దిరిగిపోయినది. అప్పటినుండి హరియనుమఱుఁ గానవలె నాతనికిఁ బ్రక్కచూపే కాని యెదుటిచూపేది? పీఁతవలె నడునడకయే కాని ముద్దున కెదుటినడకయేది?

సర—(లోనుండి) ఎవరక్కడ యలికిడి చేయుచున్నారు?

కళా—కురంగీ! నీవు ముందు గదిలోనికిఁబోయి నేను వచ్చియుంటినని సమయమును జూచి చెప్పుము.

కురం—అలాగే.

సర—ఎవరువారు మాటలాడరేమి?

కురం—అయ్యా! నేను కురంగిని.

సర—ఎల తిరిగి వచ్చితివి!

కురం—ఎలవచ్చితినో చెప్పుటకై (గదిలోనికిఁబోవును) గోవర్ధనా! నమస్కారము.

సర—ఏమి చెప్పఁదలఁచితివో వేగముగఁ జెప్పుము.

కురం—నీవు మగవాఁడవో కావో నిన్నడిగి తెలిసికొనవచ్చితిని.

సర—(తనలో) ఎప్పుడు నిది యిట్టిమాట లాడలేదే! ఎందుచేతనో చెపుమా. 'కళా లలితా! ప్రాణకాంతా' యని యిదివరకు నేను బిగ్గరగా విలపించిన విలాప మిది వినియున్నదా యేమి? అహా! యెంత ప్రమాదము! మర్యాద దక్కించుకొని యీయూరు దాఁటి పోలేనుగాఁబోలు. ఒకవేళ నాటకముగా వలచిన తనరాణిపై నాకు వలపులేదని యిది నన్నెత్తిపొడుచుచున్నదేమో! తెల్లవారకుండఁ బారి పోనైన వలయును. బ్రదుకిక్కడఁ బరిసమాప్తియైనఁ జేసికొనవలయును. అంతకన్న వేఱు దారిలేదు. (ప్రకా) నీకు నే నిన్నాళ్ళనుండి యిచ్చిన చనవుచేఁ దగనిస్వేచ్ఛ తీసికొని యిట్లు కాఱులు ప్రేలుచున్నావు జాగ్రత్త.

కురం—జాగ్రత్తయని నీవు నన్ను బెదరించుచుంటివా? బెదరుటకు నాతప్పేమి? నా దొంగవేసమేమున్నది? దాఁచి దాఁచి లోపలఁ బ్రాఁతిపెట్టి పైకిఁ బొరయవులచ్చడమునఁ గప్పుకొనుటకు నాకు లోకమెఱుఁగదని గుట్టేమున్నది? కళా లలిత వాక్యములవలన నింతకుముందే నీగుట్టు బట్టబయలైనదికాదా!

సర—(తనలో) అయ్యయ్యో! నాకును గళాలలితునకు నొక్కయరగంట క్రింద జరిగిన సంభాషణ మిది యేప్రక్కనైనఁ బొంచియుండి వినినదేమో! నన్నాఁడు దానిఁగనే భావింపుమని నే ననుట యాతఁడు నన్నుఁ బ్రేయసీయని పిలుచుట మొదలగు నసందర్భమంతయుఁ గనిపట్టినదికాఁబోలు! ఇఁక నే మున్నది? కాని తుదకాతఁడు నన్నుఁ గౌఁగిలింప యత్నించుట నేను నిరాకరించి గదిలోనికిఁ బోవుట కూడ దీనికంటఁ బడకుండునా? అంతమాత్రముచే నేను మగవాఁడనని తిరుగ నిది నిశ్చయించుకొనుట కవకాశ మేమియున్నది? అది యాఁడుదాని చెట్టు, బిగింపని యనుకొనెను. ఇంతకు నింక నాకొంపమునిగినది. ఇది పట్టి నోటిరొట్టుపుముండ. అయ్యయ్యో! ఇఁక నే నేమిచేయుదును. (ప్రకా) నీకేమి మతిపోయినదా. పో ఆవలికిఁబో!

కురం—మతి పోనే పోయినది. పోదా? మాఅమ్మగారికి నీపై వలపు నిష్ఫలమై పోవ నాకు మతిపోదా? ఆమె పదిదినములనుండి యీబెంగచేత నన్నము మానివైచి జీవములు నిలుపుకొనుటకు మాత్రము రవంత గంజిగ్రాచి కాలక్షేపము చేయుచుండఁగా నాకు మతిపోదా? నేను జేఁతకానివాఁడను— కొజ్జావాఁడను— అడంగియుబ్బున్నను— నాకొఱకు నీ వాసపడి రావలదని నాచెవిలో రవంత యూఁదిచ్చినయెడల నామెకీబాధయుండదే— నా కీకడుపుమంట యుండదే— నీకీయల్లరియుండదే— మగవాఁడననియే యాసపెట్టి నన్నింతకాల మేల త్రిప్పించుకొంటివి!

సర—(తనలో) అమ్మయ్య! బ్రదికితిని. ఇది నారహస్య మేమియు నెఱిఁగినట్లులేదు. ఇఁక భయములేదు. (ప్రకా) ఏమీ! నిన్ను నేను త్రిప్పించుకొంటినా? నీవు

కష్టపడి రాఁవలదని కూడఁ జెప్పియుండలేదా!

సుర — నీవు రమ్మనువాఁడవు నేనువచ్చుదాననా! గోలకొండ పాదుషా రమ్మనినను నేను 'పోపో' యను స్వభావముగలదానను, పీడాలు, దాబు, అంగి, నడుము కట్టు. మొలలోని కైజారు, నెత్తిటోపియుఁ జూచి నీవు మగవాఁడవనుకొని మాయమ్మ యాసపడి నన్నుఁ బంపుటచేత నిన్నిమాటలు నీయొద్దకు వచ్చితిని. నీరంగేదో తెలిసినది. మలపసన్న్యాసయ్యవు. మాప్రొద్దుల దేవతార్చనకుఁ దక్క నంతకంటెఁ బనికిరావు. ఇట్టి పడుచువారు ముసలి యాఁబోతులవలె భూభారమునకు మాత్రమే.

సర — ఛీ! ఛీ! మీరాణి కక్కులకు వచ్చినవాఁడు మగవాఁడు, కేనివాఁ డాఁడుది యునా! స్త్రీ పురుషభేదగ్రహణమున కిట్టిసూత్రమును గల్పించితివి! అట్టె వాగక పో.

సుర — పంచదారచిలుకను దినలేనివాఁడు మధుమేహరోగి యని యొప్పుకొందువా? పాలు త్రాగకుండునది మగపిల్లియనుట కేమైన సందేహమా? అప్సరసవంటి సౌందర్యముగల మారాణి తనయంతఁ దాను వాగ్ర నంపినపిమ్మట వెనుకాడిన నిర్భాగ్యుఁడు తురకల యంతఃపురములందుఁ బర్దాకాఁపుగా నుండఁదగినవాఁడు కాఁడా? సన్న్యాసులు సైతము మారాణిని దలఁచుకొని తహతహలాడఁగా గంగిరెద్దంత మగడును పైని సింగారించి విగ్రహపుష్టి తప్ప మరేదియులేక 'బసవన్నా! పాలుద్రాగరాదా?' యని నేననఁగఁ దల నడ్డముగ నూఁపినవాఁడవు నీవే మగవాఁడవైనయెడల నిఁక మేమెవరము?

సర — పట్టి మోటముండవు. నీతో మాటలాడినవానిది తప్పు పో పో.

సుర — నేను బోను.

సర — పోకపోయినయెడల నిన్ను వీధిలోనికి గెంటించెదను.

సుర — నిన్ను నడివీధిఁబెట్టి యల్లరిచేయనియెడల నేను దేవాంగికిఁ బుట్టినదానను గాను. నే నిందుల కొక్కతెనే రాలేదు. మారాణిని గూడఁ దీసికొని వచ్చితిని. అప్రక్కనున్నది.

సర — అయ్యయ్యో! అంతఃపురకాంతాశిరోమణి కింత శ్రమ మేల యిచ్చితివి!

సుర — శ్రమమిచ్చినది నీవా! నేనా! నీతిరస్కారము మూలముననే యామె వచ్చినప్పుడు శ్రమ నేనిచ్చియుందునా! నీకొరకే యామె వచ్చియున్నప్పుడు శ్రమ మిచ్చినవాఁడవు నీవుకావు కాఁబోలు నేమి!

సర — కాని అయ్యయ్యో! ఇప్పు డామె యేలరావలయును!

సుర — ఏందులకా! నీవామె నింతయలక్ష్యమేల చేయవలయునో కనుఁగొనుటకు. నీవామె నిప్పుడైన వరింతువో లేదో కనుఁగొనుటయు, ఒక్కటేమాట. నీవు మగవాఁడవైనయెడల నామెను వరించి త్వరలో వివాహము చేసికొనఁ బ్రయత్నింపుము. లేదేని నే నెంతపని చేయుటకైన సిద్ధముగా నున్నాను. నే నప్పు

రాలను. మొండిదానను. ప్రాణము విడుచుటచేఁ దెగించియున్నదానను. నేనే నీకంటె చక్కని మగవాఁడ నని, నీవాఁడుదాన నని యీరాత్రి జగన్నాథపుర దేవస్థానమున వేయిగాళ్ళ మంటపమందు శిలాశాసనము వేయింతును.

సర—(తనలో) వీరితో మంచిమాట చేసికొని తెల్లవాఱకుండ నెక్కడికైనఁ జాఱిపోయినఁ గాని మానప్రాణములు దక్కవు. నే వాఁడుదాన నని స్పష్టముగా నొప్పుకొనినయెడలఁ గళాలలితుని కలన నా కుపద్రవముగాదా? (ప్రకా) కురంగీ! ఏ మగవాఁడు నీయెదుటఁ బనికివచ్చును?

కురం—నన్నధిక్షేపించుచుంటివా! ఏ యాఁడుది నీయెదుటఁ బనికివచ్చినది? సౌందర్యముచే దిగ్విజయము చేయఁగల మారాణీమణియే నీయెదుటఁ బనికిరాలేదే.

సర—అట్టె తొందరపడకు. పనికిరాకపోవుటకుఁ గారణము లేకపోలేదు. కళాలలితుఁడు నాకుఁ బ్రాణమిత్రుఁడు. ఆతని చెల్లెలుగదా యని సందేహించుచున్నాను.

కురం—అయిన నేమి? ఆతఁడు మాకేమి పెట్టవలయునా? పోయ వలయునా? ఆతని యాస్థాన మాతనిది. మాయాస్థానము మాది. మాయమ్మకు వివాహాదులఁ గూర్చి సర్వస్వాతంత్ర్యమున్నది.

సర—కాని నిర్జనద్వీపమున మరణించుటకు సిద్ధమై యుండఁగా నాకంఠమున నీరుపోసి నాబ్రదుకు నిలుపఁబెట్టిన ప్రాణమిత్రుఁడుగదా యాపుణ్యాత్ముఁడు.

కురం—అటులైన ప్రాణమిత్రులు బావమఱఁదు లగుట మఱింత మంచిది కాదా! శత్రువే కాని చెల్లెలిని బెండ్లిచేసికోఁగూడ దని శాస్త్రమున్నదా యేమి? కాని మారాణియందు నీకు నిశ్చలమైన ప్రేమ మున్నది కదా?

సర—ఆమెకొఱకుఁ బరితపించుచున్న నన్నిట్లడుగుటే నాకు బాధయని యెఱుఁగవా?

కురం—ఇంతకుముందు 'కళాలలితా! ప్రాణకాంతా!' యని యామె కొఱకే కదా నీవు సంతపించితివి?

సర—(తనలో) అమ్మయ్యో! ఈమాటలుకూడ నీముండ వినినదా! (ప్రకా) అపరమాత్ముఁడే నాహృదయము నెఱుఁగును. నీతో నేమిచెప్పిన నీకు నమ్మకము?

కురం—నాకు నీయం దిప్పుడు నమ్మకము కలిగినది. నీవిప్పుడు మగవాఁడవై ప్రకాశించుచున్నావు. ఈయూర నిదివఱకే యాఁడు వా రక్కువగానున్నారని మాయమ్మ చెప్పినది. ఉన్న నల్వురు మగవారు కూడ నీవలెనే యప్రయోజకులై నప్పు డేస్థానుండి మగవారిని దిగుమతి చేయవలసినది? కాని మారాణి యచ్చట వేచియున్నది. ఆమె నిక్కడికిఁ బిలుతును.

సర—ఎంతయుపచారము వచ్చినది! నేనామె నెచట్కని యిటకుఁ దీసికొనివత్తును. ఏదీ! ఆమె యగపడదేమి? (గదివెలుపలి కిద్దఱు వత్తురు.)

కురం—అమ్మా! అమ్మా! అతలుపుచాటున నిలువఁబడినది కాఁబోలు. నేను దీసికొని వత్తును. (అట్లుచేయును. సిగ్గు నటించుచు రాణి యచ్చట నిలుచును.)

సర—కళాలలితా! నాయింటిలో నీకు స్వాగతమిచ్చుచున్నాను. నిన్నిటకు రప్పించు నంతటి మహాకఠినాత్ముఁడను క్షమింపుము. ఇట్లు దయచేసి యీపీఠమును నీ స్పర్శముచేఁ గృతార్థమునుగాఁ జేయుము.

కురం—అమ్మా! ఈతఁడు నీయెడల మహానురాగము కలవాఁడు. నీకై పరితపించు చున్నాఁడు. నీవాతనితో మాటలాడుము.

సర—నీదాసియగు కురంగి నాహృదయమును నీకు నీహృదయమును నాకును దెల్పినది. ప్రేమ వెల్లడియగువఱకే సిగ్గు. ఆ యవశిష్టము తీఱినది కావునఁ గొంచెము సిగ్గు విడిచి మోమెత్తిచూచి—(తనలో) ఆహా! మాటలకుఁ దడుముకొనుటయై పోవుచున్నదే! ఎంత గింజుకొనినను బ్రియుఁడు ప్రియురాలితో మాటలాడు మాటరత్తి రాదేమి! అయ్యయ్యో! నీరాబుద్ధిలో నీరా యున్నప్పుడుకదా కలము నకు నలుపు

కురం—(అప) ఇప్పుడింక నీవు బిఱ్ఱబిగియుదువా యేమి? ఆముందుకొందుకును జెడఁ దిట్టి యిక్కడ కీడ్చుకొనివచ్చునరికి నాతలప్రాణము తోఁకకు వచ్చినది. ఇప్పుడు నీకుఁ దెగపాఁకుడా! ఆఁడుదానికి సిగ్గిచ్చినంతయల కా బ్రహ్మగానిని మూతిమీఁదఁ గొట్టినయెడల మంచి సృష్టియై యింతకంటె బాగుగా నుండును. నాకు సిగ్గనఁగ నొడలుమంట. మగవాఁడు మనకంటె నెట్టుక్కువ? అతనికి సిగ్గులేకపోవుటయేమి? మనకుండుటయేమి! అయినను నీకిప్పుడు పని లేనిచో భర్తయొద్ద సిగ్గందులకు? మాయమ్మమ్మ సంతలోనికిఁ బోయి పైవారు చూచి పోవుదు రేమోయని కనులు మూసికొనెడి దఁట!

సర—కళాలలితా! ఇంతకాలము నాయనురాగమును గప్పిపుచ్చి నిన్నిటకు రప్పించుటచే నేను నీయెడల మహాపరాధ మొనర్చితిని. (తనలో) ఈవచ్చుమాట వెనుకఁ జెప్పినదే కాఁబోలు. పైమక్క తోఁపనిదే! లోపల గవంత వాయుచలన మున్నప్పుడుకదా నీళ్ళమీఁదఁ జిత్రచిత్రమైన బుద్బుదములు. లోపల నిమ్మకు నీరుపోసినట్లు నిండుగ నున్నది. అలుకులేదు. ఉలుకులేదు ఏదో మాటలాడక పోయిన యెడల మగతనమునకు లోపమని యేడ్చినయేడుపింతకంటె సొగసుగా నుండునా! (ప్రకా) కళాలలితా! నీవు క్షమించితివను సుధామధురాక్షరములను వినుటకు వేచియున్నాను.

కురం—(అప) ఈసారి నీవాతనితో మాటలాడని యెడల నేనైననుగానీ నిన్నుఁ గట్టగట్టి, కల్లురోటైనను గుక్కమీఁద విసరివైచినట్లాతనిమీఁద బాఱవైతును.

కళా—(అప) నీవు మొలకుముండవు. అంతపనిచేసినను జేయఁగలదానవు. నేనాతనితో మాటలాడుదును. అతనినిగాని నన్నుఁ గాని నీవు దుర్భాష లాడక యూర

కుండుము. (ప్రకా) గోవర్ధనా! క్షమింపుమని నన్నునీవు కోరుచున్నావు. క్షమింపఁబడుదానను గాని, క్షమించుదానను గాను.

సర—నీవలనఁ దప్పేమున్నది. ఎంతలోపమైన మాయందున్నది. (తనలో) పెండ్లికొడుకునకు మగతనపు లోపముకంటె నెక్కువ లోపముండునా? అక్కట! పేఁడికేనవ్వా డింక నక్కియేమి?

గీ. పైకిఁ దరవారి, కమ్మరు ♦ బంగరుఁ గలిగి
లోన సతినాట నాకెంత ♦ లోపమొకో- !
పరుమశబ్దాఘు బడబడా ♦ ర్భటిని గల్గి
భావబలశూన్యమైన కా ♦ వ్యంబు వోలె.

కళా—గోవర్ధనా! నీయం దేదియు లోపములేదు. మనుష్యుల యిష్టములు ప్రకృతి భేదములఁ బట్టి యుండును. నీపై నొకకాంత కిష్టముండవచ్చును. నీకా మెయందు లేకపోవచ్చును. అంతమాత్రమున కామెగుణము లేదు. నీలోపములేదు. నీకంటివైఖరి యది. అది నీలోపముకాదు. కాని యాకాంత నీచే నిరాకరింపబడినప్పటికిని నిన్నే ప్రేమించి యంతఃపురకాంతయయ్యును వంశమర్యాద విడిచి రాత్రిభాగమున నీయెదుటఁబడి మాటలాడుటయున్నదే. ఇది యాకాంతకు మహాలోపము. ఈతప్పును నీవు క్షమింపవలయును.

సర—(తనలో) కళాలలితా! నీవు నాకంటె సహస్రగుణము లెక్కువ బాగుగా మాటలాడుచున్నావు. పైపసకనువైన రసము నీలోనున్నది. మంచి మామిడిపండవు నీవు; అక్కచిలుకను నేను. అది యాలాగున నుండనిమ్ము. ఇంతమాత్రమునకే నీవిది లోపముగా నెంచునప్పుడు నామాట నేనేమి యనుకొనవలెనిపది! అవతలి మేడనుండి యీ మేడకు—అదియైన నీ మేడకే—వచ్చుటయే నీకు లోపమైనప్పుడు దేశాలకు దేశాలు, సముద్రాలకు సముద్రాలు దాఁటిన మందభాగ్యురాల నైన నామాటనేమి చెప్పుకొనవలయును? అర్ధరాత్రమున వచ్చినందుల కింత యిబ్బంది పడుచుంటివే! రేయింబగళ్ళు—ఒకటా—ఎన్నో! అట్లు యాత్ర చేసిన యీ యధమురాలి దోషమునకు హద్దుకలదా? వంశమర్యాద విడిచితి నని నీవింత బాధపడుచుంటివికదా! నేను విడిచిన దొక్క వంశమర్యాదయేనా? పురుషుఁడనై జాతిమర్యాదను గూడ విడిచితి నే. ఇఁక నాబ్రదుకునకు సార్థకతయేమైన నున్నదా? మొదట నీవంటి యాఁడుదిరయే యయి యాఁడురూపము చెడుటచే మగతనము రాకుంటచే నుభయభ్రంశము నొందిన ముగపేరంటాలితో గవంత మాటలాడినందులకే యింత వగచుచుంటివే! ప్రత్యక్షపురుషునితో నొక గంటన్నిందనే భాగవతమాడిన యీ అజ్ఞానాన్యరాలిమాట నేమి చెప్పెదవు! నీవు కోరినట్లు నేను నిన్ను క్షమింతును. నీకు మనశ్శాంతి యగును. క్షమింపుమని నే నెవనిని ప్రార్థింతును? ఈసంగతు లేమియు నామగనితోఁ జెప్పుకొనుటకు వీలులేదే. ఇఁక నెట్లు? కళాలలితా! నాలోపము తెలియఁగక పోవుటచే

గదా నీవు నన్నింతగా మన్నించుచున్నావు. ఒకనిహృదయ మొకని కప్రత్యక్ష ముగునట్లు బ్రహ్మచేయుటచే బ్రదుకులు దక్కుచున్నవి గాని యట్లే కానిచో నొకనిపై నొక్కఁడూసికొని, యొకని నొకఁడు తన్నుకొని నరులందఱొక్క పగటిలోఁ జచ్చుట కేమైన సందేహమా!

కురం—గోవర్ధనయ్యా! ఇంతసేపును గారముతిన్న బాలింతరాలివలె గ్రుక్కుమ్రింగుచు నూరకుంటి వేందుచేత? చదువుకొని శుంఠవలె మెమ్మె యనెదవేమి? కంచు గంట మ్రోఁగినట్లు కంగుమని మాటలాడవేమి?

సర—కళాలలితా! నీలోపముల నేను క్షమింపవచ్చును. నాలోపముల నీవు క్షమింప వచ్చును. నడుమ నోటికివచ్చినట్లెల్లఁ దిట్టుచున్న యీకురంగిని క్షమించుటెట్లు?

కళా—పరమవిశ్వాసవంతురాలు ప్రాణమిమ్మన్నను మాఱుమాటాడక యిచ్చును. నోటిదుడుకుఁదనము మాత్ర మెంతయైన నున్నది. దానిమాటలను నీవు నన్నుఁ బట్టి పరిగణింపవలదు.

కురం—మగవాఁ డాడంగియుండక నోరుకగుటకంటె యాఁడుది మగవాఁడగుట దేశము నకు మంచిది. పనికిమాలినసిగ్గును వదలివైచి యాఁడుది మగలక్షణములతో ఝూంకరించినప్పుడే ప్రపంచము సముద్రపుఁబోటువలె ముందునకు నడచును.

కళా—కురంగీ! ఆఁడుదానికి మగవానికిఁ గూడ సిగ్గుండవలసినదే. మగవాఁడనఁగ సిగ్గులేనివాఁడని నీయభిప్రాయము కాఁబోలు. ఆఁడుది సిగ్గువిడిచినయెడల మగవాఁడగునని యనుకొనుచున్నావు కాఁబోలు. పశువగును. గోవర్ధనా! నిన్ను బతిమాలుకొనుచున్నాను. దానిమాటలవలన నిబ్బందిపడవలదు!

సర—కాని కళాలలితా! నిన్ను బ్రాణకాంతాయని పిలుచుటకు నాకనుజ్ఞయిచ్చెదవా?

కళా—నన్నడుగకుండ నాయనుజ్ఞ నిదివఱకే తీసికొంటివని వినియుంటినే.

సర—అట్లైనసరే; ప్రాణకాంతా! కళాలలితా!

కళా—గోవర్ధనా యేల?

కురం—అదిగో గోవర్ధనాయని యందువేల? నిక్షేపములాగున ప్రాణనాథా! యని పిలువుము. ఇంతవట్టువఱకు వచ్చిన తరువాతఁ గూడ నింక గోవర్ధనాయేమి? అతనికి మాలిన సేరిఁక మానఁగూడదా! ఎవనితో చెప్పు డేమిపనివచ్చునో యని మా పెద్దమ్మ కనఁబడిన మగవారినందఱను బావగారూ యని పిలిచెడిదఁట.

కళా—ఎంతసేపు చెప్పినను ముసలిపెద్దమ్మల పిన్నమ్మల దిక్కుమాలిన మాటలేకదా.

కురం—ఇదిగో మతిమాలిన మీపడుచు చిన్నమ్మలమాటలకంటె ముసలివారైన బాగు గనే యుండును. క్రొత్తమగఁడు క్రొత్తపెండ్లాము పరిక్రొత్తగాఁ గలసికొని నప్పటి సంభాషణము కోమటి దుకాణపు సంభాషణలాగున నున్నది. మీ శృంగారాలాపకలాపములు సంగీతములాగే యుండునో, సత్యనారాయణప్రసా దములాగే యుండునోయని చెవులు నిక్కఁబెట్టుకొని నోరుతెఱచుకొని నిలుచఁ

బడితిని. నాటకాలలో నయికము మగఁడు పెండ్లము కలిసికొనునప్పు డీయమ్మ యాతనిమీఁదఁ గన్ను వేయుట—అతఁ డీమెమీఁదఁ జేయి వైచుట—యామె యటు తిరిగిలుట—యాతఁడు తత్తరించుట—ఈయమ్మ శ్రుతిలోఁ గలియకుండ నొక పద్యము చదువుట—అతఁడు తాళములేకుండఁ గొంతెత్తి పాడుట—విరహబాధచేత నీయయ్య కన్నులొత్తుకొనుట—ఆయమ్మ మెత్తఁబడుట—ఆయమ్మ చెక్కుపైఁ జేయి యడ్డము పెట్టుకొనుట—ఈయయ్య ముద్దునకై యూఱి పోడుగు సేయుట—మొదలైన వింతవింతచమత్కారములతోఁ గన్నుల వైకుంఠముగా నుండెడిదే. ఒక్కరాత్రిదంపతులయందే—ఇద్దఱు మగవారైన దంపతులయందే—యింత యుత్సాహముండఁగా బేఁడబొమ్మలవలె మీయందేమియుఁ గదలికయున్నట్లగపడదేమి?

సర—(తనలో) మేముకూడ నొక్కరాత్రిదంపతులమే.

కళా—కురంగీ! మాకీ కాంతసంభాషణమే తగియున్నది. ముచ్చటింగారమున కెంత తళుకైన నుండును. కల్లదంపతులకే యిన్ని గడబిడలైనను; దైవసన్నిధానమున సత్యబద్ధులై పవిత్రమైన గృహస్థాశ్రమమును స్వీకరించు వధూవరులకుఁ గులదేవతలయాశీర్వాద నినాదములు తప్ప వేఱేమియు నక్కఱలేదుకుమా!

సర—(తనలో) ఆహా! ఎంత బుద్ధిమంతురాలవు! రూపమునకుఁ దగినగుణము నీకున్నది. నీగొంతుకోయ నెంచిన పరమకిరాతురాలనైన నన్ను నీవెంతగా నమ్మియున్నావు! నీయాస యంతయు నీరాత్రితోడనే యంతమగును. నేను నీయెడల మహాపాతకమును జేయఁదలఁచియున్నాను. నాదుర్గతి యిట్లున్నది. నావలన నీదుర్గతి యట్లున్నది. నేను క్రమముగా నొక తప్పునుండి మఱియొకతప్పునకు లోయుటఁబడి కొట్టుకొనిపోవుచున్నాను. అందుచేతనే మొట్టమొదట నొప్పుకొనిన యెడల నాకింత దురవస్థ వచ్చియుండదేమో. అట్లొప్పుకొన్నయెడలఁ బుట్టి మునిఁగిపోవునని యిట్లు చేసినాను. ఇది యీవిధముగా మునిఁగినది మఱిలేదు. ఈయవస్థలో నీమెయెడల శృంగారచేష్టలగపడుటలేదని కురంగి నన్ను దెప్పి పొడుచుచున్నది. అది చెప్పినట్లు కళాలలిత మీఁదఁ జేయి వేయవలయును గాఁబోలు. ముద్దుపెట్టుకొనుట మాత్రము నావలనఁగాదు. ఏదో సమయమును జూచి చేయివైచెదను. చేసినదేమి చేయుచున్నదేమి? నీలాఘలము గనులు తెఱచినచోఁ జూడఁగలిగియుందువా? ఎంతబలాత్కార శృంగారప్రారబ్ధము తటస్థించినది. (ప్రకా) ప్రాణప్రియా! నీవు సముద్రప్రయాణ మెప్పుడైనఁ జేసితివా?

కురం—గోవర్ధనా! జడయల్లికగా మాటలాడకేమి! ఒకమాటకు రెండవమాటకు సంబంధముండనక్కఱలేదా? సముద్రప్రయాణపుమాట యిప్పుడెందులకు? గాగరాగుడ్డ గజమునకు వెల యెంతయో యడుగలేకపోయితివా? అంతకంటె సందర్భముగా నుండునేమో! ఒక మగవాఁడు తనకిష్టముకాని రెండవమగవానితో మాటలాడవలసివచ్చినప్పుడు పశువులసంతనుగూర్చి యొకమాట—

కొంతసేపటికిఁ బాపికొండలను గూర్చి యొకమాట—మఱికొంతసేపటికిఁ బండ్ల పొదినిగూర్చి యొకమాట నడిగిన నోరుమూసికొనినట్లు—నీవింత అంతులేనిమాట లాడెదవేమి? సముద్రప్రయాణమా? ఊఁ. కోడిగ్రుడ్లపులుసుకాదేమి?

కళా—నీగొంతుగోయ! పో! నీవావలికిఁ బో! మాలముండ!

సర—ప్రాణప్రియా! దానిస్వభావ మదియని యెఱుంగవు కాదా? ఏల దానిఁ దిట్టెదవు నిన్ను మాయూరకు దీసికొని పోవునప్పుడు నీవు నడిసంద్రమును జూచి బెదరుదువేమో యని యట్లడిగితిని.

పురం—సప్తపాదాలు కాలేదుగాని సముద్రప్రయాణమా! ఇఁకముందు పుట్టఁదలఁచిన పిల్లవాని కడుపుమీఁద గూడిపూలు వేయుటా మానుటా యని యడుగలేక పోయినావా?

సర—(తనలో) నీయిల్లువల్లకాఁడుగాను. నీమాటలకుఁ గోపముపోయి నవ్వువచ్చుచున్నదే! (ప్రకా) ప్రాణప్రియా!

గీ. ఈశ్వరకటాక్షమహిమచే ♦ నిట్లు మనకు
మనసు లొక్కటిగాఁ గూడఁ ♦ దనువు లింక
వేరుగా నుంటఁ బాపంపు ♦ విధముగానఁ
గంజదళనేత్ర! నిన్నిట్లు ♦ కౌఁగిలింతు.

(కౌఁగిలించును.)

కళా—(తనలో) హృదయమా! పరవశత్వమొందుము. రసనమా! మూఁగవైయుండుము. సిగ్గా! ఒక్కనిముసమడఁగియుండుము.

పురం—(తనలో) నాకన్ను లిప్పటికిఁ జల్లఁగానున్నవి. మాయమ్మకట్టి మగఁడు సిద్ధింపవలెనని నేను గాళికాదేవి కెన్ని మ్రొక్కులో మ్రొక్కుకొంటిని. ఱేపే పోయి యవియన్నియుఁ దీర్చుకొందును.

సర—(తనలో) ఈమెయొడలు పులకలచే నిసుకకాగిదమువలె నాయొడలికిఁ దగులుచున్నది. ఒడలు జలజలలాడుచున్న యదరుగూడ నామేనికిఁ దెలియుచున్నది. కాని నేను వట్టి శిలావిగ్రహమువలె నున్నాను. నాయొడలు రవంత వేఁడియైన నెక్కినట్లగపడదు. ఆమెయొడలిలో రాగసంబంధములగు విద్యుల్లతలు జుఱజుఱఁ బరుగువాఱి తళతళ మెఱయునట్లుంటయేమి? ఆమెయొడలి నంటియున్న నాయొడలిలో నిసుమంత యాలుకైన లేకుంట యేమి! నేనే యిట్టియవస్థ నీమెకుఁ గలిగించియుందునా? కాదు. నేను మగవాఁడనని యామె భావించుటయే యిందుకు గారణము. ఆహా! భావనాశక్తిమహిమమునకు హద్దున్నదా; భావనానందమే యానందము గాదా. దాని యనుభవము పూర్ణముగా నొక్కకవికే కలదు.

ఆ. వె. మల్లెపూవుఁ దూఱి మధుపంబులోఁ బాడి
గంధవాహులోడఁ ♦ గలసి వీచి
యబ్ధిలోన మునిఁగి ♦ యౌర్వవహ్నిని గ్రాఁగి
నీరుబుగ్గ యగుచు ♦ నింగి బ్రాఁకి
లోకచుక్కలోడ ♦ డీకొని శ్రమఁజెంది
సాంధ్యరాగనదిని ♦ స్నాన మాడి
తనువునిండ నింద్ర ♦ ధనుసు రంగులఁ బూసి
కైరవాప్తు సుధను ♦ గైపుచెంది
గోళగానరుతికి ♦ మేళవింపుగఁ బాడి
పాడి యాడియాడి ♦ పాడి సోలి
భావనా మహత్త్వ ♦ పటిమను బ్రహ్మమై
పోవు కవికిఁ గోటి ♦ మ్రొక్కు లిడుదు.

(పరి) కళాలలితా! ఈశాఁగిలి నింక విడువను.

ఆ. వె. విష్ణువునకుఁ బ్రతిగఁ ♦ బృథ్వీశుఁ డిల నుండు
బ్రహ్మప్రతిగ గాధి ♦ పట్టి గలఁడు
అవని నెవఁడు గలుగఁ ♦ డర్ధనారీశున
కతని ప్రతిగ నుండ ♦ మవని మనము.

కురం—ఇప్పుడు నీవు మగతనపుమాట నాడినావు. నేను దలయూఁపఁ దగినమాట యిది యొక్కటియే

పర—నా కింతకంటె గౌరవప్రతిక మఱి యేమున్నది?

కళా—ప్రాణనాథా! కళాలలితుఁడైన మఱియెవ్వఁడైన వచ్చునేమో మే మింటికిఁ బోవలయును. (వదలుచుకొనును.)

పర—(తనలో) ఈమె నాకంటె బలముగలది యగుటచే నిట్టివదల్చుకొనినది. అదిగాక మగతనపు డాబుకొర కింతగట్టిగఁ గౌఁగిలింప యత్నించినను గౌఁగిటికి దొరియ రానిదే నేనేమి చేయఁగలను?

కురం—ముందు చేయవలసిన పని వినుఁడు. తెల్లవాఱకుండ బయలుదేఱి మనము కాశీ పురమునకుఁ బోవలయును.

కళా—ఏల?

కురం—నీకు గోవర్ధనుఁడు మగఁడైన యెడల నాయందెలుకడియము లమ్మవారి కిచ్చెద నని మ్రొక్కుకుంటిని.

కళా—ఎంతబాగుగా జ్ఞప్తికిఁ దెచ్చితివి! ఇష్టమైన యెడల నాపెండ్లి కాళికాలయములో జరుగవచ్చునని మాతండ్రిగారి మరణశాసనములో నున్నది.

కురం—అటులైన గోవర్ధనా! అందరమును గలసిపోయిన మంచిదికాదా!

సర—కళాలలితుఁడు లేకుండఁ బెండ్లియగుట నాకిష్టము కాదు.

కళా—ఇప్పుడు కాళికకు మహోత్సవములు జరుగుచున్నవి. రేపో యెల్లుండియో కళాలలితుఁడు గూడ నక్కడికి వచ్చును. ప్రతిసంవత్సరము తిరునాళ్లకతఁడు తప్పక పోవును. ఇష్టమున్నయెడల మన మాతని నక్కడఁ గలిసికొనవచ్చును.

సర—(తనలో) నేను గూడఁ గాళీపురమునకే పోవుదును. ఎందుచేత? కళాలలితుఁ డక్కడకు వచ్చుటచేత-ఆమహాపట్టనములో నన్ను వీరు తిరిగి చూచుటయెట్లు? నేను స్త్రీవేషమునఁ గళాలలితునిఁ గాంచి యాతనిని బెండ్లిచేసికొందును. గోవర్ధనుఁ డెవఁడో, యెవరితోఁ బోయెనో యేమైపోయెనో యెవ్వరికక్కర లేదు. కళాలలితునితోఁ జెప్పకుండఁ బోవుదును.

(నేపథ్యమున)

కళాలలితుఁడుగారు మీకు వద్దనక్కెర మంపినారు.

కళా—మేమీదారిని బోవుదుము. దయయుంపుము.

(కళా లలిత; కురంగియుఁ బోవుదురు.

సర—(తనలో) ఇఁక మీదారి మీది, నాదారి నాది. (ప్రకా) తలుపుతీయుచున్నాను. సేవకా! (అట్లుచేసి) నీవు లోనికివచ్చి యాగదిలో నుంపుము. నేనును లోనికి వచ్చుచున్నాను. (తనలో) అబ్బ! తలనొప్పి వచ్చినది. ఈయుతుకులమారి నాటకములో నిఁకఁ బురుషవేషము మాత్రము ప్రాణముమీఁదికి వచ్చినప్పుడు తప్పవేయఁగూడదు. బుద్ధివచ్చినది. ఇఁక నిక్కడనుండి పాఱిపోవలయును. తరువాత జరుగఁదగిన దేది? గోవర్ధనునకుఁ గళాలలితకుఁ బెండ్లియా! ఈచెవి కి చెవికి లంక వేయవలసియున్నది. (నిష్క్రమించును.)

ఇది చతుర్థాంకము.

శ్రీరామ

సరస్వతి

పంచమాంకము

ప్రదేశము—కాళీపురమునఁ గాళికాలయవీథి నొక్కసత్రము.

ప్రవేశము—గోవర్ధనుఁడు.

గో—ఈ కాళికాపురమున నకార్యకరణము లెన్నియైన నున్నవి. అందులోను మహోత్సవములగుటచేఁ జెప్పవలసిన దేమున్నది!

గీ. కల్లు ద్రాగుట ధర్మంబు ♦ కాదుగాని
కాళికకుఁ జేయిత్రిప్పి ♦ త్రాగంగఁ దగును
ప్రాణిహింసను జేయఁ బా ♦ పంబెకాని
యమ్మచెలువకై యదియుఁ జే ♦ యంగఁ దగును.

గీ. ఎట్టి దురితౌఘమైన నీ ♦ పొట్టకొఱకు
మతముపేరిట జరిగిన ♦ మంచిదగును
నెట్టి ఘోరాఘమైన నీ ♦ మట్టికొఱకు
రణముపేరిట జరుగ శౌ ♦ ర్యంబు సుమ్మ.

గీ. రమ్మ వగకాఁడ! లోనికి రమ్మటంచు
నాకు నీపైని వలపంచు ♦ నమ్మమంచుఁ
గంటపడిన సంపన్నుల ♦ నింటి కీడ్చి
ధనము దోఁచుకొందురు దుష్ట ♦ వనిత లిచట.

నా సేవకుఁడు భ్రమరుఁ డింక రాకుంటచే నేనిట నొక్కఁడనె యుండవలసి వచ్చినది. మధురికను బెండ్లిచేసికొని సుఖపడుచు నాతఁ డాలసించియుండు నేమో!

(నేపథ్యమున) గోవర్ధనప్రభూ! గోవర్ధనప్రభూ

గో—అదిగో! మాటలోనే వచ్చినాఁడు. నేను బసచేసినసత్రమిదియే. అతఁ డెట్లు కనుగొని వచ్చినాఁడో! బసలోనికిఁ బోవుదును. (పరిక్రమించును.)

(తెర యెత్తఁగ సత్రములో నొకగదియు వసారాయుఁ గనఁబడును.)

సీవకా! భ్రమరా! ఏమీ! ఎవ్వఁడును మాటలాడఁడేమి! అదిగో యెవ్వరో వచ్చుచున్నారు. (కురంగి ప్రవేశించును.)

కురం—గోవర్ధనప్రభూ! నమస్కారము.

గో—వచ్చితివా! మధురికా! పుత్త్రవతివికమ్ము. చూడు మధురికా! భర్తృసుఖమయి దాఱు సంవత్సరము లవ్యాహతముగా ననుభవించి, యిఁకఁ బుత్త్రుఁడు గలిగిన బాగుగా నుండునని మనస్సునకుఁ దోఁచినతరువాత దైవకటాక్షమునఁ బుత్త్రుని గనుము. కాని నీభర్త యేఁడీ!

కురం—(తనలో) ఈతఁడు నన్ను మధురికాయని పిలుచుచున్నాఁడేమి! బ్రహ్మచారి ముండను నాకుఁ బరిణయ మైనదనుచున్నాఁడేమి! పరముఁడైన లేకుండ సంతాన మెట్లు! (ప్రకాశముగా) అయ్యా! పరధ్యానమున నుంటివేమో! నావంక నిశ్చలముగాఁ జూడుము. నేను మధురికనా?

గో—కావా! అటులైన క్షమింపుము. నాసేవకుఁడాతనిభార్య మధురికతో నిచ్చటికి రావలసియున్నది. వారికొరకు నేను నిరీక్షించుచుంటిని. ఆమధురికనైన నే నొక్కనిముసము మాత్రమే చూచియుంటిని. అందుచే నదియే నీవేమో యని యట్లంటిని. కాని నన్ను గోవర్ధనా యని పిలిచినవా రెవ్వరు?

కురం—నేనే.

గో—ఆఁ! నీవు నన్నెట్లెఱుఁగుదువు?

కురం—నాతోఁ బరిహాస మేల? ఆవలిగదిలో బసచేసిన మాయమ్మ నీకొరకుఁ బరితపించుచున్నది. నడు.

గో—నిన్ను జూచుటతోడనే గాలుసేతులు చల్లఁబడిన నాకు మీయమ్మతో సరసమా? నీ కమ్మమ్మ లేదేమి?

కురం—నానోరు మంచిది కాదని యెఱుఁగుదువు. నీ కిదివరకే తిట్లు చాల నైనవి. నాకు నీపరిహాసములు పనికిరావు. బిగిసినన్నినాళ్ళు బిగువనే బిగిసినావు. ఇంక నీమగతనపు బింకములు కట్టిపెట్టి చెప్పినమాట విని యటుపోయి యామెను లాలింపుము.

గో—నేను నీతోఁ బరిహాసము లాడునంతటి నిర్భాగ్యుఁడను గాను. నీవు నన్నుఁ జూచి మఱియొకఁడని భ్రమించుచున్నావు. నిశ్చయము; కావున నన్ను విడిచి పొమ్ము.

కురం—నిన్ను విడిచి నేను బోవుదునా? నిన్ను విడిచి మేమిటకు ముందు వచ్చినందు లకే కాదా నీవు నన్నిట్టు లాడించుచున్నావు? నీవు మాతోడనే బయలు దేఱుదు నని చెప్పి రాలేదేమి? నీవు వత్తువో రావో యని దారిపొడుగునను మాకళాలలిత పలవించి పరితపించెను గదా! ఇంత దాక్షిణ్యము లేదేమి?

గో—ఎవరు? మీయమ్మ కళాలలితయా? కళాకలితయా? ఏమివిచిత్రమైన నామము!

కురం—ఎంత యెఱుఁగనట్లు మాటలాడుచున్నావు! నాకుఁ దలతిక్క యెత్తుచున్నది

ఇఁక జాలు! ఓ! గొప్పమగవాఁడవు బయలు దేఱితావు! నీజాణతనము, నీ పెంకి తనము, నీతలబిఱుసుఁదనము మాయొద్దనే యగపడుచుండు గాఁబోలుసేమి! ఈ తెగనీలుగులు, నీగర్వాలాపములు మారాణి తనంతఁ దాను నిన్ను వరించి నీకిట్టె స్వాధీన యయినందులకే కదా!

గో—(తనలో) హా! ఇదేమి? ఇదివరకు వారనారీవీథిమర్యాద యనుకొంటిని. అయ్యయ్యో! రాణియనుచున్నదే! క్షత్రియవంశమర్యాద కేమియు భంగము రాలేదు కద! ఈముండ నన్నెన్ని దుర్భాషలాడినను వీలగునంతవరకు ఓర్చి పెట్టక, యీసంగతి యేదో కనుఁగొనవలయును. ఏరాజపుత్త్రిక నేడుచ్చుఁడు మోసగించెనో—గుండెలు దడదడలాడుచున్నవి. (ప్రకాశముగా) ఇదివఱ కమ్మ యనఁగ నిన్నుఁ గన్నతల్లి యనుకొంటిని. అబ్బో! రాణియే—రాణి యని పెద్దమాట లాడుచున్నావే?

కురం—పై దేశమునుండి వచ్చిన బంటిరాజవో, బురదరాజవో యగు నిన్ను మారాణి కేవల పరిశుద్ధానురాగముచేఁ గోరినందుల కామె రాజ్ఞీత్వమునే పరిహసించుచున్నావేమి! రాణిరాణి యని పెద్ద పేరా? నీబ్రదుకున కామె యభిజాత్యమునే యనుమానించుచున్నావేమి! ఏమివిశ్వాసవంతుఁడవు! ఏమికాంతాగౌరవము కలవాఁడవు! ఏమినరుఁడవు! పరిహాసమున కొక్కటిరెండుమాట లాడవచ్చును. అంతేకాని తెగువలు కొక్కటేలాగుటా? ఫుండగువలు కొక్కటే గోఁకుటా! మూతి ముడుచుకొని యింటిలోఁ గూరుచుండుటచేత బిడియము గలవాఁడ వనుకొంటిని. మెత్తనివాఁడ వనుకొంటిని. ఇంత మాటపాకమా? ఇంత మొండివేసమా? ఛీ! ఇఁక ఛీ! గ్రుడ్లగూబవలె నట్లు చూచెదవేల? ఛీ! నోరు మూసికొని యటుపోయి యామె పాదములపైఁ బడుము. ఛీ—అదిగో—లెమ్మని చెప్పఁగ లేవఁడు? లేవక పోయినయెడల మూతిమీఁదఁ బొడిచెదను. నీమాత్రము గడుసుఁదనము—కఱ్ఱపడితనము—కఱకుఁదనము నాయొద్ద నున్నవి. పదపద నిన్నిట్టె తిట్టవలదని మారాణి నానోరు నొక్కుటచే నట్లింక సందేహించుచున్నాను.

గో—నీసందేహ మెచ్చటనో నాకుఁ గనఁబడలేదు. తవమెత్తిన చాకలిదానివలె గంతులు వైచుచున్నావు.

కురం—ఆలాగేమి? అలాగేమి? వేఁపమండలు పుచ్చుకొని నీవీఁపు తట్టులు దేఱఁ గొట్టునప్పుడు కనఁబడును గురంగితమాషా.

గో—కొట్టుదువుకానిలే- నీపేరు కురంగియా? గొంతులు గోయుకు గయ్యాళికిఁ గురంగి యని పేరా? సివంగి యని నిన్నుఁ బిలిచినఁ గొంతవఱకు సరిపోవునేమో!

కురం—అఁఅఁ! ఏమి! నాపేరు కురంగియా యనికూడ ననుచున్నావా? చుక్కలలో నుండి యిప్పుడే యూడిపడితివి కాఁబోలు. మాయమ్మ పెత్తపెద్దమ్మ తగని మమకారముచేత నీయొద్దకుఁ బదేపదే పంపఁగఁ గాకు అలిగిపోయెనే! నీచుట్టుచుట్టు

తిరుగలేక కన్నులు తిరిగిపోయినవి! నాకక్కఱలేదని మాలమాఱుదాఁగి మూడుచుకొనిన నిన్ను ముందునకీడ్చి నిలువఁబెట్టిమారాణితో మాటలాడించితినే. బంగారుబొమ్మను నీబాహువుల కందిచ్చితినే, వెన్నయప్పమును నీమూతికిఁ గట్టితినే- ఊ-ఊ-నేను నీకుఁజేసిన మహోపకారమునకు నాకాళులు కడిగి—

గో—ఛీ! ఛీ! నోరు మూయుము.

కురం—నీ ఛీఛీలకు బెదరువా రిక్కడ నెవ్వరులేరు. కృతఘ్నుఁడా! నాపేరే మఱచి పోయితివా! కురంగియా నీపేరు! అబ్బా! గంజాయియుండ జేసికొంటివాయేమి!

గో—మాటలు తిన్నఁగరానీ! దౌడపండ్లు విఱుగఁ గొట్టెదను-పో! అవలికిఁబో!

కురం—నేనుబోను-మమ్మిక్కడకు మోసముచేఁ దెచ్చియిట్లు మాగొంతుగోసెదవా! నిన్ను-నిన్నుఁ—గాళికాదేవికి బలినిచ్చిన నైనఁ బాపమున్నదా!

గో—నీవు పోయెదవా! గుడిమీఁదనుండి కాలిబంతి యెగిరిపడునట్లు తన్ననా!

కురం—సరే నీవు నన్నుఁ దన్నుదువో నేను నిన్నుఁ ద్రొక్కుదునో మన బలాబలములు చూచు కొనవచ్చును. మారాణిమాట నేమి చెప్పితివి!

గో—మీరాణిని నెఱుఁగను.

కురం—(గుండెలుకొట్టుకొని) అమ్మ. అమ్మ. అమ్మ. నిజముగా నీవెఱుఁగవా! నీ ప్రమాణపూర్వకముగా నెఱుఁగవా! కాళికమ్మ గుడిలో దీపమార్పి చెప్పఁగలవా! అయ్యయ్యో కట్టినయింటిక్రిందనున్నావు. నా మొగమువంకఁజూడు. ఎఱుఁగవా ఎఱుఁగవా!

గో—ఎఱుఁగను. ఎఱుఁగను.

కురం—సరే నడు. ఈమాటలు మారాణితోడనే చెప్పుము. లే.

గో—నేను మీరాణియొద్దకు రానక్కరలేదు.

కురం—(ఏడ్చుచు) అక్కరయేలేదా! గుండెలలోఁ బోటువలె నాకిప్పుడు జ్ఞప్తికి వచ్చినది. నీవు మగవాఁడవు కావు. అక్కరలేదని మొట్టమొదటినుండియు దేవులాడుచునేయున్నావు. కాని మారాణి కదేమి వెఱ్ఱియో పిశాచముకంటెఁ గట్టిగఁ బట్టినదమ్మా! మొదట నాకు నీమగతనమును గూర్చి సందేహము కలుగనేలేదు. కాని తరువాతఁ గలిగినదమ్మా! నీశృంగార సంభాషణలోనైన నెక్కడ మగవాసనయే కొట్టలేదమ్మా! ఉప్పులేని కూరలాగున నున్నదేమిరా భగవంతుఁడాయని యేడువనే యేడ్చినానమ్మా! మాకొంపతీయుటకు నీవెక్కడ దాపురించితివి. అప్పుడే యీ మొండిచేయి చూపలేకపోయినావా! ఒక్కయేడు పేడ్చి యూరకుందుము. ఇల్లుకదలి యింత యల్లరిఁబడకుండ నుందుము. నీ పై బండారము మండిపోను. నీమగపోడుములు మాసిపోను. నీపెత్తికట్టునేలఁబడను. అమ్మా! అమ్మా! కళావతమ్మా! ఇటురావమ్మా! కొంప మునిఁగినదమ్మా! గొంతుకోసినదమ్మా! (ఏడ్చును)

గో—(తనలో) అన్నిటిట్లు తిని యాఁడుదాన నను బిరుదమార్జించుకొంటిని.

(కళావతి మేలిముసుఁగునఁ బ్రవేశించును.)

కళా—కురంగీ! ఏమి యీయల్లరి.

కురం—అదద్దయ్యాకు మగతనములేదు. నీకు మగఁడులేఁడు. నా కన్నవారి దిక్కులేదు. ఇఁక నేమియులేదు. ప్రపంచమంతయు నొక్కటే సున్నపడినదమ్మా! మాతల్లీ! (ఏడ్చును.)

కళా—(మేలిముసుఁగు రపంతతొలఁగించి చూచి) ఆహా! ప్రాణనాథా వచ్చితివా! నమస్కారము. నమస్కారము. నమస్కారము. నీవింకరాలే చెందువలనని యనియు, వత్తువో రావో యనియు, నేను బొందిన తహతహ హరహరా! భగవానికైన వలదు. నా కన్నులలో నిప్పుడు చంద్రోదయమైనది.

గో—(నిల్వుగ్రుడ్లు వైచుకొని స్తంభించి యూరకుండును.)

కళా—నాథా! నాథా! అట్లు నిల్వుగ్రుడ్లువైచుకొని చూచెదవేల! ఏమి! ఏమి! మేలిముసుఁగుచాటున నీవు నన్ను గుర్తింపలేకుంటివా? ప్రాణకాంతా! నీయెదుట నాకు మేలిముసుఁ గెందులకు? (తీసి) మాటలాడవేల? మాటలాడవేల?

గో—(కన్నులు మూసికొని కొంతతాలిమిపడి) మాటలాడెదను. మాటలాడెదను. కాని యీదాని నిక్కడ నుండకుండఁ బొమ్మని చెప్పుము.

కళా—(అప) కురంగీ! నీవాతని నేమైన దుర్భాష లాడలేదుకదా!

కురం—అతఁడు వట్టి కొయ్యబొమ్మ. ఎందులకాతల్లి? సువారములోఁ గుండలు కడుగుటకా! నీకుఁ దలఁగడిగి నీళ్ళుపోయుటకా?

కళా—(అప) వెర్రిమాటలాడక పో—ఇంటియొద్ద భద్రముగా నుండుము.

కురం—నీకే తెలియునులే. (కురంగి నిష్క్రమించును.)

గో—(తనలో)

గీ. వేయిమహాతాబు లొక్కట ♦ వెలిఁగిపోయె
వెలుఁగులో లక్షరుద్రవీ ♦ ణలు ధ్వనించెఁ
బాటలోఁ గోటిపద్మముల్ ♦ పరిమళించె
మనసు గప్పున వానిలో ♦ మాయమయ్యె.

హా! ఇప్పటికిఁ గొంత కుదుటఁబడితిని కాఁబోలు. కన్ను, ముక్కు, చెవి, త్వక్కు కలియఁగలిసి యొక్కటైపోయి యేమో యయినట్లయ్యెను. ఇట్టి వింతయనుభవమాత్రము చే చెన్నఁ డెఱుఁగను. ఒక్క చెప్పపాటుమాత్ర మట్టి స్థితియున్నదికాఁబోలు! అదియే స్థిరముగా నుండినయెడల నంతకంటె మహాపదవి యుండదు. ఇప్పు డా వెలుఁగులోనుండి బయలువెడలి యాకాంత కంటికి స్పష్టముగాఁ గనఁబడుచున్నది. అహా! కాంతిహీనదేవతయై యుండుగా? భూర

హారా! ఎంత దుర్మార్గుఁడనో! పరస్త్రీ కాఁబోలు! కాఁబోలు నేమి! దాని వాక్యములవలన స్పష్టమేయయ్యెనే!

కళా—ప్రాణనాథా! నాదాని కఠినోక్తు లాడినయెడల క్షమింపుము. దానిస్వభావ మది. మనకు మంచిదే కాని నోరు మాత్రమంచిది కాదు. ఇఁక దానిని నీయెదుటఁ బడనీయను. క్షమింపుము. కోపమును విడువుము. ప్రసన్నుఁడవు కమ్ము. ఆ తెలివితక్కువ దానిని నేను మందలింతును. నాథా! నీవిక్కడఁ గూరుచుండనేల?

గో—ఈసత్రములోనే నాబస.

కళా—ఇంతసత్రములో నెక్కడ? అదిగో మూగది. దానికి సమీపముననేకదా?

గో—ఆఁ! కొంచెము సమీపముననే.

కళా—ప్రాణనాథా! నీవు మాకంటె ముందే వచ్చితివా?

గో—(తనలో) మాటమాటకుఁ బ్రాణనాథా యని సంబోధించు నీమెను బరస్త్రీయని యెట్లనుకొనను! ఆమెకు నేను భర్తను, నాకామె పరస్త్రీయా! నేను భర్తనని యెంతమాత్రము లేకుండ నన్నుఁ బ్రాణనాథా యని పిలుచునా! వలచిన మనుజునిగూర్చియే పొరపాటుండునా! గ్రద్దకన్నకంటె- బాకుమొనకంటె- రవికిరణముకంటె- రాగవతికన్న తీక్ష్ణమగునప్పుడిట్టిప్రమాద మేలకలిగియుండును? ఒకవేళ నిట్లు జరిగియుండునేమో! పట్టి పైమఱుపుస్థితిలోనే గదా యీమెను నేను జూచితిని. అట్టి మఱియొక్క పైమఱుపుస్థితిలోఁ జూచి పరాకుపడితినేమో! హా! యెంతమాట! (ప్రకా) నేను వచ్చుసరికి వీరున్న గదిలో నెవ్వరును లేరు. అందుచే నేనే ముందు వచ్చియుండుననుకొందును.

కళా—ప్రాణప్రియా! నాపై నీకనిష్టతలేదుకదా!

గో—ప్రపంచమును దుచ్ఛముగాభావించి ప్రాణము పోఁగొట్టుకొనువానికైన నీపై ననిష్టత యుండఁదగదు. నామాట కేల యడుగనేల?

కళా—ప్రాణకాంతా! పోనిమ్ము. కోపములేకపోయినయెడల నంతేచాలును. కాని కోపములేనివాఁడవైనయెడలఁ దలవంచుకొనియే మాటలాడుదువేమి?

గో—(తనలో) అయ్యయ్యో! ఏమిప్రత్యుత్తరమీయఁగలను? అంతఃపురకాంత! రాజపుత్త్రిక! మేలిముసుఁగైనలేకుండ నాయెదుటఁబడి గాఢానురాగమునఁ బ్రాణప్రియా యని పిలుచుచుండుటయేకాక నీకనిష్టతలేకున్న నాకంతేచాలునని యానందమొందుచున్న యీకాంతాశిరోమణి మనసు నొప్పించుటకంటె మహాపాతక ముండునా? నేను నీకు భర్తనుగానన్నచో డిల్లపడి కొయ్యయై మృతినొందునేమో! అఁదుదానికి రాగవిషయకమగు నాశాభంగముకంటెఁ బాషాణ ప్రయోగము మఱేమియున్నది?

కళా—ప్రాణకాంతా! మాటాడవేమి?

గో—(తనలో) అయ్యయ్యో! ఆలోచించుకొననీయకుండఁ దొందరపెట్టుచున్నదే! ఆమె మనస్సెంత కొట్టుకొనుచున్నదో! ఏమి తహతహపడుచున్నదో! (ప్రకా) తలవంచుకొనియే మాటలాడెదవేల యని యడిగితివి. నా కట్లుమాటలాడుటయే యలవాటు.

కళా—ఔనుసుమా నిజమే. మొదట నేను నీతో మాటలాడినప్పుడుకూడఁ దలవంచుకొనియే మాటలాడితివి. కాని యెప్పుడు నదియే సిగ్గా!

గో—ఎంతసిగ్గుగలవానికైనఁ బరిచయము వృద్ధియైనకొలఁది సిగ్గు తగ్గిపోదా.

కళా—ప్రాణవల్లభా! నీకుఁ బెండ్లియగువరకీసిగ్గు బాధించుచునే యుండును. కావున శుభముహూర్తమున వేగముగాఁ బెండ్లి యవశిష్టము తీర్చుకొనిన మంచిదికాదా!

గో—(తనలో) ఈమె యిప్పటివరకుఁ బరిశుద్ధకన్యాత్వమును వదలినట్టులేదు. అందువలనఁ బరస్త్రీకాదు. కొంత ప్రతీతిసేమో! తలవంచుకొని మాటలాడునట్టి లజ్జావంతునిఁ—దరుణులఁజూచి వెనుకడుగువేయు భయస్వభావుని—నెవ్వనినో యీమె యొక్కసారి చూచి ప్రేమించి మాటలాడియుండును. ఆనిర్భాగ్యుఁ డందుల కర్హతలేనివాఁడగుటచే లంగాబెంగపెట్టుకొని యదియేపోకగా నంతరించియుండును. మగవాఁడగువాఁ డీమెను వదలి పోఁగలఁడా? ముక్కున్నచిలుక దొండపండు కొఱుకలేక బెదరి డొంకలోఁ దూఱునా? అదిగాక అతఁడాషంగివాఁడని మొదటినుండియు ననుమానించితినని కురంగి తన రోదనరాగములో నొక్క పెద్దసంగతి విసరియే వెళ్ళినది. ఆరవికబెదరు రసికశిఖామణి యదృష్టవశమున నాలాగున నుంటచే నీ రాగవల్లి నామెడకుఁ జుట్టికొనినది. కావున నీవిచిత్ర శృంగారనాటకమున నేనుఁగూడ బూడిదఁ బూసికొని కొంత వేషికొని నిలువఁబడితిని. ప్రధానుఁ డెవఁడో కొంత మాటలకథ వినిపించి గొంతులేనివాఁడగుటచే పైపాటకుఁ బనికిరాక తిరిగిరాకుండ నిష్క్రమింపఁగా వాని బదులుగా వచ్చిన తాత్కాలిక ద్వితీయపక్ష శైలూషుఁడను. వెనుక జరిగిన కథయేదో తెలియదు. ముందప్పుఁ జెప్పవలసిన పాఠ మంతకంటెఁ దెలియదు. ఈపాత్రము ప్రాణనాథాయని పిలుచుచుఁ దలవంచుకొనియైన నుండనీయదు. రవంత యూరకయైన నుండనీయదు. క్రొత్తవాఁడను. గ్రంథమెఱుఁగనివాఁడను. తలవంచుకొనక యూరకుండక యింతట నేమిసేయఁగలను?

కళా—అదేమి ప్రాణనాథా! మాటలాడకున్నావు. పెండ్లిమాట చెప్పసరికి మఱేయింత సిగ్గుపడుచున్నావు? అబ్బే! (భుజముమీఁద చేయివైచును.)

గో—(తనలో) ఆహా! ఆహాహా!

ఆ. వె. అట్టెమీట లాగ ♦ యంత్రపు వీవన
వేగతిరిగి గాలి ♦ విసరు పగిదిఁ

తెలుప బుజము నంటఁ ♦ జిత్తము గిలిగిలిఁ
దిరిగి యూర్పుగాలి ♦ పెరుగఁజేసె.

అహా!

గీ. బహుకృతు లొనర్చి యర్పింపఁ ♦ బ్రభుఁడు కవికి
నగ్రహారాళి యొసఁగిన ♦ యంతకంటెఁ
దనకు సేవలొనర్చు శి ♦ ష్యునకు గురుఁడు
కృపను వేదాంత విజ్ఞాన ♦ మిచ్చుకంటె
నిష్టదేవత సాక్షాత్క ♦ రించి తపసి
కీప్సితవరంబు లన్నియు ♦ నిచ్చుకంటె
నడుగకయె కాంత కాంతుని ♦ యంసమునను
గరముఁ జేర్చుటె యానంద ♦ కరము కరము.

ఈ యెడమభుజముమీఁద నీమె కర మెంతదివ్యముగ శోభిల్లుచున్నది! ఏరాజశిరముపై. గిరీట మిట్లు ప్రకాశించినది? ఈమెతో నిదివరకే రవంత టక్కుటిక్కున మాటలాడితిని. ఇప్పుడదియుఁ గూడఁ జెడినది. ఇప్పుడేమందును? (ప్రకా) కాంతాశిరోమణీ! నీదయకు మహానంద మొందితిని.

కళా—ప్రాణప్రియా! ఇంతసేపాలోచించి తుద కెంతమాటఁ జెప్పితివి!

గో—(తనలో) సిగ్గువలన నేను వదులుగానైనను దన్నుఁ గౌఁగిలింప లేదని యిట్లు విలవిలలాడి పోవుచున్నది. నేను గౌఁగిలింప లేకపోయితినని యంతకంటెఁ గొట్టుకొనుచున్నాను. ఏమి వినియోగము?

ఏను గౌఁగిలింపక యున్న ♦ నేమి లెమ్ము?
చేయిమాత్ర మచ్చటినుండి ♦ తీయవలదు.
సత్ప్రభుని జిహ్వపైనిల్చు ♦ సత్యమట్లు
నిశ్చలంబుగ నచటనే ♦ నిలువనిమ్ము.

అయ్యయ్యో! రాగతరంగములఁ గొట్టుకొని యూఁపిరి సలుపకుండ నున్నాను. హుఁ! పోనీ! నాకీగొడవ యెందులకు? ఛీ—తప్పించుకొని పోదునా? ఆమె తలఁపు గ్రైకొనకుండ మోటతనమునఁ బోవుట మహాప్రమాదముకాదా!

కళా—(నవ్వుచు) మనోవల్లభా! నీవింత సిగ్గుకలవాఁడవగుటచేతనే కురంగి మొదటినుండియు నీ వాడంగివాఁడవని యధిక్షేపించినది సుమా!

గో—(తనలో) అబ్బ! మంచి వంక స్ఫురింపఁజేసినది. నేనాడంగివాఁడనని యొప్పుకొందును. ఇప్పుడు నేఁ జేయుచున్నదని యాడంగితనము కాక యంతకంటె

నీ ప్రయోజకత్వమున్నది? తెలివియుండియుఁ బనిచేయని యవస్థలో నది తెలివి తక్కువకంటె భిన్నమా? భాగ్యముండియు నక్కఱకురానప్పు డది భాగ్యహీనత కాదా? ఉన్నందుకుఁ బనియే నిదర్శనము. కాని మతిలేనికళాధ— ఇప్పటికిఁ దప్పించుకొనుట కల్లాడిన యొడల ముందటి యాశకూడఁ బూర్ణానుస్వార మగునేమో? ఏటికెత్తి! ఈమె యిటు నన్నుఁ బట్టుకొనునని కలఁగని యిటకు వచ్చితినా? ముందీమెతోఁ గలయిక నా ప్రయత్నమునుబట్టి జరుగునా? ఏది యెట్లు జరుగవలయునో యట్లు జరుగును. (ప్రకాశముగా) నేనాడంగివని కురంగి మొదటినుండి చెప్పుచున్నమాటలు సత్యములేల కాకూడదు? అది యదార్థవాదిని యనియే నమ్మవలయును.

కళా—అగుఁగాక! అట్లే యయినను బ్రమాదమేమి? నీవే నాభర్తవు. నామనస్సు నీయందు లగ్నమైనది. మనస్సునకు స్త్రీపురుష భేద మేమున్నది? నిన్నుఁ గాదని మహేంద్రుడైన నేను వరింతునా?

గో—(తనలో) సెబాస్! సెబాస్!

గీ. యక్షులార! కిన్నరులార! ♦ యమరులార!
అజమహాసృష్టి నెచ్చట ♦ నైనఁ గాని
యిట్టికాంతను గంటిరే ♦ యింకఁ బుష్ప
వృష్టిగురియక మీ రుపే ♦ క్షింతురేల?
నీతి-నిశ్చలంపు ♦ నీతి-యాలోకత్ర
యంబునందు నెచట ♦ నైన నున్న
నద్ది యాఁడుదాని ♦ యంతఃకరణమందుఁ
గన్ను లున్నవారు ♦ కానవచ్చు.
పూతత నొసంగునో వంశ ♦ పురుషులార!
తనువు నిచ్చిన యో తలి ♦ దండ్రులార!
ప్రజ్ఞనిచ్చిన యాచార్య ♦ వర్యులార!
ఈమెను గ్రహింతు సెలవంద ♦ జీయరయ్య.

(కౌఁగిలించును.)

కళా—(తనలో) హృదయమా! ఆనంద మాశాభంగమువలెనే నిన్ను బాధించుచున్నదా! శాంతి నొందుము. (ప్రకా) ప్రాణనాథా! నన్నొక్కసారియైనఁ బ్రాణప్రియా! యని పిలువవేదేమి?

గో—ప్రాణప్రియా యని పదునాల్గుసారులు పిలిచిన దీనికంటె నెక్కువ గాటముగఁ గౌఁగిలించితినిగాదా? పిలుపు గాలి కెగిరిపోవునుగాని యిప్పుడు గాలి దూరఁ బడుట కవకాశమేది?

కళా—నాథా! నీవు పూర్వము నన్నుఁ గౌఁగిలించినపుఁ డేమంటివో జ్ఞప్తియున్నదా!

గో—(తనలో) అయ్యో! నాయజ్ఞత బయలగును గాఁబోలు! అక్షరములు చదువకుండ మాటలు చదువనారంభించిన క్రొత్తశిష్యున కొక్కసంవత్సరము దాఁటిననైన నన్నివర్ణములగుర్తు లేనట్లు నడుమనుండి కలిగినదగుటచే నాకథాజ్ఞానము పచ్చిపచ్చిగ నేడ్చుచున్నది. ఇఁకఁ గొంతకాలము పోయినతరువాత సందర్భమును బట్టి పూర్వగాథను గ్రహింపఁగలను గాని యిప్పుడైనను నేనుగాని వాఁడెవఁడో యన్నమాట నేనెట్లు చెప్పఁగలను? (ప్రకా) నిన్నుఁ గౌఁగిలించినప్పు డేమంటినో జ్ఞప్తియున్నదా యని యడిగితివి. పూర్వమేదో పరమేదో వర్తమానమేదో యేమియుఁ దెలియని యవస్థలో నేనుంటిని. నన్నిక నేమియు నడుగకుము.

కళా—ఇఁక నొక్కమాటమాత్ర మడిగెదను.

గో—అడుగుము. తోఁచినయెడలఁ జెప్పెదను. లేకున్న క్షమింపుము.

కళా—మనపెండ్లి యెప్పుడు?

గో—(తనలో) అప్పుడే పెండ్లియా? ఆయాడంగివాని సంగతియేదో కొంత చూడవలదా? (ప్రకాశముగ) నాసేవకుఁడింక రాకున్నాడు. అతఁడు వచ్చిన పిమ్మట యోచింపవచ్చును.

కళా—అలాగే—చూడు మఱియొక్కమాట మనపెండ్లిలోఁ గురంగి పెండ్లికూడఁ గానీయ వలయును.

గో—దానిచేతిలో మగఁడు దక్కునా?

గీ. చంటిపిల్ల దక్కుఁగ లేదు ♦ జనకుచేత
వెట్టిదాతచేతను రాజ్య ♦ విభవమడఁగుఁ
గనకకళ నశించును స్వర్ణ ♦ కారుచేతఁ
జెలువుఁడు నశించు రాకాసి ♦ చేతిలోన.

కళా—అబ్బే! మెత్తనిమనస్సుగలది. దానికిఁ గూడఁదగిన మగఁడు దొరకిన బాగుగా నుండును.

గో—పురుషలోక మంతయు నాఁడుమలయాళమువారుగాఁ గనఁబడు వాపిరికిరోమణికిఁ దగిన భర్తయెవ్వఁడు దొరకును? చూడు ప్రాణేశ్వరీ!

కళా—ప్రాణేశ్వరా! చూడు ప్రాణప్రియా యనుమాటకంటె ప్రాణేశ్వరీ యనుమాట సొగసుగా నున్నది సుమా! నీవెప్పుడు నన్నట్లే పిలుచుచుండవుగాదా! నాకా మాట యిదివఱకు స్ఫురించినది కాదు.

గో—నీయిష్టమెట్టులో యట్టులే పిలుతును. నీవిప్పటికి నీగదికిఁ బొమ్ము. నేనుబోయి నాసేవకుఁడెచ్చటనైన నాకొఱకుఁ దిరుగుచున్నాఁడేమో కొన్నికొన్ని సత్రములఁ జూచివత్తును.

కళా—ప్రాణేశ్వరా! తిరుగ నెప్పుడు వత్తువు?

గో—(చిటుకవైచి) అంతలో రానా! (నిష్క్రమించును.)

కళా—ఈమాత్రమునకై కురంగి యెంత యల్లరిచేసినదో! హా! గోవర్ధనా! ప్రాణేశ్వరా! వేగముగ వచ్చెదవుకదా!

(నిష్క్రమింపఁగ, వెంటనే స్త్రీవేషమున సరస్వతి ప్రవేశించును. అవీధిలోనె మఱియొక చివర.)

సర—గోవర్ధనత్వము వదలిపోయినది. ప్రాణేశ్వరత్వము దానితోడనే యెగిరి పోయినది. స్వస్వరూపముతో నే నుంటిని. పుంవేసమునుండఁ గురంగి చెప్పిన చెప్పులు పైకిఁ గానఁబడని కళాలలిత లోలోని తొందరలు తలఁచుకొనఁగ నవి యెట్లు సహింపఁ గలిగితినో యని నాకే యాశ్చర్యముగ నున్నది.

గీ. తెమ్ము తేకున్నఁ గారకుఁ ♦ బొమ్మటంచు
నఱచు ఋణదాతకోఁతల ♦ నందవచ్చుఁ
గానియక్కఱఁ దీర్పఁగ ♦ లేని యప్పు
డువిదపొందుచు శూలఁపుబోటు ♦ లోర్వవశమె?
పరులసంరవస్థలకు నవ్వ ♦ వచ్చు నద్ది
యొక్క యాడంగితనమె యీ ♦ యుర్వియందు
బంధువుల శుభంబులకుఁ దా ♦ పంబు మదికిఁ
దార్చునది యొక్క చూలాలి ♦ తనమె భువిని.

అట్టి సంకరావస్థ వదలినదని సంతోషింపవలసినదే కాని యరక్షితనై స్త్రీవేషమున నుండుట మఱియింత ప్రమాదమేమో! కూడ వచ్చిన యొక్క దాసియుఁ బోయినది. నానాథుఁడు కళాలలితుఁడు నన్నెప్పుడు చేరునో! ఎప్పు డాతనితో సుఖియింతునో! ఉన్న దేదో విడిచినదాఁకఁ దొందరపడి యాపోయిన దేదో తిరిగి రావలయు నని యేడ్చుట బుద్ధిహీనుల లక్షణమే కాదా! స్త్రీలకు నందులో రాగవతులకు విశేషచపలత యుండకపోవు టాశ్చర్యమేమి?

(నేపథ్యమున) సరస్వతమ్మా! సరస్వతమ్మా!

సర—(అటునిటు చూచుచున్నది.) ఎవరు నాపేరిట పిలుచుచున్నారే!

(నేపథ్యమున) అటుకాదు; నేను మధురికను. ఇదే మూలను. ఇదిగో వచ్చుచున్నాను.

సర—పోనీ! నమ్మినదాని తోడున్నది కదా! ఇఁక భయము లేదు.

(మధురిక ప్రవేశించును.)

మధు—(కౌఁగిలించుకొని) అమ్మా! పుంవేసము విడిచివైచితివా! సంతోషమే. పుంవేసపు విరింపున పరాయింగవర్తిలత కనఁబడినదికాదు కాని యిప్పుడు కన్నుల

పండువుగాఁ గనఁబడుచున్నది. మేము మీకొఱకే నిరీక్షించి తిరుగుచున్నాము.

సర—మే మనుచున్నావు నీకుఁ బెండ్లి యయినదా?

మధు—భర్త దొరకినాఁడు కాని పురోహితుని మూఢదోషమువలన మాకు గాఢాశ్లేషము లేదు. నిజముగాఁ బెండ్లి కాలేదమ్మా!

సర—కాని నాకొఱకు నిరీక్షించుచున్నా మని చెప్పితివే? నేనిటకు వత్తునని నీకెట్లు తెలిసినది?

మధు—మమ్మిచ్చటికి రమ్మని మీరే కాదా భీమపురమునఁ గాఁబోలు చెప్పి మీరు ముందు బయలుదేఱి వచ్చితిరి?

సర—ఆఁ! నేను నీతో నట్లు చెప్పితినా? ఎవరు చెప్పఁగ నేను జెప్పితినని భ్రమించుచున్నావో సుమా!

మధు—(తనలో) ఈమె మగరూపున నాడిన మాటలు గాని చేసిన చర్యలు గాని తిరుగ విననొల్లదు. నేను, భ్రమరుఁడు మా వివాహమునుగూర్చి మాటలాడుకొనుచు నుండఁగా నీమె యచ్చటికి వచ్చి నన్నెఱుఁగనట్లే నటించెను. నా పేరేదని కూడ నడుగుటకు సాహసించెను. ఇప్పుడు స్త్రీవేషమున నావృత్తాంత మంతయు నెఱుఁగనట్లు నటించుచున్నది. ఈమె యిట్టిగడుసుది యని నే నెఱుఁగక పోయితిని. గడుసుదనము కనఁబఱచుట కవకాశము రానంతవర కందఱు వేలకే (పరికాళముగ) ఎవతెనో చూచి మీరని భ్రమించితినా? నాకేమి కన్నులు లేవా! బుద్ధిలేదా? మీతోఁ గూడఁ దిరిగిన నేను మిమ్మెఱుఁగనా! ఒకతెను జూచి మీరని భ్రమించుటకు నేను బిచ్చిదాననా? అమ్మా! ఇచ్చట నీవు నేను దప్ప మఱెవ్వరున్నారు? మీరహస్యములు నేను వెల్లడించుదాననా? అమ్మా! మీ సెలవుపై మీకొఱ కిచట నిరీక్షించుచున్నాము. వచ్చితిరి. మహాసంతోషము.

సర—నీవు దాసివయ్యును నన్నుఁ బరిహసించుచుంటివి! జాగ్రత్త.

మధు—నీవు సరస్వతమ్మ వగుదువా? సరే. నీవు గోవర్ధనవేషము వేసినావనుట నీకు సమ్మతమే కదా!

సర—ఔను. కాని నేను చెప్పనిమాటలు చెప్పితినని నీవనేల! నన్ను భీమపురమునఁ జూచితినని యసత్యమాడ నేల?

మధు—భీమపురమో ధర్మపురమో నాకుఁ దెలియదు. ఈ గ్రామముల పేళ్ళు నాకు గుర్తులేదు.

సర—అదిగో! తిరుగ వ్యత్యస్తముగాఁ జెప్పుచున్నావు.

మధు—ఎటువచ్చినను గ్రామనామమును గూర్చియు మీరు చెప్పిన మాటలనుగూర్చియు మనకీ వివాదమేల? మీరు చెప్పినను జెప్పకున్నను మిమ్ముఁ గలిసికొనవలసిన దానవే కాదా! క్షమించి మా బసలోనికి రమ్మా. పోవుదము.

సర—నాకిట్టి నాలుకమడతమాటలు పనికిరావు. మనసులో బెంగ పెట్టుకొని నే నేడ్చు

చుండఁగా దానివైనదానవు నన్నుఁ బరామర్శించుటకు బదులుగాఁ బరిహసింతువా! నేను గోవర్ధన స్వరూపమున భీమపురము రాలేదు.

మధు—అది యేదిక్కుమాలిన యూరో అమ్మా! నాభర్తయూరు. భ్రమరా! నీవిటురా.

సర—అటఁ జేల!

మధు—ఆయూరిపే రేదో చెప్పుము.

సర—ఏయూరను గూడ నిన్న నే నిదివరకుఁ జూచియుండలేదు.

మధు—అయ్యయ్యో! ఇది మఱింత విచిత్రముగానున్నది. చాలులే అమ్మా! (భ్రమరుఁడు ప్రవేశించును.)

భ్రమ—ఆ! ఆ! ఇదేమి. ఇదేమి. ఓహో మీరా! గోవర్ధనప్రభూ! నమస్కారము.

సర—ఆఁ! ఆఁ! నీ వెవఁడవు! నన్ను గోవర్ధనప్రభూ యని పిలుతువేల!

భ్రమ—మీయిష్టానుసారముగ మీరు కాంతావేషధారణ మొనర్చినను నాకు మీరు గోవర్ధనప్రభువులే. మేమపేక్షించునది మీకొలువుగాని రూపముకాదు.

సర—(అప) తుమ్మెరాలా! నేను గోవర్ధనవేషధారిణినైతినని నీవు నీభర్తతోఁ జెప్పితివా!

మధు—(అప) అమ్మా! నీపాదములతోడు, చెప్పలేదు. చెప్పుట కెన్నిసారులో రహస్యము నాలుకవరకు వచ్చినది. నాప్రమాణముగా నేను జెప్పలేదు.

సర—(అప) చెప్పకున్నయెడల నేను గోవర్ధనవాముఁడనని యాతని కెట్లు తెలిసెను! మీరహస్యములు నేను వెల్లడించుదాననా అని యిప్పుడంటివిగదా! ఇట్లు నా మర్యాదతీసివేయుట నీకుఁదగునా! కానిమ్ము; వలెఁగాక! (ప్రకా) భ్రమరుఁడా! నాపేరు గోవర్ధనుఁడని నీకెట్లు తెలిసెను!

భ్రమ—మీరు చెప్పుటచేతనే తెలిసెను.

సర—నేను నీతోఁ జెప్పలేదు. నిన్నుఁజూడలేదు. నీవెవఁడవో నేనెఱుఁగను.

భ్రమ—నేను మీయొద్దఁ జేసినకొలువునకు నాకు జీతమీయకుండుట కింతకావలయునా! బాబూ! చాలు. చాలు. ఇదిగో మీ మాడలసంచి, ఇందులోనే లెక్కపత్రముంచినాను. మీసంచి మీరుతీసికొనుఁడు నాజీతము మీ రీయనక్కఱలేదు.

సర—నేను నీకు సంచి నిచ్చియుండలేదు.

భ్రమ—మీరిచ్చియుండలేదు. మీయొద్దనుండి నేనే మీయుప్పరలపై మీపెట్టెలోనుండి తీసికొంటిని.

సర—అది నాసంచికాదు, నాయొద్ద నీవు తీసికొనలేదు.

మధు—(అప) ఇప్పుడా వెనుకమాట లేవియు నామెకు జ్ఞప్తిచేయకయ్యా! పురుషరూపమునఁ జేసినచర్య లామె కేమియు నొప్పుకొనకుండనున్నది. భావ మది లాగునఁ గనఁబడుచున్నది. ఎందుల కామెను మఱింత రేఁపుదువు.

భ్రమ—(అప) నేను న్యాయబుద్ధిగలవాఁడను. నాకొకనికోపమునకు లక్ష్యములేదు. ఊడిగపుదానివవు కావున నాతనికొల్వులో నీవుండుము.

మధు—(అప) అతఁ డెవఁడవేల ? ఆమె యనుము. మగవానికొలువులో నే నెందుల కుందును ?

భ్రమ—(అప) నీకెఱుఁగము. అతఁడు గోవర్ధనుఁడు. ఆఁడుదియని భ్రమింపకు.

మధు—(అప) సరిసరి ! చాలుశే ! నాకంటె నీకెక్కువ తెలియునా ! మగవాఁడైనయెడల వాఁడు కేశ మేల ధరించును ?

భ్రమ—(అప) ఒక్కొక్క మగవాని కదియొక ముచ్చట.

సర—మీరిద్దఱాలోచించి కుట్రచేసి నన్నిట్లు బాధింతురా ! పొండు. మీరెవ్వరు నాకక్కఱలేదు.

భ్రమ—ఇదిగో మీసంచి; మీకొలువు నాకక్కఱలేదు. (సంచి పాఱవేయును.) మధురికా ! ఇచ్చట నీవు సాక్షిణివి. పైనఁ బరమాత్ముఁడు సాక్షి. (పోఁబోవును.)

మధు—(అప) సాధా ! కోపపడకుము. ఉండుము.

భ్రమ—(అప) నీవాతనియొద్ద నుండుము. నే నుండను. మనసంబంధ మింతమాత్రమునఁ దెగునని యెంచకుము. నీవు బసకెప్పుడు వచ్చెదవు ?

మధు—(అప) ఈమెను శాంతపఱచి బసకుఁ దీసికొనివత్తును. ఈలోన నీవు సంతకుఁ బోయి యీమెపథ్యములోకి మంచిమంచి కూరలను దెమ్ము. (పోవును.)

భ్రమ—ఏమో ! గోవర్ధనప్రభూ ! నమస్కారము.

సర—(తనలో) నాగోవర్ధనత్వము నానాథుఁ డెఱుఁగును. అతనికైన నే నాఁడుదాన నను నిశ్చయము లేదు. ఈముండ నాకొంప తీసినది. (ప్రకా) పో! నీవుకూడఁ బో

మధు—తుపానుగాలి తీవ్రత్వము నన్ను వెనుక నీసన్నిధినుండి వేఱుచేసెను గాని నీకోపతీవ్రత్వ మట్లు చేయఁగలదని యెంచకుము.

సర—అంతకంటెఁ దీవ్రమగు తుపానుగాలి నాహృదయమున వీఁచుచున్నది. నాయాపద లింతట నడఁగవని నాకుఁ దోఁచుచున్నది. నారహస్యములను వెల్లడించు నీవు నాకక్కఱలేదు. నాపనను నేను జూచుకొందును. నీవు పొమ్ము. (పోఁబోవును.)

మధు—అమ్మా! సరస్వతమ్మా! అమ్మా! సరస్వతమ్మా! నావలన నేరమేమియు లేదు.

(నేపథ్యమున) భటులారా! ఈప్రక్కనుండి యొకఁడు నాప్రక్కనుండి యొకఁడు వచ్చి వారిద్దఱను బట్టుకొనుఁడు.

మధు—అమ్మయ్యో! అదియేమి! ఈ సంచికొఱకు దొంగలు వచ్చుచున్నట్లున్నారు. (సంచి తీసికొనును.)

సర—ఆక్రందనము మానవు వినినదివలె నున్నది.

(ఇద్దఱుభటులతో జయరామసింగు ప్రవేశించును.)

జయ—నీ వా పెండ్లికూఁతురుగారిని బట్టుకొమ్ము. నీ వీ దాసిని బట్టుకొనుము. ఈ మందరయే యింతకును మూలము.

(అట్లు భటులు చేయుదురు.)

పెండ్లికూఁతురుగారూ! మనలఁ గాదనికదా పరుగెత్తుకొనివచ్చితిరి! తుదకు మనమే గతి యయినది. చూచితిరా సింగారించుకొని సిద్ధముగా నున్నాము. ఇఁక నొక్కగడియలోనే పెండ్లి, పునస్సంధానము. గర్భాదానము. భటుఁడా! అవి రెండు నొకటా! కాని కది కేళా! నీభాగ్యశాలిని నీకుఁ దెలియదు కాఁబోలు; పుత్త్రోత్పత్తియుఁ గావలయును. మనము తలఁచుకొన్నతరువాత భూతభవిష్యద్వర్తమానములు మూఁడును గట్టుగట్టి కాళికాపదక్రింద మోఁచ వలసినదే. మనము నీకొక్కదానికి నచ్చలేదు గాని మనపోరు దిగంతముల చెవులలో మ్రోఁగుచున్నది. భటుఁడా! నీ వీమెను దీసికొని మన మేడమీఁద గదిలో నుంపుము. అచ్చట మన భృత్యుఁడు సారంగుఁ డున్నాఁడు. అతని కప్పఁజెప్పుము. మనము నిట్టె వత్తుము.

(భటుఁ డొకఁడు సరస్వతిని నోరుమూసి తీసికొనిపోవును.)

భటుఁడా! నీ వామెను మూఁతిపైఁ గొట్టుము. మనమే కొట్టవలసినది కాని దాసీదానిని జేయిచేసికొనుట మాత్రము మన వంశమర్యాదకుఁ దగదు. తిరుగఁబడి కొట్టునపు డెవఁడైనఁ జూచువెడల రాజమర్యాద కది తగదు. (భటుఁడు కొట్టును.) నీసొమ్మేమి పోయెనురా! గట్టిగఁ గొట్టు! (కొట్టును.) దీనిని గట్టకట్టి కోటకందకమునఁ బాఱవేయుము పొమ్ము.

(భటుఁడు మధురికతో నిష్క్రమించును.)

ముందు ప్రతిసంవత్సర మీరాత్రి జయరామజయంతి జరుగఁ దగినంతచర్య జరుపుదుము. వెనుకటి జయంతులవారందఱు తప్పుదారిగా నట్టి ఘనత నొందిరే కాని యిది యపూర్వబుద్ధిని జేయు చర్య. దాసీముండను గోటకందకమునఁ బాఱవేయించినవాఁడు సూర్యచంద్రవంశ్యులలో నెవ్వఁడైనఁ బొడకట్టుచున్నాఁడా! ఇంక ముందుచర్యలోఁ గ్రొత్తపెండ్లికూఁతురుతో మన సరసమున్నదే, అది బింకమైన పట్టు; పూర్వశృంగారశాస్త్రములలోఁ గ్రొత్త యధ్యాయ మొకటి దానినిబట్టి నవీనపరిశోధకమండలివారు వ్రాఁతకోటాకుల మీఁదఁ జేర్పవలసియుండును. మనబుద్ధి కసాధ్యమైనపని లేదు. పెండ్లికూఁతురుగా రచ్చట, మన మిచ్చట నుండుటచేత మన్మథునికి విరహబాధయెక్కువగా నుండునని కామధర్మములలో నున్నట్లు వింటిని. ఆమెను జమత్కారముగాఁ గాలు పట్టుకొని కనఁబడి కనఁబడనట్లుగాఁ జైటచాటున—

(నేపథ్యమున) ఆఁ. కనఁబడియు, నాతో మాటలాడకుండ మోము చాటుచేసికొని దాఁటిపోవుచుంటివేమి! భ్రమరా! ఇటురా.

జయ—అమ్మయ్యో (పాఱిపోవును.)

(గోవర్ధనుఁడు-భ్రమరుఁడు-ప్రవేశింతురు.)

భ్రమ—గోవర్ధనా! చాలుఁ జేసితి నింకను నిన్నుఁజూచి నీతో మాటలాడవలయునా! ఇంత కాఠిన్యమైన వైఖరియని నే నెఱుఁగకపోతిని.

గో—అదేమి! అదేమి? అంతనిర్భయముగా మాటలాడెదవేల!

భ్రమ—నీసేవ నాకక్కఱలేక వదలుకొనినప్పుడు నాకు భయమేల?

గో—నాకొలువు మానివేయఁదలఁచినవాఁడవు నాతోఁ జెప్పనక్కఱలేదా. చెప్పి మానుకోవచ్చును. అంతేకాని యిట్లు మొగము చాటువైచుకొని పాఱిపోయెద వేల! సరే! నీయిష్టానుసారముగా మానుకోవచ్చును. నామాడలపంచి నాకిచ్చివేయుము.

భ్రమ—ఆఁ! ఇంక నీమాడలపంచి యెక్కడ! మంచి పెద్దమనుష్యుఁడవు. నీ వేసాలు నీవు చాలుఁ జేసియ్యా నేర్చుకొనిపోయినావు. నీసంచి నీకీయలేదా? మరి మాలిన వ్యవహారములాగున నున్నది.

గో—ఏమిరా! అట్లు ప్రేలెదవు. ఏదైన మద్యద్రవ్యమును దీసికొంటివా. పిశాచ మావహించినదా? నీ విట్టివాఁడవని నే నెఱుఁగను.

భ్రమ—మాటలు తిన్నగ రానిండు. మీరు నిట్టివారని యెఱుఁగను. గడియగడియ కొక వేసము వేయుదువు. అప్పటిమాట యిప్పుడులేదు. ఇప్పటిమాట ముందుం డదు. సేవచేయించుకొందువు. జీత మడిగినప్పుడు నిన్ను నే నెఱుఁగను బొమ్మందువు. నీకొలువు చాలించుకొని పోయినపిమ్మటఁ దిరుగఁబిలిచి నాతోఁ జెప్పకుండ నేల మానుకొంటివనెదవు ఏమి చమత్కారముగనో యున్నది. నీవంటి వాని నే నెవ్వనిఁ జూడలేదు.

గో—పోనిమ్ము. ఇవియన్నియు నాకేల? నాసంచియిచ్చి పొమ్ము.

భ్రమ—నీసంచి నీయెదుటనే గిఱగిఱ త్రిప్పి పాఱవైచితిని. నాజీతము నీవీయకపోయితివి పోనీ! నేనంతగతిలేనివాఁడను గాను. నీవే బాగుపడుము.

గో—జీతముకొఱకు సంచి యట్టిపెట్టుకొందువా! ఇదిగో నీసొమ్ము. (ఈయఁబోవును.)

భ్ర—నాకక్కఱలేదు. నీతో ఋణసంబంధము నేను వదలుకొంటిని. (నిష్క్రమించును)

గో—భ్రమరా! భ్రమరా! (కూడఁబోవును.)

(నేపథ్యమున) గోవర్ధనా నావెంటరాకు-(గోవర్ధనుఁడు నిష్క్రమించిన వెంటనే వెనుక తెరయెత్తగ నావీథిని మఱియొక్క భాగమున నొకమేడమీఁద సరస్వతి ప్రవేశించును.)

సర—హా! భగవానుఁడా! ఎంతగతిసిద్ధించెను! భటునిచే నీడ్చుకొని రాఁబడి యిక్కడ నుంపఁబడితిని. ఇఁక నాతఁడు నాగదిలోనికి వచ్చును గాఁబోలు,

ఒక్కఁడు వచ్చినయెడల భయములేదు. మందు భటులనంపించి మంచమునకు నన్నుఁ గట్టించివేయునేమో! ఏమి యుపద్రవము జరుగునో! నా దాసిచేఁ బరిభవింపఁబడితిని. దానిభర్తచే నిందింపఁబడితిని. పెండ్లిచేసికొనుట కొల్లక విడిచివచ్చిన యధమునిచేతఁబడితిని. ఈపెద్దమ్మ తెలివితేటలఁ కిట్టిపని చేయఁదగినవాఁడు కాఁడు. మాసవతితల్లి ప్రోత్సహించి వానినిటకుఁ బంపియుండును మేమిక్కడనుందుమని యామె యెఱిఁగియుండదు. కాని యీకాళికాదేవి యుత్సవములు లోకప్రసిద్ధములగుటచే నివి చూచుటకు వచ్చియుందునేమోయని తగిన పరివారముతో నాతని నామె పంపియుండును. ఇఁక ముందుగతియేమి! హా! కళాలలితా! నీభార్యనుగానున్న నాకిట్టి దురవస్థవచ్చినది. సరస్వతినైన యెడల నీతో నెక్కువ సుఖపడుదునని గోవర్ధనస్వరూపమును విడిచితిని. హా! భగవానుఁడా! రక్షింపుము. రక్షింపుము. రక్షింపుము.

(వీథిలో గోవర్ధనుఁడు ప్రవేశించును.)

గో—ఎక్కడ వెదకినను గానఁబడఁడు. ఏమైపోయినాఁడో! చీఁకటిపడి యున్నట్లున్నది. కాళికోత్సవము లగుటచేఁ దక్కువజాతివారు దరచుగాఁ ద్రావుచుందురు. మాపలసంచియును పేరేకాని దానిలోఁ బదిమాడలైనలేవు. విశేష ధనమున్నయెడల నాల్గుదినముల పరిచయముమాత్రమే యున్న వానికప్పఁజెప్పియుందునా? పోయినబోవును. ఇఁకఁ దిరిగినలాభమేమి? బసకుఁబోయి నా ద్వితీయప్రాణమగు కళాలలితను గాంతును. పాపము! నాకొరకు వేచియుండును. వాఁడెవఁడో యాఁడంగివాఁడగుటచే నాకీమహాలక్ష్మి సిద్ధించినది. ఈప్రపంచమునం దెక్కడఁజూచిన నొకని యశక్తిచే వేఱొకఁడు బాగుపడుచున్నట్లు కనఁబడుచున్నది.

గీ. జర్వితులంఘనమునుమందు ♦ వైద్యు వింద
వాదియెదిరి భిక్షయె న్యాయ ♦ వాది లక్ష
రాజుతలమట్టియేమంత్రి ♦ రవల పెట్టి
కోరలమ్మదె పేరు పూ ♦ జారినోరు.

అతఁడు నావలెనే యింటచేత నెఱుఁగకుండ నాకు మహోపకారము చేసిన యాయాఁడంగి వానికెంతయైనఁ గొనియాడఁదగును. ఎప్పటికైన నాతనిఁజూడ వేడుకపడుచున్నాను. అతఁడెక్కడనున్నాఁడో!

సర—(మేడమీఁదినుండి) ఎవరువాయనా! ఇక్కడ- ఇక్కడ దిక్కుమాలిన దాననై యున్నాను. మర్యాద పోవనున్న యాఁడుదానిని రక్షింపఁగలవా! నాయనా!

గో—ఆఁ. ఆఁ. అదేమి! (పైకిఁజూచి) అమ్మా! వచ్చుచున్నాను. భయపడకుము. పరివారంత్రాడు పైనున్నదేమో చూడుము.

సర—నాయనా! మూరెడు త్రాడున్నయెడల నీకు శ్రమమిచ్చెదనా!

గో—(తనలో) అయ్యో! ఇది యాత్మీయబాధవలెఁ గానిపించుచున్నది. కాని పరబాధ వలె నెంతమాత్రమును లేదే! ఒడలు వడఁకుచున్నది. హృదయమునఁ జేయిపెట్టి కలఁచినట్లున్నది. (ప్రకా) అమ్మా! వచ్చుచున్నాను. నేనా పెద్ద మఱిచెట్టెక్కి మేడఁదరిగ వ్యాపించిన యాకొమ్మమీఁదనుండి మేడ వసారాలోనికి దుమికెదను. దీపమున్నయెడల నెవ్వరైనఁ జూతురు. అదిగాక అమ్మా! అంతఃపుర కాంతవు నీకంటికిఁ బురుషుఁ డగపడఁదగదు. అదిగాక నేనును కులకాంతను గలవాఁడను పరకాంతను జూడను.

సర—అలాగే. (దీపమార్పఁబోవును.)

గో—అమ్మా! ఇంక నార్పకుము. మఱియొక్క మాఱా స్థలమును జూడనిమ్ము. (చూచి) అమ్మా! ఇంక దీపమును ఘనమొనర్పుము.

సర—ఆర్పును.)

గో—ఇదిగో- తెప్పపాటులోవత్తును. (గోవర్ధనుఁడు నిష్క్రమించును.)

సర—ఇతనిమాట యెంతవలననో నాకు విశ్వాసభాజనముగా నున్నది. అదిగాక యీతఁడు— మాటలాడగ నేను మాటలాడినట్లే యున్నది. కానిమ్ము ఈ యాపదనుండి విముక్తికలుగ వచ్చును. అహా! ఆపత్కాలమున నిశ్చలమైన భక్తితో నాక్రోశించు నార్తరనిమిషమునసే యిదిగో వచ్చుచున్నానని యే మహానుభావుని నోటనుండియో మా జగద్రక్షకుఁడే పలుకును గదా! నన్నింకఁ బిలువలేదేమి నిన్నింకఁ బిలువలేదేమి యని యాపరమాత్ముఁ డాపన్నుల నంటిపెట్టుకొనియే తిరుగుచుండును గాఁబోలు. (గోవర్ధనుఁడు మేడమీఁదికి వచ్చును.)

గో—అమ్మా! వచ్చితిని.

సర—నాయనా! నమస్కారము.

గో—అమ్మా! నీవెవతెవో నే నెఱుఁగను. నీపూర్వవృత్తాంతమును జెప్పుమని నే నడుగుచుండుటలేదు సుమా! నిన్నెవఁడో బలాత్కరింపనున్నాఁ డని నీమాటలవలన నాకర్థమైనది. అంతేనా?

సర—అంతే.

గో—అట్లైన నేఁ జెప్పినమాట విందువా!

సర—నాయనా! సందేహమేమి!

గో—నే నిప్పుడే మేడక్రిందిభాగమును గూడ బహు జాగరూకతతోఁ జూచినాను. భటులు నిద్రించుచున్నారు. అత్తూరుఁ డింక నద్దమునొద్దఁ గూరుచుండి మీసాలు వడిపెట్టుకొనుచున్నాఁడు. ఇఁక నొక్కపావుగంటలో నిక్కడికి వచ్చునని యనుకొందును. నిశ్శబ్దముగా వీథితలుపు తెఱచియుంచినాను. ఇప్పుడు నీవును నేనును గ్రిందికిఁ బాఱిపోవచ్చును. కాని నేనట్లు పాఱిపోను.

నే నిచ్చటఁ గొంతసేపుండి యీనిర్భాగ్యుని శిక్షించి మరలివత్తును. నేను స్త్రీవేషమున నీస్థానమున నిల్చి కొంత యల్లరిచేసి శిక్షింపఁదలఁచితిని. నాయొద్ద స్త్రీదుస్తు లేవియులేవు. ఇక్కడ నేమైన నున్నవా!

సర—నాయనా! నాకెట్లు తెలియును! ఉండవనియే నానమ్మకము.

గో—అందుకొఱకు నే నొక్కసంగతి చెప్పుచున్నాను. సిగ్గుపడకుము. నీవు నాసహచరివి—ఇదిగో! ఈమంచముమీఁది దుప్పటిని నీవు చుట్టబెట్టుకొని—

సర—ఆఁ.

గో—అమ్మా! సందేహింపకుము. కన్నుగనఁబడని చీఁకటిగానున్నది. నీవు చుట్టఁబెట్టుకొని నీవస్త్రమును అవికతోఁగూడఁ జుట్టబెట్టి నావంకఁ బాఱవేయుము. నీవస్త్రములను నేను గట్టుకొని నాపురుషవస్త్రములను నీవైపునఁ బాఱవైచెదను. నీవు వానిని ధరించి స్వేచ్ఛగాఁ గ్రిందికిఁబోయి వెలుపలఁబడుము.

సర—(తనలో) అయ్యో! తిరిగి పురుషవేషమా? (ప్రకా) అంతకంటె వేఱుసాధనమేమియు లేదా?

గో—ఏమియులేదు. ఆలస్యము కానీయకుము.

సర—పోనీ! నీవాగదిలో దాఁగియుండుము. అతఁడు నాకుఁ దొందరగలుగఁజేయునని తోఁచిన వెంటనే కేకవేసెదను. అప్పుడువచ్చి యాతని శిక్షింపుము. తరువాత మనమిద్దఱము పోవచ్చును.

గో—నిన్నాతఁడేమియు ననలేఁడు. నేనే యాతనిచేఁ బ్రాణప్రియాయని పిలిపించుకొందును. నాకాఁడువేసము వేయుటకుత్సాహముగ నున్నది.

సర—(తన) నాకు మగవేసమునందు ముచ్చటయెట్లో నీకాఁడువేస మందట్టి ముచ్చట యున్నదానాయనా! నాతమ్మునివలె నున్నావు. ఏదీ యెంత యదృష్టమో నేను బుట్టగనే మాయమ్మ పరలోకగతురాలైనదే.

గో—అదిగాక అమ్మా! అతనిని శిక్షించుటలో నల్లరియేమియుఁ గాఁగూడదు. వారు పైకివత్తురు. నేనివియన్నియు యోచించివిడిచినవియే. నేను చెప్పినట్లు చేయుము. తల్లీ! సందేహింపకుము.

సర—అట్లైన ఆమంచముమీఁది దుప్పటిని నీవు ముందుచుట్టఁబెట్టుకొని నీవస్త్రముల నిట్లు నావంకఁ బాఱవేయుము. నేను వాని నాప్రక్కగదిలోనికిఁబోయి కట్టుకొని నావస్త్రముల నీకు విసరివైచెదను.

గో—అమ్మా! అటులే. ఇదిగో నీవలె నేనుగూడ నీచాటునకుఁబోయి నావస్త్రము లూడ్చి, యీదుప్పటి కట్టుకొందును.

గో—(అట్లుచేసి తన వస్త్రములను విసరివైచును.) అమ్మా! విసరివైచితిని.

సర—(తీసికొని, గదిలోనికిఁ బోయి, తనవస్త్రములను విసరివైచును.)

గో—(నడుమ కట్టుతో లాల్చితో నీవలకువచ్చి యామె వస్త్రములను దీసికొని

చాటునకుఁ బోవును.)

(కొంతసేపటికి నిద్దఱుకూడ గదిలోనికి వత్తురు.)

గో—అమ్మా! నిన్నెఱిఁగినవారెవరైన నీగ్రామమున నున్నారా!

సర—నీకంటె నాకు నిష్కారణ బంధులెవ్వరు!

గో—అటులైన నీవు క్రిందికిఁ జప్పుడుకాకుండఁ బోయి వీధిలోనికిఁ బొమ్ము. కాళీ కాలయమునకు సమీపముననే యొక్క సత్రమున్నది. దానిలోఁ దూర్పుభాగమున మూఁడవగది నా బస. నీవచ్చటికిఁ బొమ్ము. తాళమిదిగో. నాకొఱ కచ్చట వేచియుండుము. సాధ్యమైనంత శీఘ్రముగా శత్రుశిక్ష యొనర్చి వచ్చెదను.

సర—పాప మాతని జంపెదవా?

గో—ఏదియో చేసెదను. పొమ్ము. ఆలస్యమగుచున్నది. నేనుగూడ నీతోఁ గ్రిందికి వచ్చి వీధితలుపు తిరుగ లోన గొండ్లెముపెట్టి పైకివచ్చి నాథగారికొఱకు వేచి యుందును.

సర—సరే యమ్మా. (ఇద్దఱుపోవుదురు.)

గో—(తిరుగవచ్చి) ఇఁక దీపము వెలిఁగింపవలసినదేకదా! (వెలిగించును.) ఇక్కడ నద్దమేమైన నున్నదేమో! నా వేష మెట్లున్నదో చూచుకోవలయును. సెబాస్! అదిగో అద్దము. (తీసికొని యద్దములోఁ దన్నుఁ జూచుకొనును.) సెబాస్! సెబాస్! గోవర్ధనుఁ డిక్కడికి గోవర్ధనమ్మయైనది. ఇదియేమి! రవిక తిరుగవేసి తొడిగికొంటినిగాఁబోలు. ఇప్పుడు సరిగాఁ దొడుగుకొనవలయునా యేమి! ఊఁ. ఈమాత్రపు సరసత కిది చాలదా! ఆహా! రవికతోఁ, బైటతో, మొగమంతయు భేదించినట్లు కనఁబడుచున్నదే! మొగము భేదించినందులకు నాకంత వింతగలేదు. ఏమో స్వల్పముగా మనస్సుకూడ భేదించినట్లు కనఁబడుచున్నదేమో! మగవారెవ్వరైన వత్తురేమో యను నలుకు పైటజారినదేమో సద్దుకోవలయునని యెఱుకగూడ నాకర్మమువలన సిద్ధించినట్లున్నదా యేమి! (పైట సద్దుకొనును.) ఇది వట్టిభ్రమము. అట్లేల జరుగును!

గీ. పురుషుఁ డెన్నఁడు పురుషుఁడు ♦ పొలఁతి పొలఁతి
ప్రకృతి యెల్లెడ నిర్వికా ♦ రంబు నిజము
రమ్యలోఁ బురుషుఁడు సమ ♦ ర్తుఁడఁ డెపుడు
జర్మనీ స్త్రీలకైన మీా ♦ సాలు లేవు.

ఈరవిక నాకుఁ గొంచెము గుత్తముగా నుండుటచేత బాగుగనే యున్నది. పాముచే గడిదేలిపడితిరుగు నీదండలపై నీయాకుపచ్చనిగుడ్డ స్తంభపు రాలకుఁ గట్టిన కొబ్బెరయాకుల యల్లికవలె నున్నది. ఇదియు నొక సొగసుగనే

యున్నది. కాని తామరపాకున విసములు పొట్లము కట్టవచ్చును గాని గడిగలట్లు కట్టవచ్చునా ! ఇంత కాశిపట్టుచీరఁ గట్టినందులకు మొదలో రత్యంత పానుబోఁచయైన శేశే. సాధారణముగా నిప్పటి యూఁడువారి యలంకరణ వైరాగ్య మిట్లున్నది. కావున బాధలేదు. నియపయోగమని యెంచి మగవాఁడు యజ్ఞసూత్రమును దీసివైచినట్లు మగువలలోఁ గొందఱు సాహసికులు మంగళసూత్రమును దీసివైచుచున్నారని కింవదంతికలదు. అట్టి నూతనాచారపరాయణలలో నేనుగూడఁ జేరుదును. ఎట్లైన నింత బోడిమెడతో నుండుట బాగుగానుండదు. కావున పైటచెంఁగు బాగుగాఁ గప్పుకొనెదను. లోపల నున్న రత్నాభరణములు పొందలగు నంగుమ పైకి నరచాటుగఁ బ్రకాశింపఁ చేయుటకుఁ బడుచువాండ్ర పైట విలాసముగా నుపయోగపడుచుండఁగా నా పైట-బోడిదానినెత్తిపై ముసుఁగువలె లోని శుద్ధమోత్తకను దట్టముగాఁ గప్పుటకై యున్నది. కాని- (ప్రకా) ఎవరిప్పుడు తొంగి చూచినవారు.

(నేపథ్యమున) అమ్మా ! నేను పెండ్లికొడుకుగారి దాసుఁడను.

గో—ఎందులకు వచ్చితివి ?

(నేపథ్యమున) మాబాబుగారు తమ దర్శనమునకై వత్తురఁట. సెలవుకొఱకు నిరీక్షించుచున్నారు.

గో—అతఁ డిదివఱ కెవరి సెలవును గొని యింతవఱ కాచరించెనో వారి సెలవునే పొంది రమ్మని చెప్పుము.

(జయరామసింగు ప్రవేశించును.)

జయ—రమ్మనుటయే కావలసినది. మనమిప్పుడు చేసిన చమత్కారము నీవు గ్రహింపలేదు కాఁబోలు ! మన మే యిప్పు డాప్రక్కనుండి మాఱుగొంతుకతో మన సేవకుఁడువలె నిన్ను సెలవడిగి మాయచేసినది. పిల్లికూనకూఁతపొందలు సింహపు బొబ్బవఱకు మన కన్ని కూఁతలు కంఠపాఠము. దూడ చచ్చిన గేదె యఱచినందులకు పశుసంరక్షక సమాజమువారిచ్చిన పతక మిదిగో ! విద్యావిషయము వచ్చినపుడు ప్రభువులము కదా మన కెందుల కని యొకఁజేఁపువారము కాము. గాడిదకూఁత పైవారికిఁ బెద్దబ్రహ్మవిద్యలాగునఁ గనఁబడును గాని యది పట్టి పేలపిండి. వడ్రంగిపిట్టకూఁత మాత్రము కూఁతల సార్వభౌమ మని సాంఖ్యశాస్త్రజ్ఞు లొప్పుకొనినారు. నాటకాంతం కవిత్వమన్నట్లు కూఁత కూసినవాఁడు రెండుకనుల శుక్రాచార్యులవారనుట కేమైన సందేహమా ! స్వస్వరూపప్రకటనము యోగశాస్త్రమందెంత ముఖ్యమో భోగశాస్త్రమందు గూడ నంత ముఖ్యమే. ఈ యుపోద్ఘాతముతో మన మిఁక గ్రంథరచన ముపక్రమింతుము. కాని కృత్యాద్యవస్థలోనే కవికిఁ జావుతప్పి కన్ను లొట్టపోవుట. పెండ్లికూఁతురుగారూ ! పెండ్లికొడుకుగారు స్వయముగా దయచేసినారు. అంత తప్పునిసరియైనప్పు డెప్పుడో తప్ప గర్భాధానకృత్యము సాధారణముగా రాయ

వారలచే జరిగింపఁదగినది కాదని అహమస్మి యని మనమే తెంచేయవలసి వచ్చినది. స్వస్వాహా యన్న పట్టుదల దర్భశయ్యకే కాని పుష్పశయ్యకు గాదని పరిష్కరింపఁబడినది కావున నిదిగో మనము నిష్కేకతల్ప మధిష్ఠించుచున్నాము. (నారాయణా నారాయణా యని కూలఁబడును.) ఇక్కడికి కర్మప్రారంభ మైన దన్నమాట. ఇఁకఁ బ్రారబ్ధము ననుసరించియే ఫల మపేక్షింపఁ దగినది.

గో—(తనలో) ఈతఁ డిట్లు మాట్లాడుచున్నాఁడేమి? త్రాగియున్న చిహ్నము లేవియు నగపడవు. బుద్ధివైఖరియు యిదియై యుండును. ఇట్టి పరమనిర్భాగ్యుఁడు కాంతను బలాత్కరింపఁబోయినాఁడే! మాటనుబట్టి వెఱ్ఱిముండకొడుకు; చేష్టనుబట్టి పరమకిరాతుఁడు. బుద్ధిలేనివాఁ డింతమోస మెట్లు చేయఁగలిగెను? కావున బుద్ధిగలిగినవా రెవ్వరో యాతని నిందులకుఁ బ్రోత్సహించిరేమో యని సందేహము కలుగుచున్నది. వారికేమి లాభమో నేను జెప్పలేను. ఈతని నింకఁ బరీక్షించెదను. కాంతాగారవఘాతి యగు దొంగయేమో! ఈతనిని వధించెదనని మొదట నిశ్చయించుకొంటిని. ఇఁక నాలోచింపవలయును. శృంగారసంభాషణలోనికి దిగినతరువాతఁ జూచుకొనవచ్చును. ఇఁకఁ బ్రారబ్ధము ననుసరించియే ఫల మపేక్షింపఁ దగిన దని యాతఁడు మంచము మీఁదఁ గూలఁబడినాఁడు. ఇఁక మాటలాడక కూరుచుండునేమో! నేనే మాటలాడుదునా యేమి! అది స్త్రీకిఁ దప్పుకాని నాకేమి? స్త్రీనైన నిట్టి వెఱ్ఱిముండకొడుకుతో మాటలాడినఁ దప్పులేదనుకొందును. అయినను దిట్టవలసినప్పు డీయాలోచన మేల? (ప్రకాశముగా) అయ్యా! మీరు ప్రభువులు. కాంతల మర్యాదను గాపాడవలసిన మీరే యిట్టిదుర్నయ మొనర్చుట తగునా?

జయ—(మంచముమీఁద గొంతుగూరుచుండి కునికిపాటులు పడుచున్నాఁడు.)

గో—(తనలో) అయ్యో! అయ్యో! కునికిపాటులు పడుచున్నాఁడే!

గీ. చదువునందునఁ గునికెడు ♦ జనుఁడు గలఁడు
మాటలందునఁ గునికెడు ♦ మనుజుఁ డుండు
భోజనమునందుఁ గునికెడు ♦ పురుషుఁ డుండు
నడకయందునఁ గునికెడు ♦ నరుఁడు గలఁడు;... కాని
కొయ్యవలెను బెండ్లి ♦ కూఁతురు నిలఁబడఁ
పుష్పశయ్య నెక్కి ♦ పూర్వరంగ
మందె కునికిపాటు ♦ లొందు గర్భాధాన
వరుని నెచట గాన ♦ వసుధలోన.

ఆహా! ఇతఁడు షండుఁడేమో? అట్టివాఁడే యైనయెడల నీబలాత్కార ప్రయత్నమేల? ఎవ్వఁడైన నేమి? విచిత్రస్వరూపుఁడు; ఈమందభాగ్యుని నాకన్నులారఁ జూచితినిగాన సరిపోయినది కాని యేనాటక కవియైన నిట్టిపాత్ర

మాను సృష్టించిన యెడలఁ గవిశిఁ బ్రకృతిజ్ఞానము లేదని యవివర్యముగ వాతని నిందించి పాపముకట్టుకొని యుందుముగదా! ఆహా! హద్దులేని సృష్టిలో నెట్టి చిత్రవిచిత్రాతిచిత్ర మహావిచిత్ర ప్రకృతులున్నవో! అద్ది-తునికిపాటులు తీవ్రముగానున్నవి. అనంతశయనమునఁ బాషండశిఖమువలెనున్నాఁడు. అదిగో! మంచపు పందిరి స్తంభము కణతకుఁ దగులుటచేఁ బికావిము త్తిని తెందినాఁడు.

జయ—(కన్నులు తెఱచి తలకొంచెము కదలిచి పాదమిట్టెయిట్టెయాడించి హీనస్వరముగ నిట్లు పాడును.)

> "శరీరే ఝర్ఝరీభూతే వ్యాధిగ్రస్తే కళేబరే।
> ఔషధం జాహ్నవీతోయం వైద్యో నారాయణో హరిః॥"

గో—(తనలో) అమ్మయుండకొడక! కన్నులు తెఱచి కూడఁ దల, వెనుకటివలెనే యూఁపుచున్నాఁడు. వెనుకఁగూడ నెఱిఁగియుండియేఁ యూఁపినట్లు నేననుకొనవలయు నని; విలాసముగాఁ గాలు కదల్చుచున్నాఁడు. తలకదలిచినట్లే కాలుకూడ విలాసముగాఁ కదల్చినట్లు నేననుకొనవలయునని; కాని కుక్కపిల్ల కూఁతవలె నీకూనురాగమేమి! అందులోఁ గాయిలామంచముమీఁది శ్లోకమైన యీ దిక్కుమాలినశ్లోకము గర్భాధానపు మంచముమీఁద నెందులకు! (ప్రకా) అయ్యా! మాటలాడకున్నారు. సర్వధర్మము తెలిసినమీరు, కాంతను హరించుట యెందులకు?

జయ—స్త్రీని దెచ్చుటకు మూఁడుకారణములు. బాల్యము, పడుచుఁదనము, వార్ధకమని మగవాని కామూఁడుకారణములఁబట్టియే మూఁడవస్థలు. మగవాఁడు తనబాల్యమందే స్త్రీని దెచ్చినయెడలఁ బాలుత్రాగుటకు. ఇదియొక కారణము. పడుచుఁదనమునందే తెచ్చినయెడలఁ బ్రక్కలోనికి; ఇది రెండవకారణము. వార్ధకమందే తెచ్చినయెడల వంటకొఱకు. ఇది మూఁడవకారణము. ఇప్పుడు మనము త్రిశంకుస్వర్గమువలె నడిమికారణమున వ్రేలాడుచున్నాము. పురాణము తెలిసియున్నతరువాత మాత్రము స్త్రీహరణమునకుఁ గారణము అడుగఁదగదు.

గో—సీతను హరించిన రావణుఁడేమయ్యెనో యెఱుఁగవా?

జయ—అది మనము కనులారఁజూచిన యంశము కాకపోవుటచేత పూచిపడి యిదమిద్ధమని నిశ్చయింపఁజాలము. పోనీ! స్త్రీహరణమువలనే రావణుఁడు చచ్చినాఁడని మాటవరుసకు నిశ్చయింపుము. వాల్మీకి దేనిని హరించి చచ్చినాఁడు! శత్రువిరోగమైన తరువాత మనతాత పైస్త్రీ నింగముఁగకుండ నింటిలో వంటచేయు గొల్లదానిని బెట్టుకొని కడుపులోఁ జల్ల కదలకుండ యుక్తివలెఁ గాలక్షేపము చేసినాఁడు. అతని తపస్సునకు నింద్రియనిగ్రహమునకు భంగము కలుగఁజేయవలయునని యూరిలో గొందఱు యత్నించిరి. కాని మనతాత కట్టుదిట్టముచే నాగొల్లది కదలుటకు వీలులేనికుంటిదగుటచేత వాతని తపస్సాంగతీతలమగుటకు నిర్విఘ్నముగాజరిగినది. శుకమహర్షిచావలేదా. ఒక్క

నిగ్గుగలమాట; గర్భములో శృంగారసమున్నంతకాలము మనజానకుఁ జావు
లేదు. మనశృంగారసంభాషణము నీవిదివఱకు వినియుండవు. ఇప్పుడు నీకట్టి
పుణ్యము లభింపనైయున్నది. గువ్వపిట్టలు కులికినట్లు కాఁకరపువ్వు వత్తులు
వెలిఁగినట్లుండునని నీవంటివారిచ్చిన యోగ్యతాపత్రికలున్నవి. ఇఁకఁ బదున
వన్నియు మన్మథబాణములని నిశ్చయపఱుపుము. అత్యుత్కూణీరమగుటచేతఁ
బుంఖానుపుంఖత కడ్డులేదు. ఇఁకఁ గాచికో.

గో—(తనలో) వీఁడు విశ్వామిత్రసృష్టిలోని ముండకొడుకేమో! శుద్ధబుద్ధిహీనుఁడు.
త్వరగ రెండు లెంపకాయలు గొట్టి సాగనంపిన బాగుగా నుండునేమో!

జయ—చంద్రునికేమి మన్మథమయమైన ట్లీదేహమున్నదే, ఇదియంతయు శృంగార
రసమయము. నీవు కనలేదుకాని యప్పుడే మనగర్భగోళములో రెండు సాత్త్విక
భావము లంకురించినవి. అప్పుడనఁగా నెప్పుడు? నారాయణ నారాయణ యని
యీకట్యపై నాఖాట మెప్పుడువైచితినో యప్పుడే; మొదటనే ప్రళయమను
సాత్త్వికావస్థ మొదటినుండి బయలుదేఱినది. ప్రళయమనఁగా నీకుఁ దెలియక
పోవచ్చును. స్త్రీనిఁజూచి యవశత్వము నొందుటే ప్రళయము. అది క్రమ
ముగాఁ గన్నులంబట్టి గిఱ్ఱునఁ ద్రిప్పినది. అది చూచి నీవు కునికిపాటులని
భ్రమించియుందువు. ఈభావముమాత్రము శృంగారరసములోఁ దలమున్కలైన
ముండకొడుకునకుఁ గాని ముందుగా నెన్నఁడు కలుగదు. సాధారణముగా
మొదటఁ గలుగవలసినది స్తంభము; కాని యొక్క చమత్కారమును మన
మిచ్చట జరిగించినాము. ఈయవశత్వములోఁ బందిరిమంచపు స్తంభము మన
కంటికిఁ దగిలించికొని యసలు స్తంభములేని లోపమును దీర్చి శాస్త్రగౌరవ
మును నిలువఁబెట్టినాము. పెండ్లికూఁతురుగారిని ప్రాణకాంతాయని పిలుచుట
యేదోయొక్క వెఱ్ఱి పూర్వాచారముగా జరుగుచున్నది. కాని యిది ప్రాణ
ముతోఁ జేరిన యంశము కాకపోవుటచేత నేనట్లు పిలువను.

గో—(తనలో) నేనింక సహించెదను. రోఁతగానున్నది. (ప్రకా) ఇది నీప్రాణ
ముతోఁ జేరిన యంశమని నిశ్చయముగా నమ్ముము. నీవు పొరపాటుపడు
చున్నావు. జాగ్రత్త.

జయ—అభిప్రాయభేదములు పశువులలోవలెనే మనుష్యులలో నప్పుడప్పుడుండ
వచ్చును. ఎద్దునకు వట్టిగడ్డి ప్రియముకావచ్చును. ఆవునకుఁ జెంగలిగడ్డియే
కాని యిష్టము కాకపోవచ్చును. ఇవి మనము గణింపము. ఎవరిగడ్డి వారే
తినునప్పుడేఁ జిక్కులేదు. పెండ్లికూఁతురుగారూ! (అని దీర్ఘముగా బిలు
చును.)

గో—నక్క యేడ్చినట్లుంతపిలుపేల!

జయ—మగవానికి వలపులేదు కావునఁ బిలుపే దీర్ఘముగా నుండఁదగినదని కళాశాస్త్ర
మర్యాద. పెండ్లికూఁతురుగారూ! మీరిట్లు పెండ్లికొడుకుగారియొద్దకు వచ్చి
యీయెడమచేయివైపునఁ గూర్చుండి- ఈకుడి యెడమల పట్టున్నదే- పెద్దపులి

వేసములకుఁ గంటెఁ బెండ్లికొడుకుల కక్కుర. కాదు. కూడదని- కుడిప్రక్కనే మోటతనముచేఁ గోరుచుంటి వని- ముందుగాఁ జెప్పుచున్నాను. ఇద్దఱలో నొకరు దక్కరు.

గో—అపనిని నీకొనరించుటకు సిద్ధముగా నున్నాను. చీర అదికమర్యాదను గాపాడుట కింక నూరకుంటిని.

జయ—మర్యాదకొఱకే మనము సందేహించుచున్నాము. సాధారణపుఁ గుటుంబములలోని పెండ్లికొడుకైనయెడల వెంటనే పెండ్లికూఁతును జేరును. మనము ప్రభువులలోని వారమగుటచేత మనయొద్దకుఁ బెండ్లికూఁతురు రావలసినదే. అన్యథా జరిగిన యెడల రాజమర్యాదకు లోపము. మొదటిమాట యామెది, మొదటి ముద్దామెది. ఊరకే పెండ్లికొడుకు తటస్థముగాఁ జచ్చినట్లుండవలసినదే. పెండ్లికొడుకు రవంతకదలి స్వతంత్రించినాఁడనఁగ నిఁకఁ బ్రభు గౌరవమునకుఁ బరశురామప్రీతి యైనదన్నమాటయే. మన పెద్దతాతగారు తనభార్యను భార్య యని యొప్పుకొనినయెడలఁ బ్రభుత్వ స్వాతంత్ర్యమున కెక్కడ లోపముకలుగునో యని యెన్నఁడొప్పుకొనలేదు. ఆమెకూడ నట్టి పట్టుదలతోడనే కాలక్షేపముచేసినది- మావారు మొదటినుండియు మర్యాదకొఱకుఁ జెడిచచ్చినవారు కాని మఱియొకటి కాదు.

గో—నీవుకూడ నటులే చావవచ్చును. అందుకొఱకు నేనేవత్తును. (మంచమునొద్దకుఁ బోవును)

జయ—సెబాస్! పెండ్లికూఁతురుగారూ! మీరిఁక గుడిహస్తములో నొక్కపారి మన చెక్కిలిపై ముద్దులకోడిముక్కు నాలిపినట్లు— ఏదీ? సందేహింపకుఁడు. మీ కిట్టిపనిలోఁ బూర్వానుభవము లేకపోవుటచేత నేను జెప్పవలసి వచ్చినది.

గో—(కట్టిగ లెంపపైఁ గొట్టును.)

జయ—(దౌడ పట్టుకొని యుండును.) పెండ్లికూఁతురుగారూ! తొందర పడకుఁడు. పాకము కొంచెము ముదిరినది. (కన్నులొత్తుకొనును) ఇదిగో చూచితిరా. అశ్రువను సాత్త్వికభావము. ఇదివఱకు రెండు. దీనితో మూఁడు. శృంగార శాస్త్రమెన్నటి కసత్యము కాదు. కొందఱు మోట పెండ్లికొడుకులు ముందుగా బెండ్లికూఁతురుగారలను గౌఁగిలించుకొందురు. ఇది పౌరుషమునకుఁ దత్రాపి-ప్రభుత్వమునకు శిరచ్ఛేదకమగు పని. ఏయేభావము లెంతవఱకుఁ గలిగినవో యని ముందు భావపరీక్ష చేయవలయును. పెండ్లికూఁతురుగారూ! ఇఁకముందు మీరు చేయవలసిన పని యేది?

గో—పెండ్లికొడుకుగారి యెడమప్రక్కను గూరుచుండుమనిగదా మీయాజ్ఞ.

జయ—ఒక్క మంచముమీఁద నాతో సమానమైన మట్టమునఁ గూరుచుండుట కాకఁ గొంచెము లోపము కావున నొక్క సద్యస్సాక్యము యుక్తిచేసెదను. అరలగడ యిటుపెట్టుము. దానిపైఁ గూరుచుండుము. మీకంటె నొక్క యంగుళమెత్తున

పైనఁ గూరుచుండినఁ జాలును. (గోవర్ధనుఁడు వైచిన తలగడపై జయరామ సింగు కూరుచుండును.)

(గోవర్ధనుఁడు ప్రక్క గూరుచుండును.)

గో—పెండ్లికొడుకుగారూ! ఇఁకముందు జరుఁగవలసిన దేది?

జయ—పెండ్లికొడుకుగారి రుచి బాగుగా మరఁగినావు కావున నుత్తర క్రియాచరణమున కుబలాటపడుచున్నావు. ఒక్క నిముసము శాంతింపుము. అదికాక యిది వఱకుఁ గలిగిన సాత్వికభావము- అశ్రువున్నదే- ఇది యింక నాఱలేదు. భావమునకు భావమునకుఁ గొంచె మెడ ముండినఁగాని సాంకర్యము కలుగును. ఒక్క నిముసము మర్యాదను గూర్చి మాటలాడుకొందము. ఇంతవఱ కేదియో చెప్పుచుంటిని. పరాకుపడితిని. ఈయశ్రుభావము మాత్రము కొంచెము పటుత్వముగాఁ బడినందువలన బుద్ధి కొంచెము చెదఱుచున్నది. ఇదివఱ కేది చెప్పుచుంటిని?

గో—(తనలో) వీఁడు చిన్నతనమునుండియు నెక్కువ గారాబముగాఁ జదువురాని తల్లిదండ్రులచేతఁ బెంపఁబడి పాడుచేయఁబడినవాఁడని తోఁచుచున్నది. వ్యాధి ముదిరిపోయినది. దీని కొక్క చికిత్స యున్నది. దినమునకు మూఁడుమూరు లీతనిఁ గొట్టుచుండిన యెడలఁ దాత్కాలిక శాంతి యగును. ఒక్క లెంపకాయతో రవంత మగలు మొగము పట్టినట్లు కనఁబడుచున్నది. (ప్రకా) పెండ్లికొడుకుగారూ! మాతండ్రిగారిని యేవో యారంభించి మానివైచినారు.

జయ—ఔను - మా తండ్రిగారొకప్పుడు క్రిందఁ దివాచిమీఁదఁ గూరుచుండియుండఁగా నొక తెలివితక్కువదాసి యెత్తుపీఁట నెక్కి గోడకు వెల్ల వేయుచుండెను. అది చూచి పోయెరా రాజమర్యాద యని చటుకున సమీపమున నున్న నిచ్చెనపైకి మాతండ్రిగా రెక్కఁబోయి నిచ్చెన జాఱఁగఁ బడిపోయిరి. కణతను దెబ్బ తగులుటచే నీవు నేను మాటలాడుకొనునంతలో దేహము చాలించిరి. మనము మర్యాద కొఱకుఁ బడి చచ్చినవారము నేఁజెప్పినమాట యందుకొఱకు. కుడియెడమలే కాక యెత్తుపల్లములు కూడఁ బ్రభువుల కాయువుపట్టులైన కళాస్థానములు. అందుకొఱకే నేను దలగడయో యని దేవులాడితిని.

గో—పెండ్లికొడుకుగారూ! నా కీ పూర్వపు గొడవలేల? ఇఁక ముందు మాటయేమి?

జయ—నీవు పెండ్లికొడుకుగారి వైపునఁ దిఁడునీటికిఁ దేఁప యెక్కిన ట్లెక్కుచున్నావు. నీకుడిచేయి నామెమీఁదినుండి చుట్టుకురువాటముగా రానిచ్చి కొంచెము దరికిఁ జేర్చుకొనుము. మాడు వెనుకటివలెఁ గాక నేఁబాకము లోనే వర్ధింపవలయును జుమా!

గో—(అట్లుచేసి) ఇదిగో పెండ్లికొడుకుగారిని దరిచేర్చుకొనుచున్నాను. (గట్టిగ సందిట నొక్కును.)

జయ—ఊఁ-ఊఁ-ఊఁ-ఊఁ. (ఉక్కిరిబిక్కిరై గ్రుడ్లు తేలవేయును.)

గో—(తనలో) నిర్భాగ్యపుముండకొడుకు చచ్చునేకాని వదలెడను. (వదలును.)

జయ—(కన్నులు మూసికొని కుడిచేయి ఆఁగుమాఁగుమనినట్లూఁచి గద్గదికతో) ఆఁగు, ఆఁగు రవంత కుమటఁబడనీ! చూచితివా! నీవు బాగుగాఁ గనిపట్టితివికదా! ఇప్పుడు కలిగిన భావమే వైస్వర్యము. దీనికే గద్గదిక యని యందురు. ఎనిమిది భావములకు నాలుగు గుణములు మనకు వచ్చినవి. ప్రథమతరగతిలోఁ గృతార్థతయన్నమాట. ఇఁక భావము లక్కఱలేదు.

గో—మృతియనునది కూడా నొకభావమేకాఁబోలు! అది నీకెప్పుడు వచ్చునో!

జయ—అది పెండ్లికూఁతురుగారి తత్త్వమునుబట్టి యుండును. అయినను నది సాత్త్వికములలోనిది కాదు. సంచారులలోనిది. మొత్తముమీఁద నిప్పటి కట్టితొందర లేదనుకొందును. ముందు మహారాజరోగదినము లున్నవి. ఇదివఱకు మనము చూచిన స్థలములలో మన్మథుఁ డింతదూకుడు కనఁబఱుపలేదు. తల్ప్రాణము తోఁకకు వచ్చునేమోయను భయము గర్భగోళమునం దుదయించినది. ప్రసవబాణములు వదలి మన్మథుఁ డిప్పుడు బడితె ప్రేటు లారంభించినాఁడు. మంచమెక్కినప్పు డతనిని ధ్యానింపకపోవుటచేత నిట్టియెదురెత్తునకుఁ గారణమై యుండును. నీకు మన్మథునిమీఁదిపాట యేదైన వచ్చునా?

గో—ఏడువవలసినప్పుడు పాట యెందులకు?

జయ—మనకుఁ బాటయని యేడుపని లేదా! ఒక్కటేతత్త్వము. అది పాటయే యనుము. నీయిష్టము. ఏడుపేయనుము. నీయిష్టము. ఒకసారి మాదాసికిఁ దేలు గుట్టినది. అందువలన నది యొకమూలఁ గూర్చుండి యేడ్చుచుండెను. నే నొకమూలను బెండ్లికూఁతుగారిని దలఁచుకొనుచుఁ బరవశుఁడనై పాడుకొనుచుంటిని. తేలుమంత్రము వేయువాఁడు లేచీఁకటిలో వచ్చి నాకు మంత్రము వేసి చక్కఁబోయినాఁడు. ఆశ్చర్యపడకుము. ముందున్నది చమత్కారము; దాసిదాని తేలుబాధ టక్కున శాంతించినది.

గో—పెండ్లికొడుకుగా రూరక మాటలు చెప్పుచు నాలస్యముచేయుచున్నారు. ఊఁ; ఈలాగైనయెడల నాకక్కఱలేదమ్మా. (మరలి లేచును.)

జయ—పాపము పెండ్లికూఁతురుగారికి సరిక్రొత్తకాఁబోలు. తగిన పెండ్లికొడుకౌటచే నన్నిముచ్చటలు నప్పపాటులోఁ దీరును. కాచికో. నారాయణా నారాయణా—యెత్తు మన్మథుఁడా జెండాయెత్తు, ఇదిగో వధూవరులు కలిసికొనుచున్నారు. దేవతలు పుష్పవృష్టి కురియవలసినసమయము! (కౌఁగిలించుకొనును)

గో—కుసుమవృష్టి కాదు. గుద్దులవృష్టి (జయరామసింగును మంచముమీఁదనుండి లాగి క్రిందఁ బడఁద్రోచి త్రొక్కును.)

జయ—నారాయణ! నారాయణ! భూశయనమా యేమి చెప్పుమా? కాకకిట్టునఁ దిరిగి సంచారులలోఁ బడియుండుమా! ఓహో! పెండ్లికూఁతురుగారు సప్తపాదాల త్రొక్కుచున్నారు కాఁబోలు! భార్యయు భర్తయుఁ బరస్పరమనుట

చేత చెప్పఁబడిన నేమిలెండు. కాని నిమ్మళము-నిమ్మళము - పెండ్లికూఁతురు గారూ! ఇక్కడి కన్నిపాదాలైనట్లు! అబ్బ! అబ్బ!

గో—ఇఁక గొంతుకమీఁద కత్తియుండానితో సైదు.

జయ—గ్రుడ్లువీఁదికి వచ్చుచున్నను నింక రెండు తరువాయి యున్నవా? అబ్బో! ఏడడుగులే యెంతకుఁ దెమలకుండ నున్నవేమి? ఒక్క నిమాస మాఁగుం. మన్మథుని ధ్యానింపక పోవుటయే యింతపుట్టిమునకకు బీజము. (అనిపలికి యీాదిగువ కీర్తన పాడును.)

మోహనరాగము—ఏకతాళము.

సుమశర-కాయజ-సరోజగృహాత్మజ-కరుణను జూడు.

(సంగతులతోఁ గష్టమునఁ బాడును.)

గో—ఓరి దౌర్భాగ్యుఁడా! ఇప్పుడు నీకు మన్మథధ్యానముకంటె మన్మథహరుఁడగు హరునిధ్యానము కర్తవ్యము. భూళయనసమయమున మోహనరాగముపైఁ గృతియా? ఇఁకఁ బాడినయెడల నోరు నొక్కెదను.

జయ—నాటకమర్యాద ననుసరించి పాడుచున్నాను. సగము చచ్చిన తరువాత పాడిన నాటకపాత్రల నే నెఱుఁగుదును. అమర్యాద ననుసరించి నేను బాడితిని.

గో—నిర్భాగ్యుఁడా! ప్రకృతిమర్యాదననుసరించి నాటకమర్యాదయా! నాటక మర్యాద ననుసరించి ప్రకృతిమర్యాదయా! తత్క్షణమున నీ ప్రాణము లెగురుటకు సిద్ధముగా నున్నవికదా? నీకెందులకురా పాట. పశువా! (తన్నును.)

జయ—అప్పుడే యంతిమదశకు వచ్చినదా? (ఏడ్చును.)

గో—ఛీ! పిత్రికిపండా! నిన్నుఁ జంపుట యొకటియుఁ గుక్కను జంపుట యొకటి యునా! పో. పో. (గోవర్ధనుఁడు వానిని వదలును.)

జయ—(లేచి) పితికిపండాయనిమాత్ర మెన్నఁడనకేమి? మనకున్న విశేషములే పౌరుషము బుద్ధి. పెండ్లికూఁతురుగారుకదాయని మెత్తఁదనముగాఁ బ్రవర్తించితిమి. ఇఁక మనబుద్ధియనునది లోకవిదితమే.

గో—ఇఁక నోరుమూయుము.

గీ. పరునిబుద్ధిని మెచ్చని ♦ వాఁడు శుంఠ
యందు ధీశాలియనువాఁడు ♦ మఱియుశుంఠ
తనదుబుద్ధిని స్తుతియించు ♦ కొనెడువాఁడు
శుంఠలందఱలోపల ♦ శుద్ధశుంఠ.

జయ—నీమాటలు మనకు నచ్చలేదు. నీవు చెప్పిన కడపటిజాతి శుద్ధశుంఠలలోనివారే ప్రపంచమున నూటికిఁ దొంబదితొమ్మండ్రు.

గో—(తనలో) బాగుగనే చెప్పినాఁడు. అవలయగతిలోఁ గర్మము చాలక పరిణమిన

దెబ్బ పడినట్లీమాట మూఢుడైన యీతనినోటినుండి కర్ణములపాలక బయలు వెడలినట్లున్నది.

గీ. తాను రతిదేవినని యాఁడు ♦ దాని కెట్లొ
సురగురునిభుండనని పురు ♦ షునకు నట్లె
కాంత యున్మాదగతి చర్మ ♦ గతమె కాని
పురుషునిది యాత్మగతము దు ♦ ష్కరము కరము.
స్వస్థచిత్తులైన ♦ జనులకే యీపిచ్చి
గొప్పకొలఁది ♦ గతులఁ దప్పదనఁగఁ
దల్లికడుపునుండి ♦ తలచూపినప్పుడే
పిచ్చిగలుగు కవుల ♦ పిచ్చి యెంతొ!
మూఁగ వెఱ్ఱి మఱియు ♦ వాఁగువెఱ్ఱియునంచు
వెఱ్ఱి రెండుగతుల ♦ వెలయుచుండు
వాఁగు వెఱ్ఱికోఁత ♦ బలుదిస్సమొలదాట
మూఁగ వెఱ్ఱి గడుసు ♦ బుఱ్ఱగలది.
తనదుకవిత మధువు ♦ లెక్కనకవితలు
గడ్డియనుచుఁ దెఱ్ఱ ♦ కవి వచించుఁ
దనగుణంపు బూర్వ ♦ ఘనులను గొనియాడి
కుటిలకవి స్తుతించు ♦ కొనును దన్ను.

(ప్రకా) పెండ్లికొడుకుగారూ! ఇఁక ముందాలోచనయేమి?

జయ—మన్మథునిగతి కొంచెము దిగపీఁకుడుగాఁ గనఁబడుచున్నది. చంద్రుఁడు మలయపవనుఁడు మొదలగువారు గోడమీఁదిపిల్లులవలెఁ దటస్థులైయున్నారు. కాని మన్మథుని బురికొల్పకుండనున్నారు. ఒక చిలుకపలుకుగాని యొక్క కోకిలకూఁతగాని చెవినిబడినయెడల నైఁమని యెంత కోలాహలమైనఁ జేయఁగలను! అదియు లేకుండనున్నది. ఇదికాక యీరాత్రి పెండ్లికూఁతురుగారి పట్టెయుట్టె యాకాశవిమానములో నాడించుటకై చిరకాల మభ్యసించిన యతులంకారశాస్త్రము కర్ణవిద్యవలె సమయమునకుఁ బనికిరాకపోవుటయేకాక మనకు భూశయనమువఱకుఁ దెచ్చినది. పరదేశభోజనములు దేహమునకు సరిపడకుండ నున్నవి. అదికాక యీరాత్రి లగ్నమునకు గురుబలము తక్కువగా నున్నది. ఇన్నిటికంటెఁ బ్రధానమైనది పిల్లి యడ్డముగా వచ్చియున్నదేమోయని సందేహముగా నున్నది. కావుననే మన మిప్పటికిఁబోయి రేపటిదినమున నధిలగ్నముండు (పోఁబోవును).

గో—అట్లు. కదలినయెడల గొంతుపిసికి చంపెదను. నోరు మెదలుపనైనఁ దగదు. మనమిద్దఱము కలిసి సాబసలోనికిఁ బోవుదము. ఇఁక నీవు నన్నుపేక్షింపకు, నీకు నేను దక్కుదానను గాను. ఈసంగతి యెవరితోడఁ జెప్పినవైనను నీప్రాణములు దక్కవు.

జయ—మనకుఁ బెండ్లికూఁతురుగారు సంభవింపనప్పుడు మనదారి మనదికాక మీబస కెందులకు !

గో—సాబసలో నీకుఁ దగిన కన్యకయున్నది. దానిని నీకిచ్చి పెండ్లిచేసెదను.

జయ—మనకుఁ బెండ్లికూఁతురుగారే కావలయునన్న పట్టులేదు. ఎటువచ్చినను రాజ్యముకొఱ కామెను మొదట నపేక్షించితిమి. నీ వంతవఱ కెఱిఁగియేయుందువు. రాజ్యవ్యవహార మిప్పుడు పెండ్లితో సంబంధములేకుండఁ జేసికొంటిమి. నేను ఒకటి పట్టుదలచే నీపని చేయవలసి వచ్చినది. ఆ పట్టుదలయైనను మనకుఁగాదు. మనయక్కగారికి—మీరెఱుఁగరా !

గో—ఛీఛీ! నీసొద నాకక్కఱలేదు. నేనేమియు నెఱుఁగను. ఎఱుఁగ నక్కఱ లేదు. కాని యిట్లే నోటిరొట్టుముగా నీరాత్రి జరిగిన వ్యవహారము వెల్లడించిన యెడల నాలుకఁ గోసెదను. జాగ్రత్త-వెల్లడింపవుకద.

జయ—గాయత్రితోడు.

గో—ఇఁక సరే రమ్ము.

జయ—కాని మీబసలో నెవ్వరో యున్నారంటిరే ?

గో—ఔను. నీకు సర్వవిధముల సరిపోయినకన్య యొక్కతెయున్నది.

జయ—మనకుఁ గన్యయే కావలయునన్న పెంకిపట్టువారము కాము. స్త్రీలలోఁ గన్యాత్వమే లేదని యొక ఋషిమతము. అందఱు స్త్రీలుకూడ గన్యలే యని మఱియొక్క ఋషిమతము ఇప్పటి స్త్రీలకు స్త్రీత్వమే లేదని మనమతము. పెండ్లికూఁతురుగారితో రహస్య మొప్పుకొనిన బాధలేదు. డింకొడివలె నాకంటి కానిన పెండ్లికూఁతు రెవ్వరు నాకంటఁ బడలేదు.

గో—అది నీకుఁ దగినదని చెప్పలేదా మనము పోవుదము రమ్ము. (తనలో) ఇప్పుడు స్త్రీవేషముతోడనే యూరికెంటఁ బోవలయుఁ గాఁబోలు. అయ్యో! ఎట్లు! నడిరాత్రి సమీపించుచున్నది. నన్నిప్పుడు చూచువారెవరరు ? చప్పున బసకుఁ బోయి మడుఁగుబట్టలు గట్టుకొనిన తిరువాతనే నాకళాలితను జూతును. పాప మాకాంత నాకొఱ కక్కడ వేచియున్నదికాఁబోలు!

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది పంచమాంకము.

శ్రీరామ

సరస్వతి

షష్ఠాంకము

ప్రదేశము—కాళికాలయ సమీపమున సత్రము.

ప్రవేశము—సరస్వతి పురుషరూపమున; కళాలలిత.

కళా—ప్రాణేశ్వరా! ఎంతకాలము నీకొఱకు నిద్రాహారములు లేక కనిపెట్టుకొని యుంటినో, నాప్రాణ మెంత తహతహలాడినదో నీ వెఱుఁగవుగదా! నిముస మొక్కవత్సరముగాఁ గడపితినే! ఇప్పుడా వచ్చితివి? ఇంతలో వచ్చెదనని కదా బాసచేసి నన్ను విడిచితివి!

సర—నాసఖునికొఱకు కాచియుండుటచే నాలస్యమైనది. (తనలో) ఎవతెను దప్పించుకొనవలెనని యేడ్చితినో దానియెదుటకే తిరుగ మగవేసమున వచ్చితిని.

కళా—సఖుఁడా? భటుఁడని యనుకొంటినిలే.

సర—సామాన్యసఖుఁడా? ప్రాణసఖుఁడు.

కళా—నీకీయూర నట్టివాఁ డెవ్వఁడు?

సర—ఈయూరనే కాదు. ఈప్రపంచమున నట్టివాఁ డున్నాఁడా? అతని కాతఁడే సాటి. అతఁడే నాప్రియుఁడు.

కళా—కళాలితుఁడేనా ?

సర—కాదా ? నాప్రభుఁడు. నాప్రాణము. అతఁ డింక నిక్కడకు రాలేదా ! ఈ యుత్సవములకు వచ్చునని చెప్పితివే!

కళా—అతఁ డీసరికి వచ్చియే యుండును. లేకున్న రేపు వచ్చును. నీప్రియుఁడు రాలేదని నీవెంత యిబ్బంది పడుచుంటివో నాప్రియుఁడు రాలేదని నేనంతయిబ్బంది పడుట యాశ్చర్యమేమి ! పోనీ ! ప్రాణేశ్వరా ! అతని బదులు నీవుంటివి గాదా ! లోకములో నెవ్వనికైనను భార్య కంటె బావ ఎక్కువవాఁడా !

సర—(తనలో) అట్లు కాదు. మగనికంటె నాఁడుబిడ్డ హెచ్చా యని యడఁగినది.

గీ. వలదు తమ్ముని కక్కఱకు ♦ వలదు మొదలె
అంతలేని నాకొక్కతె ♦ కంచు నేడ్చు
బాలగతి బంధుమిత్రులఁ ♦ బాఱఁదోలి
యేకముగ నాథుఁ గబళింప ♦ నింతివంత.

అయ్యయ్యో ! ఆమె నధిక్షేపింపఁబోయి నన్నే యధిక్షేపించుకొంటిని గదా !

సేవమాత్రము చేయుచున్న ప్రయోజకత యేమున్నది? నన్నుఁ బ్రాణముగా నెన్నుకొని భర్తగా భావించు నీమెను — నాభర్తకుఁ జెల్లెలైన యీమెను — నన్నుఁ బెండ్లిచేసికొనుట కిక్కడకు వచ్చిన యీమెను — దృణప్రాయముగా వదలి — నాకు భర్తతక్క యేదియు నక్కఱలేదని నాని భర్తకై విలవిలలాడు చుంటినిగాదా! నేనింతవఱకు రానందుల కీమెప్రాణ మెంతకొట్టుకొనినదో - సరే వచ్చితిని - కర్మము చాలక యిక్కడకుఁ బంపఁబడితిని. నేనేమి చేయఁగలను! ఒక్క ముష్టివాఁడు వేఱొక ముష్టివాని బాధ యెట్లు తీర్పఁగలఁడు. సరే నీ వావీధిని నే నీవీధిని ముష్టియెత్తుకుందమని చెప్పుటకంటె నాతని కేమి యుపాయము చెప్పఁగలఁడు? అట్లే ఇద్దర మీ యూరనే పతిభిక్షకై బయలు దేఱుదము. నాకు మగఁడు వచ్చినయెడల నాయొడి నిండును. నీకు మగఁడెవ్వఁడైన దొరకిన యెడల నీయొడి నిండును. అంతకంటె నేమున్నది? ఈబాధ వదలిపోవునని యిట స్త్రీవేషమునఁ బడియుండఁగాఁ దిరుగ మగవేషము నా కొంప ముంచినది. నన్ను జయరామసింగు బారిఁబడకుండ రక్షించిన మహానుభావుఁడు వచ్చునేమో యాతని కొక్క నమస్కార మర్పించుకొని యేదో యొక వంకఁబెట్టుకొని పాఱిపోవుటకైన నాకుఁ డింక రాలేదు. ఓ భగవంతుఁడా! ఏమిగతి!

కళా—ప్రాణేశ్వరా! మాటలాడవేల? భార్యకంటె బావ యెక్కువయా!

సర—ఎంతమాట! మగవాఁడైన వాని కే వస్తువైన భార్య తరువాతిదే కదా?

కళా—అలాగే, యాఁడుదియైనదాని కేవస్తువైన భర్త తరువాతిదే కదా?

సర—(తనలో) నాకు నామాటకంటె నీమాట యెక్కువ బాగుగా వచ్చినది. (ప్రకా) ఇంకను సందేహమా?

కళా—నాథా! నీకాఁకలి యగుచున్నదేమో భోజనము చేయరాదా?

సర—నాకాఁకలి లేదు. రెండుయామములు కావచ్చుచున్నది. ఇప్పుడు భోజనమేమి? నీవు భుజియించితివిక దా!

కళా—ప్రాణేశ్వరా! భుజియించిన యెడలఁ గడుపుమాత్రమే నిండును. నిన్నుఁ జూడఁగనే కన్నులు నిండినవి. మనస్సు నిండినది. రేపు నీతోడనే భుజియింతును గాని మనపెండ్లి యెప్పుడు?

సర—(తనలో) అయ్యకొర్మ్య! పెండ్లియా? ఇది మనకు బలికాని పెండ్లికాదు. ఆహా! వెఱ్ఱిదానా! పెండ్లి యెప్పుడని యడుగుచున్నావా?

ఆ. వె. మూఁగ మూఁగతోడ ♦ ముచ్చటాడినయప్పు
డంధుఁ డంధుఁగాంచి ♦ యలరు నపుడు
కవికిఁ గవికి మనసు ♦ కలసినయప్పుడు
నాకు నీకుఁ గంక♦ణాల సొగసు.

(ప్రకా) ప్రాణేశ్వరీ! మనమనస్సులు రెంటిను గట్టిగ బిగించి మన్మథుఁడు స్థిర ముగుముడి వేయునే వేసినాఁడు. ముడిపడవలసిన దక్కడఁగాని పెండ్లిలోఁగాదు. ఆ పెండ్లి జరుగనే జరిగినది. ఇంకను బెండ్లి యవశిష్టమని యేల యనుకొందువు! ఏమో యిది సావకాశముగాఁ దీర్చుకొనఁగూడదా యేమి!

కళా—ప్రాణేశ్వరా! అట్లు తొందరపడుట న్యాయమా? నీ విందుకొఱకా యింగమ ముడుచుకొనియున్నావు! నిన్ను బతిమాలుకొందును. పెండ్లియాత్ర యెంత సేపు. ఆయాచార మేదియో తీర్చుకొని—

సర—(తనలో) అయ్యయ్యో! నాకర్మము; నేనన్నమాట లేమి కిట్లగుచున్న్యా! నేను దొందరపడుచుంటినా? అయ్యయ్యో! పాతిపోవుటకుఁ దప్ప మరెందు లకుఁ దొందరపడుచుండుటలేదే. నాకుఁ దొందరయుండుటెవలె నీకేకర్మ మేమి! ఓయి భగవంతుఁడా!

గీ. నామగని తోడఁ దరువాత ♦ నన్నుఁగూర్చ
వచ్చుఁగాసి మున్ముందుగా ♦ భర్తనొకనిఁ
దగినవానిని దెచ్చి యీ♦తన్వికిచ్చి
నన్ను బ్రదికింపుమో జగ♦న్నాథ! దేవ!

(ప్రకా) ప్రాణకాంతా! నీయిష్టము. కాని యెవరున్నను లేకున్నను నా పెఁడ్లికిఁ గళాలలితుఁడుమాత్ర ముండవలయును. అతఁడు లేకుండ వివాహ మును నేనొల్లను.

కళా—అతఁడు తప్పకవచ్చును. ప్రాణేశ్వరా! మనకొక్క విచిత్రమైన యుద్యాన వనమున్నది. పెండ్లియయినతరువాత మన మా వనములోఁ గోకిలములతోఁ బాడుకొనుచుఁ, జిలుకలతోఁ బండ్లుదినుచు, భ్రమరములతోఁ దేనెఁద్రోలుచు- ఏమి? అట్లు సేయుట నీకిష్టమేనా? అలాగున నుందమా?

సర—(తనలో) పాడుటకుఁగాని, పండ్లుతినుటకుఁగాని, తేనెత్రాగుటకుఁగాని కావలసి నంత సమర్థతయున్నది. అంతవఱకే యైనయెడల ఓ—నీయిష్టమువచ్చినన్ని విలాసములు కనఁబఱుపఁగలను. కాని వెఱ్ఱిదానా?

ఆ. వె. మేడలున్ననేమి? ♦ మిద్దెలుండిన నేమి?
యుర్వి భాగ్యమెల్ల ♦ నున్న నేమి?
మగఁడు పనికి రాని ♦ మానినికెల్ల లో
కంబు వట్టి వల్ల♦కాడు గాదె?

సీ. కదలికను జూచి తళతళఁ ♦ గాంచి జలమ
టంచు మరుమరీచికల నా♦సించు గతిని

లాగు కట్టును బొట్టును ♦ బాగచుట్టఁ
గాంచి కటకటా! నన్నుఁ గాం♦క్షించినావు;
కల్లకెంపుల తళుకుచే ♦ నుల్లిసెట్టి
మణులసెట్టియై ప్రజల కొం♦పలనుదీయు;
సోగమీసాలగల్ పటా ♦ సొగసుచేత
కాతరుఁడు శూరుఁడై భూపుఁ ♦ గోతఁబెట్టు;
తేర గుత్తాలచేఁ జెట్టు♦దిగువ న్యాయ
వాది ఘనుఁడౌచు రాజ్యముల్ ♦ బూదిసేయు,
దొడ్డ రుద్రాక్షమాలచే ♦ దొంగ, బ్రహ్మ
వేత్తయై వితంతులకు వే♦విళ్ల నొసఁగు;
వేసమా! సాటి నీకేది ♦ పృథివిలోన
మంచిగా నెన్ని కొంపల ♦ ముంచినావో!
నీకె ప్రథమాధిపత్య మీ ♦ లోకమందు
మాటకంటెను బనికంటె ♦ మనసుకంటె.

ఆ. వె. ఎవతె మగనిబాధ ♦ హెచ్చౌట దానికే
ప్రకృతికాఁగ నాదు ♦ పాపమేమి?
ఏను నాదుమగని ♦ కేచ్చుట కంటెను
మిగుల నేస్తు నీమె ♦ మగనికొఱకె?

మానభంగమునుండి నన్నుఁ గాపాడిన యామహనీయుఁడగు నాసోదరుఁ డింకను రాకున్నాఁడు. ఎందుచేతనో! అతఁడు రాకుండ నిచ్చటనుండి పాఱిపోవుట బాగుగా నుండదు. అయినను నే నెవంకపెట్టుకొని యీమె నిప్పుడు త్యజింపఁగలను?

కళా—ప్రాణకాంతా! గంట కొక్కమాట పాడుచున్నావు. నీకు నిద్రవచ్చుచున్న దేమో యని యనుకొందును. రమ్ము పండుకొందువుగాని. నీకు వేఱె మంచ మున్నది.

సర—నే నచ్చటకెందుకు? మఱెక్కడనైన శయనింతును.

కళా—నాథా! అభ్యంతరమేమి? నీ వెక్కడికిఁ బోఁగూడదు. ఇదివరకు నిన్ను వదలి పడినబాధ చాలదా? రమ్ము. (మీఁదఁ జేయివైచును.)

సర—(తనలో) అయ్యయ్యో! ఇప్పు డేమిచేయుదును. మానరక్షకుఁడవగు నోసోదరుఁడా!

ఆ. వట్టి వ్యర్థుఁడైన ♦ పతినుండి రక్షించి
తెంచు మిగుల సంత♦సించినాను
మఱియు వ్యర్థపతిని ♦ మగువ కీమెకుఁ దార్చి
యేల బాధఁ గూర్చి ♦ తిరువురకును.

హరిహరీ! నిన్ననకేల ? నీ వేమి యొనేఁగియుందువు ? నీ బసయైన యీ మూఁడవగది కింకఁ బోవుచుండఁగనే యీమె నన్నడ్డుదగిలినదే. (ప్రకా) ప్రాణేశ్వరీ! నా గదికిఁ బోయి నేను బండుకొందును.

కళా—నే నేమిచేయఁగలను ? నన్ను క్షమింపుము. ఒక్క యీ రాత్రియే మన కీ బాధ.

సర—(తనలో) నిజముగా నొక్క యీ రాత్రియే. భగవంతుఁ డట్లే యనుగ్రహించుఁగాక! ఇఁక గొజ్జాముగఁడు నీకు వలదు. కొవ్వుదారి పెండ్లాము నాకు వలదు. లంఘనాలదాని నన్నము లేనిది యాచించిన ట్లెందుల కీ వ్యర్థబాధ.

కళా—కురంగీ ! కురంగీ !

సర—అదియెందులకు ?

కళా—సరి సరి. ఔను. అది నీయెదుటఁ బడనీయఁగూడదనుకొంటిని గాదా ! నీకుఁ బ్రక్కను దచ్చుటకు రమ్మంటినికే.

సర—అక్కఱలేదు.

(నేపథ్యమున నిమ్మళముగా) కురంగీ ! కురంగీ !

కళా—ఎవ్వరో కురంగిని బిలుచుచున్నారు.

సర—(తనలో) అయ్యయ్యో ! అకంఠరవ మిదివఱకువినినదే. అతఁడేమైయుండునా?
(నేపథ్యమున) ఎవరు నన్ను బిలుచువారు ? (తిరుగ నేపథ్యమున మఱియొక్క కంఠరవమున) ఎవ్వరా ? నిన్ను రామపుర రాజ్యమునకు రాణిగాఁ జేయవచ్చిన మనమే, ఇదిగో మనమే.

కళా—అదేమి అదేమి ?

సర—(తనలో) అయ్యయ్యో ! వాఁడే ! నా సోదరునిఁ జంపినాఁడు కాఁబోలు. నా జాడ కనిపట్టి యిటకు వచ్చినాఁడు కాఁబోలు. అటులైన నాతఁడు కురంగి నెందులకుఁ బిలిచినాఁడు. కురంగిపే రితఁ [illegible]గునో. అయినను దొందరపడక నిదానింతును. (ప్రకా) ప్రాణేశ్వరీ! మ[illegible]యుఁ దొందరలేదు. కురంగికి మగఁడు వచ్చినాఁడు.

కళా—నిజముగానే. నిజముగానే. ఇప్పుడెక్కడనుండి వచ్చినాఁడు? ఎవఁడు? రామపుర రాజ్యమున కీముండను రాణిగాఁ జేయుదు ననుచున్నాఁడేమి ?

సర—ఓహో ! ఎవ్వరి యదృష్ట మెట్లున్నదో !

కళా—నిజముగా దాని కట్టి మంచిమగఁడు దొరికినయెడల నమ్మవారికి నేను నా మెడలోని హార మిచ్చెదను.

సర—నా పుణ్యమున నాతఁడు దానినే పెండ్లిచేసికొనినయెడల నేను నూరు కాసులను గాళికమ్మ కిచ్చెదను.

కళా—అక్కే! ఆఁడుదానిలాగున నీవుగూడ నమ్మవారికే మ్రొక్కుకొంటివేల ?

సర—(తనలో) ఈడ్చి నేల నడచికొట్టినది. పైగుడ్డకే ప్రకృతిని మార్పఁగలిగినయెడల నట్టిలకట్టు జంగమే బ్రహ్మయగును గాదా. అహా ! మగవాఁ డాఁడుదాని ననుకరించినాఁ డనఁగ వాఁడుదానికెంత యసహ్యమో కనఁబడినది కాదా ! అక్కే? యని తృణప్రాయముగాఁ దీసివైచినది. ఆఁడుది యట్లే మగవాని ననుకరించినయెడల మగవానికిఁగూడ దానియందంత రోఁతయుండకపోవునా ! నేను మగవేసమున నుంటినని నా నాథునితోఁ జెప్పక పోవుట యెంత మంచి పనియయ్యెనో ! అహా ! తాను వలచు వస్తువు తనకంటె సర్వవిధముల భేద ముగా నున్నఁగాని యట వలపెక్కనే యెక్కదు.

గీ. కాలరూపుని గోరు బం♦గారుబొమ్మ
శ్రీరమాదేవి విష్ణునిఁ ♦ జేరినట్లు ;
నల్లనగు నామె కాంక్షించుఁ ♦ దెల్లవాని
భవునికర్థాంగియైన శాం♦భవినిబోలె.

స్వరూప వైపరీత్యమేకాక స్వభావ వైపరీత్యము కూడ వలపునకుఁ బెద్ద కార ణము. ఇది నాకు స్ఫురించినదికాదు. ఇప్పుడు మనస్సునఁ దళుక్కుమనినది.

గీ. ఎల్లజగతియు మనసులో ♦ నిమిడియుండు
నదియె చదువంగఁ దగు; వేలు ♦ చదువులేల ?
గ్రంథభండారమెల్ల న♦క్కడనె వెలయుఁ
బై చదువులెల్లఁ జిలుకల ♦ పఠన గతులె.

(ప్రకా) ప్రాణేశ్వరీ! ఆఁడుదానిలాగున నమ్మవారికి మ్రొక్కుకొంటివేల యని యం టివి. భార్య కొక దేవత భర్త కొక దేవతయునా యని యట్లొనర్చితిని. అది కాక సర్వవిధముల నీకు పతుఁడనైన నేను నీవంటి యాఁడుదాననే యనుకొనుట తప్పులేదులే.

కళా—నాథా ! నే నట్టి ప్రాల్లభ్యమును గనఁబఱచుదానను గాను, భర్తకు సర్వదా విధేయను.

సర—సరే—నీవట్టిదానవె కావచ్చును గాని నిన్ను స్వాధీనపఱచుకొనిన దాఁక నాకు బింకమేది !

కళా—నాథా ! అట్లనుట తగునా ? పడినప్పు డింకఁబఱచుకొనుట యెందులకు ! నన్ను

నిరాకరించినను నీయింటికి దాసినై నేను రాలేదా? ఏదీ! నిన్ను నాగదిలోఁ బండుకొమ్మని నేను గోరఁగఁ బైకి లేచిపోవుదు వనుచున్నావు!

(నేపథ్యమున) లేచితివా కురంగీ! కురంగీ!

(తిరిగి నేపథ్యమున మఱియొక కంఠరవమున) లేచితిని—కజ్జికొలకు పిదకువున్నాను.

కళా—ఈమూర్ఖురాలు రాజాగారిని గొట్టునుగాఁబోలు. అదిగో! వారిద్దఱిటకే వచ్చుచున్నారు. మన మావలిప్రక్కనుండి చూచి సంతసింతము రా. వారు మనకుఁ గనఁబడుదురు. మనము వారికిఁ గనఁబడము. ఇచ్చట నుందము.
(వారట్లు దాఁగియుందురు.)

(జయరామసింగు కురంగి కజ్జితోఁ బ్రవేశము.)

సర—వారి శృంగారసంభాషణము మనము వినవచ్చునా!

కళా—అఁ! నాదానిదియేకాదా? పాపము దానిపెండ్లికూడఁ జేయఁదలఁచితిని. మగఁడు కుదిరినయెడల బాగుగానుండును. నోటితూలు దగుటచేఁ గుదురనీయదు.

సర—నీదాని కావున నీవు వినుము. నేనుబోయి—ఎందులకనే—నేనుగూడ నుండెదను. ఈముండకొడుకును గురంగియు నొకరినొకరు గ్రుద్దుకొనుచెడల నేలుచేయుట కైనఁ బనికివత్తును. (తనలో) ఈముండకొడుకు సంభాషణలో నా మానరక్షకుని సంగతి యేమైన వెల్లడియగునేమో విందును.

కురం—నీ వెవఁడవురా?

జయ—మహాప్రభూ! మీ కేదేశ పరిపాలకులని యెవ్వరైన నడుగుట కంటె నీవెవ్వఁడవురా యని యడుగుట మనకు మహామృదువుగాను భక్తిపూర్వకముగాను నున్నది. మృదుత్వ మనునది మాటలోఁ గాదు నోటిలో నున్నది. దంతములచేత నీమాట యింతఁ గొంచెము పరుషముగా నున్నది కాని యవియన్నియు నూడఁదీయించిన యెడల వట్టి నల్లిపోతు. మా మేనమామ యభిచారవిద్యా పారంగతుఁడు; అతని కొకసారి యొకచిత్రము జరిగినది. అయనకు రాత్రి వఱకు దంతము లన్నియు నున్నవి. తెల్లవాఱి లేచి పండ్లు తోముకొనుటకు పన్నావాము చేయుచుండఁగా బాబూ! మీకుఁ బండ్లులేవని భటుఁడు హెచ్చరించెను. అప్పు డాతని మాటమృదుత్వము చెప్ప వీలులేదు. బూరుగదూది గోమయము.

కురం—నీ వెవ్వఁడవని యడుగ వెత్తిచదువులు చదివెదవేల? నేను మంచిదానను గాను. ఇదిగో కజ్జి—ఇట్టే మాయక్క తన్ను నిద్రనుండి లేపిన మంగలివైద్యుని మగఁ డనుకొని కోపమున ముక్కు కొఱికినది.

కళా—నాథా! అతఁడట్లు మాటలాడుచున్నాఁడేల?

సర—ఓటికుండ యంతకంటె బాగుగాఁ బలుకునా!

కళా—అలాగా? అట్లైనఁ గురంగి కజ్జిదెబ్బచే భిన్నమగునేమో?

జయ—మన మెవరమని నీవు నన్నడిగితివి. ఎవరమని చెప్పఁగలము—అన్నియు మనమే

యయినప్పుడది యెట్లు నిర్ణయింపవచ్చును. సంక్షేపముగాఁ జెప్పెదము. పెండ్లికూతురుగారి వెనుకటి మంగళము. రామపురరాజ్యమునకు ముందటి రాజాలము.

సురం—పెండ్లికూఁతురుగా నెవరు? మాపిన్నమ్మ సరిగ నిదియే మాదిరి వెనుకముగఁడని ముందుముగఁడని ప్రక్కముగఁడని పంతుగముగఁడని వెచ్చపుముగఁడని పీఁతలలో జాతులు తీసినట్లు వేలుచేయుచుండెడిది.

జయ—పెండ్లికూఁతురుగా నెవరనఁగ— రామపుర రాజకూఁతురు. ఆమె మనకొక వ్రేలువిడిచిన మేనగోడలు. అయిదువ్రేళ్లువిడిచిన పెండ్లికూఁతురుగారు.

కళా—ప్రాణేశ్వరా! రామపురరాజకూఁతు రెవతెయో నీ వెఱుఁగుదువా?

సర—నే నెఱుఁగుదును. నీ వెఱుఁగుదువు. నీవ నేకపర్యాయము లామెను జూచియుందువు. గుర్తులేదు కాని—

కళా—నీవు పొరపాటుపడుచున్నావు. లేదుసుమా!

సురం—మా మూసలమ్మ చెల్లెలు కాశీవెళ్లినది గంగాస్నానముచేసి కామినిని వదలుచుకొనుటకు. అక్కడ నామెకు జబ్బుచేసినది. గుర్తు తెలియక పశువుల యాసుపత్రిలో ముడిచిపెట్టుకొని పండుకొనెను. పశువుల వైద్యుఁడు వచ్చి యామె రోగమును జూచి కుక్కయనుకొని రెండుచెవులను కత్తిరించెను. మనగ్రామమునకు వచ్చినతరువాత నీచెవులేవియని యూరివారడుగఁ గాశీకిఁ బోయినవారిప్పుడు కాయగూరలు విడుచుట మాని కర్ణములు విడుచుచున్నారని చెప్పినది. అప్పటినుండియు మాయింటివారికిఁ జెవులు విడిచినవారని పౌరుషనామము కలిగినది. కాని అయిదువ్రేళ్లు విడిచిన పెండ్లికూఁతురని యంటివేల?

జయ—ఆమె యయిదువ్రేళ్లు మనదాదపై విడిచినది. తెలిసినదా? ఇదిగో మాదు సప్తపాదాలు మనగొంతుకమీఁద విడుచుటకు సిద్ధముగాఁగాఁ బౌరుషమే ప్రధానమైనవారము కావున, నాఁడుదానిని జేయిచేసికొనక మర్యాదగా గిరుక్కునఁ దిరిగివచ్చితిమి. నీవు మనవలెనే యుపాఖ్యానాలు చెప్పుటయం దుత్సాహముగల దానవగుటచే నిన్నుఁ జూడఁగనే మన గర్భగోళమునను న్న మన్మథుఁడు కవ్వున నార్చినాఁడు. మన యన్నగారు మనయమ్మ దానియగు కుందరదన కట్టుడుపండ్ల నొక్కసారి లాగినప్పుడది యాతని మొగముపై థూయని యుమిసినది. అన్నగారట్టె చెక్కుచెదరక పౌరుషప్రధానుఁడగుటచేత నీవృత్తాంతము వెల్లడికాకుండునట్లుగా, లౌకికశిఖామణి కావున దాని రెండు కాళ్లు బట్టుకొనెను. మఱియొక పిత్రికిముండకొడుకయిన యొడల గయోపాఖ్యానమంత గత్తరయయి యుండవలసినది. ఆపద్ధతిగానే పెండ్లికూఁతురుగారి యెడల మనము వర్తించితిమి.

సర—(తనలో) నేను బ్రతికితిని. నామానరక్షకుఁడు సుఖముగానున్నాఁడు.

కళా—ఇంతవెఱ్ఱిముండకొడుకు నింకఁ గట్టుకొని చేయక సురంగి యింక నుపేక్షించు

చున్నదేహా ?

సర—ప్రాణేశ్వరీ! ఆఁడుదానవుకదా! అది నీదానికదా? ఈమాత్రమే కనిపట్టలేక పోయితివేమి?

కళా—ప్రాణేశ్వరా! నిజముగా నదియేనా? నాకు మనస్సున స్ఫురించినదికాని నీవధిక్షేపింతువేమో యని పైకిఁ బలుకుటకు సందేహించితిని. కురంగి యీనిర్భాగ్యుని వలచియేయుండునా?

సర—నిర్భాగ్యుఁడేమి; రామపురరాజు.

కళా—ఈముండ రాణికావచ్చునని యాసపడినది కాఁబోలు;

సర—అటుగాదు వలపుగాక యదియేమి?

గీ. కన్నులరవ్రాలెఁ జెక్కిటఁ ◆ గరముపడియె
నుబికె చిఱునవ్వు చెవిప్రక్క ◆ కొత్తిగిల్లెఁ
బైటయదరె బొట్టనవ్రేల ◆ వ్రాసె నేల
నింతలో మూర్ఛఁ గాలూఁత ◆ నెన్నివరులొ.

కురం—మా మేనమామ మనుమరాలు పొగచుట్టకొఱకు మాయింటికివచ్చి యామాట చెప్పక అమ్మవారిజాతరనుగుఱించి కుక్కల పిచ్చినిగుఱించి కవుల తగవులను గూర్చియుఁ జెప్ప మొదలుపెట్టినది. మాయమ్మ యీలాగుననే దానిని జెవి పట్టుకొనిజాడించి కాలిమీద నొక్కతన్ను తన్నినది. (అట్లుతన్నును.)

కళా—ఇది విలాసముగాఁ దన్నిన తన్నుసుమా!

సర—గాడిదశృంగారమనఁగా నిదియే.

జయ—సెబాస్! మన్మథుఁడు ఢంకా మ్రోగించుచున్నాఁడు. (పాడుచున్నాఁడు.)

దండిదండిపాయిమన్మథుఁడు-డప్పుకాచికొట్టినాఁడుమన్మథుఁడు
గాడిప్రొయ్యిత్రవ్వినాఁడు మన్మథుఁడు - గరిటెకాఁడఁ ద్రిప్పి
నాఁడు మన్మథుఁడు-పఱవకువెళ్ళినాఁడు మన్మథుఁడు - పంది
కొక్కునుజంపినాఁడు మన్మథుఁడు-సింహాపీఠమెక్కినాఁడు మన్మ
థుఁడు-చెప్పుదెబ్బలుకొట్టినాఁడు మన్మథుఁడు-దండిదండిపాయి
మన్మథుఁడు-డప్పుకాచికొట్టినాఁడు మన్మథుఁడు.

కళా—అయ్యయ్యో! అట్లు పాడుచున్నాఁడేల?

సర—ఏడువలేక.

కురం—నీకేమి పిచ్చియా? అట్లు పాడెదవేల?

జయ—పిచ్చియనునది సంచారిభావములలో నొక్కటి. సాత్త్వికములు రాకుండనే సంచారిభావములు మనకు గంగవెఱ్ఱులవలె వచ్చినవి. మన్మథునికింత తుఫాను

పట్టుటమాత్రము మన పెండ్లిగమా. ఇదివఱకు మనము చూచినస్థలములలో నింతసన్నిపాతముమాత్రము మనకుఁ గలుగలేదు.

సురం—ఏమీ ? ఇదివఱకుఁ జూచినస్థలములా ? అన్నిస్థలములు చూచి యిప్పుడా యిక్కడికి వచ్చితివి! చాలుఁలే—నడునడు. (కత్తి యెత్తును).

కళా—అమ్మ నీవగలుమంద—ప్రాణేశ్వరా వింటివా ?

సర—ప్రేమార్ద్రితచేఁ బెద్దపులియైన మెత్తఁబడునుగాదా!

జయ—ఈస్థలముతక్క మఱి యేస్థలమైనఁ జూచినయెడలఁ దండ్రిని జంపినట్లు.

సర—ఛీ. ఛీ. నిర్భాగ్యుఁడా !

సురం—ఎన్నోస్థలములు చూచినట్లు నాతో నేల యసత్యమాడవలెయును ?

జయ—మర్యాదకొఱకు-పౌరుషముకొఱకు-చంపినరోగులఁబట్టి వైద్యునికి ఘనత-పాడు చేసిన గ్రంథాలఁబట్టి కవికి ఘనత-దిబ్బలుతిర్చిన రాజ్యాలఁబట్టి న్యాయవాదికి ఘనత-లాఁగిన పైటలనుబట్టి రాజానకు ఘనత-అందుకొఱ కట్లేడ్చితిమి.

సురం—నాకీగొడవయంతయు నేల ? నీవు నిజముగా రాజవేనా ?

జయ—కాకపోయినయెడల నీయెడమకాలితో మూతిమీఁదదన్ను-నెత్తిమీఁద శతకో పముకంటె నాకది యెక్కువగౌరవము. మనకుఁ గావలసినది మర్యాద-మర్యాద యనునది పరులకన్నులలో నున్నది కాని మనగర్భములో లేదు, అందుచేత మర్యాదగా నీనాలుగుగోడలనడుమను నీవెన్ని చెప్పుదెబ్బలుకొట్టినను మనకది సత్యనారాయణప్రసాదమన్నమాట-రాజమర్యాదకు ధర్మసూక్ష్మమిది.

సురం—అటులైన నీకు రాజ్యమెప్పుడువచ్చును ?

జయ—దైవకటాక్షమున రామపురరాజాన కిప్పుడు జబ్బుగా నున్నది. మనమక్కడ నున్నయెడల విసముపెట్టి చంపినామను నపయశస్సు మనకు దక్కునేమోయని—

సర—(తనలో) నాతండ్రీ! నీకు జబ్బుగానున్నదా ? ఈనిర్భాగ్యురాలు నిన్నువిడిచి యిచ్చట నాఁడుదానికి మగఁడుగా నున్నది. నీకు దిక్కెవ్వరు ? నాతండ్రీ! భార్య రండవది. కొడుకెవ్వఁడులేఁడు. ఉన్నకూఁతు రీవిధముగా నున్నయి నది. ఒకవేళ నీముండకొడు కసత్యమాడియుండునేమో ? భగవానుఁడా! మాతండ్రిని రక్షించు రక్షించు.

కళా—ప్రాణేశ్వరా ! అస్థిమితతగా నున్నట్లుంటివేల ?

సర—నాకిక్కడనుండుట రోఁతగానున్నది. పోయి పండుకొందును.

సురం—ఆయనతరువాత నీవు రాజవుకాఁబోలునేమి ?

జయ—నీవు రాణివి. నేను రాజను. నీవు కృతిపత్నివి. నేను కవిని.

సురం—మా ముసలమ్మ కొక్క పూజారికవి గణపతికథను కవిత్వముకట్టి కృతినిచ్చెను. ఆమె కవి నెట్లు బహుమానించెనో యెఱుఁగుదువా? సగముజీతమిమ్మీదఁ దనయక్కను కొలదినము లుంచుకొనుమని కవి కుత్తరువుచేసెను. పుస్తకభండా

రములకు మేము సగము వెలలేని మాగ్రంథము లిచ్చుచున్నాము. కావున నీయేర్పాటు నాకు సమ్మతమేయని కవి యందుల కొడఁబడెను. నీకృతికి నేనేమి బహుమాన మీయవలయునా యని చూచుచున్నాను.

జయ—ఈడింకికోడిరయే నాకు బహుమానము. (కురంగి ముక్కు నలుపుచున్నాఁడు.)

కురం—(జయరాముని మూతిపైఁ గొట్టుచున్నది.)

సర—ప్రాణేశ్వరీ! పాదుషారమ్మన్నను బోపాయను స్వభావముగల దాననని నాతో నిది యనినది. ఇప్పుడిట్టి యూపందకుఁ దక్కినది. కూఁతలకుఁ జేఁతల కెంత వ్యత్యాసమున్నదో చూచితివా?

కళా—కాని నాథా! ఇది మనలవిడిచి పోవును. ఏతెలివితక్కువపెద్దమ్మ రాజున కైన రాణియై సుఖపడునెడల నంతేకావలసినది.

సర—దాని వెంగము దానిపోర.

కళా—ఇదియంతయు నసత్యమేనా?

సర—ఏదో పోనిమ్ము—మనకెందులకు?

కురం—నిన్నుఁ జూడఁగనే నీయందు నా కనురాగము కలిగినది. రాజ్యమునుబట్టి కొంత కలిగినది. నీచేతవాతఁగానితనమువలన, నీవెత్తిముండకొడుకుఁదనమువలన మఱికొంత కలిగినది.

జయ—మన మట్టివారమనియే కొందఱు మూఢు లనుకొనుట కలదని మనము కర్ణాకర్ణిగా వినియున్నాము.

కురం—లోకమంతయు నేకగ్రీవముగా ననఁదగినమాట యిదియొక్కటియే. అందు కొఱకే నిన్నపేక్షించితిని. మగఁడెప్పుడు పనికిమాలిన తెలివిమాలిన నోరుమాలిన చచ్చుపెద్దమ్మయై యుండవలయును. సర్వసుఖములు పొందఁదగిన యాఁడు దట్టివానిని గట్టుకోవలయును. అట్టి యధమాధమ తత్త్వము నాకంటఁబడినది.

జయ—సరే. తత్త్వపరీక్ష యెందులకు కాని మనపెండ్లి యెప్పుడు?

కురం—ఇప్పుడేనాయేమి!

జయ—గ్రహచారజ్ఞాననిధులు పైమాసములోఁ బ్రళయమునకు ముహూర్తముంచినారు. అలగ్నమందా శుభకార్యము జరుగునేమో? ఒక్కగడియ వృథచేసినయెడలఁ గార్యములేదు. ఉత్తరజన్మములోని ముచ్చటలుకూడ నీనెలలోనే తీరవలయును.

కురం—సరే. అట్టివాఁగక నీవు కాళికాలయమునఁ బండుకొనుము.

జయ—ఇప్పటికింతే! మన్మథుఁ డిప్పటికిఁ బోదిబుజమునఁ దగిలించికొని పోవలసినదేనా?

కురం—పనిలోఁ బని—తల గొఱిగించుకొనియే పొమ్మనుము.

(జయరాముఁడు నిష్క్రమించును.)

సర—ప్రాణేశ్వరీ! నేనింకఁబోయి వందుకొందును. (తనలో) తూర్పు తెల్లఁవాఱుటకుఁ జూచి నా మానరక్షకుఁడు రాకున్నయెడలఁ బాతిపోయి మఱెక్కడనైన దాఁగి నానాథునికొఱకు చూచుచుందును. (పోవును.)

కురం—మాయమ్మతో నాథునిసంగతిఁ దెలిపెదను. (పోవును)

కళా—హా! ప్రాణేశ్వరా! తెల్లవాఱవలయునుగాదా— నిన్నుఁదిరుగ నెంతకాలమునకుఁ జూతునో?

(నిష్క్రమింపఁగ అవీధినే మఱియొకకొనను.

(ప్రవేశము గోవర్ధనుఁడు స్త్రీరూపమున)

గో—ఇదిగో వచ్చెదనని యీసందులోనికిఁ బోయినాఁడు. ఇపుడేవచ్చునో యవంత సేపటికి వచ్చునోయని గంటనుండి కనిపెట్టియుంటిని. దొంగముండకొడుకు! నాతో నిన్ను నాబసకుఁ దీసికొనిపోవుదునని చెప్పియు సత్రములో నాబస అయిదవగదియనియు దానిపేరు కురంగి యనియు నోరుజాఱఁజెప్పితిని. అక్కడికి నాతోఁ జెప్పకుండ ముందు పరిగెత్తుకొనిపోయినాఁడేమో? దానిని జూడవలయునని యుత్సాహ మెక్కువగా నున్నదికాఁబోలు! ఈసరికి మాటలాడుచుండునేమో? వారిద్దఱి యువకులవక సంభాషణ వినవలయునని యనుకొంటిని. నాదేవియగు కళాలలిత బసచెప్పితినిగాని మూఁడవగదియైన నాబస చెప్పియుండిన యెడలఁ గొంప మునిఁగియుండును. ఈతఁడు బలాత్కరింపఁ బోయిన కాంతయొద్దకే తిరుగ నీతఁడు పోయినయెడల నింకేమైన నున్నదా? అయినను బురుషరూపమున నున్నదికదా! ఆమె ధరించిన దుస్తులచేతనే నన్నామెగా నీతండు భావించినాఁడు. స్వరూపభేదము నెంతమాత్రమును గ్రహింపలేదు. పట్టి తెలివితక్కువ నిర్భాగ్యుఁడు. ఒకవేళ, బ్రదికితినిగదా యని కాలుకొలఁది మఱెక్కడికైనఁ బాతిపోయినాఁడేమో! ఒక్కసారి పిలచి—ఏమనిపిలువను? పేరెఱుఁగను. ఓ పెండ్లికొడుకుగారూ! ఊహు - నేనింక సత్రమునకుఁ బోయెదను. హా కళాలలితా! ఇంతలో వచ్చెదనని చెప్పి యెంతయాలస్యము చేసితినో! హా! కళాలలితా! ప్రాణమంతయు నీయొద్దనే యున్నది. బొందిమాత్ర మిచ్చటఁ దిరుగుచున్నది.

(కళాలలితుఁడు ప్రవేశించును.)

కళా—(గోవర్ధనుని జూచి గడగడ వడకుచున్నాఁడు.)

గీ. తేజమో గానమో ప్రేమ ♦ దేవియేమొ!
హృదయమును జీల్చుకొని పైకి ♦ నెగిరి వచ్చి
ముందు నిల్చు గోవర్ధన ♦ మూర్తియేమొ
స్వప్నమో మూర్ఛయో చావొ ♦ పరిణయంబొ!

(నేలవ్రాలి మూర్ఛపడును.)

గో__హా! ఇదేమి? (అతనిసమీపించి) అయ్యా! అయ్యా! (విసరును.) ఇంకను లేవకున్నాఁడు. "హృదయమును జీల్చుకొని పైకి వెగిరివచ్చి, ముందు నిల్చి గోచరించుమూర్తియేమొ" యని యీతఁ డనినాఁడు ఆహా! ఈతఁడు నాకు ద్వితీయభర్త కాఁబోలు. వెనుకటి మగఁడు నావలన నేమి సుఖపడినాఁడని యీతఁడు నన్నాసించెనో! అహా! పాపము. గాఢమైన మూర్ఛావస్థలో నున్నాఁడు. నాపేరతఁ డెట్లెఱుఁగునో తెలియదు. ఏకాంతమైన యిచ్చట నైన నేనెఱుఁగకుండ వలచియుండి నాకొఱకు వేచియుండి యుదకు నన్నుఁ జేరుటకే పురుషవేషమును ధరించి వచ్చియున్నదా? అట్టిదేయైనయెడల నీమె నుండి వచ్చుగాలియైన నాకుఁ దగులఁగూడదు. కళాలలితాకాంతుఁడనైన నాకీమె పరస్త్రీ—ఒక్కవేళ నారూపమునే గల యొక్క కాంత నీతఁడు ప్రేమించి నన్నే యదియని భ్రమించియుండునా? వెనుక భ్రమయని భ్రమను బట్టియు, నీతని భ్రమనుబట్టియు నాప్రతిబింబమైన యొకకాంత యీగ్రామమునఁ దిరుగుచున్నట్లు స్పష్టము. అదే యొకవేళ నా కళాలలిత వరించిన యాడంగి వాఁడై యుండునా? ఆమె మాటలనుబట్టి ఆకాంత పురుషరూపమున నున్నట్లే నిశ్చయింపవలసి యున్నది. అదిగాక యాడంగివాఁ డెప్పుడు స్త్రీవేషముననే యుండును. స్త్రీయెదుటమాత్రమె మతఁడు తప్పక స్త్రీవేషమున నుండును. అది గాక యా యాడంగివాఁడు బ్రదికితినిరా యని కాలుకొలఁదిఁ బశ్చిమతీరమునకుఁ బాఱిపోవునుగాని కళాలలిత యున్న యీగ్రామముననే యేల యుండును! ఏమియుఁ దెలియదు. ఎట్లును గోచరింపకుండ నున్నది. అయ్యో! ఇంకను లేవకున్నాఁడే! (విసరును) సుందరస్వరూపుఁడు. సుకుమారుఁడు. సుక్షత్రియకుమారునివలెఁ గానఁబడుచున్నాఁడు. ఆహా! ఉమాపతీ! నీవు నన్నుఁ గాంచి మోహావేశమున మూర్ఛపడఁ దగినంత యర్హత నాయొద్ద లేదు. మొదటి భర్తను జంపుటకు సిద్ధపడితిని గాని వెఱ్ఱిముండకొడుకు కావున విడిచిపెట్టితిని. అయ్యో! పాప మింక లేవకున్నాఁడే!

గీ. దొంగయైనను సన్యాసి ♦ లుంగి దాల్చ
భిక్షమిడువార లెందఱో ♦ వెలయునట్లు
పురుషుఁడైనను స్త్రీరూప ♦ మునను దిరుగ
ముద్దులిచ్చెడు మగలకు ♦ హద్దు కలదె?

గీ. భర్తృసంపాదనమునకుఁ ♦ బడఁతి యగుచుఁ
బుట్టనక్కఱయే లేదు ♦ ముదితవలెను
నిలఁబడినఁ జాలుఁ బోతురా ♦ యలను నేల
రాయునది పైకయే కాని ♦ రమణి కాదు.

ఆ! ఇదిగో కొంత స్మృతి కలుగుచున్నది. కన్నులు తెఱచినాఁడు.

కళా—(నిమ్మళముగ) చక్రపుటపాకాయ మండుచుఁ దిరిగినట్టు లేదియా యొకదీప్తి గిఱగిఱఁ దిరుగుచున్నది.

గో—తొందరలేదు—కన్నులింక మూసికొనుము. (మూయును) పాపము! ఏకాంతను గాఢముగా దలచియున్నాఁడో. ఇతని రాగ మతి గాఢమై యున్నట్లున్నది. ఆహా! నాభ్రమకెంత చిత్రముగా నున్నది?

గీ. పతులు లెక్కింప నిద్దఱు ♦ భార్య యొకతె
భార్యయైనను మొదట నా ♦ భార్యకాదు
వట్టి యాడంగివానిది ♦ కట్టుకొంటి
మగతనము చూడ నీరీతిఁ ♦ దగులబడియె.

కళా—(కన్నులు తెఱచి)

గీ. గంటలాగున వెలిఁగెడి ♦ మంటలోనఁ
బూలు తీఁగెలు మొగ్గలు ♦ ముత్తెములును
గ్రాలు కాఁకరపూవత్తి ♦ కాలుచున్న
దేమొ? దీపావళీదర్శ ♦ యేమొ నేఁడు?

గో—అబ్బ! ఏమివిచిత్రముగా నున్నది! ఇంకను స్మృతి రాకుండ నున్నదే! గిఱగిఱ తిరిగినట్లు కనఁబడుట మాత్రము సద్దుకొనినది ఇంకను దృష్టికి విస్పష్టత కలుగ లేదు. (ప్రకాశముగా) ఒకనిముసము శాంతి నొందుము. కనులు మూసికొనుము. ఆఁడుదానిచేతనే యీతఁడు పడియుండినయెడల నీవలెనే ప్రజ్ఞావంతుఁడై యుండ వలసినది. మగవాఁడనైన నాకు

గీ. చలువలేదు చేతను దయా ♦ లలితమైన
పలుకు లేదు నిపుణమైన ♦ పట్టులేదు,
త్వరగ నారోగ్య మీతఁడు ♦ పడయు టెట్లు?
కటికవైద్యుచేఁ బడు రోగ ♦ కలితుఁ డట్లు.

ఈతని జూడగా నాకుఁ గొంచెము ప్రేమ యుదయించుచున్నదేల? బనారసు చీర ప్రభావమా? కాదు. ఇదిగో ఈతనిముక్కు నాకళాలలిత ముక్కునకు నొక్కతీరున నున్నవి. అందులకే యీ వికారము—ఇంతమాత్రమునకే కాకట్టి మనోగతి కలుగఁగా నామూలాగ్రముగఁ దనభార్యవలెఁ గానఁబడు నన్నుఁ జూచి యీతఁ డింత మూర్ఛపడుటలో వింతి యేమున్నది? కాని లేచు చున్నాఁడు.

(లేచును. గోవర్ధనుఁడుకూడ లేచును.)

కళా—(గద్గదతో) ప్రాణేశ్వరీ! ఆఁగి ఆఁగి ఆలోచించి — ఆలోచించి—ఒక్కసారి

కౌఁగిలించుకొంటి నని కోపముగలిగి పాఱిపోయితివా! నాగతి యేమగునను కొంటివి!

గీ. బ్రదుకుమంటివా పాషాణ ♦ భక్షణమునఁ
జావుమంటివో సెలవిమ్ము ♦ సత్వరముగ
నెన్నఁడును గాఁగిలింపక ♦ మిన్నకుండు
బ్రదికినన్నాళ్లు పదములే ♦ పట్టుకొందు. (కాళులుబట్టుకొనును)

గో—(తనలో) భగవానుఁడా! నా శీవరహార్య—అంతలో రాజహార్య—యేల గొంతు కకుఁ జుట్టబెట్టితివయ్యా! అయ్యయ్యో! ఈతఁ డేదో ప్రభుకుమారుఁడో నా కాళులఁ బడుటయేమి? పోనీ! పడినందుల కేమైన ఫలమున్నదా? పాపము తక్క నేమున్నది? నేను నీభార్యను గాను బొమ్మని యనువెంటనే కాళుల తుపాకితోఁ జచ్చిన కాకివలె గిలగిల దిరిగి చచ్చును. అది మఱింత పాపము కాదా? ఏమిచేయుటకును దోఁపకున్నదే. (ప్రకాశముగా) లెమ్ము కాళుల వదలుము.

కళా—ప్రేయసీ!

గీ. వలదు కాళులు, చేతులు ♦ వలదు, నోరు
వలదు, నాసికస్పర్శంబు ♦ వలదు మొదలె;
గాత్రమంతయు నొక్కటే ♦ కన్నుగాఁగ,
నైన నిను జూచుకొంచు నే ♦ నట్టెయుందు.

గో—(తనలో) నాభార్యయెడల నాప్రేమమే యధికమనుకొనుచుంటినిగాని, యిప్పుడు తల వంచుకొనవలసి వచ్చినది. అనురాగాంబుధియైన యీతని బ్రదుకే బ్రదుకగుఁగాక! ఈతనిచే వరింపఁబడిన యాకాంత బ్రదుకే బ్రదుకగుఁగాక! ఇట్టి వానిని నేను బొమ్మని నిరుత్సాహపఱచిన నిల్వనఁ బ్రాణము విడువఁడా? వచ్చునదైన నింత స్వచ్ఛానురాగము కొంతకాలము లోకమున నుండనీయక తప్పదు. అటులైన నేఁ జేయునదేమి? నాకింత దిక్కుమాలిన సంధ్యవస్థ వచ్చినది. పత్రమందునఁ గళాలలిత—

గీ. నా మగఁడ వీవు రమ్మంచు ♦ నన్ను నామె
పొడువ భర్తనైతిని నోరు ♦ మూసికొనుచుఁ
బ్రేయసీ! ప్రేయసీ యంచుఁ ♦ బిలువ నితని
సతినిగా నుంటినో యేమొ ♦ చచ్చినట్లు?

ఆహాహా! నాప్రాణమైన కళాలలిత యచ్చట నాకొఱకు వేచియుండఁగా నక్కడకుఁ బోఁదలఁచియుఁ బోలేకుండ నున్నాను. ఇతనిని వదలఁదలఁచియు వదల లేకుండ నున్నాను.

గీ. ఇష్టముండియు హితునకు ♦ నీయలేఁడు;
రోదనము సేయుచుండి శ ♦ త్రువున కిచ్చు;
నరుని స్వాతంత్ర్యసౌభాగ్య ♦ సరణి యిదియె;
మనుజుఁడంత నిర్భాగ్యుఁ డీమహిని లేఁడు.

గీ. బుద్ధి యున్నది యాత్రోవఁ ♦ బోవలేఁడు
కలదు స్వైరత; వదలఁడు ♦ కాలిబోండ
ఎఱుక యున్నది వినియోగ ♦ మెపుడు లేదు
నరుని యంతటి బానిస ♦ ధరను లేఁడు.

కళా—ప్రాణేశ్వరీ! పనికిమాలిన మగరూపమును వదలి స్త్రీరూపమును ధరించితివి! మహానందముగా నున్నది. ఇఁక నిన్ను నేను వదలను.

గో—(తనలో) ఇదియొక కర్మము కూడనా? నే నెదో స్త్రీనని భావింపకుండ మగవాఁడనై యాఁడువేసము వేసితినని, యనుకొనుచున్నాఁడా! కాదు-కాదు-నాదే పొరపాటు. కనఁబడికనఁబడని వెలుతురులో కన్ను చెదరినట్లు, తెలిసి తెలియని యీగాథలో మనస్సు చెదరుచున్నది. పురుషరూపధారిణినైన కాంత నీతఁడు వలచినాఁడు. ఆవేసమును విడిచి స్వస్వరూపమునఁ గానఁబడుట మహానందమయ్యెనని యాతనియభిప్రాయము. ఈతఁడు నన్ను వదలననుచున్నాఁ డేమికర్మమో! ఇంక నెంతసేపు బాధించునో! నాప్రియురాలగు కళాలలితను నే నెప్పుడు చూతును? ఈతఁడు నాకు స్వాధీనుఁడై యున్నాఁడు. కావున నీతినిని సత్రమునొద్దకు తీసికొనిపోవుదునా? అయ్యయ్యో! గుమ్మములో నాకొఱకుఁ గనిపెట్టుకొనియుండు కళాలలిత నన్నుఁ జూడదా?

ఆ. వె. అవికఁ దొడిగి చీర ♦ తవణించి మగఁడనై,
చెలువఁ జూడ నేగ ♦ సిగ్గుగాదె?
మఱియు నందు నాదు ♦ మగఁడంచు నీతని
వెంటఁ బెట్టుకొనుచు ♦ వెడలఁగలనె?

కళాలలితాప్రియుఁడ నైన నాకు లోకమందలి పరస్త్రీలు తోఁబుట్టువులు. అందులో నీతనిభార్య నావలెనే యుంటచే నాకు మఱింత చెల్లెలు—అదృష్టశాలినీ- కన్యకావతంసమా! ఓ చెల్లెలా!

ఆ. వె. భార్యభార్య యనుచు ♦ బావ సిగ్గును వీడి,
చీర అవికడాబు ♦ చిత్తగించి

పాత్ర గనిన ఘోట ♦ వటువును దలఁదాఁటె
వేగ నేలుకొనుమ ♦ వెఱ్ఱిమగని.

నే నతనితో నొకటి రెండు మాటలకంటె నెక్కుడుమాట లాడలేదుగదా! 'ధారాళముగా మాటలాడవేమి; ప్రాణేశ్వరా యని పిలువవేమి! నావంకఁ దిన్నగఁ జూడవైనఁ జూడవేమి!' యని యేమియు ననఁడే! అతని కేమియు నక్కఱ లేదు. అతఁడు నన్నుఁ జూచి యానంద మొందుటే యాతనికిఁ గావలసినది కాఁబోలు- ఫలాభిసంధి లేని మహానురాగముతోఁ బ్రకాశించుచున్నాఁడు- సెబాస్-ఇంతవానిని నేను జూడలేదు. సర్వాత్మకముగా నిష్టదేవతకుఁ దన్నర్పణముఁ జేసికొనిన ప్రపన్నునివలె నున్నాఁడు. గొప్పవాఁడే యగును. అయిన నేమి? కందిమోడువలె బిగిసికొనియున్నాఁడే కదలఁడే!

ఆ. వె. వట్టిమొండివాని ♦ వైఖరి యొక్కటి
మఱి ప్రపత్తిపూర్ణు ♦ మార్గ మొకటి
యొక్కొకపుడు పైకి ♦ నొక్కలాగే యుండు
జ్ఞానిపిచ్చివాని ♦ చందమునను.

కళా—ప్రాణేశ్వరీ! నీవు స్త్రీవస్త్రధారిణివై యుండుటచేత నీవు బ్రదికితివి—నన్ను బ్రదికించితివి.

గో—నేను బ్రదుకుటకూడ నెట్లు?

కళా—ఈ కాళీపురరాజు దుర్మార్గుఁడు - రామపురరాజున కతఁడు పినతండ్రి కొడుకు. ద్వితీయభార్యామృతివలన రామపురాధీశుఁడు కొంచెము మతిచెడియున్నాఁడు. ఆవంకను దీసికొని కాళీపురరాజు తదనంతరప్రభుఁ డగుటచేఁ గొంతపరివారమును గూర్చుకొని కోటలోనే యున్నాఁడట; అతని కొకవేళ రాజ్యాశచేఁ జంపు నేమో యని నాకు భయముగా నున్నది. ఆరామపురరాజున కొక్కతెయే కూఁతురు. రాజ్య మామెకు రాఁదగినది. ఆమె యెచ్చట నున్నదో తెలియదు. ఇంతకఱ కేదో కొంత కారణబద్ధముగనే యున్నది. కాని గోవర్ధనుని బట్టుకొని చంపుమని కాళీపురరాజు నాజ్ఞయగుటచేత వారతనికొఱ కన్నియూళ్ళు దిరుగుచున్నారు. అన్నియాస్థానములు దరుగుచున్నారు. ఆగోవర్ధనుఁ డెవఁడో తెలియదు. ఈ సంగతులన్నియు నీ యూరనున్న గాళీపురాస్థానప్రధానుఁడు నాతోఁ జెప్పినాఁడు. అన్నియుత్సవప్రదేశములను నేను నీకొఱకు వెదకితిని. తుదకు నిన్నిక్కడఁ జూచితిని. కర్మముచాలక నీవు గోవర్ధననామధారిణి వైతివి. నీపూర్వనామ మేదో నే నెఱుఁగను. స్త్రీవేషమును మాత్ర మింక విడువకుము.

గో—(తనలో) కాళీపుర రామపుర రాజ్యములకుఁ దగవేమి? నడుమ నన్నుఁ జంపుట యేమి? యీప్రాంతములనున్న రాజబాలకులలో గోవర్ధనునిఁ దెవఁడును లేఁడు. ఉన్మాదమునకు వైద్యము నాకుఁ దెలియును. నన్నుఁ బోషించుచున్న యవ్వ చెప్పినది. నేను రామపురమునకుఁ బోయి యారాజు పిచ్చి కుదిర్చెదను. ఎందుకైనను మంచిది, స్త్రీవేషముననే యుందును. నాభార్యతో నెందుల కిట్లుండవలసివచ్చినదో చెప్పుదును. ఆమెను దీసికొని సూర్యోదయమగు వెంటనే పోవుదును. కాని యితఁడు నన్ను విడుచుటెట్లు? నేను భార్యనని భ్రమపడి పాపము ఎన్ని రహస్యములో చెప్పుచున్నాఁడు. నారహస్యము లిట్టితనికిఁ జెప్పవచ్చునా? రాత్రి యంతయు నిదురలేదు. అందులో నెక్కడికిఁ బోయిన నేదోయొక భ్రమయే - ఆభ్రమకు మొక్కులేదు మూలములేదు. ఎవ్వఁడును నన్నెఱుఁగఁడు. అందఱు నన్నెఱిఁగినవారే. నాకు మతియేపోవనున్నదో యేమో - సరి యేదో నాకర్మము నాది - కాని మరమేకువలె నున్న యీమగనిమాట యేమి?

కళా—తెల్లవాఱవచ్చుచున్నదేమో! ఇంక నిక్కడ నెందులకు?

గో—నేను నదియే చూచుచున్నాను. నీవు సందేహింపకుండువెడల నీతో నొకమాట చెప్పెదను.

కళా—సందేహములేదు. నీమాటకు వ్యతిరేకతలేదు. నీవు చెప్పినది చేయవలసినదే కాని, నేను స్వతంత్రించి యేదియు నీకుఁ జేయను. అట్లు చేసినందులకుఁ బ్రాయశ్చిత్తమైనది.

గో—ఇదివఱకుఁ బురుషుఁడను గాన నాకు బాధలేకపోయినది. ఇప్పుడాఁడుదాననైతిని గాన—రాజకాంతనైన నాకొక్క దాసియుండినఁగాని వీలులేదు. నాకు మిగుల నమ్మకమైనదాసి కావలెను. నీవు స్త్రీవేషమును ధరించి నాదాసివై యుందువా?

కళా—మహాప్రసాదము - మహాప్రసాదము - ఉందువా యని సెలవన్నదుగనక్కఱ లేదు - అట్లే యుండుకొనుము.

గోవ—సరే-నీవు పోయి స్త్రీవేషమును ధరించి, వేగరమ్ము-నేనా మేడలోనే యుందును. మత్తికొమ్మ ప్రక్కనుండి పోయినదే-అదే-

కళా—పోవుదును. త్వరలో వత్తును. (నిష్క్రమించును.)

గోవ—అమ్మ-బ్రదికితిని. మగఁడని పేరున్నంతమాత్రమున నెత్తి నిర్భాగ్యపుమొండకొడుకునకే కావలసినంత బిగింపు కలిగినప్పుడు మహారాజైన మగని కేమాత్రమైన నుండదా? హో కళావతీ! వచ్చుచున్నాను. అయ్యయో! నాడసుకుఁ జంపిన యారాజపుత్రికమాట మఱచియే పోయితిని.

(నిష్క్రమించుచుండఁ, ప్రవేశము సరస్వతి.)
ప్రదేశము—సత్రమునకుఁ గొంచెము దూరమున.

సర—ఇఁక నన్ను రక్షించిన నాసోదరుఁడు రాఁడు. తెల్లవాఱవచ్చుచున్నది. ఇక్కడ నొక్క నిముసమైన నుండఁగూడదు. తాళముతీసి యుంచినయెడల నెవ్వఁడైన నతని గదిని బ్రవేశించి యాతని వస్తువులను హరించును. వేసియే వెళ్ళెదను. అతఁడు వచ్చి పగులఁగొట్టుకొనును.

(నేపథ్యమున) పట్టుకో - పట్టుకో - అతఁడే గోవర్ధనుఁడు - పట్టుకొని ప్రభువు నొద్దకుఁ దీసికొనిపొమ్ము.

(ఒక భటుఁడు ప్రవేశించును.)

భటు—ఆఁగు. (పట్టుకొనును) రమ్ము.

సర—హా కళాలలితా! హా కళాలలితా!

(తీసికొనిపోవును.)

ఇది షష్ఠాంకము.

శ్రీరామ

సరస్వతి

సప్తమాంకము

ప్రదేశము—సత్రము

ప్రవేశము—కళాలలిత

కళా—వనికిమాలిన మనస్సు! సందేహించినట్లే యయినది. అయ్యయ్యో! నే నేమి చేయుదును? ఇంత మిడిమేలపు మగఁడైన నెట్లు బ్రదుకుదును! కేవలము స్వాధీనురాలగు భార్యను మగఁ డిట్లు కేఁపుకొనియే తినుచుగాఁబోలు! స్వాధీనము కాకుండుటకు నాతరమా! భర్తను జూచి యూడకున్న భార్య చుట్టుచుట్టు మగఁడు తిరుగును. కాని వదలి యొక్క క్షణమైన బ్రదుకలేని నావంటివారి బ్రదుకు మగల చుట్టుచుట్టు తిరుగుటయే. అదియే మహాభాగ్యము. ఏలాగైన నా భర్త కనఁబడినఁజాలు! అదిగో! భానుఁడు! కలకల నుదయించుచున్నాఁడు. ఓ సూర్యభగవానుఁడా! నిన్నుఁ బ్రత్యక్షముగాఁ జూచుట యీనాఁడే జరిగినది. నాకుఁ బైటపండుగ జరిగినది మొదలు మేలుముసుఁగు చాటునుండియే నిన్నుఁ జూచితిని గాని యిట్లు నిర్భయముగాఁ జూడలేదు. నాకిఁక రాణివాస మెందులకు? బహిరంగముగా వీథినిఁబడి నానాథుఁ డెక్కడ నున్నాఁడో వెదకుదును. అంతఃపురకాంత యిట్లు రాణివాసమును బరిత్యజింపవచ్చునా? ఏమి చేయఁగలను? రాణివాసము జరుగుబాటుతో నున్నది. అది లేనప్పు డిదియు లేదు. జరుగుచున్నప్పు డందఱు స్త్రీలు రాణివాసము కలవారే; కడుపుకక్కుర్తిచేఁ గడ నెక్కి యాడు దొమ్మరిసానికైనను రవంత చేరినతరువాత, రాణివాసమే; రాణివాస మొకరు రుంపనక్కఱలేదు. ఒకరు తీసివేయనక్కఱలేదు. ఉండవలసినప్పు డదియే యుండును. పోవలసినప్పు డదియే పోవును. అంతేకాక దానిని దీసివేయుతలంపునఁ బనిలేక యంతఃపురకాంతను నడువీథి కెక్కించి నగుబాటు నొందదగదు. దాని నుంచుతలఁపున ముష్టిదానిని దడకచాటునఁ గూర్చుండఁబెట్టి పస్తుపెట్టింపఁదగదు. ఎందకన్నన్నఁ డెలుఁగకపోవుటచే నింత యీవిషయమై యాలోచించుకొనవలసివచ్చినది. ఇంత త్రొక్కులాడవలసివచ్చినది. నాకిది మహాపత్సమయము. మగఁడు మాయమగుటకంటె, మహాపద మఱియేమి! ఇప్పుడు రాణివాసమేల! కావున నేను వీథినిబడెదను. ఓ యంతఃపురకాంతలారా! నేను మీమర్యాదను జెడఁగొట్టితి నని మీరు నన్ను నిందింపకుఁడు. ఇట్టియవస్థలో మీరుకూడ నిట్లే చేయుదురేమో యోచించుకొనుఁడు—ఎవరచ్చట? కురంగీ!

కురంగి—(ప్రవేశించి) అమ్మా! కనఁబడినాఁడా?

కళా—అయ్యో!, లేదే. నీవు దేవాలయవీథులన్నియు జూచితివా?

కురం—చూచితిని. ఎక్కడను గనఁబడఁడు. ఏమికర్మమో!

కళా—నిధర్త యేమిచేయుచున్నాఁడు?

కురం—బలికై తెచ్చిన మేకలు భయపడి చేయుమని యఱచునంతటి విపరీతమైన గుఱక తీయుచు ముసుగు వైచుకొని నిద్రించుచున్నాఁడు.

కళా—లేవలేకపోయితివా? పోనీ. అతఁ డెందులకులే. నీవు పోయి తూర్పువీథిని మఱియొకసారి చూచిరమ్మా.

కురం—అలాగే. (నిష్క్రమించును.)

కళా—ఆదిత్యభగవానుఁడా! నాభర్తను నాకుఁ గనఁబఱచి రక్షింపుము. లోకచక్షువైన నీ కాతఁ డెక్కడ నున్నాఁడో తెలియకపోదు. నీతో మఱియొకమాట చెప్పుచున్నాను. నీవు మఱియొక్క బారెడు పైకివచ్చుసరికి నా నాథుఁడు నన్నుఁ జేరకుండునెడల నిదిగో యీ పైఁట చెఱఁగును గొంతుకకుఁ జుట్టఁబెట్టికొని నడువీథిని మరణింతును. నీవంశమునఁ బుట్టినవారియెడల నీ కభిమాన మున్నయెడల నట్టి తొందర రానీకుండఁ గాపాడుము. నీవంటి మహాత్ముఁడు వంశాభిమానము గనఁబఱుపనప్పుడు నావంటిది ప్రాణాభిమాన మగపఱచుట తగదు. గోవర్ధనా! ప్రాణేశ్వరా! ఎచ్చట నున్నావు? అట్లుపోయి వెదకుచును.

(కళాలలిత నిష్క్రమింపఁగ గోవర్ధనుఁడు ప్రవేశించును.)

గో—స్త్రీవేషమున పెద్దవీథినుండి రాలేక సందుదారులఁ బట్టి నాబసకుఁ బోయితిని. తలుపునకుఁ దాళము వైచియున్నది. ఆకాంత నాబసకు రానట్లు కనఁబడుచున్నది. తాళ మామెయొద్దనే యున్నది. తాళము పగులఁగొట్టుట కెవనినైనఁ దేవలయును. పోనీ - కళాలలిత బసలోనికిఁ బోయిచూడ నాతలుపునకుఁ గూడఁ దాళము వైచియున్నది. ఆమెయు లేదు. కురంగియు లేదు. హా! కళాలలితా! ఎచ్చటికిఁ బోయితివి! అయ్యయ్యో! ఇదియేమి? స్వప్నమా! మాయయా! ఇంద్రజాలమా! హా! కళాలలితా! హా! కళాలలితా!

(కళాలలిత ప్రవేశించును.)

కళా—(కౌఁగిలించుకొని) హా! ప్రాణేశ్వరా! ఇది న్యాయమా - న్యాయమా? స్త్రీవేషధారివై మమ్ము విడిచి పాఱిపోవుచుంటివా!

గో—కళాలలితా! కనఁబడితివా! మహాసంతోషము. నిన్ను మోసపుచ్చుట కీవేషము నేను ధరింపలేదు. ఇది వీథి. అప్రక్కను మాటలాడుకొందము రా.

కళా—సరే. (పరిక్రమించి) ఈవేసము నన్ను మోసపుచ్చుటకుఁ గాదుకదా - నన్ను వదలకుండునెడల నీవెన్ని వేసములు వేసినను నే నభ్యంతరపెట్టుదానను గాను. కాని ప్రాణేశ్వరా! స్త్రీవేషమున నీవు నాకంటె బాగుగా నున్నావేమోసుమా! అద్దము చూచుకొంటివా?

గో—చూచుకొంటిని. కాని యిక్కడ మన మాలసింపఁదగదు. కురంగి యెచ్చట నున్నది? మనము శీఘ్రముగా నిక్కడనుండి పోవలసియున్నది.

కళా—కురంగి నీకొఱకే యింతసేపు వెదకినది. అలయములోఁ బండుకొన్న తనభర్తను లేపుటకుఁ బోయినది. కురంగి కాదు - ఇంతటినుండి కురంగి రాణికదా -

గో—(తనలో) ఆ కత్తిమొండకొడుకు కిక్కడకు వచ్చుట కురంగిని వలచుట - వారు భార్యాభర్తలగుట, జరిగినదా! సంతోషమే—వాని నయిదవగదికిఁ బొమ్మని నేను జెప్పితినిగాన సరిగ లెక్కఁజూచి యాబసకు వచ్చి కురంగిని జూచి నాఁడు—మూఁడవగదిదైన నాబసకు నేను బంపిన పురుషరూపధారిణియైన కాంతనుగూర్చి యీమె నడుగుట యెందులకు? ఈమె కామెనుగూర్చి యేమి తెలిసియుండును? అదిగాక ఆమె యవమానము నీమెతోఁ జెప్పుట దోషము కాదా! స్త్రీమర్యాద (పిడికిలిబట్టి) యింతలోనున్నది. ఇంతకు నాబసలోని కాకాంత వచ్చినట్లే లేదు. తెల్లవాఱువఱకు రానందులకు నన్ను క్షమింపుమని నాభార్యను గోరుట మఱచిపోయితిని. పోనీ. అదియుఁ గొంతమంచి పనియే జరిగినదేమో? ఎందుచేత రాలేదనఁగ నెన్నియో చెప్పవలసియుండును.

కళా—అదిగో కురంగిరాణి వచ్చుచున్నది.

గో—అది యిక్కడకేల? మనముకూడ బసలోనికిఁ బోవుదము. చూడు. నేనొక కారణమున స్త్రీరూపముననే కొంతకాల ముండవలసివచ్చినది. నీవొక్కతెవు తప్ప నాయొద్ద కెవ్వరును రావలదు.

కళా—నీయిష్ట మెట్లో యట్లే.

గో—రమ్ము-పోవుదము. (తనలో) ఆనిర్భాగ్యుని బారినుండి నిన్ను రక్షించితిని. నిన్నుఁ దిరిగి చూడవలయునని యనుకొంటిని. నీ వెచ్చటికిఁ బోయితివో సుఖముగా నుంటివో మఱి యేయాపదలోనైనఁ జిక్కుకొంటివో-సోదరీమణీ! నిన్ను భగవంతుఁడు రక్షించుఁగాక.

(ఇద్దఱు నిష్క్రమింపఁగఁ బురుషవేషమున సరస్వతి
యిద్దఱుభటులతోఁ బ్రవేశించును.)

సర—భటులారా! నన్నుఁ జంపుదురని సంతసించితిని గాని యిప్పుడింక నెక్కడకుఁ దీసికొని పోవుదురు?

భటు—చంపుటకే మొదటఁ బ్రధానుఁ డుద్దేశించెను గాని, యెందుకైన మంచిది, మారాజుగారి యెదుటికే పంపించిన యెడలఁ దనపూచి తగ్గిపోవునుగదా యని యిట్లు చేసినాఁడట.

సర—నన్నే రాష్ట్రమునకుఁ దీసికొనిపోవుదురు?

మొదటిభటుఁడు—రోమపురరాష్ట్రమునకు.

సర—ఆరాష్ట్రాధిపతియే నన్నుఁ జంపునా?

కండవభటుఁడు—తమ్ముఁడా! ఆతనితో వ్యవహారరహస్యము లేల వెల్లడింతువు! రాజకార్యము లెంతటింతమైన పట్టులో నుంపవలెనురా పెద్దమ్మ!

సర—నాయనలారా! నేనేమియు నడుగనులెండు.

మొ॥భ—ఇంతలో మునిఁగిపోయినదేమిరా! రాజకార్యరహస్యములు మనము గుట్టుగనే యుంచవలయునని దేవులాడుదుము కాని, మనచెవిని బడకుండునే యవి నంతపాటి కక్కు౯ను.

సర—పోనిండు. మీకుఁ దగవెందులకు!

(నేపథ్యమున) మనకుఁ దగవెందులకు? ఆఁడుదే యను నీయిష్టము-మగవాఁడే యను నీయిష్టము.

మొదటి—ఎవ్వరో యిట్లు వచ్చుచున్నారు.

సర—(తనలో) మధురికాభ్రమరకు లిచ్చటికి వచ్చుచున్నారు. ఇదివఱకు వీరిద్దఱు నన్నుఁ బరిహసించి బాధించినారు. ఇప్పుడెందులకో వచ్చుచున్నారు. మధురిక యానిర్భాగ్యుని భటులనుండి తప్పించుకొనినది కాఁబోలు - నేను వారితో మాటలాడను.

(భ్రమరుఁడు మధురికయుఁ బ్రవేశింతురు.)

భ్రమ—(అటు చూచి) మధురికా! కన్నులు పెట్టుకొని చూడు-అతఁడు నాగోవర్ధనుఁడు

మధు—(చూచి) ఆమె సరస్వతి; నీకుఁ దెలియదు. అయినను నేను నీతో నిందును గూర్చి తగవు పెట్టుకొనలేదుకదా-అయ్యయ్యో! భటు లామెను బంధించినారే.

భ్రమ—వెఱ్ఱివెఱ్ఱివేసాలు వేసినవానికి గతి యింతేకాదా? (ప్రకా) అయ్యో! గోవర్ధనా! నీవు నాకిచ్చినసంచిని నీయెదుటఁ బడవైచితిని. నీవు తీసికొనక పోవుటచే నది మధురికయొద్దనే యుండెను. దానిని బట్టుకొనిన దొంగలకది యిచ్చి వారిబారినుండి తప్పించుకొనినది. నీవు పురుషరూపమున నాకుఁ గనఁబడి నాసంచి యేదని నీవడిగితివి. నీకే యిచ్చితిని పొమ్మని నిన్ను దుర్భాషలాడితిని. అంతవరకు నాతప్పు క్షమింపవలయును. నీసంచివిలువను నీకీయ వచ్చితిని క్షమింపుము.

మధు—(తనలో) నాకాంతను జయరామసింగు హరించుకొనిపోయి నాఁడని నేను నాభర్తతోఁ జెప్పక ఆమె మనబసకురానున్నదని మాత్రమే చెప్పి యామె యభిమానమును గాపాడితిని. రాణిగారిగుట్టు కాపాడలేని దాసిదాని బ్రదుకేల? (ప్రకాశముగా) అమ్మా! కాదు. అయ్యో!

సర—(పో, పో యనునట్లుగా నిద్దరకు సంజ్ఞచేయును.)

కండవభటుఁడు—మీరెవ్వరో యీయనతో మాటాడుటకు వీలులేదు పొండు.

మధు—మేము వారిభటులము. ఎట్లు మాటలాడకుండఁగలము?

కం-భ—భటులైనసరే—కటులైనసరే—వీలులేదు పొండు.

మధు—మేముకూడ మీతోడనే వచ్చెదము. మా ప్రభువును విడిచి, మేమెక్కడికిఁ బోవుదుము.

మె-భ—మేము రామపురరాష్ట్రమునకుఁ బోవువారముకదా, మీరు మాతో నెంత దూరము రాఁగలరు?

రం-భ—నీగొంతుగోయ—ఆమాటయెందులకురా?

మధు—(తనలో) ఈమె జయరామసింగుచేఁ బట్టుపడినది కావున నాతఁడే యీమెను రామపురమునకు వివాహమునకై తీసికొనిపోవుచున్నాఁడు కాఁబోలు! అయ్యో! ఎంతగతి పట్టినది. తుద కా నిర్భాగ్యపుముండకొడుకే గతి యైనదా?

భ్రమ—గోవర్ధనా! ఇదిగో నీసంచివిలువ. (కాగితపుఁబొట్ల మీయఁబోవును.)

సర—(పో, పో, యనునట్లు సన్న చేయును.)

భ్రమ—మధురికా! ఈస్వామిఁ బారవైచి మనము పోవుదమురా.

మధు—(అప) నాథా! ఆస్వామినిగూర్చి యిప్పుడామెను దొందరచేయవలదు. స్వామినిఁగా నెంత? ఆమె మర్యాదపోయి యేడ్చుచున్నది.

భ్రమ—(అప) నీకు మతి పోయినదా? ఆమె ఆమెయని యింకనదియే మాటయేనా!

మధు—(అప) నాపిచ్చి నాది. ఆమెయేకాని ఆయన కాదు. ఆమె రహస్యము నే నెఱుఁగుదును. అపరమాత్ముఁ డెఱుఁగును. ఆమె నాకు రాణి. ఆమె మహాపదలో నున్నది. మేము చిన్నతనమునుండియుఁ గలసి పెరిఁగినవారము. ఇప్పు డామెను వదలుటకంటె మహాపాపము లేదు. ఆమెతో నేను బోవుదును. నీవు నన్ను వదలకుండ నాతో రాఁగోరెదను.

భ్రమ—ఆతని కొలువు నేను వదలుకొంటినిగదా!

మధు—ఆమెయాశ్రయము వదలుకొంటివి కాని నాయాశ్రయము వదలుకొంటివా?

భ్రమ—నీవు నాయొద్దనే యుండరాదా? ఆయనతో నేలపోవలయును!

మధు—నీవు నీరాణిని సేవించుచుండు మనియును, నీయిష్టమైనయెడల నీతో రామపురమున నుండుమనియు నీవు బాసచేసితివి కాదా? ఇప్పు డిట్లనుటన్యాయమా?

భ్రమ—అంటినికాని యాతఁడు నీరాణి కానప్పుడు సేవ నీవెవరికిఁ జేసెదవు?

మధు—అట్లనుట తప్పు. నాప్రార్థన విని నాతో నీవిమెను వెంబడింపుము.

భ్రమ—నీవు నేను చెప్పినట్లయిన వినవలయును. కాకున్న నేను నీవు చెప్పినట్లయిన వినవలయును. సరే-నడు-మనకు బసయొద్దమాత్ర మేమున్నది! ఇట్లే పోవుదము. (కూడ నడతురు.)

రం-భ—మీరు మాతో నేల! పొండు.

భ్రమ—మాదారిని మేము పోవుదుము. ఈవీథిని మఱియెవ్వరు నడువనేకూడదా యేమి?

మధు—అయ్యో! మే మెవ్వరితోడను మాటలాడకుండ వచ్చునప్పుడు మీకేమిబాధ యున్నది!

బొ-భ—రండు మరేమియు భయములేదు.

సర—(తనలో) హా! కళాలలితా! తుదకు నీదగ్ధస్వప్నమైన కాలేదుకదా! నేనెంత మందభాగ్యరాలనో! రాజకుటుంబమున బుట్టిననేమి? మహైశ్వర్యమున దులదూగిననేమి! నుదుటిరేఖ సరిగాలేనప్పు డేమివినియోగము! లోకమున నెవతెయదృష్టము దానిదే. బంగారుగనిలో మనిబొగ్గు పుట్టినది. గోదావరిలో స్నానముచేయుచు దాహమో దాహమో యని యేడ్చినదానను నేనొక్కతెనే. నిన్నను బగలు రాత్రికూడ నన్నములేదు. ఇక్కడనే నన్నుం జంపుదురేమో యని యాసపడితిని. నాతండ్రియొద్దకుం దీసికొనిపోవుదురుకాంబోలు. కాని యేమికావలసియున్నదో? కళాలలితుండెప్పటికైన నీగ్రామమునకువచ్చుట గాని రామపురమున కెట్లువచ్చును? నేనాతనిని దిరస్కరించితినని యాతండు కోపించునేమో! హా కళాలలితా! నిన్నెప్పుడైనం జూతునా? నీవు నాకు లభి యింపనియెడల నేను ప్రాణములువిడుతును. నాచిత్రచరిత్ర యేమోకాని యొక్కడకక్కడకే విలుపు; ఎక్కడ కక్కడకే యడుకు. అచ్చటవిలుగండులకో తెలియదు. ఇచ్చట నడుకెందుకో తెలియదు. నాకథ నాకే తెలియకుండనున్న దేమికర్మము? పెండ్లామని యొకండు గౌంగిలింపంబోవంగ మగండనని యింకొకతె లాగుటయేమి? కావలసినమగండు కనంబడక పోవుటయేమి! వలికిరాని భార్య బాధించుటయేమి? ఈలోన జయరామసింగు బలత్కారమా? పోనీ మానరక్షణమొనర్చిన యామహానుభావుండు కనంబడరాదా? అతనితోం జెప్పు కొని యేడ్చియుందును. అతండు నన్నుం గళాలలితునితో గూర్చునేమో! కాని యాతనికంఠరవము నాదివతెనే యుండుట కేమికారణమో! నిజముగా నున్నదో? అదికూడ భ్రమయో? అయినను నాకథ చిక్కువిప్పుట కిదియా నాకు దొరకిన సాధనము? ఏడ్చినక్లేయున్నది. అక్లేయుండుటేమి? ఏడ్చుచునే యున్నాను. హా కళాలలితా! నన్ను బ్రదికింతువా — చంపుదువా? (అవీథిని పొందటికొనను స్త్రీవేషమునం గళాలలితుండు ప్రవేశించును. భటులతో సరస్వతి నిష్క్రమించును.)

కళా—నాకింక బ్రదుకా-చావా-నాభార్య కనంబడదే! ఇప్పుడు చేయవలసినదేది? గోవర్ధనుండు పట్టుకొనంబడినాండని తెలిసినది. నాభార్యతక్క గోవర్ధనుం డెవ్వండు? పట్టుకొనిన గోవర్ధనుని రామపురమున కంపించిరంట! చంపుదుమని కదా మొదట ప్రధానుండు చెప్పినాండు. రామపురమున కంపించుటనుబట్టి పట్టుబడిన వ్యక్తినిగూర్చి ప్రధానుని కేదోసందేహము తోంచినట్లుండవలసియున్నది. అనంగ స్త్రీయో పురుషుండో యను సందేహము దోంచంగ మనకెందులకని రామపురము కంపించినాండేమో? ఇంక నెప్పుడు మగవేసము వేయవలదని నాభార్యతో నేను చెప్పియుండగాం దిరుగ మగవేసము వేసినదేమో? ఏమో పోనీ—పోయి ప్రధానుని గనుగొందమన్న నుదయమునుండి యిప్పటివరకే యాండువేసమున నామెకొరకు వెదకుటతోడనే సరిపోయినది. మతిలేక నేనెప్పు

చుండఁగా, నెక్కడకుఁ బోవఁగలను. అదిగాక స్త్రీవేషమున నెట్లుపోఁగలను. నాకిప్పుడే యీవార్త తెలిసినదిగదా! ఇప్పుడుపోయిన లాభమేమియున్నది? పట్టుఁబడుటయైనది. పంపుటయైనది. ఇఁకఁ బ్రధానుఁడు నాకుఁ జేయులాభ మేమి? అయినను దనప్రభునియాజ్ఞకు వ్యతిరేకముగా నా కతఁడేమి చేయఁ గలఁడు. ప్రధానునియొద్దకుఁ బోవలసిన పనిలేదు. నేనే రామపురమునకుఁ బోవుదును. అడ్డుదారి కాలిదారి యున్నది. అట్లుపోయిన మంచిదనుకొందును. స్వల్పమైన సేనను రామపురమునకుఁ బంపుమని, నాప్రతినిధికి లేఖ వ్రాయు దును. రామపురములో దుర్మార్గుఁడైన యారాజుండఁగా నాభార్య యచ్చటికిఁ దీసికొనిపోఁబడఁగా నేనిక్కడ నెందులకిఁకఁ ద్రొక్కులాడుచుండవలయును? కాని నాభార్య యెక్కడనున్నదో యదియే నాయూరు— కాని, పురుషవేష మునఁ బోయిన మంచిదా—స్త్రీవేషమునఁ బోయిన మంచిదా? పురుషరూప మునఁ బోయినయెడలనే యన్నివిధముల మేలు కాని యాఁడువేషము వేయు మని నాభార్య నాకాజ్ఞయిచ్చినది. కొంతకాల మామెయొద్ద దాసిగా నుండు మని చెప్పినది. ఆమె యానతిచ్చినప్పుడు వ్యతిరేకముగా నడతునా—నీవు చెప్పినట్లే చేయుదునని నే నామెయెదుట రాత్రియేకదా శపథమొనర్చితిని? ఏమి యాపదలువచ్చిననుసరే—ఎంత నగుబాటైననుసరే—స్త్రీవేషమును దీయను— ఈవేషమున నామెదాసినై యామెను గొంతకాలము సేవింపవలయును. ఆమె యాజ్ఞనుబొంది తీసివేయవలయును. అంతేకాని యిప్పుడే తీసివైచుట తగునా? భార్య యిచ్చినయాజ్ఞలను భార్య యెదుట తీర్చుట విశేషముకాదు. భార్య లేనప్పుడుతీర్చినవాఁడే భర్త. అదికాక యీవేసమును వేసి మూఁడుజాములైనఁ గాలేదుకాఁబోలు. వేసినతరువాత నేదో కొంతకలాపము వినిపింపకుండ నిప్పుడే తీసివైతునా? ఏదోకాని. ఆలస్యమేల? పోయెదను. హా గోవర్ధనా! నీమగ పేరకాని యాఁడుపేరెతెలియదు. పెండ్లాముపేరైనఁ దెలియనిమందభాగ్యుఁడను ప్రపంచమున నే నొక్కడనే. హా! గోవర్ధనా! గోవర్ధనా!

(నిష్క్రమించును.)

ఇది సప్తమాంకము.

సరస్వతి

అష్టమాంకము

ప్రదేశము—రామపురము.

ప్రవేశము—స్త్రీవేషమున గోవర్ధనుఁడు.

గో—ఈకోటలో బసచేసియున్న యీరాజుగారి పినతండ్రికొడుకగు మాధవవర్మకు, గోవర్ధనుని బట్టుకొని చంపునట్టి మేలు కలిగెనో, యేమియుఁ దెలియకున్నది. పోనీ! స్త్రీవేషముతోఁ గాని దీనిఁ దీసివైచికొని గాని యాతనివద్దకుఁ బోయి యచ్చట నెవ్వరికైనఁ గనఁగొనుటకు నాకీరాజుప్రక్క విడుచుట కెంతమాత్రమును వీలులేకున్నదే. కోటలో నింకఁ బ్రవేశించుచుండఁగానే సరస్వతమ్మ వచ్చినదని దాసులు భటులందఱు కేకలువైచి రాజుతోఁ జెప్పఁగ, నాతఁడాపిచ్చికేకలతో నేవచ్చి రెండవపారాగుమ్మములో నాకాళ్ళపైఁబడి యేడ్చినాఁడు. నేను నీభార్యను గానని యెట్లు చెప్పఁగలను? చెప్పిన నెవ్వరు నమ్మెదరు? అప్పటినుండి యీనాలుగైదు దినములనుండి యహోరాత్రములు నన్ను విడువకుండ నున్నాఁడు. ఇతనికి నావంటిభార్యయున్న దని యెఱిఁగి యుండినయెడల నిక్కడకు రాకయేయుందును.

(నేపథ్యమున) అమ్మా! సరస్వతమ్మా!

గో—ఆ! నన్ను సరస్వతమ్మ యని పిలువవచ్చునని యొక్క రాజుగారికే నే ననుమతి యిచ్చియుండఁగా మీరందఱెట్లు పిలిచెదరు?

(నేపథ్యమున) అలవాటుచొప్పున నట్లు పిలిచితిని. అదిగాక సరస్వతమ్మా యని పిలువవలసిన దని మారాజుగారు మాకాజ్ఞ యిచ్చి యుండఁగా మా ప్రభువుగారి మాట పాటిసేయకుండ వచ్చునా?

గో—రాజుగారికి మతి కుదుటఁబడనున్నది, కాని నాకు మతిపోవుచున్నది. (ప్రకాశము) సరే, ఎందులకు?

(నేపథ్యమున) రాజుగారు రమ్మనినారు. (మఱియొక రవమున) అమ్మా! సరస్వతమ్మా!

గో—వారెవరు?

(నేపథ్యమున) రాజుగారు రమ్మని మీతోఁ జెప్పుమని నన్నుఁగూడఁ బంపినారు.

గో—సరే వచ్చుచున్నాను. పొమ్ము. (తనలో) రోగియింటిలోనుండి వైద్యముచేయు వైద్యుఁడు రోగికంటె ముందు చచ్చును. (పరిక్రమించును.)

(వెనుకఁ దెరయెత్తఁగ, మంచముమీఁద రాగవర్ధనుఁడు
కూరుచుండి ప్రవేశము.)

రాగ—అమ్మా! సరస్వతీ! నేను రావలయునని యనుకొనుచున్నాను. నీవే వచ్చితివా! చూడు. నీవిక్కడ కూరుచుండఁగలిగినంతసేపు కూరుచుండుము. ఎక్కడికైనఁ బనియుండి నీవు పోవలసివచ్చినప్పుడు నీవు నన్ను నీతోకూడఁ దీసికొనిపొమ్ము. నేనుమాత్రము నీవులేకుండ నిక్కడనుండను. ఎందువల్లననఁగా నీవు పైకిఁబోయినప్పుడు నాకడుపులోనుండి యేదియో నీవైపు పోవును. నీవు తిరిగి రాఁగనే యది తిరిగి కడుపులోఁ జేరును. ఎన్నినాళ్లు నిన్నిదివరకు విడిచియుంటినో జ్ఞప్తిలేదు. చూడు. అక్కడ నెవ్వరైన నున్నారేమో తొంగిచూడు.

గో—(అట్లుచూచి) ఎవ్వరులేరు.

రాగ—అమ్మా! నీతో నెంతయెంతయో చెప్పవలసియున్నది. ఈదినమున మనస్సు నిన్నటికంటె నిర్మలముగా నున్నది. అమ్మా! చూడు. మీసవతితల్లి పరలోకమునకు వెళ్ళిపోయినది. ఇఁక నీకు, నాకుఁగూడ భయములేదు. ఎప్పుడు కూడ రెండవపెండ్లామంత చెడ్డవస్తువు లేదమ్మా—తల్లీ—నేననుభవించినానమ్మా—చూడు. నీవు పెద్దదానవైనతరువాతమాత్రము నావలె రెండవపెండ్లి చేసికొనకుసుమా.

గో—నాయనగారూ! పొరపాటుమాటలాడుచున్నారు. ఊరకుండుఁడు. (తనలో) ఆహా! "నాయనగారూ" అనుమాట నోరుజాఱినదేమి చెప్పుమా. నాతల్లిదండ్రులు నాపసితనములోనే పోవుటచేత, "నాయనగారూ" అని పిలుచుటయైన నెఱుఁగనే!

రాగ—ఔను-పొరపాటే-అమ్మా, నిన్ను మీతల్లి యిక్కడఁ గనలేదుసుమా. మీయమ్మకు మొదటిపురుడు కోటలోనే పోసినాము. ఆసంతానమక్కఱకు రాకపోవుటచేత నామె రెండవపురిటికి మాతమ్ముఁడు మాధవవర్మయింటికి దాసీమాత్రసహాయగా నామెను బంపినాము. ఆచారము దప్పింపవలయునని, యాతని సొంతధనముచేఁ బురుడుపోయించెను. నీవు పుట్టిన మూఁడవదినమునఁగాఁబోలు మీతల్లి పోయినది. తల్లియనఁగా సవతితల్లియనుకొని, భయపడి తిరుగఁ జాతిపోకుమా. కన్నతల్లి యున్నఁడును సవతితల్లికాదమ్మా. కాని కన్నతండ్రి సవతితండ్రియగుటమాత్ర మున్నదిసుమా.

గో—అయ్యా పొరపాటుమాటలాడుచున్నారు.

రాగ—ఇది పొరపాటుకాదు. ఈదినమున వెనుకటి సంగతు లన్నియు నద్దముకట్టినట్లున్నవి. కన్నతండ్రినైన నేను నా రెండవపెండ్లాము మాయమున నీకు సవతితండ్రినైతిని. తెలిసినదా? నాభార్య కీ—యన—కే కా—యన—కా; నిన్ను దయతోఁ జూడలేదు. నీమీఁదఁ గోపపడితిని. నిన్నుఁ దిట్టితిని. నీవు నన్ను క్షమింతువుకద. (ఏడ్చును.) పెద్దవాఁడను. మాతల్లీ నాకు నీవుతక్క నెవ్వరు

లేరు. రెండుచేతులు బట్టుకొనుచున్నాను. క్షమింపవా. తల్లీ క్షమింపకపోయిన యెడల నేను నీయొడిలో పండుకొని అమ్మా అమ్మా అని యేడ్చెదను. అప్పుడు నీవు నన్నెత్తుకొనఁగలవా.

గో—నాయనగారూ! కుదుటఁబడుచున్న మనస్సు చెదరుచున్నది. ఈమాట లిఁక మానివేయుఁడు.

రాగ—ఏదో నీమాట చెప్పఁబోయితిని. ఆ-ఔను జ్ఞప్తికివచ్చినది. నీవు తొట్టిలోఁ బండుకొని అమ్మా - అమ్మా - యని యేడ్చునప్పుడు నాకడుపు తరుగుకొని పోయెడిది. అప్పుడు నిన్ను నీసవతితల్లి వచ్చి యెత్తుకొని యాడించుచుండెడిది. అందఱు సవతితల్లులు మొదట సవతిపిల్లలయందు దయతోడనే ప్రవర్తింతురు. అందఱు సవతిపెండ్లాములు మొదట సవతిమగలయందు దయనే చూపుదురు సుమా. మొదట కొంతకాలమువఱకు బాగుగనే జరిగినది. చూడు. ఎటువచ్చి నను నా బావమఱఁది జయరామిగాఁడున్నాఁడే, కొంకనక్కముండకొడుకు. అతఁడు వచ్చి దానిమనసు పాడుచేసినాఁడుసుమా. (అటునిటు చూచి నిమ్మళముగా) ఇక్కడ నెక్కడ నాముండకొడుకు లేఁడుకదా.

గో—(తనలో) వానిని సురంగిని కోటబైటనేయుంచి నేను నాభార్యయు మాత్రమే వచ్చినాము. (ప్రకాశము) ఇచ్చట లేఁడు.

రాగ—పోనీ-అమ్మా! అందులో సవతి యాఁడుదానిమనస్సు గడియారములాగున నెవ్వఁడైన బాడుచేయకుండ మాత్రము చెడదుసుమా. నీవు నీభార్య తమ్ముని మాత్రము గోటలో నుంచనని నామీఁద నొట్టుపెట్టుకో.

గో—అదిగో. ఊ. ఊ.

రా—తప్పాడితినిగాఁబోలు. అజయరామిగాఁడున్నాఁడే వాఁడే నామీఁద సవారు. అందఱిపైకి సవారుకావలసినరాజా తానే గుఱ్ఱమైనప్పుడింక గడ్డితినుట కాశ్చర్యమేమి? నిన్ను వానిని బెండ్లిచేసుకొనుమని నేననినందులకు నిదిగో లెంపలు వైచుకొనుచున్నాను. (కొట్టుకొనుచున్నాఁడు.)

గో—ఆఁ. ఆఁ. అది యేమిటని?

రా—నీవు కొట్టుటకు సందేహించినప్పుడు నేను గొట్టుకొనుట తప్పులేదులే. నీవు కూఁతురవు కావున నీవు సందేహించితివి కాని సవతిపెండ్లామునకు స్వతంత్రత యెక్కువచేతఁగాఁబోలు నన్నుఁ గొట్టినదిసుమా-అమ్మా! నీవు నీమగని నెప్పుడు కొట్టఁగూడదుసుమా. మరేమియులేదు. కొట్టినయెడల మగనికిఁ బిచ్చి యెత్తును. అంతే; అన్నప్పుడెల్లను గన్నకూఁతులు వచ్చి పిచ్చినికుదిర్చి బాగు చేసెదరా. దెబ్బతోఁ బిచ్చి కుదురునందురు కాని అసత్యముసుమా-దెబ్బకొట్టిన కొలఁది బంగారములాగునఁ బిచ్చి సాగిపోవును.

గో—నాయనగారూ! ఊరకుండరాదా!

రాగ—తప్పుమాట లాడినప్పుడుకూడ నన్నాఁపెదవేమి (నిమ్మళముగా) చూడు.

అక్కడ దాసులెవ్వరు లేరుగదా.

గో—లేరు.

రాగ—(నిమ్మళముగ) అలాగునఁ గాదు. పోయి చూడుము.

గో—(చూచివచ్చి) ఎవ్వరును లేరు.

రాగ—రాజుగారిమాటలను బొంచి వినుటలో నీదాసీముండలంత పండితులు లేరుసుమీ. రాణి కోఱుకరానికోర్కెయైన తరువాత దాసిది రాజుగారి చెవులు పట్టుకొని కోకొయించుట సిద్ధాంతము. తెలిసినదా—ఈమాట జ్ఞప్తిలో నుంచుకొనుము.

గో—అయ్యా! నాకీగొడవయంతయు నెందులకు?

రాగ—అమ్మా! అట్లనవచ్చునా? నాకష్టసుఖములు నీతోఁ జెప్పుకొనినఁగాని నాకు శాంతియెట్లగును? అదికాక నీవు పెద్దదానవైతివి. మగఁడు పిల్లలని యింక నీకు గొడవ పెరుగనైయున్నది. నీకు లోకజ్ఞానము నావలనఁగాని యెట్లు వచ్చును? అదిగాక వైద్యురాలవు కావునఁ బిచ్చి యెందులకుఁగలిగినదో నీవు కనిపట్టవచ్చును. నాకింకఁ బిచ్చి కుదురవలెనని బ్రదుకవలెనని లేదుసుమా. నిజముగా—మూడు—పెండ్లాముట్టిదైనసరే—పోయినతరువాతమాత్రము సంసారమున కంత విలువ మఱియొక్కటి లేదుసుమా—భార్యలేనివానికిఁ దనయిల్లె పూటకూటిల్లని నమ్ము. ఈదాసులున్నారే—నాసొమ్ము నాకుఁబెట్టుట కేడ్చుచుందురుసుమా—రాజ్యము తమదైనయట్లు, నేను గతిలేక కోటలో గంజికై చేరినట్లు వారియూహ—కాని యేదో చెప్పఁబోయి మఱచితినితల్లీ—

గో—నాయనా! ఇఁకఁ బండుకొనుము. చెప్పినమాటవినుము. (తనలో) ఆహా! ఈతఁడెన్నివిధముల శ్రమపడెనో. ఎన్నికారణములచే నీతనికి మతిచెదరెనో. ఆహాహా! రాజులవంటి సుఖవంతులు ప్రపంచమున లేరని, జనుల సాధారణాభిప్రాయము. ఈతనిని జూడ నాకు మిగుల జాలియగుచున్నది. (ప్రకా.) నాయనా! ఇఁకఁ బండుకొనుము.

రాగ—ఇఁక నొక ముఖ్యమైనసంగతి చెప్పవచ్చితిని. ఏదియా? అది. ఔను. నీపతి తల్లి యేలాగునఁ జచ్చిపోయినదో నీవెఱుఁగుదువా?

గో—నాకెట్లు తెలియును?

రాగ—నాకును నిశ్చయము తెలియదుకే—కాని నాయూహ—అజయరాముగాఁడున్నాఁడే—ఈనడుమ నిన్నుఁదెచ్చి పెండ్లిచేసికొనుట కెక్కడకో పోయినాఁడు. కాళీపురమున కుత్సవములకొఱకని పైకివంక—అమ్మా! అట్లు కన్నులుమూసికొంటివి నిద్రవచ్చుచున్నదా?

గో—లేదు. (తనలో) జయరామసింగు బలాత్కరింపఁబోయినది—నేను నాబసకుఁ బురువుచేయుమనఁ బంపిన దీయన కూఁతురే కాఁబోలు! ఆహా! కన్యారత్నము వచ్చి తండ్రినిజూచినయెడల .నెంత బాగుగానుండునో చెప్పుట కవకాశ

మున్నదా? ఏది! ఎచ్చట నున్నదో తెలియదు. కాని మంచములోనుండి యులికి పడినట్లు వస్తువులు గనఁబడినరీతిని నా కతని మాటలవలన నాశక్యాగాపుర చరిత్రము, కాళీపురచరిత్రముఁ గొంత గోచరించుచున్నది.

రాగ—అమ్మా! చూడు. ఆజయరామిగాఁడు మనకోటనుండి వెడలిపోవునప్పు డేమి చేసినాఁడోఁగాని, యిక్కడకు వచ్చినాఁడు. ఏమిచేసినాఁడో నేను దిన్నగఁ జూడలేదు. పోయినాఁడు. కొంతసేపటికి మీసవతితల్లి వచ్చినది. అప్పటికిఁ జింతపిక్కలాగున నున్నదినుమా. ఆమాట యీమాట కొంతసేపు మాటలాడి, నీచెంబులో మంచినీరున్నదా యని యడిగినది. ఉండవచ్చునని చెప్పితిని. అనీరుత్రాగినది. మఱియొకగంటకు పట్టికొయ్య.

గో—అయ్యో! మీరు త్రాగి చావవలయునని జయరాముఁడు విసము కలిపినాఁడు కాఁబోలు.

రాగ—అట్లే యనుకోవలసివచ్చినది. మంచినీటిచేఁ బ్రాణముపోవుటెడల సముద్రపుఁ జేఁపలు తప్ప మఱియొకజీవము ప్రపంచమున నుండనేకూడదు. వాఁడే యింత పనిచేసినాఁడు. సాధారణముగా మొదటిభార్య తమ్ముఁడే దొంగ—అందులో సవతిభార్యతమ్ముఁ డున్నాఁడే వానియంత నరాంతకదేవాంతకపుముండకొడుకు లేఁడని యాగోడమీఁదను మూఁడుబంతులను లిఖించు—ఊఁ.—కాని.

గో—నాయనగారూ! అతనినిబట్టి యందఱనుగూడ నట్లనుట తగునా.

రాగ—ఎవరిమట్టునకు వారే అలాగనున్నప్పు డంతలో నందఱిల చేరకపోవుదురు. పోనీ—మనకెంతలకు మనవస్తువు చేయిదాఁటిపోయినది; కాని నాకు నిజమైన నమ్మకమేదో చెప్పుతా. నిన్నూరక సాధించి, సాధించి, బాధించుటచేతనే, యీమెకట్టిగతి కలిగినది. ఆమెతోఁజేరి నిన్ను నేను నిరాదరణఁజేసినందులకు నాకు మతిపోయినది. నామతి నీమూలమున దిరుగ వచ్చినది. ఆమెప్రాణము కూడ నట్లు నీవలన రావలసినదేకదా. ఏది! ఆఘటమిచ్చట లేకపోయినది కాని, నీవామెను బ్రతికింపఁగలవనియే నానమ్మకము.

గో—నాయనగారూ! తప్పుడుమాట లెక్కువగా వచ్చుచున్నవి. నే నొప్పుకొనను. మీరు మాటలాడక యుండుఁడు.

రాగ—అమ్మా! నీకేమియు భయములేదు. నే నింతటఁ జచ్చిపోవుదు నేమోయని నీవాందోళనపడుచున్నావు. మొదటిభార్య మరణించుటయే భర్తకుఁ గొంచె మాయుర్వృద్ధికిఁ గారణము. రెండవభార్యకూడ మరణించినయెడల నిఁకఁ గోటలోఁ బాగాకేసినాఁడన్నమాటయే. మొదటిభార్య పోయినప్పుడే కొంత నట్టుగాని, రెండవభార్య పోయినతరువాతమాత్రి మావిసరువిసరు లొమ్మిది వత్సరఁ జూడవలసినదే. భర్తకు బ్రహ్మయిచ్చినయాయాయువుమీఁద పోయిన భార్యలసంఖ్యలోఁ దలకొక్క పదిసంవత్సరములచొప్పునఁ జేర్పవలసినదే.

గో—నాయనా! ఆమాటలన్నియు మానుఁడు. చాలు కిఁకఁజాలు.

రాగ—ఇదికూడఁ బొరపాటందువా యేమి ! మంచిబుద్ధిమంతురాలవు ! చెట్టుకొమ్మలు కొట్టివేయుము. మొదలెంతవృద్ధియగునో-ఈచేయి యెండిపోయినప్పు డీచేయి బలిసినదా ? లేదా ? కాళ్ళుఁజేతులుగూడ పెండినప్పుడు మొండెము బలిష్ఠమైనదా-లేదా-అమ్మా ! నేను దప్పుమాటాడను. కొంచెము తలనొప్పిగా నున్నది కాని, మతిమాత్రము తరవాణిలాగునఁ దేరి స్వచ్ఛముగా నున్నది.

గో—తలనొప్పి యారంభమైనదా ! సరి-సరి-ఇఁకఁజాలు-ఇఁక మాటలాడుట పనికి రాదు.

రాగ—వైద్యునిమాట వినవలసినదని నేనెఱుఁగనా ? కాని-యిఁకనొక్కమాట చెప్పెదను విను. తప్పుమాటలేకుండ జాగ్రత్తగానే మాటాడెదను. నాకు మతికుదిరినతరువాత మూఁడవపెండ్లి చేసికొనవలయునని బుద్ధిపుట్టునేమో !

గో—ఊఁ (అని గద్దించును.)

రాగ—ఊఁ అనకు; పెండ్లి ద్రోగుడువంటిదమ్మా. ఎవ్వరైన బలాత్కారమున నాఁపినయెడల నాఁగవలసినదేకాని సాధారణముగా నాఁగదు. అప్పుడు నేను నిన్నుఁ బ్రార్థించునదేమనఁగా నీపే నా రాజ్యము నీకిచ్చెదను. నీవు స్వేచ్ఛగాఁ బరిపాలించుకొనుము. రాజ్యము నాకుండదు కావున, నాకుఁ బిల్లనిచ్చువా రెవ్వరుండరు. అది సుఖపడును. నీవు సుఖపడుదువు. నేను సుఖపడుదును. ఈత యథాకాకుండఁ ద్రివిధధామంచిది. బొమ్మకెమ్మడులో 'త్రిధార' యనునది యున్నది. నీవెఱుఁగుదువా.

గో—సరి-సరి-ముదురుచున్నది. ఇఁక మాటలాడకుము.

రాగ—ఇఁక మాటలాడఁదలఁచుకొనలేదు కాని, వెనుకటిమాటనుబట్టి మఱియొక్క ముఖ్యమైనమాట జ్ఞప్తికివచ్చినది. అమ్మా! అమ్మా! అదియొక్కటే చెప్పెదను.

గో—ఇఁకఁ బనికిరాదు.

రాగ—అమ్మా ! అమ్మా ! అమ్మా! ఒకటేమాట. ఆలస్యమైనయెడల మఱచిపోయెదను.

గో—అటులైనఁ జెప్పుము. ఆపైనఁ బనికిరాదు. (తనలో) కొంచెము కృత్రిమనిద్రను గలుగఁజేసెదను. (చేయియూఁపును.)

రాగ—నాపినతండ్రికొడుకు కోటలోఁ బ్రవేశించినాఁడు. ఆతనిస్వభావము మంచిది. నాయందాతఁడు మిగుల భక్తికలవాఁడు. నాకూఁతురు లేచిపోయినదని నాకు మతిపోయినదని యోదార్పుటకై వచ్చినాఁడు. కాని యాతఁడే నాతరువాత నీవులేనియెడల నా రాజ్యమునకుఁ బ్రభుఁడు. నీవిఁక వచ్చితివికావున నాతనికి రాజ్యములేదు. ఆసంగతి యాతనితోఁ జెప్పి యాతనిఁ బంపివేయవలయును. రాజ్యము మనము స్వాధీనపఱుచకపోయినయెడల బలాత్కారముగా స్వాధీనపఱచుకొనవలయునని-యూహముండియుండునని కొందఱందురు. కాని నేనా మాట నమ్మను. ఇంతకును నీపటినుండి నీవే యీరాజ్యమునకుఁ బరిపాలకురాలవు; సేనాయుద్యోగుల నందఱఁ బిలిపింతును. నీవు తప్పకుండ రాజ్యమున

స్వీకరింపుము. నేనింకఁ బండుకొనెదను. నీవు నాప్రక్కలోఁ గూరుచుండుము. కదలకుము సుమా—(నిద్రించును.)

గో—అమ్మ ! ఈపత్త్రిరాజునకు మాధవవర్మ పరమద్వేష్యుఁడని నమ్మకము—గోవర్ధనుని బట్టుకొనుమని యా దుర్మార్గుఁడిచ్చిన యాజ్ఞ యిప్పుడు కారణము తెలిసినది. ఈరాజకూఁతురు పురుషరూపమునఁ గోవర్ధననామముతో సంచరించినది. గోవర్ధనా యని సత్రములోఁ గురంగి నన్నెట్లు పిలిచినది ! నాభార్య యామెను జూచియే వలచినది. తిరుగ నామె నేనిచ్చిన పురుషరూపమున నున్నది. ఆమెను గోవర్ధనుఁ డని పట్టుకొందురేమో ! నేను గాళీపురము బంతులాడెడుసరి కట్టిడి జరిగినట్లు మాత్రము విని యుండలేదు. తరువాతఁ బట్టుపడినదేమో తెలియదు. ఒకవేళఁ బట్టుపడి ప్రధానుని యొద్దకుఁ దీసికొనిపోఁబడెనని యనుకొందము. నేను స్త్రీనమ్మా యని ప్రధానుని భార్యతోఁ జెప్పి మృతిఁ దప్పించుకొనలేదా ? ఒకవేళ యిక్కడకే పంపఁబడినయెడల మరింత మంచిది. తండ్రి కీవార్త నంపి తప్పించుకొనును. ఆమెను జూడవలె నని కుతూహలముగా నున్నది. మగవానిని బోలిన మగవానినే జూడలేదు. మగవానినిఁ బోలిన యాఁడు దెట్లుండెనో జూడవలెను. ఎట్లుండు నేమి ? నేనున్నట్లే యున్నది కాఁబోలు - ఆమె వచ్చిన తరువాత నేను మాయూరు పోయెదను. మాయవ్వగారితోఁ జెప్పి రాలేదు. అమ్మా - సరస్వతమ్మా - ఎందఱ కెన్ని భ్రమలు కల్పించితివమ్మా—నీమూలమున మాకు భ్రమలే కాని నీకు శ్రమలెన్ని కలిగెనో—తుట్టతుద కీ మాధవవర్మచేఁ బట్టుపడి యేమి బాధ నొందుదువో !

(తెర పడును.)

ఇది అష్టమాంకము.

శ్రీరామ

సరస్వతి

నవమాంకము

ప్రదేశము — రామపురపుఁగోటలో మాధవవర్మ బస.

ప్రవేశము — మాధవవర్మ.

మాధ — నాయాజ్ఞ యొకటియుఁ దనచేఁత యొకటియునా! చెప్పినయక్షరముల ప్రకార మాచరింపలేని యీతెలివితక్కువ ప్రధానుఁడు నాకెందులకు? పరీక్షించితి ననియు, గోవర్ధనుఁడు కాఁడేమోయని సంశయముగా నున్నదనియును వ్రాసినాఁడు. పరీక్షఁజేసి చంపుమంటిని గాని సందేహముగా నున్నయెడల నిక్కడకుఁ బంపుమంటినా? ఇది నాయూరా! నాకోటయా? ఇక్కడ నితనిఁ జంపుట, యెల్లరికిఁ గారణమగును గాదా? తానేమనుకొనినాఁడో? మన కోటలో మన మెన్నికార్యములు చేసినను గ్రమ్ముదలగా నుండును. ఎవని సంసారపుగుట్టు వానిది. ఇంతవఱకు వచ్చిన తరువాతఁ జంపక తప్పునా? దగ్గఱనుండి చంపింపవలయును. అప్పుడుగాని మనస్సునకు సంతుష్టిగా నుండదు. సరే-అతనితో ముందు మాటలాడవలసియున్నది. కాని భూకంపమేమి? పాతాళ గుహాద్వారము పగులుటయేమి! వారు పాఱిపోవుటయేమి? వింతగానున్నది. ఎంతవెదకినను గానఁబడకపోవుట యేమి! అదేదో చూచుకొనవచ్చును. ముందు గోవర్ధనుని జూడవలయును.

(మాధవవర్మ పరిక్రమించుచు నిష్క్రమింపఁగ, వెనుకఁ దెర యెత్తఁబడును. ప్రవేశము:–పురుషవేషమున సరస్వతి.)

సర — ఇది నాతండ్రికోట. ఇది కోటలో వేఱుగానున్న పుస్తకభండారము. ఇచ్చట నేను మొన్నమొన్నటివఱకుఁ జదువుకొనుచుండెడిదానను. ఇందు బసచేసిన రాజు నన్నుఁ దప్పక ఖండించునని మొదటిభటుఁడు దారిలోఁ జెప్పినాఁడు. అంతయదృష్ట మెన్నఁడైనఁ బట్టునా! నాకోటలో, నేనాడుకొనినస్థలములోఁ దండ్రిగా రేజబ్బుతోడనో యింత బాగుగ నుండఁగా నీమట్టిలో నామట్టి కలిసిపోవుట యదృష్టముకాదా? భ్రమరుని మధురికను గోటలోనికి భటులు రానీయలేదు. వారు రాకపోవుట నాకు నిష్టమే. ఇక్కడకు మాతండ్రిగారి భటులుకూడ నేవో సామానులు తీసికొనివచ్చుచుఁ బోవుచున్నారఁట! ఏభటునిచేనైన, మాతండ్రిగారికి వార్త నంపినయెడల నాకీకష్టము వదలిపోవును;

నేనట్లు చేయను. ఇంతకంటెఁ జచ్చుటకు మంచిసమయములేదు. మంచి యవకాశము లేదు. మొదట సముద్రములోపలనే చావవలసినది. అట్లు జరుగకుండఁ గళా కలితుఁ డడ్డుపడినాఁడు. అట్టి యామహానుభావుని, నేను వదలకుండ నుండవలసి నది. వదలితిని. బుద్ధిపూర్వకముగఁ జెడిపోయితిని, ఇఁకఁ గళాకలితుని దర్శ నము నాకీజన్మమునకు లేదు. అందుచే మరణింపవలసినదే. చంపునప్పుడు నేను గట్టిగా నేడువనైన నేడువను. నారొదప్పు వినఁబడి మాతండ్రివచ్చి రక్షించు నేమో! నాకుఁ బ్రపంచమున మూఁడే హితపదార్థము లున్నవి. తండ్రి, కళాకలితుఁడు, నామానరక్షకుఁడు—మొదటియాతఁడు దేహప్రదాత—రెండవ యాతఁడు ప్రాణరక్షకుఁడు—మూఁడవయాతఁడు మానరక్షకుఁడు—వీరియుప కారము నేను దీర్చుకొనఁజాలను. చావఁగ నేమో కొందలుపడిని యేడ్తురు కాని, నాకేమియుఁ గష్టముగాఁ గాని భయముగాఁ గాని కానఁబడదు. భగ వానుఁడా! నిన్నుఁ ద్రికరణశుద్ధిగా నమ్మినదానను. నన్ను వేగముగ నీలోఁ జేర్చుకొనుము. ఓ పరాత్పరుఁడా! (లేచి చేతులు జోడించుకొని యుండును.)

(మాధవవర్మ ప్రవేశించును.)

మాధ— నాయనా! గోవర్ధనా! వచ్చితివా? దీర్ఘాయుష్మంతుఁడవై యుండుము.

సర—(తనలో) ఈతనికి నమస్కరించితి నని యనుకొని కాఁబోలు నన్నాశీర్వదించు చున్నాఁడు.

మాధ—నాయనా! కూరుచుండుము. నీవు వచ్చితివి, పరమానందముగా నున్నది. నిన్నుఁ జిన్నతనములోఁ జూచితిని. ఈనడుమ నీవెచ్చట నుంటివో తెలియు లేదుసుమా! నాప్రాణములన్నియు నీమీఁదనే యున్నవి. నిన్నెప్పుడు జూతునా యని యనుకొనుచున్నాను కాని తండ్రీ! నీచదువు పూర్తియైన దనియు నీవు యాత్రాచరణదీక్షుఁడవై యున్నావనియు వింటిని. నిజమేనా?

సర—నిజము కాదు.

మాధ—నాయనా! నీవు కళ్యాణపురమునఁ గొంతకాలముండి చదువుకొంటివి కాదా?

సర—లేదు.

మాధ—నిన్నుఁ బెంచుచున్న ముసలియామె బాగుగా నున్నదా?

సర—ఆమె యెవ్వతెయో నే నెఱుఁగను.

మాధ—పోనీ నాతండ్రీ! నీపేరు గోవర్ధనుఁడేనా?

సర—ఔను.

మాధ—(తనలో) ఇతని మాటలనుబట్టి యితఁడు గోవర్ధనుఁడు కాఁడని నాకుఁ దోఁచు చున్నది. మాప్రధానుఁడుగూడ నీప్రశ్నములే యీతని నడిగియుండును. మాకీ నడుమను గోవర్ధనునిగూర్చి తెలిసిన సమాచార మిదియే. ఇతఁడు గోవర్ధనుఁడు కాఁడేమో! అయియుండియు నసత్యమాడుచున్నాఁడేమో! పేరు గోవర్ధనుఁ డన్నంతవఱకు నిశ్చయముకదా! ఇఁకఁ జంపుటకు సందేహమేమి? శత్రువును

జంపుటకు నిశ్చయజ్ఞానమే యక్కఱలేదు. సందేహమైనను జాలు. (ప్రకాశముగా) నాయనా! నీకెవ్వరైనఁ బిల్లలున్నారా?

సర—పెండ్లియే యింక లేదు.

మాధ—(తనలో) పోనీ ఈ ప్రేటుతో నీకొమ్మ నాశనమే. బ్రదికితిని. (ప్రకా) నాయనా! నాకుఁ బిల్లలు లేరు. నాకాళీపురరాజ్యమునకు నిన్నుఁ బ్రభువుగాఁ జేసెదను. నాకు దత్తపుత్త్రుఁడవై యుందువా?

సర—నాకు నీరాజ్య మక్కఱలేదు.

మాధ—నాయనా! చిన్నతనములో నీకీ విరాగతయేల? అయిన నాలోచించుకొనుము. సరే—నీవిటనుండుము. నేనిప్పుడే వత్తును.

(ముందునకుఁ బరిక్రమింపఁగ, వెనుక తెరపడును.)

మాధ—(చప్పటలు గొట్టును.)

(ఇద్దఱు భటులు ప్రవేశింతురు.)

1 భటు—ఏలపిలిచినారు?

మాధ—మీరు మాసొమ్ముతినువారేనా?

1 భటు—ఏమిమహాప్రభూ! అట్లు సెలవిచ్చుచున్నారేల?

మాధ—ప్రశ్నకుఁ బ్రశ్నయేల? అడిగినదానికి త్తరమిమ్ము.

1 భటు—మేము మీభటులము, మీరుమాకు పోషకులు.

మాధ—మీరు మాసొమ్మువలనఁ బ్రదుకవలసినది. మీసేవవలన నేను జావవలసినదియా?

2 భటు—మహాప్రభూ! మావలన నేమి నేరము జరిగినదో మేమెఱుఁగము. క్షమింపవలెను.

1 భటు—బాబూ! సెలవైనయెడల నగ్గిలో దుముకుమన్న దుమికెదము.

మాధ—నాప్రాణముపోయిన తరువాత మీరు భస్మమైన నాకేమి? లోకమంతయు భస్మమైన నాకేమి?

1 భటు—తమ కిప్పుడుగలిగిన యపాయమేదో మహాప్రభూ! మాకేమియుఁ దెలియలేదు.

మాధ—నేను నాదాయాదికోటలో బసచేసియుండుట నాకపాయము కాదా? బంధుమర్యాదకొఱకు నేనురాఁగఁ దనరాజ్యముకొఱకువచ్చినానని నాబంధువనుకొనుట మఱింత యపాయముకాదా? నేనిచ్చట నిట్టి యపాయస్థితిలోనుండఁగ మీరు నాక్షేమమును సహస్రనేత్రములఁగని పట్టవలసినవారేకదా.

2 భటు—అత్యంతరమేమి! అట్లు మేముచేయుచునేయున్నాముకాదా?

మాధ—చేయుచున్నామని యేముఖము పెట్టుకొని చెప్పెదవు. ప్రాణరక్షణము మీరు చేయుచుండిన యెడల రామపురరాజగు మాయన్నగారివలనఁ బంపఁబడిన యాతఁడు నన్నుఁ జంపుట కీరాత్రి యేల వచ్చియుండును? మీరు పంపకుండ నాతఁడు లోనికి రాఁగలఁడా?

2 భటు—మీప్రధానుఁడుగారివలనఁ బంపఁబడిన యొక చిన్నవానిని మాత్రము మేము లోనికిఁబంపితిమి.

మాధ—ప్రధానుఁడుకాఁడు. వల్లకాఁడుకాదు. లోపలికి వచ్చుట కదియొకవంక. ఇక్కడ నాకు మనుష్యులులేరా ? ప్రధానుఁడేల పంపవలయును ? ఆచిన్నవానిని దెచ్చిన భటులను మీరు గుర్తెఱుఁగుదురా !

2 భటు—నీవు చూచితివఁటరా !

1 భటు—నేను దిన్నగఁ జూడలేదు,

మాధ—మీరెఱుఁగరు. వారీయూరివారైనప్పుడు మీరెట్లెఱుఁగుదురు ? (తనలో) వారిని వెంటనే కాశీపురము పంపినాను.

1 భటు—అలాగా బాబూ !

మాధ—ఆచిన్నవాఁడు — ఆరాజకుమారుఁడు — ప్రధానుఁడుపంపిన నాప్రాణ మిత్రుఁడు—బాకుతీసికొని నన్ను నిద్రలోఁ బొడువఁబోయినాఁడు.

2 భటు—దెబ్బతగులలేదుకదా బాబూ !

మాధ—దెబ్బతగిలినయెడల నాకు దండధరభటసాహాయ్యముకాక యీనర్మపింప భట సాహాయ్యమేల ?

1 భటు—మాకు మీరుచెప్పినమాట తెలియలేదు. కాని మహాప్రభూ గొప్పగండము మీకు దాటినందులకు సంతోషముగానున్నది.

మాధ—ఆ చిన్నవాఁడు తొందరలో బాకుతో నొఱ తీయకుండనే పొడిచినాఁడు. లేచి పట్టుకొని యాగదిలోనుంచితిని. అతనిని నేను జూడను. మీరుజూచి నాలుగుచీవాట్లు వేసివదలిపెట్టుఁడు.

2 భటు—వదలిపెట్టుమందురేమి ? మహాప్రభూ ! రాజహత్య సంకల్పించినవానిని విడిచిపెట్టుదురా ?

1 భటు—నాయనా ! ఇంత ధర్మప్రభువులైన యెడల నేలాగు బాబూ !

మాధ—మా యన్నగారిచేఁ బంపఁబడినాఁడు. ఆయన కోటలో మన మున్నాము. ఆయిన భటునిట్లు శిక్షించుట యప్రతిష్ఠకాదా !

2 భటు—మీయన్నగారికి మిమ్ముఁ జంపుట ప్రతిష్ఠయైనప్పుడు మీకిది యప్రతిష్ఠ కాదులెండు.

మాధ—ఏమిరా ? నన్నేమి చేయుమనినారురా ! దిక్కుమాలిన రాజత్వమైపోయెను. తెల్లవాఱినది మొదలుకొని వారిని శిక్షించి, వీరిని శిక్షించి—ఛీ! ఛీ! సామాన్య కుటుంబములోఁ బుట్టినయెడల నాకీ ఘోరకృత్యక్షోభము లేకుందును. నా కర్మము.

1 భటు—మీరేమియు ననకుఁడు. మే మాతనిని జిత్రవధము చేసెదము.

మాధ—అల్లరిరా—పనిలేని యల్లరిరా—అదిగాక మీరన్నమాటలవల నాకొడలు జలదరించుచున్నదిరా.

2 భటు—చచ్చేటప్పటికంటె జలదరించుట మంచిది కాదా నాయనా! అల్లరిలేదు—అట్టి శబ్దమైనలేదు. నల్లిని నలిపినట్లు—

మాధ—అబ్బ! అబ్బ! అసహ్యమురా! ఇక్కడ నన్నగారికిఁ దెలిసిపోవునేమో యని కూడ నంతఁ బరితపించువాఁడనుగాను. అదిగో! అక్కడరా.

1 భటు—ఇక్కడ నెవ్వరికిఁ దెలియదు బాబూ! అక్కడిమాట తరువాతఁ జూచుకొందము.

మాధ—రాజవిశ్వాసముచేత మీ రంతపట్టుగాఁ జెప్పుచున్నప్పుడు నే నొప్పుకొనక తీరనట్లు కనఁబడుచున్నది. నా చెవిని వైవకుండ, మీరు తలఁచుకొనినపని యేదో చేయరాదఁటరా?

2 భటు—చిత్తము బాబూ! అంతేచాలు. దండాలు. పువ్వు త్రుంపినట్లు—దీపమార్పినట్లు—తేగకొటిక లాగినట్లు.

మాధ—తీరఁ జెవిని వైచితివి కాదా? చేయుపనిలో నేమైన బుద్ధిహీనతగా నాచరించిన మొదల—ఆ యపయశస్సు నాకే కాదా? వినవలెనప్పునా! ఏది యేలాగునఁ జేయఁదలఁచుకొనినారో, రవంత యేదువుఁడు.

1 భటు—కత్తితోఁ దల నఱుకుదుము. ఆ!

మాధ—కత్తితోఁ దల తెగును—తెగకపోవును. క్రింద రక్తము—వాని వస్త్రములమీఁద, మీవస్త్రములమీఁద రక్తము—ఇవియన్నియు నిదర్శనములు గావఁటరా!

2 భటు—భోజనము చేసి విస్తరి యవలఁ బాఱవైచి యలికినట్లుండవలెను బాబూ! కడుపునిండునప్పుఁ బైకేమియు నగపడఁగూడదు బాబూ! గొంతు గట్టిగాఁ బిసికి చంపి—

మాధ—అబ్బా! అబ్బా! గుండెలు కొట్టుకొనుచున్నవిరా. ఊఁ. ఆమాట నోట నన లేనురా. కాని—ఏది? అపైని!

2 భటు—అంతే బాబూ! చంపినతరువాత నింతేమున్నది బాబూ! ఒక్కగంటతరువాత నైనను ప్రాణము పోకతప్పదండి.

మాధ—ప్రాణముకొఱకే యెవ్వఁ డేడ్చుచున్నాఁడురా! ఈదిక్కుమాలిన శరీరముకొరకే కాదా యీ కొపత్రయమంతయును?

2 భటు—కళేబరమును ఱాలుగట్టి నూతిలోఁ బాఱవైచెదము.

మాధ—చప్పుడురా! నడిరేయి వేళ మఱింతచప్పుడురా! పొండి ఏదో యేడ్వఁడు. నాకెందుల కీబాధ—మీవిశ్వాసముకొలఁది మీరేమి యేడ్చినను సరే. నే మానుమన్న మానుదురా? పోఁడిముండకొడుకులు! ఈపనియైన యీ క్షణమున మీరు కాశీపురమునకుఁ బోవలయును. అక్కడ నేదో యలికిడి యగుచున్నది. చూడుఁడు. (నేపథ్యమున) అయ్యో!

మాధ—లేగమా ప్రక్కనుండి పొండు. నిద్రించుచుండఁగాఁ లేపినయెడల మంచిది. రవంత నిదానించి మఱి చేయుఁడు.

1-2 భటులు—చిత్తము. (పోవుదురు)

మాధ—ఎవఁడురా? ఇటురా.

(భటుఁడు ప్రవేశించును.)

భటు—దండాలు బాబూ!

మాధ—ఎందులకు వచ్చితివి!

భటు—ఒకయాఁడుది వచ్చియున్నది — మీదర్శనము నపేక్షించుచున్నది.

మాధ—ఆఁడుదియా! నీవు బాగుగాఁ జూచినావా?

భటు—ఆఁడుదనుట కెంత చూడవలెను బాబూ!

మాధ—ఋషివలెఁ గాలక్షేపము చేయు నావంటివానియొద్ద కాఁడుది యెందులకురా?

భటు—మనకేమియుఁ దెలియదుబాబూ!

మాధ—మనకేమిటిరా నీమొంగము! బాగుగా నున్నదా? పెద్దమ్మగారి వారివలె నున్నదా?

భటు—కమ్మనివాసన గొట్టుచు మినుపకున్నియుండలాగున నున్నది.

మాధ—మినుపకున్నియుండ నీవెఱుఁగుదువఁటరా?

భటు—మీగురువుగారి కూఁతురు సమర్తాడినప్పుడు పెట్టినారుబాబూ!

మాధ—ఏమిరా యీకర్మము? పొమ్మని చెప్పరా.

భటు—చిత్తము. (పోఁబోవును.)

మాధ—ఉండు. ఉండు.

భటు—(ఆఁగును.)

మాధ—దర్శనమునకు వచ్చినతరువాత నిరాకరించుట బాగుగా నుండదేమో — రమ్మని చెప్పు. ఒక్కనిముసమైన నామనస్సునకు శాంతి నుండనీయదురా.

భటు—(పోవును.)

(స్త్రీవేషమునఁ గళాలలితుఁడు ప్రవేశించును.)

కళా—అయ్యా! రామ్ రామ్. గోవర్ధనుఁ డిచ్చటకు వచ్చినాఁడా?

మాధ—ఎవరు? గోవర్ధనుఁడా? కాని—నీవెవతెవు?

కళా—అతని దాసిని.

మాధ—ఆఁడుదానికి దాసికాని మగవానికి దాసి యెందులకు?

కళా—ఆఁడుదానికి బానిసతనమునకు మగవానికిఁ బ్రక్కయింగునకు.

మాధ—అతని కింకఁ బెండ్లి లేదాయేమి?

కళా—పెండ్లి యగువఱకు నెప్పటికైనను నాతోడనే.

మాధ—నిన్నిప్పటి కంచుకొనెనా యేమి? చక్రవర్తియైన నంచుకొనఁదగినవాఁడవు వలె నున్నావు. కాని మొదటిభేదము తీఱిపోయినతరువాత నిన్నాతఁడు పెండ్లి చేసికొనఁడేమో! అయినను నీవేల వచ్చితివి?

కళా—నాప్రభువును జూచుటకు.

మాధ—నీప్రభుఁ డిక్కడ నుండెనని నీకెట్లు తెలిసెను?

కళా—నాకంటె నొక్కగంట ముందు వాఁడు కోటలోఁ బ్రవేశించినాఁడు. నేను గొంచెము వెనుక నుండవలసివచ్చినది. ఎక్కడ నున్నాఁడో శీఘ్రముగఁ జూపి పుణ్యము కట్టుకొనుఁడు.

మాధ—చూపెదను గాని, నాకేమి యిచ్చెదవు?

కళా—నీకేమికావలయునో అదియే.

మాధ—అటులైనఁ జెప్పెదను. ఒక్కముద్దు.

కళా—అభ్యంతరమేమి! ఇదిగో! ఊఁ ఊ. (జుట్టు వంచి యొకగ్రుద్దు గ్రుద్దును.)

మాధ—అబ్బ! అబ్బ! (నడుము పట్టుకొని) గ్రుద్దితివేమి?

కళా—ఇంతటితో సరిపెట్టినందులకు సంతసింపుము. గోవర్ధనుఁ డెట నున్నాఁడో చెప్పెదవా! డొక్క చీల్పనా?

మాధ—ఎవఁడురా! అక్కడ?

కళా—నీయింటి నాశ్రయించిన భటుల నందఱ కరదండములు వేయించితిని. వారు నీకుఁ దోడ్పడరు. నాభటులను బిలువనా? ఎవఁడురా! అక్కడ?

(ఒకభటుఁ డరదండములు పట్టుకొని ప్రవేశించును.)

భటుఁడా! నీ వీ రాజాచేతి కరదండములు తగిలింపుము.

మాధ—ఆ-ఆ-

భటు—(అట్టుచేసి) మహాప్రభూ! ఈతని నేమిచేయుమని సెలవు?

కళా—ఎక్కడ నున్నాఁడో చెప్పవేమి? (కొట్టును.)

మాధ—హా! హా! హా! హా!

(నేపథ్యమున) హా! హా! హా! కళాలలితా!

కళా—ప్రాణప్రియా! వచ్చుచున్నాను. ఆధ్వని యేవైపునుండికదా వచ్చినది? భటుఁడా! నీవీతనిఁ గొట్టులో నుంచి భద్రముగా నుండుము. పో!

(భటుఁడు మాధవవర్మతోఁ బోవును.)

అటుకాదు ఇటు. హా! ప్రాణప్రియా!

(పరిక్రమింపఁగ వెంటనే తెర నెత్తఁబడును. భటులు సరస్వతిగొంతు నులుముదురు. ఒకఁడు చేతులు గట్టిగఁ బట్టుకొనును.)

హా! ప్రాణకాంతా! ఆ! ఆ! (గట్టిగఁ గేకలు వైవఁగ భటులు పాఱిపోవుదురు.)

కళా—(సరస్వతిని బట్టుకొని తొడిలోఁ బరుండఁబెట్టుకొని విసరును.) నేను జడిసి నట్లే యయినది. దైవకటాక్షమునఁ బ్రాణ మింక నున్నది. అయ్యయ్యో! మెడపై నా క్రూరుల క్రేళ్లెట్లొత్తుకొనినవో! ముచ్చటలు లెట్లుపోసినవో! కన్నుల వెలుపలికొలుకులనుండి పెద్దబాష్పబిందువులు రెండు జాఱినవి. (తుడిచి విసరును.) ఊఁపిరి యిప్పుడు బాగుగా నాడుచున్నది. ఈచొక్కా మెడ గుండి వదలు చేయుదునా? ఎఱుఁగనియవస్థలో నంతవఱకు సాహసించుట తప్పేమో? ఆహా! కన్నులు తెఱచుచున్నది. హా! ప్రాణప్రియా! ప్రాణప్రియా! అట్టె చూచి వెంటనే కన్నులు మూసికొనినది. హా! ప్రాణప్రియా!

సర—(తనలో) ఈమె నన్ను వదలకుండ నావెంటనే యిటకు వచ్చి తనవలె కాఁడు దానవైన నన్నిట్లు బాధించుచున్నదా! హా! ఈమనువుబాధ నాకు మున్నగు వరకుఁ దీఱదాయేమి? (ప్రకాశముగా) హా! కళాలలితా! నాప్రాణము పోవుచున్నప్పుడైన నన్నుఁ బ్రాణప్రియా యని పిలుచుట మానవా? అవసాన సమయమునఁ బ్రాణప్రియా యనుటకంటె 'భవానీప్రియా!' యను మాట నాచెవిని వైచుట మంచిది కాదా!

కళా—నీకేమియు భయము లేదు. నీవు బ్రదికితివి. అందువలన నేను బ్రదికితిని. నేను నీప్రాణప్రియుఁడను గావున నిన్నిట్లు పిలిచితిని.

సర—(తనలో) కళాలలితకాదు. కళాలలితుఁడే. ఆహా! ఇతఁడు స్త్రీవేషమున నుండుటచే భ్రమఁ జెందితిని. ఔను. ప్రత్యక్షముగఁ గళాలలితుఁడే! ఇప్పుడే బ్రదికితిని. అందుదానికి హృదయమునఁ బ్రాణము నిలుచుట బ్రదుకుకాదు. ప్రాణప్రియుఁడెదుట నిలుచుట బ్రదుకు. ఇఁక నేమి! కావలసినంతశక్తి వచ్చినది. (లేచును.)

కళా—కన్నులు తిరుగునేమో. జాగ్రత్త. ఇప్పుడు నీవు సుఖముగా నున్నావా?

సర—(తనలో) నాకొడలెఱుఁగని యవస్థ కావున, నాథుఁడు నన్నుఁ గౌఁగిలించి నాఁడు. ఈతనిని నేనట్లు తిరుగఁ గౌఁగిలించుట తగునా? కౌఁగిలింపక యూరకుండఁగలనా? ఈతఁ డింక నుపేక్షించుట యెందులకో? కన్నులు తిరుగునేమో యన్నవాఁడు కౌఁగిలించుకొనఁగూడదు కాఁబోలు. (ప్రకా) ప్రాణేశ్వరా! ఇది యేమి?

కళా—నావలనఁ దప్పే జరిగినది. అశక్తుఁడనై జగన్నాథపురమున నిన్నుఁ గౌఁగిలించినందులకు, నీవు పాఱిపోయితివి. అతప్పును క్షమింపుమనియు నిన్నెప్పుడు నీయిష్టము లేనిదే కౌఁగిలింపననియుఁ గాశీపురమున రాత్రి స్త్రీరూపమున నున్న నిన్ను నేను గలసినప్పుడు శపథమొనర్చితిని. దానికి వ్యతిరేకముగా నిన్నింతకు ముందే కౌఁగిలించితిని. ఒడలు తెలియక జ్ఞప్తిలేక సగముప్రాణ మెగిరిపోవ నట్లొనర్చితిని. ఎటులైనఁ దప్పుచేసితిని. క్షమింపుము.

సర—ఏమీ? కాశీపురమున నిన్ను నేను గలిసితినా? నీవు నాతో శపథమొనర్చితివా? ఎవతెను గలిసితివో! జ్ఞప్తిచేసికొనుము.

కళా—ప్రాణప్రియా ! నీ మనస్సింకఁ గుదుటఁబడలేదు. కొంతసేపటికి నీకే యంతయు జ్ఞప్తికివచ్చును.

సర—అసత్యము. అసత్యము. జగన్నాథపురమున నిన్ను వదలినతరువాత నీ రామపుర మునఁ దక్క మఱి యెచ్చటను నిన్నుఁ గలసికొనలేదు.

కళా—ప్రాణకాంతా ! అట్లు పెలవిచ్చుట న్యాయమా ? పోనీ ! అప్పుడు జరిగినదే మఱియొక్క మాట జ్ఞప్తికిఁదెచ్చెదను. గోవర్ధనుని బట్టికొనుమని ప్రధానుని యాజ్ఞయయినది. దైవవశమున నీవు స్త్రీరూపమున నుంటివి. మహాసంతోషము. 'తిరుగఁ బురుషరూపమును ధరింపకుముమా ! ఏమి ప్రమాదము వచ్చునో !' అని నేను నీతోఁ జెప్పలేదా ! తిరుగఁ బురుషరూపమును ధరించుటచేతనేకదా యింత మునిఁగినది !

సర—ప్రాణనాథా ! మతి నాకుఁ గుదుటఁబడలేదని యంటివి. నీకు మతియే లేనట్లున్న దేమి ! నీవు నాతో నీ మాటలు చెప్పితివా ! మఱల నిన్నుఁ జూడ నేలేనప్పుడు మాటలాడుట యెట్లు ? బహు చిత్రముగా నున్నది. ఇదివఱ కనేక భ్రమము లొందితినికాని వానికంటె నిది మఱింత సొగసుగ నున్నది.

కళా—నీ వల్లనఁగ నే నేమి చేయవలయును ! నిన్నుఁ జూచితిని. నీతో మాటలాడి తిని.

సర—అవి యేవో వెనుక జరుగని మాటల కేమికాని, ప్రస్తుతము నీకీ స్త్రీవేషమేమి?

కళా—నన్ను నీ దాసిగా నుండుటకై స్త్రీవేషమును ధరింపుమని నీవు చెప్పుటచేతనే కదా యిట్లయితిని.

సర—కళాలలితా ? నీ కేమి స్వప్నమా ? ఏదైన నావహించెనా ! ఎవరైన మందు పెట్టిరా ! నీవు నాకు దాసిగా నుండుమని నేనంటినా ! హరహరా ! నే నట్టి దానను గానని యెఱుఁగుదువు కదా ! ఆమాటవలననైన నిన్నుఁ గలసిన దెవ తెయో నావేషమును వైచిన దొంగయని గ్రహింపఁజాలకపోయితివా !

కళా—అయ్యో ! అయ్యో ! నీ వట్లనుచుండ నే నిఁకఁ జేయవలసినదేది ?

సర—నాకును గొన్ని భ్రమ లిదివఱకుఁ గలిగియున్నవి. అందులకుఁ గారణ మేదో నే నూహింపలేకున్నాను. నావంటివాఁడో నావంటిదో యొక్క పిశాచమో కామినియో మనవెంటఁ దిరుగుచున్నది. ఇది నీతప్పుగా నేను భావింపలేదు. నీవు సందేహింపకుము. అది యేదో తెలియవలసివచ్చినప్పుడు తెలియును. కాని యానిర్భాగ్యుఁ డేమైనాఁడు ?

కళా—బద్ధుఁడైనాఁడు.

సర—తిరుగ నాకుఁ బ్రాణమిచ్చిన పుణ్యాత్ముఁడు నాభర్తయేనా ! ఇఁకఁ గాఁగిలింతు నని నీ పినతల్లోడనో చేసిన శపథమును గొట్టివైచుటకు దానికే కాని నాకధి కారము లేనందున నిన్ను నేను—(కౌఁగిలించును.)

కళా—ఓ! ప్రాణప్రియా! ఈజన్మమున నీ సౌఖ్యమే చాలును. ఇంకటితో మనకు జన్మరాహిత్యమే సుమా!

గీ. మనుజునకు జన్మరాహిత్య ♦ మను సదాశటి
కలుగుటయే సత్యమైనచోఁ ♦ గాంత! వినుమ,
అద్ది నిష్ఫలాపేక్షమా ♦ నట్టి ప్రేమ
తత్త్వమహిమను కలుగంగఁ ♦ దగును జుమ్మి.
ప్రేమలతఁ గోయుమని మన ♦ పెద్ద లనిరి
నాకు క్షమియింపు మామాట ♦ నచ్చ లేదు
జన్మరాహిత్యపరమశా ♦ శ్వతసుమంబు
భవ్యతమరాగలతికోద్భ ♦ వంబు గాదె?
దంపతుల ప్రేమవంటి దీ ♦ ధరణి లేదు
వారికే ముక్తి విభవ మె ♦ ప్పటికినైన
నట్టిబ్రహ్మచారికి మోక్ష ♦ పదవి నున్న
జ్ఞానియగువాని కద్ది సం ♦ శయము సుమ్మి.

(సరస్వతి నవ్వును.)

ప్రాణకాంతా! నవ్వెదవేల? ఇట్టి శృంగారసమయమునఁ బుష్పహారములు, చుంబనములు, వనవిహారములు ప్రశంసనీయములు గాని బ్రహ్మచారులు జ్ఞానులను గూర్చి యేల ముచ్చటించుచున్నాఁ డని నవ్వితివా?

సర—అబ్బే! అందులకుఁ గాదు. అట్టిది నాకు నక్కరలేదు.

కళా—కాకపోయిన యెడల నామాటలు నీకు నచ్చలేదు కాఁబోలు! పోనీ! నీయభిప్రాయ మేమి?

సర—జగన్మిథ్యాత్వమును గూర్చి, జన్మరాహిత్యమునుగూర్చియు మన మేమి చెప్పఁగలము! మొద్దులాగున నెదుటఁ బడి మన కన్నిభ్రమలు కలిగించినవ్యక్తి యాఁడుదియో మగవాఁడో మనము కనిపట్టఁ జాలకపోయితిమే! మనకథ చిక్కు మనము విప్పఁగొనినయెడల నంతే చాలును. ప్రపంచపుఁజిక్కుమాట తరువాతఁ జూడవచ్చును. నీవు మంచివాఁడవు. నేను మంచిదానను. కావున సరిపోయినది. కాని కాశీపురమున రాత్రి నీ వెవతెనో చూచి మాటలాడితి వని యనఁగఁ దిరుగ నీమొగముఁ జూతునా? కాని యిఁక కాలస్యము చేయ ముండ మాతండ్రిగారిని జూడవలయును. నీవు నాతో రావలయును.

కళా—మాకుగా రవశ్యవందనీయులు గదా?

సర—నే నీ పురుషవేషమును దీసి నా స్వరూపముననే మా తండ్రిగారిని జూతును. నీవుకూడ నీ వేషమును దీయవలయును.

కళా—నే నిది తీయను. క్షమింపుము.

సర—ఎందుచేత ?

కళా—స్త్రీవేషమున దాసిగా నిన్నుఁ గొలుతు మని నాతో నీవు కాళీపురమునఁ జెప్పియుంటివి. ఆమాట నీ కేదో కారణమున జ్ఞప్తిలేదు. ఏకారణముననైన నీ కట్టి స్ఫురణ తిరుగఁ గలుగునెడల నీవు నన్నధిక్షేపింతువు. కోపించి మును పటివలెనే పాఱిపోవుదువేమో !

సర—ఈ వేషమును దీసివేయుమని నేనే నీకుఁ జెప్పుచుంటిని గాదా ? ఇంకను సందేహమేల ?

కళా—అటులైనఁ గాళీపురమున నాతో మాటలాడినది నీవే యని యొప్పుకొనుము.

సర—అదిమాత్ర మసత్యము.

కళా—అటులైన నాకక్కడఁ జెప్పినవా రెవరో తీయుమని చెప్పువఱకును వేషము దీయను. క్షమింపుము.

సర—ఏమీ ! నీయిష్టము. మా తండ్రిగారియొద్దకుఁ ద్వరగఁ బోవుదమా ?

కళా—అభ్యంతర మేమి ?

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది నవమాంకము.

శ్రీరామ

సరస్వతి

దశమాంకము

ప్రదేశము—రాగవర్ధనుని మందిరము

ప్రవేశము—రాగవర్ధనుఁడు; స్త్రీవేషములతో సరస్వతి, గోవర్ధనుఁడును, కళాలలిత, కళాలలితుఁడును.

రాగ—ఇదివఱకు మీరందఱు చెప్పినమాట లేవియో నాకు నచ్చలేదు. ఆహా! ఇది యేమి?

గీ. కలయొ? మాయయొ? మఱి కను ♦ కట్టొ? మంత్ర
సాంద్రతయొ? పిశాచకృతియొ? ♦ యింద్రజాల
గతియొ? గాధేయసృష్టియొ? ♦ కాక యహహా!
నావలె మతిమాలిన కవి ♦ నాటకంబొ?

జంటపువ్వులలో భేద ♦ సరణి కలదు
తారలందైన భేదంపు ♦ దారి యుండు
నచ్చుబొమ్మల నైన వ్య ♦ త్యాస ముండు
కలదు భేదము ప్రతిబింబ ♦ ములనుగూడ.

అమ్మ! నీవు! అమ్మ! నీవు! మీరిద్దఱు కాదా? ఆ సంగతి ముందు చెప్పుఁడు. ఇదివఱ కేమి చెప్పినారో నా మనస్సున నిలువలేదు.

సర—(తనలో, గోవర్ధనుని జూచి) అదియే నాచీర. అదియే నారవిక. నేనిచ్చిన స్త్రీవేషముననే యింక నున్నాఁడు. నాయనా! నీవిచ్చినపురుషవేషమును దీసి వైచి నీయందలి తత్త్వమునుజూపితిని. క్షమింపుము.

రాగ—మీరిద్దఱొకరా యిద్దఱా యని యడుగ మాటలాడరేమి?

సర—నాయనా! అట్టిప్రశ్న మడుగుదురా? మే మిద్దఱము కామా?

రాగ—సరే-అటులైన నాకూఁతు రెవరు?

సర—నాయనా! నేనే.

రాగ—(అటుచూచి యిటుచూచి యాలోచించును. సరస్వతి నుద్దేశించి) అటులైన నీవు నాచేయి గట్టిగాఁ బట్టుకొనుము.

సరే-నాతల్లీ! నీవు నాకూఁతురవే! నాకు మందిచ్చి మతిపుట్టించినది నీవేనా?

సర—నీకు మం దిచ్చినదో నే నెఱుఁగను.

గో—మందిచ్చినది-నాయనగారూ! నేను.

రాగ—అటులైన మతి నిచ్చినదే సరస్వతమ్మ. కాని మఱియొక రెట్లగుదురు? నీవే నాకూఁతురవు. నీవు నాచేయి గట్టిగాఁ బట్టుకొనుము. తుపాకిరవ్వలలాగున నంటచే భేదము తెలియకుండఁగా నొక్కనుతిని మేళవించిన తంబురాలవలె నొక్కనాదములోఁ గూడఁ బలుకుచుండఁగా భేదము తెలియుటెట్లు? ఇప్పుడు మీరిద్దఱుకూడ నాచేయి పట్టుకొనియున్నారేల? ఇదిగో! నా కుడిచేయివైపు నున్న కూఁతురేకాని యెడమచేతివైపుననున్న కూఁతురు పట్టుకొననేల?

సర—నాయనా! నేనే సరస్వతిని. జయరామసింగును చేసుకొనుమని నాసవతితల్లి పెట్టినబాధలను నేను సహింపలేక నిన్ను విడిచిపాఱిపోయిన దుర్మార్గురాలను నేనే నాయనా! గోవర్ధనునకట్టి బాధయేమైన నున్నదేమో యడుగుము.

రాగ—అమ్మా! అది బాగుగా నున్నది. సవతియాఁడుదానిబాధయంత శాశ్వతపుఁ గోఁత ప్రపంచమున నుండదమ్మా! నీవు మంచిసాధనమే చెప్పితివి. కుడివైపున నున్న కూఁతురు నడుగుమంటివా?

గో—నన్ను వేఱె యడుగనక్కరలేదు. నేను దల్లి నెఱుఁగను. తండ్రి నెఱుఁగను. ఇఁక నాకు సవతితల్లిబాధ యేమున్నది? అయ్యా! ఇంతసేపు వినోదముగా నుండుటచేత నూరక వినుచున్నాను. నేను మగవాఁడను, మగవాఁడను. మగవాఁడను,

రాగ—మగవాఁడవైనయెడలఁ గూఁతురుగా నుండఁగూడదు. కాని కొడుకుగా నుండవచ్చును గాదా? అమ్మా! సరస్వతమ్మా! ఈరాజ్యము సగము నీది. సగ మీతనిది. మీరిద్దఱేలుకొనుఁడు.

సర—నాయనా! నాకు నాభర్తరాజ్యమే చాలు. నీరాజ్యమంతయు గోవర్ధనుని కిమ్ము. ఈతఁడు నాకొక్క గొప్పయాపద తప్పించినాఁడు. ఇప్పుడు నీకు మతి నిచ్చినాఁడు.

గో—నేను జేసిన జనసేవకు నేనేమియుఁ దీసికొనువాఁడను గాను. నాకు రాజ్య మక్కఱలేదు. భగవంతుని యీసర్వప్రపంచమే నారాజ్యము. నామనస్సున కీవృత్తాంతములోని యన్నిచిక్కులు విడిపోయినవి. ఇఁక నేను బోవుదును.

కళాలలిత—నాథా! నేనుగూడ వచ్చెదను. రాజేంద్రా! నమస్కారము.

కళాలలితుఁడు—చెల్లెలా! మన మిదివరకు మాటలాడినట్లు కలిసియే పోవుదము. బావా! గోవర్ధనా! కొంతసేపటిలో మేముగూడ వచ్చెదము.

సర — నా మానసంరక్షకుఁడ వగు నో మహాత్మా నమస్కారము.

రాగ — అమ్మా ! ఆ సంగతి యేమి ?

సర — ఈ గాథ సావకాశముగఁ జెప్పెదనులే.

గో — అమ్మా ! అందఱను రక్షించువాఁ డా పరాత్పరుఁడు. నీవు నన్నుఁ బ్రశంసింప వలదు.

రాగ — సరే. గోవర్ధనా ! నా దొక్క ప్రశ్న. దానికి సంతుష్టికరమైన యుత్తరము చెప్పి మఱిపొమ్ము. చూడు ! నీవు సర్వవిధముల మా సరస్వతమ్మలాగున నుండు టకుఁ గారణమేమి ?

గో — నే నెట్లు చెప్పగలను ? పోవుదును.

రాగ — నే నడిగినది చెప్పకుండ నెట్లు పోవుదువు ? కదలకుము. నీకు వీరియందఱు సాహాయ్య మిచ్చెదరు. మీ రందఱు నాలోచించి చెప్పుఁడు. నా పుస్తకమును మఱియొకఁ డమ్ముచేయించుకొనుట కేమి యధికార మున్నదో కనుఁగొనక పోవుదునా ?

(నేపథ్యమున) మహాప్రభూ ! కల్యాణపురమునుండి యెవ్వఁడో భటుఁడు వచ్చి నాఁడు.

రాగ — కల్యాణము పుట్టినది మా కిష్టమే కాని పురము మాత్రము కాదు. పొమ్మని చెప్పుము.

గో — అయ్యా ! కల్యాణపురము మా యూరు. నన్నుఁ బోషించు ముసలియమ్మగారి యొద్దనుండి వచ్చినాఁడేమో ! రానిండు.

రాగ — సరే ! లోనికిఁ బంపుము.

• (నేపథ్యమున) చిత్తము.

గో — (చూచి) వీరిగా ! అమ్మగారు బాగుగ నున్నారా ? ఇచ్చట శ్రీ లున్నారు. నీ వా ప్రక్క నుండుము.

భటు — (లోనుండియే) బాగుగా నున్నారు. గోవర్ధనయ్యా ! నీ వాఁడు వేసమున నుంటి వేమి ? మిగిలిన యాఁడువారుగూడ నీవంటివారేనా యేమి ? పెద్దవాఁడ వైతివి కదా ? ఇట్టి వేసములు బాగుగా నుండునా నాయనా ? ఈ కోటలో నీవంటి వారు చేరి రాజుగారియెదుట భాగవత మాడుచున్నారా యేమి ?

గో — లేదు. నిన్ను మా యమ్మ యెందులకుఁ బంపినారు ?

భటు — నా కెట్లు తెలియును ? ఈ యుత్తరమును నీవు రామపురరాజుగారి కిమ్మని చెప్పినారు. ఆమె దగ్గుచే బాధపడుచుండుటచేత రాలేకపోయితి నని చెప్పినారు.

గో — అలాగే. నీ వావల నుండుము. నే నీ యుత్తరమును రాజుగారి కిచ్చెదను. అయ్యా ! రామపురప్రభూ ! మా ముసలియమ్మగారు మీ కీలేఖ నర్పింపు మని నారు. (ఇచ్చును.)

రాగ—అయ్యో తర మేదో నీవే చదువుము.

గో—అయ్యా! నే నెందులకు? సరస్వతమ్మచేఁ జదివింపుఁడు.

రాగ—సరే.

సర—(చదువును.)

శ్రీరామపురరాజాగారికి—నంద్యాల పార్వతమ్మ రామ్ రామ్.

గోవర్ధనుఁ డను చిన్నవాఁడు నాచేఁ బండ్రెండు సంవత్సరములనుండి పెంపఁ బడుచున్నాఁడు. నేనొక క్షత్రియకాంతను. అతనిని బట్టుకొని మీ దుర్గమున కెందులకో తీసికొనిపోయినారని వింటిని. నేను మతిలేకుండ నున్నాను. అతనిని రక్షింపవలెను. అతఁడు దొంగకాఁడు. జనాపకారికాఁడు. అతనికి విద్యజెప్పించితిని. అతనికి మీరుగాని మీకంక నెవ్వరైనఁ గాని యేమి యపకృతి చేయుదురో యని మీకు వ్రాసితిని. అతని చరిత్ర మీక్రింద వ్రాసితిని.

నాకుఁ దెలియకుండ నా దాసీ యీ పిల్లవానిని నాలుగు సంవత్సరములు పెంచినది. తాను మరణించుచు వీనిని నాకిచ్చి పోయినది. దాని కీ పిల్లవాఁ డెట్లువచ్చెననఁగ—వాలేశ్వరనగరమునుండి దాని మేనత్త కూఁతురు దాని యింటి కీ పిల్లవానితో వచ్చి యక్కడ మృతినొందెను. అకాలమున దాని కామె వీని నప్పఁజెప్పెను. ఆ మేనత్తకూఁతున కెట్లు వచ్చెననఁగా—దాని పినతల్లి కూఁతురు దాని కిచ్చెను. ఆ పినతల్లికూఁతు రీ చిన్నవాఁడు పుట్టినప్పుడు తల్లియొద్ద నుండినది. ఆమెకుఁ గాళీపుర ప్రభుఁడగు మాధవవర్మ కొయివరాల నొసఁగి యా బిడ్డను జంపుమని ప్రార్థించెను. అందుల కామె యొడఁబడినట్లు నటించి చంపితినని చెప్పి ప్రచ్ఛన్నముగాఁ దెచ్చి దన పెదతల్లి కూఁతున కిచ్చెను. పుట్టిన మూఁడవనాటినుండి యాచేతినుండి యాచేతికిఁ దిరుగులాడుచుఁ బండ్రెండు సంవత్సరములక్రింద నాకు లభించినాఁడు. అతని కిప్పుడు ౧౬ సంవత్సరముల వయస్సు. అతఁడు మీయొద్ద నున్నాఁడు. అతనిని రక్షించు పెడల దైవము మెచ్చును.

అంతర్యామునకుఁ దేవలయును.

రాగ—(లేచి తొందరతో) నాయనా! గోవర్ధనా! నీవు నా పుత్రుఁడవేనా! తండ్రీ! (ఏడ్చును.)

సర—అన్నయ్యా! అన్నయ్యా! (కౌఁగిలించుకొనును.)

రాగ—ఒకకాను మఱియొక కానులాగున నుండుట కచ్చొక్కటియై యుండవల యును. సరే—నీవు నాకొడుకవు. అమ్మా! పీరిద్ద ఱెవరు?

సర—ఆమె నీ కోడలు.

గో—ఈతఁడు నీ యల్లుఁడు.

రాగ—అలాగా! అల్లుఁడుగారూ! మీ కీ యయిదవతన మేల? పురుషరూపమును ధరింపరాదా?

కళాబలిశుఁడు—(అహా గోవర్ధనా! స్త్రీవేషమును ధరింపుమని నీవేకాదా నాతోఁ జెప్పితివి?

గో—(అవు) క్షమింపుము. నేను.

కళాబలిశుఁడు—(లోనికిఁ బోవును.)

రాఘ—నాయనా! గోవర్ధనా! అమ్మా! సరస్వతీ! మీరిద్దఱు నన్ను గాఢముగాఁ గౌఁగిలింపుఁడు.

గో-స—(అట్లు చేయుదురు.)

రాఘ—సరస్వతమ్మా! నీమగఁడు మంచివాఁడేనా?

సర—ఆ.

(కళాబలిశుఁడు ప్రవేశించును.)

రాఘ—నాయనా! గోవర్ధనా! నీవు స్త్రీవేషమును దీసి రమ్ము.

(గోవర్ధనుఁడు నిష్క్రమించును.)

కళాబలిశుఁడు—మామగారూ! నమస్కారము.

రాఘ—దీర్ఘాయుష్యమస్తు. (గోవర్ధనుఁడు ప్రవేశించును.)

గో—నాయనగారూ! నమస్కారము.

రాఘ—నాయనా! దీర్ఘాయుష్యమస్తు. నీవు నీ భార్యయు దగ్గఱగా నుండుఁడు. అమ్మా! నీవు నీ భర్తయు దగ్గఱగా నుండుఁడు. (వారట్లుందురు.) వేదాల కన్నిటికి సారమైనమాట యొక్కటి యున్నది. పిల్లలను బోఁగొట్టుకొనఁదలఁచినవాఁడుదక్క మఱెవ్వరు రెండవపెండ్లిచేసికొనఁగూడదు. అలాగున మాయాయన తన రాష్ట్రపరిపాలనములో నుత్తరువు లీయవలసి యున్నది. అమ్మా! నీరాజ్యములోఁ గూడ నీభర్త యట్టి యుత్తరువు లీయవలసియున్నది.

సర—అట్టి యుత్తరువులు మేమెప్పుడో యిచ్చుట కేమికాని, యింతద్రోహ మొనర్చిన మీపినతండ్రికొడుకును గూర్చి మీరిప్పుడేమి యుత్తరువు లిచ్చెదరు?

రాఘ—పోయిన వస్తువులు దొరికిన మహాసంతోషములో, దొంగవానిమాట మనస్సునుండి జాఱిపోయినది సుమా! అతనిని దప్పక శిక్షింపవలయుననియే మీ యభిప్రాయమా?

కళాబలిశుఁడు—బద్ధుఁడై నాకాతఁ డధీనుఁడై యున్నాఁడు.

రాఘ—పినతండ్రికొడుకనఁగఁ దమ్ముఁడన్న మాటయేనా? మాతండ్రియు నతనితండ్రియు నన్నదమ్ములు. తమ్మునిఁ జంపుట మంచిదైన యెడల మాతండ్రి యతనితండ్రిని చంపించి యుండును. నాపిల్లలు నాకంటఁ బడినారు. పూర్వ మేపాపము చేయుటచేతనో నాకన్ని బాధలు కలిగినవి. మన మెవ్వరియందును నింకఁ బోనీకొన వలదు. రాముఁడు అశ్వత్థామాదృశు సంతోషించినట్లు వాల్మీకి వ్రాయలేదు. ఇంతకును పెద్ద లౌకికమైనమాట. అతనిని జంపినయెడల మన కాశౌచము.

సర—అతనిని జంపనేయక్కరలేదు. దోషము చేసినవారికి దైవశిక్ష యొనర్చినంగాని లోఁటువగా నుండదు. మాసోదరుని కాతఁడు చేసిన యపకార మింతని చెప్ప వచ్చునా?

రాగ—నిజమే. ఏతప్పయిన క్షమింపవచ్చును గాని నోరెఱుఁగని పిల్లలయెడలఁ జేసిన దోషము మాత్రము సాధారణముగా క్షమింపఁదగదు. కావున మాసోదరు నిటు పిలిపింపుము.

కళాలలితుఁడు—నేను పోయి తీసికొనివచ్చెదను. (పోవును.)

రాగ—అమ్మా! నాయనా! ఇదివరకు మీరిద్దఱు నన్నొకసారి కౌఁగిలించినారు. తనివి యొంతమాత్రమును దీరలేదు. మఱియొక్కసారి కౌఁగిలించుకొనుఁడు. (వారట్లు చేయుదురు.) బిడ్డలారా! ఈసమయమున మీతల్లియే యిట నుండినయెడల నెంత సంతోషించునో! నాకిప్పుడు మతి కుదుటఁబడినట్లున్నది. అన్ని సంతోషములు సమకూడినవి. మీతల్లి యిచ్చట లేకపోవుటయే గొప్పలోపము.

(నేపథ్యమున) ఔను. గొప్పలోపమే యొనర్చినాను. నన్ను క్షమించునెడల నింతకంటె మహానందమును గలుఁగఁజేయుదు నని చెప్పుము (మఱియొకధ్వనితో) నీవే చెప్పుము.

రాగ—మాధవవర్మ వచ్చుచున్నాఁడు.

(మాధవవర్మ కళాలలితుఁడు ప్రవేశింతురు.)

మాధ—అన్నగారూ! నమస్కారము.

రాగ—సోదరుఁడా! నీవు నాయందు మహాభక్తిగలవాఁడవు. నీవదినెను నన్నుఁ దల్లిదండ్రులఁగా జూచుకొనుచుంటివని నీయింటికి నాభార్యను బురిటికిఁ బంపియుండ నీవు నాకొడుకున కింతహాని యొనర్చుట తగునా?

మాధ—నేను నేరమే చేసితిని. క్షమింపుము. అయినను తుదకది మహానందదాయకముగాఁ బరిణమించినదికదా!

రాగ—మాకు మహానందము కలిగినమాట నిజమే. క్షమింపవలసినదే. కాని—

మాధ—ఇంతకంటెను మహానందమును గలుగఁజేయుదును. క్షమింతురా?

రాగ—సందేహమా? క్షమింతును.

మాధ—మీరు సెలవిచ్చినట్లు నేను దల్లిగఁ జూచుకొనుచున్న మావదినెగారు సుఖముగా నున్నారు.

రాగ—ఆహా! ఆహా! (అందఱు సంతోషింతురు.)

రాగ—తమ్ముఁడా! ఎంత శుభవార్త చెప్పితివి! ఆమె బ్రదికియే యున్నదా?

మాధ—ఆ. ఆమె మృతిజెందె నని యసత్యవార్త కల్పించి లోకమును నమ్మఁజేసి యామెను ౧౯ సంవత్సరములు పాతాళగుహాలో దాసీమాత్రసహాయగా దాఁచితిని. ఈ నడుమను గలిగిన భూకంపముచే గుహాద్వారము పడిపోయినది,

ఆమెయు దాసియు గుహనుండి తప్పించుకొని పాఱిపోయిరని నా ప్రధానుఁడు వ్రాసినాఁడు.

రాగ—ఎప్పుడు? ఎప్పుడు? వా రింక నిటకు రాలేదేమి? వా రిక్కడకు వత్తురా?

అంద—ఓ-ఓ- రాకపోవుటకూడనా?

(నేపథ్యమున) ఓ-ఓ- (యనుసవారి మూలుగు వినఁబడును.)

(నేపథ్యమున మఱియొక ధ్వనితో) సవారి అపు.

(కమలయు, దాసియుఁ బ్రవేశింతురు.)

రాగ—ప్రాణప్రియా! ప్రాణప్రియా! (ఎదురుగఁ బోవును.)

కమల—ప్రాణకాంతా! నమస్కారము. (కాళులపైఁ బడి మూర్ఛపడును.)

సర—అమ్మా! అమ్మా! మాటలాడవేమి?

గోవ—అమ్మా! అమ్మా!

(ఇద్దఱు నామెను లేవఁదీసి కౌఁగిలించుకొందురు.)

రాగ—ప్రాణప్రియా! ప్రజ్ఞనొందితివా? కన్నులు తెరచితివా? వీరే నీవు కన్న కవలు.

కమ—ఆ! ఆ! ఎరీ? ఏరీ?

సర-గోవ—అమ్మా! అమ్మా! మేమే.

కమ—(బిడ్డలను కౌఁగిలించుకొని) అమ్మా! నాయనా! ఇంతవారైతిరా? మీ ముచ్చటలేమియు నేను జూచుకొనలేదుకదా?

సర—అమ్మా! మా యిద్దరలో నెవరు ముందు పుట్టిరి?

కమ—అమ్మా! నీవే ముందుఁ బుట్టితివి.

సర—అటులైన గోవర్ధనుఁడు నాకుఁ దమ్ముఁడా!

రాగ—కాదమ్మా! కవలలోఁ గడపట బుట్టినవాఁడు పెద్దవాఁడు. కావున మాతాయన నయే నీకంటెఁ బెద్ద. ప్రాణప్రియా! ముచ్చటలేవియుఁ జూడలేదని నీవు చింతింపవలదు. ఇక్కడనుండి కావలసినన్ని ముచ్చటలు. ఇప్పుడే మన పెదబాయన పుట్టినదినపుఁబండుగఁ జేసికొందము.

కమల—అంతకంటెఁ గావలసిన దేది?

రాగ—అదిగో! నీ యల్లుఁడు. అదిగో! నీ కోడలు.

కళాలలితుఁడు-కళాలలిత—అత్తగారూ! నమస్కారము.

కమ—కల్యాణమస్తు.

రాగ—"కల్యాణమస్తు" అని యొక్కసారి యనుట కాదు. రెండు సారు లనవలయును. జరుగవలసిన కల్యాణములు రెండున్నవి.

సర—రెండే కాదు, నాలుగు. భ్రమరునకు మధురికకు నొకటి.

రాగ — వా రేరీ ?

సర — కోటవెలుపల నున్నారు. వారిని పిలిపింతును. జయరామసింగునకుఁ సురంగికి రెండు.

రాగ — అముండకోడు ఎక్కడ కెంపులకు? వాఁడు భార్యకు విసము పెట్టఁదగిన వాఁడు. ఇంత మహానందమును గలిగించినందులకు దైవమును ప్రార్థింతము.

[అందరు దైవమును ప్రార్థింతురు.]

కళాలలితుఁడు — ఐన నిట్లు కావలయును.

గీ. ధరణి యీతిబాధలు లేక ♦ తనరుఁగాక
ప్రజలయన్యోన్యవైరముల్ ♦ పాయుఁగాక
కవిత రాజపోషణమునఁ ♦ గ్రాలుఁగాక
నీతిపాలనమున రాజు ♦ నెగడుఁగాక !

రాగ — తథాస్తు. తథాస్తు.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది దశమాంకముతో సర్వము సంపూర్ణము.